శుక్రవారం 19-1-2024

సత్యమేవ జయతే


సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 298

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'పారదర్శకతతో పథకాలు అమలు చేస్తే చిట్టచివరి వ్యక్తికి కూడా సంక్షేమం అందుతుంది'





మ్యూజికల్ ఫౌంటెన్ & ఉద్యానవనం





అంబేద్కర్ జీవిత విశేషాలతో 36 కుడ్య చిత్రాలు






అంబేద్కర్ చైత్య మ్యూజియం

డా॥ బి. ఆర్. అంబేద్కర్ గారి విగ్రహం ప్రత్యేకతలు

- డా॥ బి.ఆర్. అంబేద్కర్ గారి విగ్రహం ఎత్తు 125 అడుగులు
- కింద పీఠం (పెడస్టల్) ఎత్తు 81 అడుగులు
- పెడస్టల్ సైజు 3,481 చదరపు అడుగులు
- పెడస్టల్ తో కలిపి విగ్రహం మొత్తం ఎత్తు 206 అడుగులు
- పెడస్టల్ లో జీ+2తో గదుల నిర్మాణం
- బౌద్ధ వాస్తు శిల్పకళలోని కాలచక్ర మహా మండల డిజైన్ తో పీఠం ఏర్పాటు..
- పీఠం (పెడస్టల్) మొత్తం జీ+2 ఐసాసిలెస్, ట్రెపీజియం ఆకారంలో ఆర్సీసీ నిర్మాణం..
- రాజస్థాన్ పింక్ శాండ్ స్టోన్ తాపడంతో పెడస్టల్ నిర్మాణం..

డా॥ బి. ఆర్. అంబేద్కర్ స్వరాజ్ మైదాన్ ప్రత్యేకతలు

- రూ. 404 కోట్ల వ్యయంతో ప్రతిష్టాత్మకంగా స్వరాజ్ మైదాన్ ను తీర్చిదిద్దిన జగనన్న ప్రభుత్వం
- 18.81 ఎకరాల స్వరాజ్ మైదానంలో ఆహ్లాదకరమైన ఉద్యానవనం..
- పర్యాటకులను ఆకర్షించేలా, అంబేద్కర్ జీవిత విశేషాలు తెలియచేసి వారి ఆదర్శాల నుంచి స్ఫూర్తి పొందేలా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్..
- డా. అంబేద్కర్ గారి జీవిత విశేషాలను వివరించే కుడ్య చిత్రాలతో కూడిన కొలనేడ్..
- 2వేల మంది కూర్చునేలా కన్వెన్షన్ సెంటర్..
- 8వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఫుడ్ కోర్టు..
- చిన్నారులు ఆడుకోవటానికి ప్లే ఏరియా..
- స్మృతివనం ఆవరణలో మ్యూజికల్ వాటర్ ఫౌంటెన్లు, స్మృతివనం చుట్టూ ఉదయం, సాయంకాల వేళల్లో వాకింగ్, జాగింగ్, సైక్లింగ్ చేసుకునేలా ప్రత్యేక మార్గాలు..



కాలచక్ర మహా మండపం



విహార ఆంఫి థియేటర్



14' ఎత్తు x 22' పొడవు నెమలి ఆకృతి




జీవ కళ ఉట్టిపడే మైనపు విగ్రహాలు

జగనన్న ప్రభుత్వంలో సామాజిక సాధికారత ఒక నినాదం కాదు, అది రాష్ట్ర ప్రభుత్వ విధానం ..

డా. మేరుగు నాగార్జున, సాంఘిక సంక్షేమ శాఖామాత్యులు

జారీచేసినవారు: కమిషనర్, సమాచార, పౌర సంబంధాల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం


'అవినీతి, అసత్య వార్తలు
క్యాన్సర్ కన్నా ప్రమాదకరం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 298

శుక్రవారం 19-1-2024



భళా బ్లింకోవా...

ఆస్ట్రేలియన్ ఓపెన్ రెండో రౌండ్‌లో మూడో సీడ్ రిబాకినాపై విజయం -13లో



మూడో రోజూ వెనకడుగు

సెన్సెక్స్ 314 పాయింట్ల పతనం. నిఫ్టీకి 110 పాయింట్ల నష్టం -13లో

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ఢిల్లీ పరేడ్‌కు అసామాన్యులు

హైదరాబాద్ స్వీపర్ నారాయణమ్మ, కోదాడ షీ టాయిలెట్ నిర్వాహకురాలు నాగలక్ష్మిలపై ప్రత్యేక కథనం.

వివరాలు 11లో ▸



వారిని చేర్చుకోవద్దు

16 ఏళ్లలోపు విద్యార్థులను చేర్చుకోవద్దని ప్రైవేటు కోచింగ్ సెంటర్లకు జారీ చేసిన మార్గదర్శకాల్లో కేంద్రం స్పష్టం చేసింది.

వివరాలు 6లో ▸



పాక్ ప్రతీకార దాడి

ఇరాన్‌పై పాక్ ప్రతీకార దాడులకు దిగింది. రాకెట్లు, డ్రోన్లతో చేపట్టిన ఈ దాడుల్లో 9 మంది ఉగ్రవాదులు హతమైనట్లు పేర్కొంది.

వివరాలు 6లో ▸



అత్యంత అవినీతిమయం

అస్సాం ప్రభుత్వంతోపాటు ఆ రాష్ట్ర సీఎం దేశంలోనే అత్యంత అవినీతిపరుడని రాహుల్ గాంధీ ఆరోపించారు

వివరాలు 6లో ▸

పల్లెల్లో 'ప్రత్యేక'మే!

వచ్చే నెల 1తో ముగియనున్న సర్పంచ్‌లు, వార్డు మెంబర్ల పదవీకాలం

ఆ మరునాటి నుంచి గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలనకు సర్కారు మొగ్గు

- ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీల్లో బీఆర్ఎస్‌కే ఆధిపత్యం..
- ఆ సర్పంచ్‌లనే ఇన్‌చార్జులుగా కొనసాగించేందుకు కాంగ్రెస్ సర్కారు విముఖత.. లోక్‌సభ ఎన్నికల తర్వాతే పంచాయతీ ఎన్నికలు చేపట్టాలనే ఆలోచన
- ఆలోగా స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల పెంపు అంశంపైనా పరిశీలన
- దీంతో 6 నెలలపాటు పంచాయతీల్లో తప్పని 'స్పెషల్ ఆఫీసర్ల' పాలన
- మండల, గ్రామస్థాయిల్లోని వివిధ శాఖల అధికారులకు బాధ్యతలు
- నియామకాలపై కసరత్తు చేస్తున్న పంచాయతీరాజ్ ఉన్నతాధికారులు
- గ్రామ పాలన కుంటుపడుతుందంటున్న పంచాయతీరాజ్ సంఘాలు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని పల్లెలు ప్రత్యేకాధికారుల పాలనలోకి వెళ్లే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుత గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు, వార్డు మెంబర్ల పదవీకాలం వచ్చే నెల (ఫిబ్రవరి) 1న ముగుస్తోంది. దీంతో స్పెషల్ ఆఫీసర్లను నియమించి పంచాయతీల బాధ్యతలను అప్పగించాలని రాష్ట్ర సర్కారు భావిస్తున్నట్టు తెలిసింది. ప్రస్తుత సర్పంచ్‌లకే ఇన్‌చార్జులుగా బాధ్యతలు అప్పగించే అవకాశమున్నా.. పంచాయతీల పాలకమండళ్లలో బీఆర్ఎస్ పార్టీకే ఆధిపత్యం ఉండటంతో అందుకు కాంగ్రెస్ సర్కారు విముఖంగా ఉంది. మండల, గ్రామస్థాయిల్లోని వివిధ శాఖల అధికారులను స్పెషలాఫీసర్లుగా నియమించేందుకు ప్రభుత్వపరంగా, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖాపరంగా ఇప్పటికే కసరత్తు మొదలైనట్టు సమాచారం. పోలీసుశాఖ మినహా మండల, గ్రామస్థాయిల్లోని పంచాయతీరాజ్, రెవెన్యూ, విద్యా, వైద్య తదితర శాఖల అధికారులను పంచాయతీలకు ప్రత్యేక అధికారులుగా నియమించే అవకాశం ఉంది.

ఏ నిర్ణయమూ తీసుకోని సర్కారు..

రాష్ట్రంలో 2019 జనవరిలో పంచాయతీ ఎన్నికలు జరిగాయి. ఈ ఏడాది ఫిబ్రవరి 2వ తేదీలోగా పంచాయతీ ఎన్నికలు పూర్తయి, కొత్త పాలకమండళ్లు ఏర్పాటై ఉండాల్సింది. అక్టోబర్ నుంచి డిసెంబర్ తొలివారం వరకు అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియ కొనసాగడం.. ఏప్రిల్, మేలలో లోక్‌సభ ఎన్నికలు ఉండటంతో పంచాయతీ ఎన్నికల ప్రక్రియ ముందుకు పడలేదు. పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) ముందస్తు సన్నాహాల్లో నిమగ్నమైనా.. ఎన్నికల తేదీలపై నిర్ణయం తీసుకునే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికే ఉంది. కొత్తగా ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకా దీనిపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.

రిజర్వేషన్ల పెంపు ప్రతిపాదన నేపథ్యంలో..

స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతామని, ఉపకులాల వారీగా కూడా రిజర్వేషన్లు ఇస్తామని కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చింది. దీనికి సంబంధించి బీసీ కమిషన్ నుంచి ఆరు నెలల్లో నివేదిక తెప్పించుకుని తదుపరి చర్యలు చేపడతామని తెలిపింది. వాస్తవానికి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలు, ఇతర గ్రూపులకు

మిగతా 10వ పేజీలో ▶




సాఫ్ట్‌వేర్‌ను వీడి
సేద్యం చేస్తున్న మల్లికార్జున్

యువతకు ఆదర్శం

- కరీంనగర్ జిల్లా చొప్పదండి రైతుకు ప్రధాని మోదీ కితాబు
- 'వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర'లో భాగంగా వర్చువల్‌గా రైతులతో సంభాషణ
- మల్లికార్జున్‌రెడ్డి, ఆయన ఇద్దరు కుమార్తెలతో మాట్లాడిన ప్రధాని
- సమీకృత, ప్రకృతి వ్యవసాయ విధానాలపై ఆరా
- విద్యావంతులైన యువత వ్యవసాయ రంగంలోకి రావాలని పిలుపు

5 లో

గర్భగుడిలో ప్రతిష్ఠించిన రామ్‌లల్లా విగ్రహం. 22న ప్రాణప్రతిష్ఠ రోజున విగ్రహానికి కప్పిన వస్త్రాన్ని తొలగిస్తారు.



6 లో

గర్భగుడిలోకి రామ్‌లల్లా

అయోధ్య ఆలయంపై **స్టాంప్‌లు..**

- వివరాలు 6లో

22న కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలకు 'సగం రోజు సెలవు'

గుజరాత్‌లో ఘోర ప్రమాదం

- వడోదర శివారులో చెరువులో మునిగిన పడవ
- 14 మంది విద్యార్థులు, ఇద్దరు టీచర్లు మృతి
- మరో నలుగురు గల్లంతు

- వివరాలు 6లో





విమానయానం

ఉజ్వలం

- ఐదో అతిపెద్ద మార్కెట్‌గా భారత్..
- ఏడేళ్లలో మరో 50 విమానాశ్రయాలు
- కేంద్ర మంత్రి సింధియా వెల్లడి ప్రారంభమైన వింగ్స్ ఇండియా

-13లో

సారంగ్ హెలికాప్టర్ల విన్యాసాలు



సామాజిక న్యాయ శిల్పం..

నేడు జాతికి అంకితం

- విజయవాడలో అంబేడ్కర్ స్మృతివనం పనులు పూర్తి.. ఏపీ సీఎం వైఎస్ జగన్ చేతుల మీదుగా నేడు ఆవిష్కరణ

- వివరాలు 10లో ▶

న్యూస్‌రీల్

ప్రజలపై భారం మోపం



ప్రజలపై భారం మోపకుండా ప్రత్యామ్నాయ ఆదాయ వనరులపై దృష్టి సారించి రాష్ట్ర అభివృద్ధికి పాటుపడుతామని డిప్యూటీ సీఎం భట్టి స్పష్టం చేశారు. 2024–25 బడ్జెట్ ప్రతిపాదనల రూపకల్పనపై మంత్రులు తుమ్మల, పొంగులేటితో కలసి సమీక్షించారు.

- వివరాలు 2లో ▶

రైతు రుణాలను రికవరీ చేయండి



రైతు రుణాలను రికవరీ చేయాలని మంత్రి తుమ్మల అధికారులను ఆదేశించారు. డీసీసీబీలు,ప్యాక్స్‌ల్లో మొండి బకాయిలు, వ్యవసాయేతర రుణాలను తీర్చని వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు.

- వివరాలు 2లో ▶

దారి దీపం



రోడ్ మేనేజ్‌మెంట్ ప్లాన్‌ను అందించే కృత్రిమ మేధ ఆధారిత స్టార్టప్ రోడ్‌మెట్రిక్స్ కార్యరూపం దాల్చడంలో కీలకపాత్ర పోషించిన యువ ఆంట్రప్రెన్యూర్ దీపెన్ బబారియాపై ప్రత్యేక కథనం.

- వివరాలు 12లో ▶

సర్కారు స్కూళ్లలో ఎన్నికలు షురూ



పాఠశాల నిర్వహణ కమిటీ ఎన్నికలకు ప్రభుత్వం షెడ్యూల్ ఇచ్చింది. 29న రాష్ట్రంలోని ప్రైవేటు పాఠశాలలు మినహా అన్ని రకాల ప్రభుత్వ స్కూల్స్‌లోనూ ఎన్నికలు నిర్వహించాలని పాఠశాల విద్య కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు.

- వివరాలు 3లో ▶

ఇదండీ సంగతి



మిర్చి రైతును నలిపేస్తున్న 'నల్లి'



- రాష్ట్రంలో విస్తారంగా మిరప సాగు.. పూత దశలో ఆశించిన నల్లి తెగులు
- తెగులు కారణంగా రాలిపోతున్న పూత
- అర్ధంతరంగా ఎండిపోతున్న మొక్కలు
- పురుగు మందులతో కానరాని ప్రయోజనం

నల్లివైరస్ బారిన పడి వాడిపోతున్న మిర్చి తోట

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: వరుసగా రెండో ఏడాదీ మిర్చి రైతులను 'నల్లి' నలిపేస్తోంది. సరిగ్గా మిర్చి పంట పూత దశకు వచ్చిన సమయంలో నల్లి ఆశించింది. దీంతో వేలాది ఎకరాల్లో పూత రాలిపోతోంది. కొన్ని చోట్ల చెట్లకు చెట్లు నిలువునా ఎండిపోతున్నాయి. దీంతో మిర్చి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

2.77 లక్షల ఎకరాల్లో

గోదావరి తీర ప్రాంతం ఉన్న ఉమ్మడి వరంగల్, కరీంనగర్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో మిర్చి సాగు ఎక్కువగా ఉంది. వ్యవసాయ శాఖ లెక్కల ప్రకారం గతేడాది రాష్ట్రంలోని 32 జిల్లాల పరిధిలో 2.77 లక్షల ఎకరాల్లో మిర్చి సాగు చేశారు. ఈసారి కూడా ఇంచుమించుగా అదే స్థాయిలో సాగవుతోంది. సాధారణంగా సెప్టెంబర్/ అక్టోబర్‌లో మొక్కలు నాటితే డిసెంబర్/జనవరి నాటికి పూత దశకు చేరుకుంటాయి. అప్పటి వరకు ఒక్కో ఎకరానికి సగటున రూ.లక్షన్నర వరకు వ్యయం అవుతోంది. అంతా సవ్యంగా సాగిపోతున్న దశలో నల్లి వైరస్ కారణంగా మిర్చి మొక్కలకు పూసిన పూత రాలిపోతోంది. మొక్కలు ఎండిపోతున్నాయి. కొద్దో గొప్పో కాత చేతికి వచ్చినా అందులో సగానికి పైగా తాలు కిందకే పోతోంది. దీంతో రైతుల కళ్లలో ఆనందం ఆవిరైపోతోంది.

మందుకొట్టినా చావని నల్లి

నల్లి ఆశించిన మిర్చి పంటను కాపాడుకునేందుకు రైతులు ప్రాపర్‌గేట్ అనే పురుగుల మందును ఉపయోగిస్తున్నా ఆశించిన మేరకు ఫలితాలు రావడం లేదు. ఒక్కో ఎకరాకు

మిగతా 5వ పేజీలో ▶



జూ. ఎన్టీఆర్ ఫ్లెక్సీలను తొలగించాలని ఆదేశిస్తున్న బాలకృష్ణ

జూ.ఎన్టీఆర్ ఫ్లెక్సీలు తీసేయండి

- బాలకృష్ణ ఆదేశం.. తొలగించిన అనుచరులు..
- తిరిగి ఏర్పాటు చేసేందుకు జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ ప్రయత్నం
- హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులోని ఎన్టీఆర్ ఘాట్ వద్ద ఉద్రిక్తత

- వివరాలు 2లో ▶

భార్యను చంపిన భర్తకు ఉరిశిక్ష

నాంపల్లి కోర్టు సంచలన తీర్పు.. 2019లో భవానీనగర్ పీఎస్‌లో కేసు నమోదు

- వివరాలు 5లో ▶

క్లుప్తంగా...

పార్లమెంటులో తెలంగాణ గొంతుక వినపడాలి

మహబూబ్‌నగర్‌లో బీఆర్‌ఎస్ గెలవాలి: మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్



సాక్షి, హైదరాబాద్: పార్లమెంటులో తెలంగాణ గొంతుక వినపడాలంటే లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఘన విజయం సాధించాల్సిన అవసరం ఉందని మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో గురువారం మహబూబ్‌నగర్ పార్లమెంటు సన్నాహక సమావేశం అనంతరం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. గత రెండు లోక్ సభల్లో బీఆర్‌ఎస్ ఎంపీలే కాంగ్రెస్, బీజేపీ ఎంపీల కన్నా ఎక్కువ ప్రశ్నలు అడిగారని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన తప్పుడు హామీలతో ప్రజలు మోసపోయారని, ఇప్పుడు వారంతా తమ కళ్లను తామే పొడుచుకున్నామని బాధ పడుతున్నారని తెలిపారు.

కేసులు పెడుతున్నారు

ఆలయం కడితే నోటీసులు ఇస్తారా?: గండ్ర వెంకటరమణారెడ్డి



సాక్షి, హైదరాబాద్: పోలీసులు బీఆర్‌ఎస్ నేతలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆపార్టీ మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ఆరోపించారు. గురువారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ తనపైనే కాకుండా తన కుటుంబ సభ్యులపై కూడా ఒక రౌడీ షీటర్‌తో ప్రైవేటు ఫిర్యాదు ఇప్పించి కేసులు నమోదు చేశారని తెలిపారు. ఆలయం కడితే స్థానిక ఎమ్మెల్యే ప్రోద్బలంతో నోటీసులు ఇచ్చారని, దానిపై హైకోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నానని చెప్పారు. అది ఆలయం ఆస్తి తప్ప తన సొంత ఆస్తి కాదని స్పష్టం చేశారు.

కాంగ్రెస్, బీఆర్‌ఎస్ కార్యకర్తలు

బీజేపీ గెలుపును కోరుకుంటున్నారు: బండి



సిరిసిల్ల: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలవాలని కాంగ్రెస్, బీఆర్‌ఎస్ కార్యకర్తలు కోరుకుంటున్నారని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ పేర్కొన్నారు. సిరిసిల్లలో గురువారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఈనెల 28న కరీంనగర్‌లో నిర్వహించే పార్లమెంట్ నియోజకవర్గ క్రియాశీల కార్యకర్తల సమ్మేళనంలో పాల్గొంటారని తెలిపారు. బీజేపీని గెలిపిస్తేనే తెలంగాణకు కేంద్రం నుంచి అదనపు నిధులు వస్తాయని అందరూ నమ్ముతున్నారని, మోదీ ప్రభుత్వ విజయాలు, అందించిన నిధుల వివరాలు జనంలోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. కేంద్రంలో మళ్లీ వచ్చేది మోదీ సర్కారేనని, అప్పుల్లో ఉన్న రాష్ట్రాన్ని గట్టెక్కించాలంటే మోదీతోనే సాధ్యమనే భావన కాంగ్రెస్, బీఆర్‌ఎస్ శ్రేణుల్లో నెలకొందన్నారు.

రాష్ట్రపతిని ఆహ్వానించరా?

రాములు నాయక్ ఆవేదన



సాక్షి, హైదరాబాద్: అయోధ్య మందిర ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ఆహ్వానం లేకపోవడం దారుణమని మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం గాంధీభవన్‌లో టీపీసీసీ నేతలు జగన్‌లాల్ నాయక్, మంగీలాల్ నాయక్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. దేశ ప్రథమ మహిళ, ఆదివాసీని అవమానిస్తారా అని ధ్వజమెత్తారు.

జూ.ఎన్టీఆర్ ఫ్లెక్సీలు తీసేయండి

బాలకృష్ణ అసహనం.. తొలగించిన అనుచరులు

- తిరిగి ఏర్పాటు చేసేందుకు జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ ప్రయత్నం
- నెక్లెస్ రోడ్డులోని ఎన్టీఆర్ ఘాట్ వద్ద ఉద్రిక్తత



బాలయ్య ఆదేశంతో ఎన్టీఆర్ ఘాట్ వద్ద జూనియర్ ఎన్టీఆర్ ఫ్లెక్సీలను తొలగిస్తున్న అనుచరులు

ఖైరతాబాద్ (హైదరాబాద్): ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా నెక్లెస్ రోడ్డులోని ఆయన ఘాట్ వద్ద నటుడు జూనియర్ ఎన్టీఆర్ ఫొటోతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించాలంటూ బాలకృష్ణ ఆదేశించడం వివాదానికి దారితీసింది. బాలకృష్ణ ఆదేశాలతో ఆయన అనుచరులు ఫ్లెక్సీలు తొలగించడం, జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు వాటిని తిరిగి ఏర్పాటు చేసేందుకు ప్రయత్నించడం, పోలీసులు అడ్డుకోవడంతో ఘాట్ వద్ద స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. వివరాలు ఇలా ఉన్నాయి.

ఎన్టీఆర్‌కు కుటుంబసభ్యుల నివాళి

గురువారం ఎన్టీఆర్ వర్ధంతి పురస్కరించుకుని ఎన్టీఆర్ ఘాట్‌లోని ఆయన సమాధి వద్ద కుటుంబ సభ్యులు, అభిమానులు ఘనంగా నివాళులర్పించారు. తెల్లవారు జామున జూనియర్ ఎన్టీఆర్, కల్యాణ్‌రామ్‌లు.. ఎన్టీఆర్ ఘాట్‌కు విచ్చేసి తాతకు నివాళులర్పించారు. అనంతరం ఎన్టీఆర్ కుమారుడు, సీనియర్ నటుడు, ఎమ్మెల్యే బాలకృష్ణ, నందమూరి రామకృష్ణ, సుహాసినితో పాటు చంద్రబాబు సతీమణి భువనేశ్వరి నివాళులర్పించారు. అయితే ఈ సందర్భంగా ఎన్టీఆర్ ఘాట్ లోపల, ప్రవేశ ద్వారం రెండువైపులా జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు.. ఎన్టీఆర్, జూనియర్ ఎన్టీఆర్‌లతో కూడిన భారీ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. తండ్రికి నివాళులర్పించి బయటకు వచ్చే క్రమంలో ఈ ఫ్లెక్సీలను చూసిన బాలకృష్ణ.. వెంటనే వాటిని తొలగించాలని ఆదేశించడంతో, ఆయన అనుచరులు జూనియర్ ఎన్టీఆర్ ఫ్లెక్సీలను తొలగించి కొన్నింటిని రోడ్డు ఫుట్‌పాత్‌పై, మరికొన్ని ఘాట్ పార్కింగ్ ప్రాంతంలో కనిపించకుండా పెట్టారు.

జూ.ఎన్టీఆర్ ఫ్లెక్సీలకు పాలాభిషేకం

తమ హీరో ఫ్లెక్సీలు తొలగించారన్న విషయం తెలుసుకున్న జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు వెంటనే అక్కడికి చేరుకున్నారు. బయట ఉంచిన ఫ్లెక్సీలను తిరిగి లోపల పెట్టేందుకు అనుమతించాలని పోలీసులను కోరారు. వారు అందుకు అనుమతించకపోవడంతో అభిమానులు ఘాట్ లోపల తొలగించకుండా వదిలేసిన జూనియర్ ఎన్టీఆర్ ఫ్లెక్సీలకు పూలమాల వేసి పాలాభిషేకం చేశారు. ఆ తర్వాత అక్కడికి వచ్చిన జూనియర్ ఎన్టీఆర్ అభిమానుల సంఘం అధ్యక్షుడు ఫుట్‌పాత్‌పై ఉంచిన రెండు ఫ్లెక్సీలను ఘాట్ లోపలికి తీసుకువచ్చారు. ఇది గమనించిన పోలీసులు.. బయట ఉన్న ఫ్లెక్సీలు లోపలికి ఎందుకు తీసుకువచ్చారంటూ.. వెంటనే వాటిని యథాస్థానంలో పెట్టాలని ఆదేశించారు. వారు విన్పించుకోక పోవడంతో అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నించారు. దీంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. చివరకు పోలీసులు లోపలికి తీసుకువచ్చిన ఫ్లెక్సీలను తిరిగి బయట పెట్టించి వారిని అక్కడినుంచి పంపించి వేయడంతో ఉద్రిక్తత చల్లారింది. కాగా నివాళులర్పించిన అనంతరం బాలకృష్ణ మాట్లాడుతూ..తెలుగు బిడ్డ బొడ్డు కోయకముందే రాజకీయాలంటే ఏంటో తెలిపిన మహనీయుడు ఎన్టీఆర్ అని అన్నారు. సాహసోపేత పథకాల అమలుతో పేదవాడి ఆకలి తీర్చి, విప్లవాత్మక, సామాజిక మార్పులు తీసుకువచ్చిన గొప్ప నాయకుడని పేర్కొన్నారు. అందుకే ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని చెప్పారు.

సామాన్యుడు విమానాల్లో వెళ్లాలన్నదే మోదీ కల

- ఉడాన్ స్కీమ్‌తో సామాన్య ప్రజలకు విమాన యానం చేరువైంది
- 2047 నాటికి అతిపెద్ద విమానయాన మార్కెట్‌గా భారత్
- పౌర విమానయాన శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా


మాట్లాడుతున్న జ్యోతిరాదిత్య సింధియా

సాక్షి, హైదరాబాద్: హవాయి చెప్పులు వేసుకునే సామాన్య వ్యక్తి సైతం విమానాల్లో ప్రయాణించాలన్నదే పీఎం నరేంద్రమోదీ కల అని పౌర విమానయాన శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా పేర్కొన్నారు. ఉడాన్ పథకంతో సామాన్యులకు కూడా విమాన ప్రయాణాన్ని పీఎం అందుబాటులోకి తీసుకు వచ్చారని గుర్తు చేశారు.గురువారం బీజేపీ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 2047 నాటికి అతిపెద్ద విమానయాన మార్కెట్‌గా భారతదేశం అవతరిస్తుందన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. ప్రస్తుతం మూడవ అతిపెద్ద దేశీయ మార్కెట్‌గా, ఏడవ అతిపెద్ద అంతర్జాతీయ మార్కెట్‌గా భారత్ అవతరించిందని జ్యోతిరాదిత్య సింధియా వెల్లడించారు. 2047 నాటికి విమానయాన రంగంలో 20 ట్రిలియన్ డాలర్ల వృద్ధిని సాధించే దిశగా ముందుకు వెళ్తున్నామని తెలిపారు. దేశంలో 500 కొత్త ఇండిగో విమానాల కొనుగోలుకు ఆర్డర్ ఇచ్చామని తెలిపారు. మానవవనరుల కోసం పెరుగుతున్న డిమాండ్‌కు అనుగుణంగా ఎయిర్ క్రాఫ్ట్ మెయింటెనెన్స్ ఇంజినీరింగ్ కోర్సులను బోధించే జీఎంఆర్ స్కూల్ ఆఫ్ ఏవియేషన్‌ను హైదరాబాద్‌లో ప్రారంభించినట్లు మంత్రి వెల్లడించారు.

తప్పుడు ప్రచారాలను ఎప్పటికప్పుడు తిప్పికొట్టండి: ఇస్లాం

బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర శాఖ మీడియా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన మీడియా వర్క్‌షాప్‌ను మాజీ ఎంపీ, జాతీయ అధికార ప్రతినిధి జాఫర్ సయ్యద్ ఇస్లాం ప్రారంభించారు. పార్టీ బలోపేతంతో సహా పార్లమెంటు ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, విధివిధానాలపై కూలంకుషంగా చర్చించడంతో పాటు కాంగ్రెస్, బీఆర్‌ఎస్ తప్పుడు ప్రచారాలపై ఎప్పటికప్పుడు కౌంటర్ ఎటాక్ చేసేలా, మరింత యాక్టివ్‌గా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. మోదీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన గురించి క్షేత్రస్థాయిలో తీసుకెళ్లి, రానున్న పార్లమెంటు ఎన్నికల్లో పార్టీ మెజారిటీ సీట్లు గెలిపించుకునేలా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎన్వీ సుభాష్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీ ప్రేమేందర్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ప్రకాశ్ రెడ్డి, జాతీయ ఎస్సీ మోర్చా కార్యదర్శి ఎస్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మేము తలచుకుంటే బీఆర్‌ఎస్‌ను ముక్కలు చేయగలం

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ డైరీ, కేలండర్ ఆవిష్కరణ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం (హైదరాబాద్): ఆరు నెలల్లో అధికారం కోల్పోతోందని కాంగ్రెస్ పార్టీపై బీఆర్‌ఎస్ పిచ్చిపిచ్చిగా అవాకులు, చెవాకులు పేలుతోందని, మేం తలుచుకుంటే ఆ పార్టీని గంటలో 14 ముక్కలు చేయగలమని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఘాటుగా హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్ర ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (327 ఐఎన్‌టీయూసీ) అనుబంధ సంఘం 2024 డైరీ, కేలండర్ ఆవిష్కరణ బాగ్‌లింగంపల్లి ఆర్టీసీ కళాభవన్‌లో గురువారం జరిగింది. ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రులు కోమటిరెడ్డి, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, చీఫ్ విప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్యేలు రాజేందర్‌రెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు. ఆర్టిజన్లను రెగ్యులరైజ్ చేయడంతో పాటు ఇతర విద్యుత్ శాఖ ఉద్యోగుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని మంత్రి భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ, గత పదేళ్ల కాలంలో విద్యుత్ శాఖ మొత్తం మోసాలతోనే నడిచిందన్నారు.


కార్యక్రమంలో మంత్రులు కోమటిరెడ్డి, ఉత్తమ్

ఇలాగైతే 6 నెలల్లోనే తిరుగుబాటు!

- కాంగ్రెస్ హామీలను నెరవేర్చకుంటే ప్రజలు తిరగబడతారు: కేటీఆర్
- అదానీతో రేవంత్ అలయ్ బలయ్
- ఢిల్లీలో కొట్లాడుతూ తెలంగాణలో ఎందుకు దోస్తీ?
- కాంగ్రెస్ వైఖరి ఎందుకు మారిందో చెప్పాలని నిలదీత
- మహబూబ్‌నగర్ లోక్‌సభ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నేతలతో సమావేశం



తెలంగాణ భవన్‌లో మాట్లాడుతున్న కేటీఆర్. చిత్రంలో మధుసూదనాచారి, శ్రీనివాస్ గౌడ్, కడియం శ్రీహరి, పోచారం శ్రీనివాస్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: 'ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీలను ఎప్పటికప్పుడు ప్రజలు, కాంగ్రెస్ పార్టీకి గుర్తు చేయాలి. రైతు రుణమాఫీ, కరెంటు బిల్లుల చెల్లింపు, రైతుబంధు రూ.15 వేలకు పెంపు, రూ.4 వేల ఆసరా పింఛన్‌ను అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేస్తామనే హామీని గుర్తు చేస్తున్నాం. నిరుద్యోగ భృతిపై ప్రియాంక గాంధీ హామీ ఇస్తే, అమలు సాధ్యం కాదని డిప్యూటీ సీఎం అసెంబ్లీ వేదికగా చెప్తున్నారు. రుణమాఫీ హామీని దశల వారీగా అమలు చేస్తామంటూ రేవంత్ మాట మార్చారు. గతంలో వారం రోజుల్లో 70 లక్షల మంది రైతులకు రైతుబంధు ఇస్తే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి నెలన్నర దాటినా రైతుల ఖాతాల్లోకి డబ్బులు రావడం లేదు. ఎరువుల కోసం మళ్లీ లైన్లలో నిలబడాల్సిన పరిస్థితి నెలకొంది. ఇదే పరిస్థితి కొనసాగితే కేవలం ఆరు నెలల్లోనే ప్రభుత్వంపై ప్రజలు తిరగబడే పరిస్థితి వస్తుంది'అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు వ్యాఖ్యానించారు. తెలంగాణ భవన్‌లో గురువారం జరిగిన మహబూబ్‌నగర్ లోక్‌సభ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నేతల సమావేశంలో కేటీఆర్ ప్రసంగించారు.

గెలుపు బాట కష్టం కాదు

'ఆదిలాబాద్ నుంచి ఆలంపూర్ దాకా, హైదరాబాద్‌లోనూ వేల కోట్ల రూపాయల ఆస్తులు సృష్టించి బంగారు పళ్లెంలో తెలంగాణను కాంగ్రెస్‌కు అప్పగించినా.. బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై దుష్ప్రచారం విస్తృతంగా జరిగింది. ఇలాంటి వ్యతిరేక ప్రచారాన్ని తిప్పికొట్టాల్సిన బాధ్యత పార్టీ కార్యకర్తలు, నాయకులపై ఉంది. కార్యకర్తల అభిప్రాయం మేరకే ఇకపై పార్టీ కార్యక్రమాలకు రూపకల్పన జరుగుతుంది. పార్లమెంటు ఎన్నికల్లో తిరిగి గెలుపుబాట పట్టడం కష్టమేమీ కాదు'అని కేటీఆర్ అన్నారు.

కాంగ్రెస్ వైఖరి ఎందుకు మారింది?

దావోస్ సాక్షిగా అదానీతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అలయ్ బలయ్ చేసుకున్నారని కేటీఆర్ విమర్శించారు. ఢిల్లీలో అదానీతో కొట్లాడుతున్న కాంగ్రెస్ తెలంగాణలో మాత్రం ఎందుకు కలిసి పనిచేస్తోందని ప్రశ్నించారు. 'మోదీ, అదానీ ఒకటే అని రాహుల్‌గాంధీ అంటుండగా, ఇటీవలి కాంగ్రెస్ జాతీయ సమావేశాల్లో రేవంత్ కూడా వారు ఒకటేనంటూ మాట్లాడారు. రూ.13 లక్షల కోట్లు దోచిన అదానీ డబ్బులు ప్రధానికి, బీజేపీ ఖాతాలోకి వెళ్తాయని ఎన్నికల సమయంలో విమర్శించడంతో పాటు అదానీని దొంగ అంటూ సంబోధించారు. అధికారంలో లేనప్పుడు అదానీని దేశానికి శత్రువుగా పోల్చిన రేవంత్.. ఇప్పుడు అతనితో ఎందుకు కలిసి పనిచేస్తున్నారో చెప్పాలి. అదానీ పట్ల కాంగ్రెస్ పార్టీ వైఖరి ఎందుకు మారిందో చెప్పాలి. బీజేపీ ఆదేశాల మేరకే తెలంగాణ ప్రభుత్వం, సీఎం రేవంత్ అదానీతో కలిసి పని చేస్తున్నారు. మరోవైపు లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను కాంగ్రెస్, బీజేపీ కలిసి బొంద పెట్టాలంటూ బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ పిలుపునిస్తారు. కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కు రాజకీయాలను ప్రజలకు వివరించాలి'అని పార్టీ శ్రేణులకు కేటీఆర్ సూచించారు.

ఎమ్మెల్సీలు కీలకంగా వ్యవహరించాలి

గ్రామ స్థాయి నుంచి పొలిట్‌బ్యూరో వరకు బీఆర్‌ఎస్‌ను పునర్వ్యవస్థీకరించాలని అధినేత కేసీఆర్ భావిస్తున్నారని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తదనుగుణంగా భవిష్యత్ కార్యాచరణ ఉంటుందని, చురుకైన నాయకులు, కార్యకర్తల సేవలను పార్టీ ఉపయోగించుకుంటుందని చెప్పారు. కేటీఆర్ తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీలతో సమావేశమై మాట్లాడారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో త్రిముఖ పోటీ ఉండే అవకాశం ఉందని, తదనుగుణంగా ఎన్నికల ప్రణాళికలు తయారు చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో ఎమ్మెల్సీలు కీలకంగా పనిచేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. వారం తరువాత కేసీఆర్‌తో ఎమ్మెల్సీల సమావేశం ఉంటుందని తెలిపారు. ఆ భేటీలోనే శాసన మండలికి సంబంధించి పార్టీ నేతలను ఎన్నుకుంటారని పేర్కొన్నారు.

ఎమ్మెల్సీలకు సమన్వయ బాధ్యతలు!

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎమ్మెల్సీలకు కీలక బాధ్యతలు అప్పగించాలని ఈ సమావేశంలో నిర్ణయించినట్లు సమాచారం. పార్టీ ఓడిపోయిన నియోజక వర్గాల్లోని సిట్టింగ్ ఎమ్మెల్సీలకు సమన్వయ బాధ్యతలు అప్పజెప్పాలని పార్టీ భావిస్తున్నట్లు కూడా కేటీఆర్ చెప్పినట్లు తెలిసింది. అవసరమైతే వారినే ఎంపీలుగా పోటీకి నిలిపే యోచనలో ఉన్నట్లు తెలిసింది. ఇందులో భాగంగా నిజామాబాద్ స్థానానికి కల్వకుంట్ల కవిత, మల్కాజిగిరికి శంభీపూర్ రాజు, మెదక్‌కు పి.వెంకట్ రాంరెడ్డి, మహబూబాబాద్‌కు సత్యవతి రాథోడ్, నల్లగొండకు గుత్తా తనయుడు అమిత్ రెడ్డి పేర్లను సూత్రప్రాయంగా నిర్ణయించినట్లు తెలిసింది.

ఐదు మోర్చాలకు కొత్త అధ్యక్షులు

12 మంది జిల్లా అధ్యక్షుల మార్పు.. కొత్తవారి నియామకం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర బీజేపీలో కొన్ని సంస్థాగత మార్పుచేర్పులు చోటుచేసుకున్నాయి. పార్టీ రాజ్యాంగం ప్రకారం రాష్ట్రాన్ని 35 జిల్లాలుగా విభజించిన విషయం తెలిసిందే. కాగా 12 మంది జిల్లా అధ్యక్షులను మారుస్తూ కేంద్రమంత్రి, రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్ర స్థాయిలో మొత్తం ఏడు మోర్చాలు ఉండగా.. మైనారిటీ మోర్చా, కిసాన్ మోర్చా మినహా మిగతా ఐదు మోర్చాల అధ్యక్షులను మార్చారు. దీంతో 12 జిల్లాలకు చెందిన పాత కమిటీలు, అలాగే ఐదు మోర్చాల కమిటీలు రద్దయ్యాయి.

కొత్తగా నియమితులైన జిల్లా అధ్యక్షులు వీరే..

నిజామాబాద్- దినేష్‌కుమార్, పెద్దపల్లి - చందుపట్ల సునీల్, సంగారెడ్డి - గోదావరి అంజిరెడ్డి, సిద్దిపేట-మోహన్‌రెడ్డి, యాదాద్రి భువనగిరి-పాశం భాస్కర్, వనపర్తి నారాయణ, వికారాబాద్ - మాధవరెడ్డి, నల్లగొండ- డాక్టర్ వర్షిత్‌రెడ్డి, ములుగు - బలరాం, మహబూబ్‌నగర్ - పి.శ్రీనివాస్ రెడ్డి, వరంగల్ - గంట రవి, నారాయణపేట - జలంధర్ రెడ్డి.

మోర్చాల కొత్త అధ్యక్షులు

ఎస్టీ మోర్చా అధ్యక్షుడిగా నాగర్‌కర్నూల్ జిల్లాకు చెందిన డా. జారుప్లవత్ గోపి (కళ్యాణ్ నాయక్), ఎస్సీ మోర్చా అధ్యక్షుడిగా కొండేటి శ్రీధర్ (వరంగల్ జిల్లా), యువ మోర్చా అధ్యక్షుడిగా సెవెళ్ల మహేందర్ (రంగారెడ్డి జిల్లా రూరల్), ఓబీసీ మోర్చా అధ్యక్షుడిగా ఆనంద్ గౌడ్ (హైదరాబాద్), మహిళా మోర్చా అధ్యక్షురాలిగా డా.శిల్ప (మేడ్చల్ రూరల్ జిల్లా) నియమితులయ్యారు. కిసాన్ మోర్చా అధ్యక్షుడిగా తౌలుత పెద్దోళ్ల గంగారెడ్డి (నిజామాబాద్ జిల్లా)ని నియమించినా తర్వాత పెండింగ్‌లో పెట్టారు.

ప్రజలపై భారం మోపం

ప్రత్యామ్నాయ ఆదాయ వనరులపై దృష్టి

- బడ్జెట్ 2024-25 రూపకల్పన సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క


మాట్లాడుతున్న భట్టి. చిత్రంలో పొంగులేటి

సాక్షి, హైదరాబాద్: ప్రజలపై భారం మోపకుండా ప్రత్యామ్నాయ ఆదాయ వనరులపై దృష్టి సారించి రాష్ట్ర అభివృద్ధికి పాటుపడుతామని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క స్పష్టం చేశారు. వార్షిక బడ్జెట్ 2024-25 ప్రతిపాదనల రూపకల్పనలో భాగంగా గురువారం సచివాలయంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితోకలిసి వ్యవసాయం, మార్కెటింగ్, చేనేత జౌళి, ఉద్యాన వన, రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార /ప్రజాసంబంధాల శాఖలతో సమీక్ష నిర్వహించారు. ఆస్తులు సృష్టించి, వాటితో వచ్చే ఆదాయాన్ని ప్రజలకు పంచడానికి కృషి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఆరు గ్యారంటీల అమలు, గడువు ముగిసిన భూముల లీజుపై దృష్టి సారించాలన్నారు.

అసైన్డ్ భూములపై నివేదిక ఇవ్వాలి..

గత ప్రభుత్వం ధరణిలో 'కాస్తు' కాలమ్ తొలగించడంతో పాటు ప్రభుత్వ, అసైన్డ్, మాన్యం, ఎండోమెంట్, కొన్ని పట్టా భూములను పార్ట్-బీలో పెట్టి రైతుల హక్కులను కాలరాసిందన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏటా రెవెన్యూ సదస్సులు నిర్వహించి జమాబందీ చేసేవారని, 2014 తర్వాత ఈ విధానానికి స్వస్తి పలకడంతో రైతులు ఇబ్బంది పడ్డారని చెప్పారు. ధరణితో ప్రభుత్వ భూములు కొందరి చేతుల్లోకి వెళ్లాయని, వాటిని గుర్తించి తిరిగి స్వాధీనం చేసుకోవాలని రెవెన్యూశాఖను ఆదేశించారు. 2014 వరకు పంపిణీ చేసిన అసైన్డ్ భూములు, గత ప్రభుత్వం వెనక్కి తీసుకున్న అసైన్డ్ భూములను ఏ అవసరాల కోసం వాడారు.. వెనక్కి తీసుకున్న భూముల్లో మిగిలి ఉన్న భూమి ఎంత? వంటి వివరాలతో సమగ్ర నివేదిక ఇవ్వాలని కోరారు. ఆపద్బంధు, పిడుగుపాటు మృతులకు కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించే పథకాలను గత ప్రభుత్వం అమలు చేయలేదని అధికారులు వివరించారు. కేంద్రం ఈ పదేళ్లలో రాష్ట్రంలో 1.50 లక్షల ఇళ్ల నిర్మాణానికి మాత్రమే నిధులిచ్చిందని, 2023-24లో ఇళ్ల నిర్మాణ పథకాన్ని తాత్కాలికంగా నిలుపుదల చేసిందని మంత్రులకు తెలిపారు. 2024-25లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సిద్ధం చేసిన ప్రతిపాదనలను వివరించారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 2లక్షలగాను 67 వేల ఇళ్లు పూర్తి చేశామని చెప్పారు.

నకిలీ విత్తనాలపై ఉక్కుపాదం: నకిలీ విత్తనాలు మార్కెట్లోకి రాకుండా అరికట్టాలని, నిబంధనలు పాటించని కంపెనీలపై ఉక్కు పాదం మోపాలని మంత్రులు ఆదేశించారు. బతుకమ్మ చీరలు, విద్యార్థుల యూనిఫామ్‌ల తయారీపై ఆరా తీశారు. ఈ సమీక్షలో ఆర్థిక, రెవెన్యూ(విపత్తు) శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, అర్వింద్ కుమార్, నవీన్‌మిత్తల్ పాల్గొన్నారు.

రైతు రుణాలను రికవరీ చేయండి

- తీర్చని వారిపైనే కాదు.. వసూళ్లు చేయని వారిపై కూడా కఠిన చర్యలు తీసుకోండి
- అధికారులకు వ్యవసాయ మంత్రి తుమ్మల ఆదేశం



సాక్షి, హైదరాబాద్: రైతు రుణాలను రికవరీ చేయాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ)లు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (ప్యాక్స్)ల్లో ఉన్న రుణాల మొండి బకాయిలు, వ్యవసాయేతర రుణాలను తీర్చని వాటిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు స్పష్టం చేశారు. అలాగే వారం రోజుల్లో రుణాలను తీర్చని రైతులపై, రుణాలను రికవరీ చేయని అధికారులపైనా కఠినమైన చర్యలు తీసుకోవాలని కూడా ఆయన ఆదేశించారు. డీసీసీబీ, ప్యాక్స్‌ల్లో పాత రుణాల బకాయిలపై గురువారం మంత్రి తుమ్మల సమీక్ష చేశారు. రుణాలను నియమాల ప్రకారం ఆమోదించాలని ఆదేశించారు. నిజామాబాద్ పర్యటనలో రైతులు ఇచ్చిన వినతిపత్రాలపై కూడా ఈ సమీక్షా సమావేశంలో ఆయన స్పందించారు.

ప్యాక్స్‌లను బలోపేతం చేయండి: ప్యాక్స్‌ల్లో నిబంధనలకు విరుద్ధంగా తీసుకున్న రుణాలపై కఠినమైన చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంక్ (టెస్కాబ్) ఎండీని మంత్రి తుమ్మల ఆదేశించారు. ప్యాక్స్‌లను బలోపేతం చేయాలని సూచించిన ఆయన రైతులకు అవసరమైన అన్ని రకాల ఎరువులను సిద్ధంగా ఉంచాలన్నారు. గ్రామ స్థాయి వరకు చేర్చే ప్రణాళికను మార్క్‌ఫెడ్ అమలు చేయాలనీ, ఎరువుల కంపెనీలతో చర్చించాలని సూచించారు. రైతులకు ఎరువుల పంపిణీలో ఎటువంటి జాప్యం జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైన స్థాయిలోఎరువులు అందుబాటులో ఉన్నందున రైతులు ఎటువంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని తుమ్మల భరోసానిచ్చారు.

తుమ్మల ఆదేశాలపై చర్చ

కాగా, మంత్రి తుమ్మల రుణ వసూళ్ల ఆదేశాలపై సర్వత్రా చర్చ జరుగుతోంది. రైతులు తీసుకున్న స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాలతోపాటు వ్యవసాయేతర రుణ బకాయిలు పేరుకుపోతే కఠిన చర్యలు తీసుకోవాలన్న ఆదేశాలపై వ్యవసాయశాఖలోనూ చర్చకు తెరలేపింది. రైతులు బకాయిలపై చర్యలు తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని డీసీసీబీ, టెస్కాబ్ వర్గాలు చెబుతున్నాయి.

హామీల సంగతేమైంది?

కాంగ్రెస్ తీరుపై మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజం



గజ్వేల్: రుణమాఫీ, రూ.4వేలకు పింఛన్ల పెంపు, నిరుద్యోగ భృతి, వడ్లకు రూ.500 బోనస్, కరెంట్ బిల్లుల మాఫీ హామీలు ఏమయ్యాయని మాజీ మంత్రి హరీశ్‌రావు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రైతుబంధు కూడా పెంచుతామని చెప్పారని, కానీ ఇచ్చేదేమీ కనిపించడం లేదని ఎద్దేవా చేశారు. గురువారం సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో బీఆర్‌ఎస్ కృతజ్ఞత సభ జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన హరీశ్‌రావు మాట్లాడుతూ అదానీ, అంబానీ అవినీతి వెనుక ప్రధాని మోదీ హస్తమున్నదని ఓ వైపు రాహుల్‌గాంధీ విమర్శిస్తుంటే.. సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం దావోస్‌లో అదానీతో అగ్రిమెంట్లు చేసుకుని అలుముకోవడం విడ్డూరంగా ఉందన్నారు. బీజేపీతో కొట్లాడతామని చెప్పిన కాంగ్రెస్ నేతలు పాలమూరు ప్రాజెక్టుకు జాతీయ హోదాపై ఆ పార్టీని ఎందుకు నిలదీయటం లేదని ప్రశ్నించారు. బీజేపీతో కొట్లాడుతున్నది బీఆర్‌ఎస్ మాత్రమేనని బండి సంజయ్, అరవింద్, ఈటల, రఘునందన్‌రావులను ఓడించింది తమ పార్టీయేననే విషయం మర్చిపోవద్దన్నారు. మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సభలో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, జెడ్పీ చైర్మన్ రోజాశర్మ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీలుగా బల్మూరి వెంకట్, మహేశ్ గౌడ్ నామినేషన్లు


నామినేషన్లు దాఖలు చేస్తున్న బల్మూరి వెంకట్, మహేశ్ గౌడ్. చిత్రంలో వివేక్, భట్టి, పొంగులేటి, తుమ్మల, అంజన్ కుమార్, ఉత్తమ్, వీహెచ్ తదితరులు

22న ఉపసంహరణ అనంతరం ఫలితంపై ప్రకటన

- రెండు స్థానాలకు ఇద్దరే నామినేషన్లు.. ఏకగ్రీవ ప్రకటనే తరువాయి

సాక్షి, హైదరాబాద్: శాసన మండలిలో ఎమ్మెల్యే కోటాలో ఖాళీగా ఉన్న రెండు స్థానాలకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులుగా బల్మూరి వెంకట్, మహేశ్ కుమార్ గౌడ్ గురువారం నామినేషన్ దాఖలు చేశారు. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీల ఉప ఎన్నిక నోటిఫికేషన్ ఈనెల 11న వెలువడింది. నామినేషన్ల స్వీకరణకు గురువారం చివరి రోజు కాగా కాంగ్రెస్ అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను అసెంబ్లీ రిటర్నింగ్ అధికారికి సమర్పించారు. నామినేషన్ దాఖలు కార్యక్రమానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు. వీరితో పాటు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడు గిడుగు రుద్రరాజు, ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యతో పాటు పలువురు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

ఎన్నిక ఏకగ్రీవమే

రెండు స్థానాలకు ఇద్దరు అభ్యర్థులు మాత్రమే నామినేషన్ వేయడంతో ఎన్నిక ఏకగ్రీవం కానుంది. అయితే ఈ నెల 19న నామినేషన్ల పరిశీలన, 22న ఉపసంహరణ ప్రక్రియ ముగిసిన తర్వాత ఫలితాన్ని అధికారికంగా ప్రకటించనున్నారు. 119 ఎమ్మెల్యేలు కలిగిన తెలంగాణ అసెంబ్లీలో సీపీఐతో కలుపుకుని కాంగ్రెస్‌కు 65 మంది సభ్యుల సంఖ్యాబలం ఉంది. మరోవైపు 39 మంది ఎమ్మెల్యేలు కలిగిన బీఆర్‌ఎస్ పార్టీ ఈ ఎన్నిక ప్రక్రియకు దూరంగా ఉంది. దీంతో కాంగ్రెస్ తరఫున ఖాళీగా ఉన్న రెండు ఎమ్మెల్సీ స్థానాలకు ఇద్దరు అభ్యర్థులు నామినేషన్లు వేయడంతో ఎమ్మెల్సీలుగా బల్మూరు వెంకట్, మహేశ్ కుమార్ గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యే అవకాశముంది. నామినేషన్ల అనంతరం మంత్రి ఉత్తమ్ మీడియాతో మాట్లాడారు. పార్టీలో కష్టపడిన వారికి గుర్తింపు లభిస్తుందనేందుకు ఈ ఇద్దరు నాయకులను శాసన మండలికి పంపడమే ఉదాహరణ అని ఆయన పేర్కొన్నారు.

క్లుప్తంగా...

డీజీపీ కార్యాలయ ఉద్యోగుల కేలండర్ ఆవిష్కరణ



సాక్షి, హైదరాబాద్: డీజీపీ కార్యాలయ ఉద్యోగుల సంక్షేమ సంఘానికి సంబంధించిన 2024 సంవత్సర కేలండర్‌ను డీజీపీ రవిగుప్తా గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఐజీ పర్సనల్ ఎస్.చంద్రశేఖర్‌రెడ్డి, డీజీపీ కార్యాలయ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు సి.పవన్‌కుమార్, ప్రధాన కార్యదర్శి కె.హరిణి, ఉపాధ్యక్షురాలు లూసీ లావణ్య, ఉపాధ్యక్షుడు ఇ.సుధీర్‌రెడ్డి, సాయి, కమల్ తదితరులు పాల్గొన్నారు.

ఐసీఎస్ఐ హైదరాబాద్ చాప్టర్ నూతన కార్యవర్గం ఎన్నిక



నాంపల్లి (హైదరాబాద్): భారత ప్రభుత్వ కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ పరిధిలో పనిచేస్తున్న 'ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీస్ ఆఫ్ ఇండియా (ఐసీఎస్ఐ) హైదరాబాద్ చాప్టర్‌కు 2024వ ఏడాదికిగాను నూతన కార్య వర్గాన్ని గురువారం ప్రకటించారు. ఐసీఎస్ఐ హైదరాబాద్ చాప్టర్ చైర్మన్‌గా లక్ష్మీనారాయణ గుప్తా గమిని, వైస్ చైర్మన్‌గా మంజిత్ బుచా, కార్యదర్శిగా శిల్పాబంగ్, కోశాధికారిగా పవన్ కంకణి, సభ్యులుగా తంగిరాల లలితాదేవి, అక్షితా సురానా, ఎ.కార్తీక్, ఎక్స్‌అఫీషియో సభ్యులుగా రాజవోలు వెంకటరమణ, మహాదేవి తిరునగరి ఎన్నికైనట్లు చాప్టర్ ఈఓ శ్రీనివాస్ ఓ ప్రకటనలో వెల్లడించారు. నూతన కమిటీ 2025 జనవరి 18 వరకు ఉంటుదన్నారు.

'పోటీ పరీక్షలపై అవగాహన అభినందనీయం'

సాక్షి, హైదరాబాద్: నీట్, ఐఐటీ పరీక్షల్లో ర్యాంకులు సాధించాలనుకునే విద్యార్థులకు మెటా మైండ్ అకాడమీ ప్రత్యేక ఉచిత అవగాహన తరగతులు నిర్వహించడం అభినందనీయమని ప్రొఫెసర్ కోదండరాం పేర్కొన్నారు. అకాడమీ ఆధ్వర్యంలో ప్రతీ ఆదివారం చేపడుతున్న అవగాహన తరగతులకు సంబంధించిన పోస్టర్‌ను గురువారం ఆయన ఆవిష్కరించారు. ఐఐటీ, నీట్ సాధనలో ఎదురయ్యే సవాళ్లు, పోటీ పరీక్షలను ఎదుర్కొనేందుకు కావాల్సిన మెళకువలపై నిపుణులతో అవగాహన కల్పిస్తున్నామని మెటామైండ్ చైర్మన్ మనోజ్‌కుమార్, డైరెక్టర్ గోపాల్ తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు 90908 98902 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

అతిథి అధ్యాపకుల వేతనాల వెతలు

సాక్షి, హైదరాబాద్: రెగ్యులర్ అధ్యాపకుల మాదిరి తమకు వేతనాలు ఇవ్వాలని తెలంగాణ డిగ్రీ కళాశాలల అతిథి అధ్యాపకుల సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నర్సింగ్ శంకరయ్య, ప్రధాన కార్యదర్శి గొడుగు గోవర్ధన్‌గిరి రాష్ట్ర ప్రభుత్వానికి ఓ వినతిపత్రం పంపారు. 15 ఏళ్లుగా పనిచేస్తున్నా, తమకు ఏడాదికి 8 నెలల వేతనమే అందుతోందని, సెలవుల్లోస్తే వేతనం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమను ప్రతీఏటా రెన్యువల్ చేయాలని, 12 నెలలపాటు వేతనం ఇవ్వాలని కోరారు.

టాటాతో కలిసి స్కిల్లింగ్ సెంటర్లు

- ఐటీఐల్లో సాంకేతిక నైపుణ్య శిక్షణ కేంద్రాల ఏర్పాటుకు నిర్ణయం
- టాటా సన్స్ చైర్మన్‌తో రాష్ట్ర ప్రభుత్వ ఒప్పందం



టాటా సన్స్ చైర్మన్ నటరాజన్ చంద్రశేఖరన్‌తో సీఎం రేవంత్, మంత్రి శ్రీధర్‌బాబు

సాక్షి, హైదరాబాద్: దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సు (డబ్ల్యూఈఎఫ్) సందర్భంగా పలు సంస్థల అధిపతులు, ప్రతినిధులతో సీఎం రేవంత్‌రెడ్డి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పలు ఒప్పందాలు చేసుకున్నారు. ముఖ్యంగా టాటా సంస్థల నేతృత్వంలో రాష్ట్రంలోని ఐటీఐల్లో అధునాతన సాంకేతిక నైపుణ్య శిక్షణ కేంద్రాలను (స్కిల్లింగ్ సెంటర్లు) ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో.. ఈ మేరకు టాటా సన్స్ చైర్మన్ నటరాజన్ చంద్రశేఖరన్‌తో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. రాష్ట్రంలోని 50 పారిశ్రామిక శిక్షణా కేంద్రాల్లో (ఐటీఐల్లో) స్కిల్లింగ్ సెంటర్లు ఏర్పాటు చేయనున్నట్లు ముఖ్యమంత్రి కార్యాలయం గురువారం వెల్లడించింది. ఐటీఐల్లో కొత్త కోర్సులు, మాస్టర్ ట్రైనర్ల నియామకం కోసం టాటా గ్రూప్ రూ.1,500 కోట్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు తెలిపింది. కాగా టాటా గ్రూప్ తెలంగాణలో చేపట్టబోయే భవిష్యత్తు వ్యాపార ప్రణాళికలపై సమావేశంలో చర్చించారు.

తెలంగాణ అభివృద్ధికి కీలక భాగస్వామ్యం

తెలంగాణ అభివృద్ధికి టాటా గ్రూప్ కీలకమైన భాగస్వామ్యం అందిస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి ఈ సందర్భంగా చెప్పారు. వివిధ రంగాలలో పెట్టుబడులు పెడుతున్న ఈ సంస్థకు ప్రభుత్వం తగిన సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. తమ గ్రూప్ పెట్టుబడులకు తెలంగాణ వ్యూహాత్మకమైన కేంద్రంగా ఉందని, తమ వ్యాపారాలను రాష్ట్రంలో విస్తరిస్తామని చంద్రశేఖరన్ అన్నారు.

పెట్టుబడులకు క్యూ సెంట్రియో ఆసక్తి

ఐటీ డెవలప్‌మెంట్, సర్వీసెస్ అందించే క్యూ సెంట్రియో కంపెనీ తెలంగాణలో తమ కార్యకలాపాలను విస్తరించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా హైదరాబాద్ పరిధిలో దాదాపు 1,000 ఉద్యోగాలు కల్పించనున్నట్లు సంస్థ తెలిపింది. ఈ మేరకు దావోస్‌లో మంత్రి శ్రీధర్‌బాబుతో కంపెనీ ప్రతినిధి ఎలమర్తి సమావేశమయ్యారు.

ఏఐ, మెషీన్ లెర్నింగ్ రంగాల్లోకి ఉబర్

ప్రముఖ మొబిలిటీ సంస్థ ఉబర్ హైదరాబాద్‌లో ఏఐ, మెషీన్ లెర్నింగ్ రంగాల్లో ప్రవేశించాలని నిర్ణయించింది. అలాగే ఇప్పుడు అందిస్తున్న ఉబర్ సేవలతో పాటు కొత్తగా ఉబర్ షటిల్, ఉబర్ గ్రీన్ సేవలను కూడా అందించనున్నట్లు సీఎం రేవంత్‌తో భేటీ సందర్భంగా పేర్కొంది. దీని ద్వారా 1,000 మందికి ఉపాధి అవకాశాలను కల్పించనుంది.

మంత్రి శ్రీధర్‌బాబుతో ఒ9 సొల్యూషన్స్ సీఈవో భేటీ

ఒ9 సొల్యూషన్స్ సహ వ్యవస్థాపకుడు, సీఈవో చక్రి గొట్టిముక్కల మంత్రి శ్రీధర్‌బాబుతో సమావేశమయ్యారు. తెలంగాణ ప్రభుత్వ భాగస్వామ్యంతో స్కిల్స్ అకాడమీ చైన్ సప్లైని ప్రారంభించనున్నట్లు ఈ సందర్భంగా తెలిపారు.

లండన్ చేరుకున్న రేవంత్‌రెడ్డి

డబ్ల్యూఈఎఫ్ సదస్సుల్లో పాల్గొన్న సీఎం రేవంత్ గురువారం లండన్ చేరుకున్నారు. పలువురు కాంగ్రెస్ పార్టీ అభిమానులు స్వాగతం పలికారు.

రైతులకు 'కార్పొరేట్' లాభాలు రావాలి: సీఎం

రైతులకు కార్పొరేట్ తరహాలో లాభాలు రావాలన్నదే తన స్వప్నమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. దావోస్‌లో డబ్ల్యూఈఎఫ్ సమావేశంలో 'ఆహార వ్యవస్థలు, స్థానిక చర్యలు' అంశంపై సదస్సు జరిగింది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. భారత్‌లో రైతుల ఆత్మహత్యలు అతిపెద్ద సమస్య అని అన్నారు. రైతులకు బ్యాంకు రుణాలు రావడం లేదని, ఆధునిక టెక్నాలజీ లేదని చెప్పారు. రైతులకు కార్పొరేట్ తరహా లాభాలు వస్తే వారి ఆత్మహత్యలు 99 శాతం ఉండవని అన్నారు.

ఎస్సెస్సీ బోర్డు పేరుతో నకిలీ వెబ్‌సైట్స్

- కేసు నమోదు చేసిన సిటీ సైబర్ పోలీసులు
- డేటాను అక్రమంగా సేకరించడానికేనా?



నకిలీ వెబ్‌సైట్

సాక్షి, హైదరాబాద్: సెకండరీ స్కూల్ సర్టిఫికెట్ (ఎస్సెస్సీ) బోర్డు వెబ్‌సైట్‌ను పోలిన రెండు నకిలీ (bsetelangana.co.in, bsetelangana gov.in) సైట్లు ఇంటర్‌నెట్‌లో ఉన్నట్లు ఎస్సెస్సీ బోర్డు గుర్తించింది. ఈ నకిలీ వెబ్‌సైట్లను వెంటనే తొలగించి, నిర్వాహకులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ డైరెక్టర్ ఆఫ్ ఎగ్జామినేషన్ విభాగం డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్‌రావు సీసీఎస్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న అధికారులు దర్యాప్తు చేపట్టారు. ఈ నకిలీ వెబ్‌సైట్ల వెనుక ప్రైవేట్ ఇంటర్మీడియట్ కాలేజీల, కోచింగ్ ఇన్‌స్టిట్యూట్‌ల పాత్ర ఉందా? అనే కోణాన్నీ పరిగణనలోకి తీసుకుని ముందుకు వెళ్తున్నారు. ఈ సైట్లతో టెన్త్ విద్యార్థుల డేటాబేస్ సేకరించడం ద్వారా వారిని, వారి కుటుంబీకులను సంప్రదించడానికి అవసరమైన ఫోన్ నంబర్లు, చిరునామా సంగ్రహిస్తున్నారనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

అందుకోసమేనా ఈ నకిలీ వెబ్‌సైట్‌లు?

సాధారణంగా విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందు టెన్త్, ఇంటర్మీడియట్ విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులకూ ప్రైవేట్ ఇంటర్మీడియట్ కాలేజీలు, కొన్ని ఇన్‌స్టిట్యూట్స్ నుంచి ఫోన్లు, లేఖలు వస్తుంటాయి. దీనికోసం వారికి విద్యార్థుల పేర్లు, వివరాలు, చిరునామా తదితరాల డేటా కోసమే ఎవరి సహాయంతోనైనా నకిలీ వెబ్‌సైట్లు సృష్టించారా? అనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నారు. ఎస్సెస్సీ బోర్డుకు చెందిన అసలు వెబ్‌సైట్లో కుడివైపు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఫొటో మాత్రమే ఉంటుందని, అసలు పేజీని పోలిఉన్న నకిలీ దాంట్లో మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఫొటోలు ఉన్నాయని, మరో నకిలీ వెబ్‌సైట్ స్వరూపమే వేరుగా ఉందని అధికారులు స్పష్టం చేస్తున్నారు. దీన్ని ప్రతి ఒక్కరూ దృష్టిలో ఉంచుకోవాలని కోరుతున్నారు.

అధికారిక వెబ్‌సైట్ ఇదే



పదో తరగతికి సంబంధించిన పబ్లిక్ పరీక్షలు ఈ ఏడాది మార్చి, ఏప్రిల్ నెలల్లో నిర్వహించేందుకు ఎస్సెస్సీ బోర్డు సన్నాహాలు చేస్తోంది. ఆ ఏర్పాట్లలో భాగంగా విద్యార్థులకు సంబంధించిన డేటాను అప్‌లోడ్ చేసేందుకు అధికారిక వెబ్‌సైట్ (www.bse.telangana.gov.in) ద్వారా అవకాశం ఇచ్చారు. దీన్ని వినియోగించుకుని జిల్లా స్థాయి అధికారులు, సెకండరీ స్కూల్స్ నిర్వాహకులు విద్యార్థుల డేటాను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. బోర్డుకు సంబంధించిన కంప్యూటర్, సాఫ్ట్‌వేర్ వ్యవహారాలను సికింద్రాబాద్‌లోని మ్యాగ్నటిక్ ఇన్ఫోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ పర్యవేక్షిస్తోంది.

సర్కారు స్కూళ్లలో ఎన్నికలు షురూ

- 29న స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల ఎంపిక
- రేపు నోటిఫికేషన్ విడుదల
- నాలుగేళ్ల తర్వాత కొత్త కమిటీలు



సాక్షి, హైదరాబాద్: పాఠశాల నిర్వహణ కమిటీ ఎన్నికలకు ప్రభుత్వం గురువారం షెడ్యూల్ ఇచ్చింది. ఈ నెల 29వ తేదీన రాష్ట్రంలోని ప్రైవేటు పాఠశాలలు మినహా అన్ని రకాల ప్రభుత్వ స్కూల్స్‌లోనూ ఎన్నికలు నిర్వహించాలని జిల్లా విద్యాశాఖాధికారులకు పాఠశాల విద్య కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. 2009 విద్యాహక్కు చట్టం ప్రకారం 1 నుంచి 8వ తరగతి వరకూ స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంఎస్)లను నియమించాల్సి ఉంటుంది. రాష్ట్రంలో 2019 నవంబర్‌లో ఎన్నికలు జరిగాయి. వీటి కాలపరిమితి రెండేళ్లు ఉంటుంది. గడువు తీరినప్పటికీ అదే కమిటీలను రెండు పర్యాయాలు పొడిగిస్తూ వస్తున్నారు. దీనివల్ల స్కూల్‌లో విద్య ముగించుకున్న విద్యార్థుల తల్లిదండ్రులే ఇంకా కమిటీలో కొనసాగుతున్నారు. దీనిపై విమర్శలు రావడంతో ప్రభుత్వం కొత్త ఎస్ఎంఎస్‌ల నియామకానికి షెడ్యూల్ ఇచ్చింది.

రేపే నోటిఫికేషన్

స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల ఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్ ఈ నెల 20వ తేదీ ఉదయం 10 గంటలకు వెలువడుతుంది. ఇదే రోజు మధ్యాహ్నం 2 గంటలకు అన్ని స్కూల్స్‌లోనూ విద్యార్థుల తల్లిదండ్రుల జాబితాను నోటీసు బోర్డుపై ఉంచుతారు. జాబితాపై అభ్యంతరాలను 22వ తేదీ సాయంత్రం 4 గంటల వరకూ స్వీకరిస్తారు. తుది జాబితాను 24వ తేదీ ఉదయం 11 గంటలకు ప్రతీ స్కూల్ నోటీసు బోర్డుపై ఉంచుతారు. 29వ తేదీ ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ ఎన్నిక జరుపుతారు. 1–8 తరగతుల్లో సభ్యులను ఎన్నుకున్న తర్వాత 29వ తేదీన మధ్యాహ్నం 1.30 గంటకు మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్‌ను ఎన్నుకుంటారు. ఆ తర్వాత సాయంత్రం 2 నుంచి 4 గంటల మధ్య కొత్త కమిటీ సమావేశం జరుగుతుంది.

ఎన్నిక విధానం ఇలా...

- 1–8 తరగతులల్లో ప్రతీ క్లాసు నుంచి ముగ్గురు సభ్యులను విద్యార్థుల తల్లిదండ్రులు ఎన్నుకుంటారు. వీరిలో విధిగా ఇద్దరు మహిళలు ఉండాలి. ఏకగ్రీవ ఎన్నికకు వీలవ్వకపోతే చేతులెత్తే పద్ధతిలో ఎన్నిక చేపడతారు.
- స్కూల్ హెచ్ఎం కూడా మెంబర్‌గా ఉంటారు. వీరు కాకుండా స్థానిక కార్పొరేటర్, వార్డు మెంబర్, అంగన్‌వాడీ కార్యకర్త, హెల్త్ వర్కర్, మహిళా సమాఖ్య అధ్యక్షులు, స్వచ్ఛంద సంస్థల నుంచి ముగ్గురికి తక్కువ కాకుండా స్థానిక ఎంఈవో కో–ఆప్షన్ మెంబర్స్‌ను ఎంపిక చేస్తారు.
- ప్రైమరీ స్కూల్‌లో మొత్తం 15 మంది, అప్పర్ ప్రైమరీ స్కూల్‌లో 21 మంది సభ్యులుగా ఉంటారు. ఎన్నికైన సభ్యులు చైర్మన్, వైస్ చైర్మన్‌ను ఎన్నుకుంటారు. అవసరమైతే ఓటింగ్ నిర్వహిస్తారు. ఈ కమిటీ రెండేళ్ళ కాలపరిమితితో పనిచేస్తుంది.
- పాఠశాలలో అకడమిక్ పురోగతిని ఈ కమిటీ పరిశీలిస్తుంది. విద్యార్థుల చేరిక, హాజరు అంశాలను సమీక్షిస్తుంది. మిడ్ డే మీల్స్ అమలు, వార్షిక పద్దులను రూపొందించే అధికారంలో భాగస్వామ్యమవుతుంది.

ఉన్నత విద్యామండలి చైర్మన్, వైస్‌చైర్మన్ కొనసాగింపు..

సాక్షి, హైదరాబాద్: ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి, వైస్ చైర్మన్–1 ప్రొఫెసర్ వి.వెంకటరమణ తిరిగి తమ పదవుల్లో కొనసాగనున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారి ఈ మేరకు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత డిసెంబర్ 10వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా నామినేటెడ్ పోస్టుల్లో ఉన్న 54 మందిని తొలగిస్తూ ప్రభుత్వం జీఓ ఇచ్చిన విషయం తెలిసిందే. వీరిలో లింబాద్రి, వెంకటరమణ కూడా ఉన్నారు. వీరిద్దరిని తిరిగి కొనసాగిస్తూ, గతంలో ఇచ్చిన ఆదేశాలు నిలిపివేస్తున్నట్టు సీఎస్ తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. మండలి చైర్మన్, వైస్ చైర్మన్‌లను తొలగించినా, ఉన్నతాధికారుల మౌఖిక ఆదేశాల మేరకు వీరు తమ స్థానాల్లో పనిచేస్తున్నారు. ముఖ్యమంత్రి సమీక్ష సమావేశాలకు కూడా వెళుతున్నారు. విద్యాశాఖ ముఖ్యకార్యదర్శిగా బుర్రా వెంకటేశంను నియమించడం, ఆయన ఈ శాఖకు కొత్త కావడం వల్ల కావాల్సిన సమాచారం ఇవ్వడానికి లింబాద్రి అవసరమయ్యారు. ఎంసెట్ సహా ఇతర ఉమ్మడి ప్రవేశ పరీక్షలుండటంతో వారిని తిరిగి కొనసాగించాల్సి వచ్చిందని ప్రభుత్వవర్గాలు చెబుతున్నాయి. ఇదిలా ఉంటే ప్రభుత్వ శాఖల్లో రిటైర్ అయినా కొనసాగుతున్న వారి వివరాలను ప్రభుత్వం సేకరించింది. వీరిలో లింబాద్రి, మండలి వీసీ–2 మహ్మమూద్ కూడా ఉన్నారు. ప్రస్తుతం లింబాద్రిని కొనసాగించడంతో వీసీ–2 పరిస్థితిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

'సాక్షి' వార్తకు స్పందన..

మండలి చైర్మన్, వైస్ చైర్మన్ తొలగింపుతో ఉమ్మడి ప్రవేశ పరీక్షలపై తీవ్ర ప్రభావం ఉందనే కోణంలో 'ఇంకా సెట్ కాలేదు' అనే శీర్షికతో సాక్షి దినపత్రిక గురువారం ఓ కథనం ప్రచురించింది. దీంతో ఉన్నత విద్యామండలిలో నెలకొన్న గందరగోళ పరిస్థితులపై ముఖ్యమంత్రి కార్యాలయం ఆరా తీసింది. ఈ నేపథ్యంలో చైర్మన్, వైస్ చైర్మన్‌లను కొనసాగిస్తూ ఇదే రోజు ఉత్తర్వులు ఇవ్వడం విశేషం.

ఈడీ విచారణకు ఎమ్మెల్యే వివేక్

సాక్షి, హైదరాబాద్: విశాఖ ఇండస్ట్రీస్, ఎంఎస్ విజిలెన్స్ సెక్యూరిటీస్ సర్వీసెస్ లావాదేవీల వ్యవహారంపై నమోదైన కేసు దర్యాప్తులో భాగంగా చెన్నూరు కాంగ్రెస్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ గురువారం ఈడీ ముందు విచారణకు హాజరయ్యారు. రూ.8 కోట్ల బ్యాంకు లావాదేవీలపై గతంలో తెలంగాణ పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల సమయంలో విశాఖ ఇండస్ట్రీస్, ఎంఎస్ విజిలెన్స్ సెక్యూరిటీస్ సర్వీసెస్ మధ్య రూ.100 కోట్ల మేర లావాదేవీల వ్యవహారంలో మనీలాండరింగ్‌పై ఈడీ అధికారులు దర్యాప్తు చేపట్టారు. ఈ కేసుకు సంబంధించి పలు ఆధారాలు లభించినట్టు ఈడీ అధికారులు గతంలో వెల్లడించారు. కేసు దర్యాప్తులో భాగంగా ఈడీ అధికారుల విచారణకు ఎమ్మెల్యే వివేక్ హాజరయ్యారు. అధికారుల సూచన మేరకు కొన్ని పత్రాలను వివేక్ వారికి సమర్పించినట్టు సమాచారం.

నెలాఖరులోగా సీఎంఆర్ పూర్తి కావాల్సిందే!

పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ స్పష్టీకరణ



సాక్షి, హైదరాబాద్: వానాకాలం సీజన్‌కు సంబంధించిన కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్)ను ఈనెల 31లోగా మిల్లర్ల నుంచి పూర్తిస్థాయిలో సేకరించేందుకు చర్యలు తీసుకోవాలని పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ అధికారులను ఆదేశించారు. ఎంసీఆర్ హెచ్ఆర్డీలో గురువారం అడిషనల్ కలెక్టర్లు, డీసీఎస్‌వోలు, డీఎంలతో కమిషనర్ చౌహాన్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజాపంపిణీకి అవసరమైన బియ్యం నిల్వలు కార్పొరేషన్ దగ్గర ఉన్నాయని, ఈ నేపథ్యంలో ప్రతి బియ్యం గింజను కూడా ఎఫ్‌సీఐకి అప్పగించాల్సిందేనన్నారు. డీఫాల్ట్ అయిన మిల్లర్లపై కఠిన చర్యలు తప్పవని చౌహాన్ హెచ్చరించారు. గతంలో డీఫాల్ట్ అయిన మిల్లర్ల నుంచి 25శాతం పెనాల్టీని వసూలు చేస్తామని, ఈ విషయంలో ఎవరిని వదిలిపెట్టబోమన్నారు. రాష్ట్రంలో మిల్లుల సామర్థ్యం ప్రకారం మిల్లింగ్ జరగడంలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. కొంతమంది అధికారులు ఉద్దేశపూర్వకంగా అవసరానికి మించి అధిక మొత్తంలో గన్నీ సంచులను సేకరిస్తున్నారని, దీనిపై విచారణకు ఆదేశించినట్లు తెలిపారు.



సమష్టి కృషితోనే దక్షిణ మధ్య రైల్వే ప్రగతి

జీఎం అరుణ్‌కుమార్ జైన్



బన్సీలాల్‌పేట్ (హైదరాబాద్): ఉద్యోగుల అంకితభావం, సమష్టి కృషి ఫలితంగానే దక్షిణ మధ్య రైల్వే ప్రగతి పథంలో ప్రయాణిస్తూ అనేక అవార్డులను కైవసం చేసుకుంటోందని జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ అన్నారు. సికింద్రాబాద్ బోయిగూడ రైల్‌కళారంగ్‌లో గురువారం జరిగిన దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ 32వ ద్వైవార్షిక సర్వసభ్య మండలి సమావేశానికి జీఎం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉద్యోగులు, పెన్షనర్ల సంక్షేమం, భద్రత కోసం అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని, ఉద్యోగుల సమస్యల విషయంలో సదా అందుబాటులో ఉంటామని అరుణ్‌కుమార్ జైన్ పేర్కొన్నారు. దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ ప్రధాన కార్యదర్శి మర్రి రాఘవయ్య మాట్లాడుతూ, దేశాభివృద్ధిలో రైల్వే ఉద్యోగులు, కార్మికులు కీలకపాత్ర పోషిస్తున్నారని చెప్పారు. ఉద్యోగులకు పాత పెన్షన్ పద్ధతి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల నుంచి స్ట్రెయిట్ బ్యాలెట్ ఓటింగ్ ద్వారా అభిప్రాయాలను సేకరించామని, దాని ఆధారంగా దేశవ్యాప్తంగా సమ్మె చేయాలా వద్దా అన్నది చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. తమ డిమాండ్లపై జాతీయ ఎన్ఎఫ్ఐఆర్ సమాఖ్య ద్వారా ప్రధానికి వినతి పత్రం సమర్పిస్తామన్నారు. సమావేశంలో చీఫ్ పర్సనల్ మేనేజర్ కిశోర్ బాబు, డిప్యూటీ జీఎం శ్రీధర్, సంఘ్ అధ్యక్షుడు ప్రభాకర్ అంద్రూస్ తదితరులు పాల్గొన్నారు.

మసీదులపై కేసుల్లో పోరాటానికి న్యాయ మండలి

ముస్లిం పర్సనల్ లాబోర్డు నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: మసీదులపై ఉన్న కేసులకు సంబంధించి న్యాయ పోరాటానికి ముస్లిం పర్సల్ లాబోర్డు న్యాయ మండలిని ఏర్పాటు చేసింది. మసీదుల పరిరక్షణ కోసం బోర్డు.. లీగల్‌సెల్ ఆధ్వర్యంలో ఇక నుంచి ప్రణాళికలు రూపొందించి ముందుకు వెళ్లనుంది. గురువారం పాతబస్తీలోని ఓ మదర్సాలో ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లాబోర్డు సర్వసభ్య సమావేశం జరిగింది. ప్రస్తుతం దేశం ఉన్న పరిస్థితుల్లో ముస్లింలు ఎలా వ్యవహరించాలి, షరియత్ పరిరక్షణ, ముస్లిం ప్రార్థనా స్థలాల పరిరక్షణ కోసం ఎలాంటి వ్యూహంతో ముందుకు వెళ్లాలనే అంశాలపై ఈ సమావేశంలో చర్చించినట్లు సమాచారం. అయోధ్యలో రామ మందిర ప్రారంభం సందర్భంగా బోర్డు సమావేశం నిర్వహించడంతో దీనికి ప్రాధాన్యం ఏర్పడింది. ఈ సమావేశంలో బోర్డు అధ్యక్షుడు ఖాలిద్ సైఫుల్లా రహ్మానీతో పాటు హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, బోర్డు సభ్యులు, మతగురువులు పాల్గొన్నారు. దేశవ్యాప్తంగా ఖాజీలు నిర్వహించే పెళ్లిళ్ల వ్యవస్థను కేంద్రీకృతం చేయడానికి పెళ్లి ధ్రువీకరణ పుస్తకం ఒకేలా ఉండాలని నిర్ణయించారు.



ఈ సంపద, ఈ సంతానం... కేవలం ఐహిక జీవితపు అలంకారాలు మాత్రమే! శాశ్వతంగా నిలిచేవి సత్కార్యాలే! అవే నీ ప్రభువు దృష్టిలో ప్రతిఫలానికి ఉత్తమమైనవి.
– ఇస్లాం ధర్మం

సాక్షి
శుక్రవారం, 19 జనవరి 2024

చైనా మెచ్చని తైవాన్ తీర్పు

కొన్ని ఎన్నికలు, వాటి ఫలితాల ప్రభావం అంతర్జాతీయ స్థాయిలో అమితంగా ఉంటుంది. జనవరి 13న తైవాన్‌లో జరిగిన అధ్యక్ష ఎన్నికలలాంటివే. ఈ ఎన్నికల్లో అక్కడి 'ప్రజాస్వామ్య అభ్యుదయ పార్టీ' (డీపీపీ) వరుసగా మూడోసారి చరిత్రాత్మక విజయం సాధించడం అనేక విధాల ప్రత్యేకమైనది. ద్వీపదేశమైన తైవాన్‌పై ఆధిపత్యం కోసం చైనా జోరుగా ప్రయత్నిస్తున్న వేళ, ఇండో– పసిఫిక్ ప్రాంతంలో క్లిష్ట పరిస్థితులు నెలకొన్నవేళ వచ్చిన ఎన్నికల ఫలితాలు ఇక్కడి భౌగోళిక రాజకీయాల్లో కీలకమైనవి. 1.4 కోట్ల తైవానీయులు స్వయంప్రతిపత్తి గల ప్రజాస్వామ్యంగానే దేశం కొనసాగాలనీ, చైనాతో బంధంలో మార్పు అవసరం లేదనీ భావిస్తున్నట్టు ఫలితాలను వ్యాఖ్యానించవచ్చు.

ఉపాధ్యక్షుడైన విలియమ్ లై చింగ్–తె తాజా ఎన్నికల్లో అధ్యక్ష పదవికి డీపీపీ తరఫున పోటీపడి, చైనాతో సర్దుబాటు కోరుతున్న ప్రధాన ప్రతిపక్షమైన కెఎంటి (కుయో మిన్ తాంగ్) అభ్యర్థిపై గెలిచారు. అయితే, మునుపటి 2020 ఎన్నికల్లో అప్పటి డీపీపీ అభ్యర్థి 57 శాతం ఓట్లు సాధిస్తే, ఈసారి అది 40 శాతానికి తగ్గింది. డీపీపీ పార్లమెంటరీ ఆధిక్యాన్ని కోల్పోయి, అతిపెద్ద పార్టీ కిరీటాన్ని ప్రతిపక్ష కెఎంటి పొందేయడం గమనార్హం. కొత్త విధానసభలో డీపీపీ 51, కెఎంటి 52 స్థానాలు గెలిచాయి. ఈ రెండు పార్టీల ద్విధాధిపత్యానికి గండికొడుతూ కొత్త రాజకీయ శక్తిగా అవతరించిన 'తైవాన్ పీపుల్స్ పార్టీ' (టీపీపీ) 20 శాతానికి పైగా ఓట్లతో, 8 స్థానాలు గెలిచింది. దేశీయ విధానంలో, చైనాతో వ్యవహారంలో అధికార పార్టీకి ఇది ఇబ్బందే. సభలో పట్టుకై ఇతర పార్టీలతో దోస్తీ కట్టాల్సి ఉంది. అలాగే, చైనా దూకుడు చూపుతున్నందున సైన్యాధిపతి అయిన తైవాన్ అధ్యక్షుడు ఇటు చైనా, అటు అమెరికాలతో నేర్పుగా వ్యవహరించాలి.

నిజానికి స్వయంపాలక ప్రజాస్వామ్య దేశమైన తైవాన్ ఎన్నడూ కమ్యూనిస్టు చైనా నియంత్రణలో లేదు. అయితే, తైవాన్ ప్రజాభీష్టంతో సంబంధం లేకుండా, ఆ దేశంపై తమదే ఆధిపత్యమంటూ డ్రాగన్ అహంకారం చూపుతోంది. ఎన్నికలను వ్యూహాత్మకంగా చక్కటి అవకాశంగా భావించిన బీజింగ్ ఫలితాలను ప్రభావితం చేసేందుకు శతవిధాల ప్రయత్నించింది. ఆర్థిక నిర్బంధాల మొదలు అసత్య ప్రచారాలు, భద్రతా సవాళ్ళ దాకా అనేక అస్త్రాలు ప్రయోగించింది. తైవాన్‌ను కలిపేసుకోవాలని చైనా అసహనంతో తొందరపడుతుంటే, 'ఒకే దేశం – రెండు వ్యవస్థల' విధానం హాంగ్‌కాంగ్‌లో విఫలమవడం చూసిన తైవాన్ అత్యంత జాగరూకతతో వ్యవహరిస్తోంది.

చరిత్ర చూస్తే 1895 నుంచి 1945 దాకా 50 ఏళ్ళు జపాన్ ఏలుబడిలో తైవాన్ ఉంది. శరవేగంగా అభివృద్ధి చెందింది. తీరా 1945 ఆగస్టులో జపాన్ లొంగిపోవడంతో, తైవాన్ అప్పటి చైనా ప్రధాన భూభాగాన్ని ఏలుతున్న కెఎంటి పార్టీ హయాంలోకి వచ్చింది. అప్పట్లో తైవాన్‌లోని జపనీస్ ఆస్తులను కెఎంటి సభ్యులు స్వాధీనం చేసుకున్నారు. దాంతో, స్థానిక తైవానీయుల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చింది. తైవాన్ జాతీయవాదుల ఉద్యమంగా మారిన ఆ నిరసనను 1947 ఫిబ్రవరి 28న కెఎంటి అణిచివేసింది. కెఎంటి సైన్యం 28 వేల మందిని పొట్టనబెట్టుకుంది. చియాంగ్ కై–షెక్ సారథ్యంలోని కెఎంటి జాతీయవాదులు 1949లో అంతర్యుద్ధంలో ఓటమి పాలై, తైవాన్‌కు తరలిపోయారు. అలా దాదాపు 20 లక్షల మంది కెఎంటితో కలసి చైనా నుంచి తైవాన్‌కు వలస వచ్చారు. ఇవాళ్టికీ 2.4 కోట్ల తైవాన్ జనాభాలో నాలుగోవంతు మంది ఈ 'మెయిన్‌ల్యాండర్లే'. అంటే, చైనా భూభాగం నుంచి వలసదారులు, వారి సంతతే. కెఎంటి నియంతృత్వ పాలనలోనూ ఎలక్ట్రానిక్స్‌పై దృష్టి పెట్టిన తైవాన్ తన ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసుకుంది. 1975 వరకు అధ్యక్ష పాలనలోనే 'రిపబ్లిక్ ఆఫ్ చైనా'గా నడిచింది. తరువాతి పరిణామాల్లో రాజకీయ సరళీకరణ ఆరంభమైంది.

1991 నాటికి ప్రజాస్వామ్య ప్రక్రియ ఊపందుకుంది. ఉపాధ్యక్షుడి నుంచి అధ్యక్షుడిగా ఎదిన లీ తెంగ్–హుయి దేశాన్ని పూర్తి ప్రజాస్వామ్య దిశగా నడిపించడానికి ఉద్యుక్తుడయ్యేసరికి డ్రాగన్ తోక తొక్కినట్టయింది. 1996లో తొలిసారి స్వేచ్ఛాయుత అధ్యక్ష ఎన్నికలు జరుగుతుండగా తైవాన్ జలసంధిలో చైనా వందలాది క్షిపణులు ప్రయోగించింది. తైవాన్‌కు మద్దతుగా అమెరికా యుద్ధనౌకలను పంపాల్సి వచ్చింది. ఆ ఎన్నికల్లో లీ అపూర్వ విజయం అందుకున్నారు. కాలక్రమంలో స్థానిక తైవానీయుల ప్రయోజనాలకు కట్టుబడ్డ డీపీపీ వేగంగా జనాదరణ పొందింది. లీ పదవీ విరమణ తర్వాత 2000లో డీపీపీ అభ్యర్థే అధ్యక్షుడిగా గెలిచారు. గమనిస్తే, తైవాన్‌లో ప్రజాస్వామ్యం ఏర్పాటు నుంచి ఇప్పటి దాకా 2008, 2012లోనే కెఎంటి 'మెయిన్‌ల్యాండర్' అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. తాజా ఎన్నికల్లో కెఎంటి అభ్యర్థి సహా అధ్యక్ష పదవికి పోటీపడ్డ ముగ్గురూ మెయిన్ ల్యాండర్లు కాకపోవడం గమనార్హం. ఒకరకంగా ఇది అధికార డీపీపీ తైవానీ అస్తిత్వ రాజకీయాలకు రాజముద్ర.

ఆసియా భౌగోళిక రాజకీయ చిత్రపటంలో తైవాన్ కీలకం. ప్రపంచ సాంకేతిక నాయకత్వ భవితవ్యంలోనూ ఆ దేశం అవిస్మరణీయం. ప్రపంచ సెమీ కండక్టర్ల ఉత్పత్తిలో 60 శాతం పైగా, అత్యాధునిక చిప్‌లలో 90 శాతం పైగా అక్కడ చేసేవే. ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్‌ఫోన్ల నుంచి కార్లు, ఉపగ్రహాల దాకా ఎలక్ట్రానిక్ ఉపకరణాలన్నిటికీ అవే ప్రాణాధారం. స్వయంప్రతిపత్తి గల తైవాన్ మనకు సహజ మిత్రదేశం. అలా తాజా ఎన్నికల ఫలితాలు సానుకూల పరిణామమే. గత 8 ఏళ్ళలానే వచ్చే నాలుగేళ్ళూ ఢిల్లీతో బంధానికే తాయ్‌పే ఆసక్తి చూపుతుంది. దౌత్య సంబంధాలు లేకున్నా ఇప్పటికే 250కి పైగా తైవానీ కంపెనీలు భారత్‌లో 400 కోట్ల డాలర్ల మేర పెట్టుబడులు పెట్టాయి. అందుకే, తైవాన్ జలసంధిలో సుస్థిరత, ప్రశాంతత కొనసాగితే భారత్‌కు అది శుభవార్త. తరచూ సైనిక విన్యాసాలతో అస్థిరత రేపుతున్న చైనా సైతం తైవాన్ ప్రజాభీష్టాన్ని గౌరవిస్తే మేలు.

ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ వర్ధిల్లాలి!

సందర్భం



దినేశ్ సి. శర్మ

ఏటా జనవరిలో జరగాల్సిన ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ సమావేశాలు ఈసారి రద్దుకావడం అవాంఛనీయ పరిణామం. భారతీయ శాస్త్ర సమాజం ఒక పొందికతో పురోగమించేందుకు... నూటా పదేళ్లుగా సాగుతున్న ఈ సమావేశాలూ ఒక కారణమంటే అతిశయోక్తి కాదు. ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ అనేది ఓ విభిన్న వేదిక. ప్రత్యేక అంశాలు ఇతివృత్తంగా ఏర్పాటు చేసే శాస్త్రీయ సెమినార్లలో ఆ యా రంగాల్లో నిష్ణాతులైన శాస్త్రవేత్తలు మాత్రమే పాల్గొంటారు. సైన్స్ కాంగ్రెస్‌లో మాత్రం అన్ని రంగాలకు సంబంధించిన చర్చోపచర్చలూ జరుగుతాయి. శాస్త్రవేత్తలతో పాటు సామాన్యులు, డిగ్రీ కాలేజీ, యూనివర్సిటీ విద్యార్థులు కూడా హాజరవుతారు. ఇవి వారికి ఎంతో స్ఫూర్తిదాయకం. అందుకే ఈ సమావేశాలు నిరాటంకంగా కొనసాగాలి.

భారతీయ శాస్త్ర పరిశోధన రంగానికి జనవరి నెల చాలా ముఖ్యమైంది. ఏటా ఈ నెలలోనే 'ఇండియన్ సైన్స్ కాంగ్రెస్' సమావేశాలు ఘనంగా జరుగుతాయి. భారత ప్రధాని చేతుల మీదుగా ప్రారంభమయ్యే ఈ వార్షిక ఉత్సవాలకు దేశం నలుమూలల నుంచి వేలాది మంది శాస్త్రవేత్తలు, విద్యార్థులు హాజరవుతారు. కానీ ఈ ఏడాది సైన్స్ కాంగ్రెస్‌కు ఆతిథ్యం ఇవ్వాల్సిన లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ చివరి నిమిషంలో ఊహించని సమస్యల కారణంగా తప్పుకొంది. సమావేశాలకు ఆర్థిక సాయం అందించే కేంద్ర ప్రభుత్వం కూడా వెనక్కి తగ్గడంతో ఈ ఏడాది కార్యక్రమాలు అనివార్యంగా రద్దయ్యాయి.

కీలకమైన అంశాలపై మేధోమథనం జరిపేందుకు, ఆ విషయాలపై ప్రభుత్వాలకు సూచనలిచ్చేందుకు ప్రత్యేక ఏర్పాట్లు ఇండియన్ సైన్స్ కాంగ్రెస్‌లో ఉంటాయి. ఇలాంటి సలహా, సూచనలు గతంలో విధాన రూపకల్పనకు ఉపయోగపడిన ఉదాహరణలు కోకొల్లలు. కేంద్రంలో పర్యావరణ విభాగం (తరువాతి కాలంలో మంత్రిత్వ శాఖ స్థాయికి ఎదిగింది) ఏర్పాటుకూ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఓషన్ డెవలప్‌మెంట్ (ప్రస్తుతం ఎర్త్ సైన్సెస్ మినిస్ట్రీ) ఏర్పాటుకూ సైన్స్ కాంగ్రెస్ ఇచ్చిన సలహాలే కారణం. వీటన్నింటికీ మించి ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ ప్రజల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంచేలా అత్యంత కీలకంగా వ్యవహరించింది.

నూరేళ్లకు పైగా అప్రతిహతంగా...

1914లో ఏర్పాటైంది మొదలు ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ సమావేశాలు ఏటా అప్రతిహతంగా కొనసాగాయి. కోవిడ్ కాలం నాటి పరిస్థితులు ఒక్కటే మినహాయింపు. అప్పట్లో లక్నోలోని కానింగ్ కాలేజ్ అధ్యాపకులు పి.ఎస్. మెక్‌మోహన్, మద్రాస్‌లోని ప్రెసిడెన్సీ కాలేజీ అధ్యాపకులు జేఎల్ సైమన్‌సెన్ మానస పుత్రికగా ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ అసోసియేషన్ ఆవిర్భవించింది. 'బ్రిటిష్ అసోసియేషన్ ఫర్ ద అడ్వాన్స్‌మెంట్ ఆఫ్ సైన్స్' తరహాలో వారు ఈ సంస్థను ఏర్పాటు చేశారు. ప్యూర్, అప్లైడ్ సైన్స్ రంగాలపై అభినివేశం ఉన్న వారందరికీ ఒక వేదిక కల్పించడం దీని ప్రధానోద్దేశం. సమాజానికీ, సైన్స్‌కూ మధ్య ఒక వారధిగానూ ఈ సంస్థ ఉపయోగపడుతుందని వారు భావించారు. గణిత, ఖగోళ, భౌతిక, రసాయన, భౌగోళిక, జీవ శాస్త్రాల్లో పరిశోధనలు చేస్తున్న వారందరికీ తొలి ఉమ్మడి వేదిక కూడా ఇదే. ఆయా శాస్త్ర రంగాలకు సంబంధించిన కొత్త ఆలోచనలు పంచుకునేందుకు సైన్స్ కాంగ్రెస్ ఎంతో ఉపయోగపడింది. దశాబ్దాల సైన్స్ కాంగ్రెస్ సమావేశాల కారణంగా దేశంలో మరిన్ని శాస్త్రీయ సొసైటీలు, వృత్తినైపుణ్యమున్న సంస్థలు ఏర్పడ్డాయి.

ఈ వేదిక ఈ కాలానికి సరిపోయేది కాదనీ, పాతకాలపు పద్ధతులనే కొనసాగిస్తోందనీ కొందరు అంటూంటారు. దేశంలో శాస్త్ర రంగాల అభివృద్ధితో పరుగులు పెడుతూనే, వేర్వేరు దశల్లో ఇండియన్



సైన్స్ కాంగ్రెస్ ఎలా ఎదిగిందో విస్మరించేవారే ఇలాంటి విమర్శలు చేయగలరు.

ప్రాక్ – పశ్చిమాల మేళవింపు...

ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ అసోసియేషన్ ప్రస్థానంలో తొలిదశ 1914–47 మధ్యకాలమని చెప్పవచ్చు. ఈ సమయంలో భారతీయ, యూరోపియన్ శాస్త్రవేత్తల మధ్య సమాచార వినిమయం ఎక్కువగా ఉండేది. యూరోపియన్ శాస్త్రవేత్తలు అనేకులు భారతీయ పరిశోధన సంస్థల్లో పనిచేస్తూండేవారు. తమ ఆలోచనలు పంచుకునేందుకు వీరికి ఉన్న ఒకే ఒక్క వేదిక ఇండియన్ సైన్స్ కాంగ్రెస్సే. దీనికి సమర్పించే అన్ని పరిశోధన వ్యాసాలనూ సమకాలీన శాస్త్రవేత్తలు సమీక్షించేవారు. ఈ రకమైన సమీక్ష, అంతర్జాతీయ స్థాయి గుర్తింపు అన్న భావన ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ ద్వారానే ఏర్పడ్డాయి. భారత్‌లో సైంటిఫిక్ జర్నల్స్ ప్రచురణ కూడా సైన్స్ కాంగ్రెస్ పుణ్యమే. ప్రఖ్యాత శాస్త్రవేత్త మేఘనాథ్ సాహా ప్రచురించిన 'సైన్స్ అండ్ కల్చర్' జర్నల్ దీనికి ప్రబల ఉదాహరణ.

దేశంలో స్వాతంత్ర్య ఉద్యమం బాగా నడుస్తున్న 1930లలో జాతీయ నాయకత్వం దేశ భవిష్యత్తు కోసం ప్రణాళికలు రచించడం మొదలుపెట్టింది. ఈ క్రమంలో దేశాభివృద్ధిలో సైన్స్‌ను వినియోగించడంపై దీని వేదికగా అనేక కొత్త ఆలోచనలపై చర్చ జరిగింది. పారిశ్రామికీకరణ, సమాజం పట్ల సైన్స్ బాధ్యత వంటి ఆలోచనలు పురుడు పోసుకున్నది ఇక్కడే. 1937లో జరిగిన సమావేశాల్లోనే జవహర్‌లాల్ నెహ్రూ ''ఈ కాలపు స్ఫూర్తి సైన్స్. ఆధునిక ప్రపంచాన్ని శాసిస్తున్నదీ ఇదే. సైన్స్‌తో మిత్రత్వం నెరిపేవారిది, సమాజ పురోభివృద్ధికి దాని సాయం తీసుకునేవారిదే భవిష్యత్తు'' అన్న వ్యాఖ్యలు చేశారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన 1947లోనూ ఈ సమావేశాలకు నెహ్రూ అధ్యక్షుడిగా ఉన్నారు. 1964లో ఆయన మరణించేంత వరకూ కొనసాగారు. ఆ తరువాతి కాలంలో ఈ సమావేశాల్లో దేశ ప్రధాని శాస్త్రవేత్తలను ఉద్దేశించి ప్రసంగించే సంప్రదాయం మొదలైంది. చాలా సందర్భాల్లో దేశ ప్రధానులు ఈ వేదికపై నుంచి కొన్ని కీలకమైన విధాన నిర్ణయాలను కూడా ప్రకటించేవారు.

స్వాతంత్ర్యం వచ్చిన తరువాత దేశంలో శాస్త్ర పరిశోధనల పునాదులకు శ్రీకారం చుట్టారు. జాతీయ పరిశోధన సంస్థలు, రీసెర్చ్ కౌన్సిళ్లు పనిచేయడం మొదలైంది. ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ కూడా ఒక కొత్త దశలోకి అడుగుపెట్టింది. శాస్త్ర పరిశోధనలపై చర్చలకు వేదికగా నిలుస్తూనే ప్రణాళిక, ఆహార సంక్షోభం, ఆరోగ్యాభివృద్ధి వంటి విస్తృత స్థాయి విధానపరమైన అంశాలపై కూడా చర్చలు మొదలయ్యాయి. యూనివర్సిటీ వ్యవస్థలోని పరిశోధకులతో పాటు జాతీయ పరిశోధన సంస్థలు, శాస్త్ర విభాగాలకు చెందినవారు ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ ప్రక్రియలో ఎక్కువగా పాలుపంచుకోవడం మొదలైంది. ఈ క్రమంలోనే కొన్ని దశాబ్దాల తరువాత ఆయా రంగాలకు ప్రత్యేకమైన సంస్థలు ఏర్పడటంతో ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ తన ప్రాభవాన్ని కొంత కోల్పోయిందని చెప్పాలి. ఆయా రంగాల పరిశోధన పత్రాలను మునుపటిలా సైన్స్ కాంగ్రెస్‌లో కాకుండా ప్రత్యేక సంస్థలకు సమర్పించడం మొదలైంది.

శాస్త్రీయ దృక్పథం పెరగాలంటే...

ప్రస్తుతానికి వద్దాం. ఇప్పుడున్న పరిస్థితుల్లో, సైన్స్ రంగంలో పోటీని దృష్టిలో పెట్టుకుంటే ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ సమావేశాల్లో శాస్త్రవేత్తలు తమ పరిశోధనల ఫలితాలను పంచుకోవాలని అనుకోవడం అత్యాశే అవుతుంది. అందుకే ఈ సమావేశాలపై కొంతమంది పెదవి విరుస్తున్నారు. నిర్వాహకుల నిర్లక్ష్యం అనండి... ఇంకేమైనా కానివ్వండి... సైన్స్ వ్యతిరేకులు కొందరికి ఈ సైన్స్ కాంగ్రెస్ వేదికగా మారడం ఇటీవలి పరిణామం.

ఒక్కటైతే నిజం. యువతరంతో తమ పరిశోధనల వివరాలను పంచుకోవాలని అనుకునే శాస్త్రవేత్తలకు, ఇతర రంగాల్లోని సహోద్యోగులతో ఆలోచనలు పంచుకోవాలనుకునేవారికి ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ అవసరం ఇప్పటికీ ఉంది. నోబెల్ అవార్డు గ్రహీతలు ఇక్కడ చేసే ప్రసంగాలు ఎంతోమంది యువకులు, విద్యార్థులకు స్ఫూర్తినిస్తాయనడంలో సందేహం లేదు. ఈ కారణాలన్నింటినీ దృష్టిలో ఉంచుకుంటే ఈ సమావేశాలు భవిష్యత్తులోనూ కొనసాగాలి. సామాజిక మాధ్యమాల ద్వారా సూడోసైన్స్ కూడా సైన్స్ పేరిట చలామణి అవుతున్న ఈ సమయంలో దేశంలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు ఇలాంటి వేదికలు అనేకం అవసరం. డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ 2024 సైన్స్ కాంగ్రెస్ సమావేశాలకు ఆర్థిక సాయాన్ని ఎందుకు నిలిపేసిందో వివరణ ఇవ్వాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉంది.

వ్యాసకర్త సైన్స్ అంశాల వ్యాఖ్యాత
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఉమ్మడి చైతన్యదీప్తి



ఇది మధ్యప్రదేశ్ ఉత్తేజం. పన్నెండేళ్ల వయసు ఆది శంకరాచార్యుడికి 36 అడుగుల పొడవైన 'ఏకత్వ' విగ్రహం నెలకొల్పారు. సరిహద్దులకు అతీతంగా భారత నేలలోని విలువలను, సంస్కృతిని ఏకీకరించి, ఉమ్మడి చైతన్యాన్ని వ్యాపింపజేశారు శంకరాచార్య. అలాంటి ఏకత్వానికి ప్రతినిధిగా ఉండటం సంతోషదాయకం!

– ఎరిక్ సోల్‌హెయిమ్, 'వన్‌నెస్' అంబాసిడర్

చెప్పేవాడికి...



నేను చనిపోయేలోగా ఒక్కసారైనా 'దావోస్'లోలా చేయాలనుంది. ఈ క్రూరమైన, అన్యాయమైన ప్రపంచంలో ఒక పేదవాడిగా ఎలా సమర్థంగా నెగ్గుకురావాలో మిలియనీర్లు, బిలియనీర్లు ఇచ్చే సలహాలను వినాలనుంది.

– శోభా డె, కాలమిస్ట్

నేటి ప్రపంచం



హమాస్ వర్సెస్ ఇజ్రాయెల్. హెజ్బొల్లా వర్సెస్ ఇజ్రాయెల్. ఇజ్రాయెల్ వర్సెస్ హెజ్బొల్లా (లెబనాన్). ఇరాకీ పౌరసైన్యం వర్సెస్ యూఎస్ స్థావరాలు. హౌతీలు వర్సెస్ ఓడలు. హౌతీలు వర్సెస్ యూఎస్, యూకే. ఇరాక్, సిరియా పౌరసైన్యాలు వర్సెస్ యూఎస్. టర్కీ వర్సెస్ పీకేకే (కుర్దులు). ఐసిస్ వర్సెస్ ఇరాన్. సిరియా వర్సెస్ ఇరాన్. పాకిస్తాన్ వర్సెస్ ఇరాన్. ఇరాన్ వర్సెస్ ఇరాకీ కుర్దులు. ఇంకా ఏమైనా మిస్సయ్యానా?

– రాశా అల్ అఖీదీ, రచయిత్రి

గ్రహించాల్సిన విషయం



దక్షిణ భారత దేశంలో మోదీ ఎన్నిసార్లు పర్యటించినా, ఎన్ని ఆలయాలు దర్శించినా అక్కడొకటి... ఇక్కడొకటి లోక్‌సభ సీటు రావడం తప్ప ఫలితం ఉండదు. దక్షిణ భారతీయులు ధార్మిక జీవులే గానీ మోదీ కోరుకునే మతాంధత వాళ్లకు లేదు.

– రాజేంద్ర కుంభట్
రాజకీయాంశాల వ్యాఖ్యాత

మన వైఖరి



రెండు ఘోరమైన పక్షాలు (ఇరాన్, పాకిస్తాన్) పోరాడుతున్నప్పుడు మనం ఎవరి పక్షమూ వహించము. తగినంత దూరం పాటిస్తూ, ఎవరు ఓడినా ప్రపంచానికి కొంత చీదర తగ్గిందని ఉత్సవం చేసుకుంటాం.

– అమిత్ శాండిల్య, కాలమిస్ట్

నిజమైన ప్రజాకవి

తెలుగువారు గర్వించదగిన గొప్ప సామాజిక కవి వేమన. 19వ శతాబ్దం మొదటి భాగంలో బ్రిటిష్ అధికారి చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ వేమన రాసిన పద్యాలను సేకరించి పుస్తక రూపంలోకి తెచ్చి ఆయన గొప్పదనం ప్రపంచానికి తెలియడానికి కారకులయ్యారు.



వేమన

సామాజిక చైతన్యం వేమన పద్యాల లక్షణం. వేమన స్పృజించని అంశం లేదు. సమాజంలోని అన్ని సమస్యలు భిన్న కోణాల్లో దర్శించి ఆ దర్శన వైశిష్ట్యాన్ని తన పద్యాలలో ప్రదర్శించాడు. కుటుంబ వ్యవస్థలోని లోటుపాట్లు, మతం పేరిట జరుగుతున్న దోపిడీలు, విగ్రహారాధనను నిరసించటం, కుహనా గురువులు, దొంగ సన్యాసులు ఒకటేమిటి... కనిపించిన ప్రతి సామాజిక అవకతవకల మీద వేమన్న కలం ఝుళిపించాడు. పద్యాలన్నీ ఆట వెలది ఛందస్సులోనే చెప్పాడు.

మనుషుల మధ్య సమానత్వం ఉండాలని చెబుతూ 'ఉర్వి వారి కెల్ల నొక్క కంచంబు బెట్టి/పొత్తు గుడిపి కులము పొలయజేసి/తలను చెయ్యిబెట్టి తగ నమ్మ జెప్పరా/ విశ్వదాభిరామ వినురవేమ' అన్నాడు. సమాజంలో ఉన్న బాధలకు, దుఃఖాలకు, దురహంకారానికి, దౌర్జన్యానికి, గర్వానికి మూల కారణం వర్ణ వ్యవస్థ అన్న సత్యాన్ని వేమన తెలుసుకున్నాడు. మానవులంతా ఒక్కటే అన్న సత్యాన్ని చాటి చెప్పాడు. మానవులలో ఎక్కువ తక్కువలు ఉన్నంత కాలం చిక్కులు తప్పవు అంటాడు.

ఇంతటి గొప్పవాడు కాబట్టే కేంద్ర సాహిత్య అకాడమీ వారు వేమన జీవిత చరిత్రను వ్రాయించి 14 భాషల్లో అనువదింపజేశారు. ఐక్యరాజ్యసమితి–యునెస్కో విభాగం వారు ప్రపంచ భాషా కవులలో గొప్ప వారిని ఎంపిక చేసే సందర్భంలో వేమనను ఎంపిక చేసి ఆయన రచనలను పలు భాషల్లోకి అనువదింప చేశారు.

ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లా, కదిరి తాలూకాలోని కటారుపల్లిలో వేమన సమాధి గుర్తుగా ఒక శిలా ఫలకం ఉంది. వేమన ఈ గ్రామంలోనే మరణించాడని విశ్వసిస్తారు.

– పి.బి. చారి, ఈసీఐఎల్ విశ్రాంత అధికారి, హైదరాబాద్
(నేడు ప్రజాకవి వేమన జయంతి)

సామాజిక విప్లవ చైతన్యమూర్తికి నీరాజనం

సందర్భం



ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి

విగ్రహాలు జాతి జీవన వికాస చారిత్రక ప్రతిబింబాలు. సమాజాన్ని చైతన్యపరచే విగ్రహాలు మౌన సందేశాలకు ప్రతిరూపాలు. భారతదేశం మినహా ప్రపంచదేశాల్లో ఇప్పటికి లక్షకు పైగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలు ఉన్నాయని అధికారిక అంచనా. ప్రపంచ దేశాలు అంబేడ్కర్ జ్ఞాన సంపదకూ, సమసమాజ నిర్మాణ రచనా చాతుర్యానికీ, సమయస్ఫూర్తి గల వాగ్ధాటికీ ముగ్ధులై నిత్య నీరాజనాలు పలుకుతున్నాయంటే అది భారతదేశానికి గర్వకారణం. అంబేడ్కర్ సమాజం కోసం జీవించాడు. సమాజ పురోగతి కోసం నిరంతర పోరాటం జరిపిన అసమాన ప్రతిభావంతుడు. తాను నేర్చిన విద్య, విజ్ఞాన సంపద అంతా సమాజం కోసమే వినియోగించాడు. దీన్నే 'పేబాక్ టు ది సొసైటీ' అంటారు. అందుకే ఆయన విధానాలను పలు దేశాలు అనుసరిస్తున్నాయి. 'నా జీవన పోరాటమే నా సందేశం' (మేరా జీవన్ సంఘర్ష్ హీ మేరా సందేశ్) అని చెప్పిన మాటలే విశ్వ సందేశంగా వినువీధుల్లో వినిపిస్తున్నాయి.

ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలు అంబేడ్కర్ విగ్రహాలు నెలకొల్పి తమకున్న గౌరవాన్ని చాటుకున్నాయి. అమెరికాలో మిచిగన్ విశ్వవిద్యాలయం (1993)లో ఒక విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. 2023 అక్టోబరు 14న మేరీలాండ్‌లో 'స్టాట్యూ ఆఫ్ ఈక్వాలిటీ' అనే పేర 19 అడుగుల ఎత్తయిన విగ్రహాన్ని నిలిపారు. 1996లో టొరంటో విశ్వవిద్యాలయం (కెనడా) కూడా అంబేడ్కర్ విగ్రహాన్ని ప్రతిష్ఠించుకొంది. ఇక బ్రిటన్‌లో చాలానే ఉన్నాయి. లండన్, బర్మింగ్ హామ్, మాంచెస్టర్‌లలో పలు విగ్రహాలను నెలకొల్పారు. అలాగే అంబేడ్కర్ చదివిన 'లండన్ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్' ముఖద్వారంలో 2000లో ఆయన విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. జర్మనీలోని బెర్లిన్, మ్యూనిక్, ఫ్రాంక్‌ఫర్ట్‌లలో; జపాన్‌లోని టోక్యో, ఒకాసా, కొయెటోలల్లో; దక్షిణాఫ్రికాలోని జోహన్నెస్ బర్గ్, కేప్‌టౌన్, డర్బన్‌లలో; ఆస్ట్రేలియాలోని సిడ్నీ, మెల్ బోర్న్, బ్రిస్బెయిన్ వంటి నగరాల్లో; న్యూజిలాండ్‌లోని ఆక్లండ్ తదితర ప్రాంతాల్లో, మారిషస్ (2018), శ్రీలంక (కొలంబో). నేపాల్ (ఖాట్మండు 2019), బంగ్లాదేశ్ (ఢాకా 2021), దుబాయ్‌తో సహా మరెన్నో దేశాల్లో అంబేడ్కర్ విగ్రహాలు నెల కొన్నాయి.

తెలంగాణలో గతేడాది ఏప్రిల్ 14న అంబేడ్కర్ మునిమనుమడు ప్రకాష్ అంబేడ్కర్‌చే 125 అడుగుల ఎత్తయిన అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరించబడింది. లక్నోలో అత్యంత



నేడు విజయవాడలో 206 అడుగుల ఎత్తైన అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణ

ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన పార్క్‌కు 'డాక్టర్ భీమ్‌రావ్ సామాజిక్ పరివర్తన్ స్థల్'గా నామకరణం చేసి అక్కడ ఆయన విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ ప్రదేశంలోనే జ్యోతిరావ్ పూలే, నారాయణగురు, బిర్సా ముండా, శాయాజీ మహరాజ్, కాన్షీ రామ్ విగ్రహాలున్నాయి. ఇక్కడే 124 ఏనుగుల విగ్రహాలు కొలువుదీరి సందర్శకులకు ఆహ్లాదం కలుగచేస్తున్నాయి.

ఆంధ్రప్రదేశ్‌లో లెక్కకు మించిన అంబేడ్కర్ విగ్రహాలున్నాయి. వీటికి తోడు విజయవాడ నడిబొడ్డున స్వరాజ్ మైదానంలో రాష్ట్రప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా రూ. 400 కోట్లకు పైగా ఖర్చుతో నిర్మించిన 206 అడుగుల విగ్రహాన్ని ఈ రోజు ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరిస్తున్నారు. ఈ విగ్రహ పీఠం 81 అడుగుల ఎత్తు ఉంది. దానిపై ప్రతిష్ఠించిన 125 అడుగుల ప్రధాన విగ్రహంతో మొత్తం 206 అడుగుల అంబేడ్కర్ శిల్పం విజయవాడ నలుదిక్కులకూ కనిపిస్తూ, చూడగానే ఆకర్షించేలా ఉంది. ఈ విగ్రహ ప్రదేశం ఒక స్మృతివనంగా భాసిస్తుంది.

మూడు అంతస్తులున్న విగ్రహం కింది భాగంలో నాలుగు ఏసీ హాల్స్ ఉన్నాయి. నాలుగు వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో మినీ థియేటర్, మ్యూజియం, మరో రెండు హాల్స్‌లో అంబేడ్కర్‌కు దక్షిణ భారతదేశంతో ఉన్న అనుబంధంతో కూడిన ఛాయాచిత్రాలు, మరో మ్యూజియం ఉంది. వీటికి తోడు రెండు వేలమంది కూర్చోవడానికి సరిపడే మరో ఓపెన్ ఎయిర్ థియేటర్‌తో పాటు అందమైన పార్కు, మరో అందమైన ఫౌంటెన్ సందర్శకులకు కనువిందు చేయనున్నాయి. విగ్రహం రంగు మాసిపోకుండా పాల్యూరెథేన్ కోటింగ్ వేయటం మరో ప్రత్యేకత! 15 మంది ఎక్కడానికి సరిపడ రెండు లిఫ్టులను ఏర్పాటుచేశారు. మూడు అంతస్తుల్లో నిర్మితమైన ఈ ప్రదేశం ఒక పర్యాటక కేంద్రంగా వర్ధిల్లుతుందనటంలో ఎలాంటి అనుమానం లేదు. అంబేడ్కర్ విగ్రహ ప్రతిష్ఠతో విజయవాడలో నూతన సాంస్కృతిక వికాసం మరింతగా వృద్ధిచెందుతుంది. దీనివల్ల సమాజ వికాసంతోపాటు దళిత అస్తిత్వానికీ, సర్వమత సామరస్యానికీ, సకల మానవ సౌభ్రాతృత్వానికీ మరింత దోహదం చేకూరుతుంది. ఈ విగ్రహ ప్రాంగణం నిత్యమూ విజ్ఞాన మేధామథనంతోపాటు సకల కళలు అభివృద్ధి చెందే సాంస్కృతిక కేంద్రంగా మారు తుంది. ఈ కేంద్రంలో ఏర్పరచే నూతన పుస్తక భాండాగారం పుస్తక ప్రియులకూ, పాఠకులకూ ఒక విజ్ఞాన వికాస కేంద్రంగా నిత్యం అందుబాటులో ఉంటుంది.

అంబేడ్కర్ విగ్రహంతో పోరాటాల పురిటిగడ్డ విజయవాడ నగరానికి కొత్త అందాలు పురివిప్పుకుంటాయి. ఆయన జీవిత సందేశం అడుగడుగునా ప్రతిబింబించి ప్రగతిపథంలో పయనించే ప్రజలకు మార్గదర్శి కాగలదు.

వ్యాసకర్త ప్రముఖ సాహితీవేత్త । 98481 23655

అందరివాడు



మహరు కులమందు మహనీయుడై జన్మించాడు
అసమానతల మేఘాలు మధ్య ఆదిత్యుడై ప్రభవించె
అవమానాలు, బాధలను అభిమాన ధనుడై భరియించె
పేదరికాన్ని స్వీయ మేధావితనంతో జయించె
బుద్ధి మంతుడై ఘన బౌద్ధ మతాన్ని స్వీకరించాడు
అందరి వాడు అంబేడ్కరు... నీలాంబరాన్ని తాకేను అతని పేరు!

పుస్తకాలను ప్రేమించె అస్తమానం ఆరాధకుడిలా
విశ్వమంతా చదివేను విసుగు విశ్రాంతి లేకుండా
మస్తకాలలో నింపుకొనే బస్తాల కొద్దీ పరిజ్ఞానాన్ని
డిగ్రీ పట్టా లెన్నో పొందినాడు డీప్ పరిశోధకుడిలా!

ప్రాచీన భారతాన్ని నిశితంగా అధ్యయనం చేసి
కుల, మతాల భూతాలను పొలిమేరల నుంచి తరిమికొట్టె!
సమతా విత్తనాలను సర్వత్రా మేదినిలో వెదజల్లి
యువ భారతం కోసం నవ రాజ్యాంగాన్ని విరచించేను!

ఎవరెస్టు శిఖరం కన్న ఎత్తైన వ్యక్తిత్వం అతనిది
సముద్రం కంటే లోతైన సహృదయం ఆయనిది
ఆకాశ మంటేను అతగాడి ఆలోచనా లోచనాలు
కడిగిన జాతిరత్నమై కూడలిలో నిటారుగా నిలిచి
దారి చూపుతున్నాడు దళిత వర్గాలకు మార్గదర్శిగా!

– జి. సూర్య నారాయణ । 62817 25659

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంత ఋతువు, పుష్య మాసం, **తిథి:** శు.నవమి రా.11.23 వరకు, తదుపరి దశమి, **నక్షత్రం:** అశ్వని ఉ.7.14 వరకు, తదుపరి భరణి తె.6.09 వరకు (తెల్లవారితే శనివారం), **వర్జ్యం:** సా.4.25 నుండి 5.53 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.49 నుండి 9.37 వరకు, తదుపరి ప.12.34 నుండి 1.22 వరకు, **అమృతఘడియలు:** రా.1.43 నుండి 3.16 వరకు; **రాహుకాలం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **యమగండం:** ప.3.00 నుండి 4.30 వరకు, **సూర్యోదయం:** 6.39, **సూర్యాస్తమయం:** 5.44.

తిరుమలగిరిలో కందులు క్వింటా రూ.9,509

- రికార్డు ధర పలకడంతో రైతుల్లో ఆనందం



తిరుమలగిరి (తుంగతుర్తి): సూర్యాపేట జిల్లా తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్ యార్డులో కందులకు గురువారం రికార్డు ధర పలికింది. మార్కెట్ యార్డుకు 52 బస్తాల కందులు రాగా క్వింటాకు గరిష్టంగా రూ.9,509, కనిష్టంగా రూ.9,172 ధర పలికినట్లు మార్కెట్ కార్యదర్శి శ్రీధర్ తెలిపారు. ప్రభుత్వ మద్దతు ధర రూ.7 వేలు ఉంది. మద్దతు ధర కంటే అధికంగా ధర పలకడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

'యాదాద్రి పవర్'లో అవకతవకలు!

మిర్యాలగూడ: నల్లగొండ జిల్లా వీర్లపాలెం శివారులోని యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో పక్షం రోజులుగా విజిలెన్స్ విచారణ సాగుతోంది. ప్లాంట్ నిర్మాణానికి జరిగిన భూసేకరణలో భారీ అవకతవకలకు పాల్పడినట్టు ఆరోపణలు ఉన్నాయి. దీంతో జెన్‌కో కు చెందిన ఓ రిటైర్డ్ అధికారితోపాటు మరో ఇద్దరు అధికారులపై విజిలెన్స్ దృష్టి సారించింది. ప్లాంట్ నిర్మాణానికి 4,200 ఎకరాల భూమిని సేకరించారు. ఇందులో అటవీ, ప్రభుత్వ, పట్టా భూ ములుండగా..ఆ భూములను సాగు చేస్తున్న వారికి ఎకరాకు గరిష్టంగా రూ.6.50 లక్షల పరిహారం అందించారు. పరిహారం చెల్లింపులో భారీగా అక్రమాలు జరిగాయని అధికారులు, ప్రజా ప్రతినిధులు కలిసి కోట్లాది రూపాయల నిధులను స్వాహా చేసినట్టు గతంలో ఆరో పణలు వచ్చాయి. ప్లాంట్ నిర్మాణ దశ నుంచి ఇప్పటి వరకు చేసిన పనులు, వ్యయంపై జెన్‌కో గోప్యత పాటిస్తోంది. కొంతమంది పేర్లు నిర్వాసితుల జాబితాలో చేర్చి ఆ పరిహారాన్ని అధికారులు, ప్రజా ప్రతినిధులు పంచుకున్నట్టు సమాచారం. భూనిర్వాసితులకు సంబంధించిన రూ.100కోట్లకు పైగా చెల్లింపులు మిర్యాలగూడ ఆర్డీఓ ఆధ్వర్యంలో జరిగాయి. ప్లాంట్‌లో రూ.20వేల కోట్ల విలువైన పను ల టెండర్ల కేటాయింపులపై కూడా పలు ఆరోపణలు వచ్చాయి. అనుకూలమైన సంస్థలకే టెండర్లు దక్కే విధంగా జెన్‌కో అధికారులు వ్యవహరించినట్టు తెలిసింది. కాగా, యాదాద్రి థర్మల్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు కేంద్ర పర్యావరణ మంత్రిత్వశాఖ పూర్తిస్థాయిలో అనుమతులు మంజూరు చేయకపోవడంతో వచ్చే నెల 20న ప్లాంట్ ఆవరణలో జెన్‌కో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించనుంది.



షర్మిల కుమారుడి నిశ్చితార్థానికి ఏపీ సీఎం జగన్

మణికొండ (హైదరాబాద్)/అమరావతి: హైదరాబాద్ గండిపేటలోని గోల్కొండ రిసార్ట్‌లో గురువారం సాయంత్రం జరిగిన షర్మిల కుమారుడు రాజారెడ్డి వివాహ నిశ్చితార్థ వేడుకకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, సతీమణి భారతిరెడ్డితో కలిసి హాజరయ్యారు. కాబోయే వధూవరులు రాజారెడ్డి, అట్లూరి ప్రియలను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా షర్మిల, బ్రదర్ అనిల్‌కుమార్ దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమానికి వైఎస్ విజయమ్మ, తెలంగాణ మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఏపీ ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, శాంతా బయోటెక్ ఎండీ వరప్రసాద్‌రెడ్డి, మాజీ ఎంపీ కేవీపీ రామచంద్రరావు, మాజీ మంత్రులు జానారెడ్డి, రఘువీరారెడ్డి, సినీనటులు మోహన్‌బాబు, విష్ణు, ఏపీ మాజీ పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజుతోపాటు రాజకీయ, సినీ, వ్యాపార రంగాలకు చెందిన ప్రముఖులు హాజరయ్యారు. సీఎం జగన్‌ను చూసేందుకు అభిమానులు భారీగా రావడంతో వారిని నియంత్రించేందుకు పోలీసులు శ్రమించాల్సి వచ్చింది.

రైతు మల్లికార్జున్ యువతకు ఆదర్శం

కరీంనగర్ జిల్లా చొప్పదండి రైతుకు ప్రధాని మోదీ కితాబు


వర్చువల్ విధానంలో ఉత్తమ రైతు అవార్డు గ్రహీత మల్లికార్జున్ రెడ్డితో మాట్లాడుతున్న ప్రధాని నరేంద్ర మోదీ

సాక్షి, న్యూఢిల్లీ/ చొప్పదండి: ఉన్నత విద్య అభ్యసించి సాఫ్ట్‌వేర్ ఉద్యోగంలో చేరినా.. దానిని వదులుకొని స్వగ్రామంలో పర్యావరణహిత పద్ధతిలో వ్యవసాయం చేస్తున్న కరీంనగర్ జిల్లాకు చెందిన రైతు మల్లికార్జున్ రెడ్డి యువతకు ఆదర్శప్రాయుడని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కొనియాడారు. వ్యవసాయంలో ఉన్న విస్తృత అవకాశాలకు వీరు బలమైన ఉదాహరణ అని ప్రశంసించారు. ఇటువంటి ఉన్నత విద్యావంతులు మరెందరికో మార్గదర్శకంగా నిలవాలన్నారు. విద్యావంతులైన యువత వ్యవసాయ రంగంలోకి వచ్చేలా ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు.

వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి..

వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రలో భాగంగా ప్రధాని మోదీ గురువారం దేశవ్యాప్తంగా ఉన్న లబ్ధిదారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంభాషించారు. ఇందులో భాగంగా కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం పెద్దకుర్మపల్లికి చెందిన రైతు మావురం మల్లికార్జున్‌రెడ్డి, ఆయన ఇద్దరి కుమార్తెలతోనూ ప్రధాని మాట్లాడారు. ఈ సందర్భంగా మల్లికార్జున్‌రెడ్డి మాట్లాడుతూ.. తాను మంచి రైతుగా ఎదగడానికి విద్య ఎంతో సహాయపడిందన్నారు. పశుపోషణ, ఉద్యానవనాల సాగుతోపాటు ప్రకృతి సేద్యం, ఔషధ మొక్కల పెంపకం చేపట్టానని వివరించారు. సాంప్రదాయ వ్యవసాయానికి భిన్నంగా సమీకృత, పర్యావరణహిత వ్యవసాయ విధానాలను అవలంబిస్తున్నట్టు చెప్పారు. ఏడాదికి రూ.6 లక్షలుగా ఉన్న తన ఆదాయం రూ.12 లక్షలకు పెరిగిందని తెలిపారు.

రైతులకు స్ఫూర్తిగా నిలిచారు

ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. విద్యావంతులైన యువత వ్యవసాయం చేయడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. మల్లికార్జున్ చేస్తున్న సమీకృత వ్యవసాయంపై విశ్వవిద్యాలయాల్లో నిర్వహించే సెమినార్లలో అవగాహన కల్పించాలన్నారు. వ్యవసాయంలో భర్తకు చేదోడుగా నిలిచిన సంధ్య వంటివారు భారత నారీ శక్తులని అభివర్ణించారు. వ్యవసాయంలో ఉన్న అవకాశాలకు మీరే బలమైన ఉదాహరణ అన్నారు. ఇటువంటి ఉన్నత విద్యావంతులు మరెందరికో ఆదర్శంగా నిలవాలని.. విద్యార్థులను, యువతను కలసి వ్యవసాయ రంగంలోకి వచ్చేలా ప్రోత్సహించాలని కోరారు. ఈ సమయంలో కేంద్ర ప్రభుత్వం ద్వారా రైతులకు కల్పిస్తున్న పలు పథకాలను ప్రధాని వివరించారు. వ్యవసాయ రుణాలపై బ్యాంకులు వేస్తున్న వడ్డీ వివరాలను ప్రధాని అడగడంతో.. సాలీనా ఏడు శాతం వేస్తున్నారని మల్లికార్జున్ చెప్పారు. దీనిపై స్పందించిన ప్రధాని ఆ వడ్డీ మూడు శాతమేనని, మళ్లీ బ్యాంకులో సంప్రదించి తెలుసుకోవాలని సూచించారు. కాగా.. చొప్పదండి మార్కెట్ యార్డు నుంచి మల్లికార్జున్‌రెడ్డి ప్రధాని వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంపీ బండి సంజయ్, కలెక్టర్ పమేలా సత్పతి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వదిలేసి..

బీటెక్ కంప్యూటర్ సైన్స్ చది విన మల్లికార్జున్‌రెడ్డి గతంలో హైదరాబాద్ లో సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేశారు. ఆయన తోపాటు సతీమణి సంధ్య ఇద్దరూ తమ ఉద్యోగాలను వదిలేసి స్వగ్రామానికి వచ్చారు. ఇక్కడ ప్రకృతి వ్యవసాయం, ఉద్యానవనాల సాగు, పశుపోషణ చేపట్టారు. సమీకృత వ్యవసాయం, ప్రకృతి సేద్యంపై ప్రచారం చేయడంతోపాటు సమీప ప్రాంతాల్లో రైతులకు శిక్షణ కూడా ఇస్తున్నారు. రెండేళ్ల క్రితం ఐకార్ సంస్థ అందించిన జాతీయ ఉత్తమ రైతు అవార్డు పొందారు.

ఎంతో ఆనందంగా ఉంది..

ప్రధానితో మాట్లాడే అవకాశం రావడం మరిచిపోలేనిది. నేను సాఫ్ట్‌వేర్ ఉద్యోగాన్ని వదిలేసి చేపట్టిన ప్రకృతి వ్యవసాయానికి తగిన గుర్తింపు రావడం సంతోషంగా ఉంది. వికసిత్ భారత్ యాత్ర ద్వారా కేంద్ర ప్రభుత్వ పథకాల వివరాలు ప్రజలకు తెలిసివస్తున్నాయి. గతంలో నాకు కూడా ఈ పథకాలు తెలియవు. నేను సాయిల్ హెల్త్‌కార్డు తీసుకోవడం ద్వారా.. నా పొలానికి భూసార పరీక్ష చేయించా. అనువైన పంటలు వేసుకొని తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి, ఎక్కువ ఆదాయం పొందుతున్నాను. పీఎం కృషి సంచాయి యోజన కార్డు, పీఎం కిసాన్ క్రెడిట్‌కార్డు ఎంతో ఉపయోగపడ్డాయి. నేచర్ ఫార్మింగ్ పథకం లబ్ధి కూడా పొందాను.

– రైతు మల్లికార్జున్‌రెడ్డి

ప్రధాని ప్రశంసలను మర్చిపోలేను



నేను ఎంబీఏ చేసి.. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు కంపెనీలో హెచ్‌ఆర్‌గా పనిచేశాను. మా ఆయన ప్రకృతి వ్యవసాయం చేయాలని సంకల్పించడంతో.. స్వగ్రామానికి తిరిగి వచ్చాం. సేంద్రియ వ్యవసాయంతోపాటు హార్టికల్చర్, పశువుల పెంపకం, వంటివి చేపట్టి ఆదాయం పొందుతున్నాం. ప్రధాని నన్ను ఉద్దేశించి నారీశక్తి అని ప్రశంసించడం మర్చిపోలేని గుర్తింపు. మా ఇద్దరు పిల్లలు కూడా స్వగ్రామంలోనే చదువుకుంటూ మాకు సహకరిస్తున్నారు.

– సంధ్య, మల్లికార్జున్‌రెడ్డి సతీమణి

మిర్చి రైతును నలిపేస్తున్న 'నల్లి'

▶ మొదటి పేజీ తరువాయి

సగటున రూ.1500 వరకు పురుగుల మందుకు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఒకసారి మందు కొట్టినా రెండు మూడు వారాల తర్వాత మరోసారి నల్లి ఆశిస్తోంది. నల్లి పెట్టే ఇబ్బందులు తట్టుకోలేక భద్రాద్రి జిల్లాలో కొందరు రైతులు పొలాల్లో ఉన్న మిర్చి మొక్కలను పీకేస్తున్నారు. దీంతో ఇప్పటి వరకు పెట్టిన పెట్టుబడి అంతా వృథా అవుతోంది. ఫలితంగా రైతులకు రాబడికి బదులు అప్పులు పెరుగుతున్నాయి. ఇక కౌలుకు తీసుకుని మిర్చి వేసిన రైతులు నిలువునా మునిగిపోతున్నారు.

మిర్చి రైతుల గోడు పట్టించుకోని అధికారులు

మిర్చి సాగు ఉద్యాన శాఖ పరిధిలో ఉంటుందనీ, మిర్చి పంటకు ఆశించిన నల్లి తెగులు సమస్య, దాని నివారణతో తమకేమీ బాధ్యత లేదంటున్నారు వ్యవసాయ శాఖ అధికారులు. నిబంధనల ప్రకారం నియోజకవర్గానికి ఒకరు వంతున ఉద్యానశాఖ అధికారులను నియమించాల్సి ఉంటుంది. వీరు వాణిజ్యసాగు విషయంలో మంచిచెడులను రైతులకు తెలియజేస్తూ ఉంటారు. అయితే ఉద్యాన శాఖలో పోస్టులు భారీగా ఖాళీగా ఉన్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లానే తీసుకుంటే ఇక్కడ ఐదు నియోజకవర్గాలు ఉండగా కేవలం అశ్వారావుపేట, కొత్తగూడెంలకే ఉద్యానశాఖ అధికారులు ఉన్నారు. వీరు కూడా ప్రధానంగా ఆయిల్‌పామ్ సాగుపైనే ఫోకస్ అంతా పెట్టారు. దీంతో మిర్చి రైతుల గోడును పట్టించుకునే వారు కరువయ్యారు.

మార్చి మార్చి మందులు...

పూత దశకు వచ్చిన మిర్చి మొక్కలు నిలువునా ఎండిపోతుంటే చూస్తూ ఊరుకోలేక పురుగుల మందు కోసం రైతులు పెస్టిసైడ్స్ దుకాణాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. వివిధ కంపెనీలకు చెందిన పురుగుల మందును మార్చి మార్చి కొడుతున్నా ఆశించిన ప్రయోజనం కరువైంది. ఐనప్పటికీ ఆశలు వదులుకోలేక కొందరు రసాయన మందులు కాదని, బయో పెస్టిసైడ్స్ మందులు చల్లుతున్నారు. క్షేత్రస్థాయిలో మిర్చి రైతులకు సరైన మార్గదర్శకత్వం, కార్యాచరణ కొరవడటంతో ఎన్ని మందులు వాడినా ప్రయోజనం లేకుండా పోతోంది.

కార్యాచరణ ఎక్కడ?

నల్లి తెగులు సోకినప్పుడు, దాన్ని నివారించేందుకు ఒక క్లస్టర్ మొత్తంలో ఒకేసారి సమగ్ర సస్య రక్షణ చర్యలు చేపట్టాల్సి ఉంటుంది. అప్పుడే ఆ ప్రాంతం నుంచి ఈ సమస్య తొలగిపోతుంది. అలా కాకుండా ఎవరికివారుగా వేర్వేరుగా పురుగుల మందు వాడితే ఒక తోటలో సమస్య తగ్గినా, సమీపంలో ఉన్న మరో తోట నుంచి మరోసారి తెగులు ఆశిస్తుంది. ఫలితంగా విరామం లేకుండా రైతులు శ్రమించడంతో పాటు పెట్టుబడి భారీగా పెరుగుతోంది. చివరకు ఆశించిన ప్రయోజనం నెరవేరడం లేదు. నల్లి కారణంగా ఈసారి మిర్చి దిగుబడి సగం వరకు పడిపోయే ప్రమాదం ఉంది.

దిక్కు తోచడం లేదు



నాలుగు ఎకరాల్లో మిర్చి సాగు చేశాను. కౌలు కాకుండానే ఎకరానికి రూ.లక్ష వరకు పెట్టుబడి ఖర్చు వచ్చింది. నల్లి సోకడంతో పంట పూర్తిగా ఎండిపోయింది. గుప్పెడు కాయలు కోసుకునే పరిస్థితి లేదు. ఏం చేయాలో పాలుపోవడం లేదు.

– యారం వెంకటరెడ్డి, సంజీవరెడ్డిపాలెం, బూర్గంపాడు

మళ్లీ మళ్లీ వస్తోంది



రెండు ఎకరాల్లో మిర్చి సాగు చేశాను. నల్లి సోకడంతో ఇప్పటి వరకు నాలుగు సార్లు పురుగుల మందు స్ప్రే చేశాను. దాదాపు రూ. 20 వేల వరకు ఖర్చు పురుగుల మందుకే అయ్యింది. ప్రస్తుతం కాతకు చేరుకోగా మరోసారి నల్లి సోకింది. నివారణ కోసం ఈసారి రూ.11,750 మేరకు పురుగుల మందులు కొన్నాను.

– తాటి వెంకటేశ్వర్లు, మామకన్ను, గుండాల

గుడులకు దారివ్వలేదని మూడు కుటుంబాల వెలి

- గ్రామస్తులెవరూ సహకరించొద్దని వీడీసీ సభ్యుల ఆంక్షలు
- జగిత్యాల జిల్లా తిమ్మాపూర్‌లో ఘటన


ఇబ్రహీంపట్నం: గ్రామదేవతల గుడులకు దారి ఇచ్చి తిరిగి తీసుకున్నారన్న కారణంతో మూడు కుటుంబాలను వీడీసీ(విలేజ్ డెవలప్‌మెంట్ కమిటీ) సభ్యులు సాంఘిక బహిష్కరణ చేసిన సంఘటన జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం తిమ్మాపూర్‌లో జరిగింది. బాధితులు కొమ్ముల రాజారెడ్డి, మోహన్‌రెడ్డి, రాజు కథనం ప్రకారం.. తిమ్మాపూర్‌లో ఐదుచేతుల పోచమ్మ, మహాలక్ష్మీ ఆలయాలు రాజారెడ్డి, మోహన్‌రెడ్డి, రాజు భూముల వద్ద ఉన్నాయి. అయితే అక్కడికి వెళ్లేందుకు దారిలేదు. దీంతో వీడీసీ సభ్యులు సమావేశమై దారి కోసం రాజారెడ్డి, మోహన్‌రెడ్డి, రాజును సంప్రదించగా నాలుగు అడుగుల స్థలం ఇచ్చారు. ఆ స్థలంలో వీడీసీ సభ్యులు రాయితో తెట్టే కట్టేందుకు సన్నాహాలు చేస్తుండగా బాధితులు అభ్యంతరం తెలిపారు. అయినా వినిపించుకోకపోవడంతో దారిని బాధితులు తిరిగి ఆక్రమించుకున్నారు. దీంతో రాజారెడ్డి, మోహన్‌రెడ్డి, రాజు కుటుంబాలను వెలివేస్తున్నామని, గ్రామస్తులెవరూ వారి వ్యవసాయ పనులకు వెళ్లవద్దని, సరుకులు ఇవ్వొద్దని, టీ, టిఫిన్స్ కూడా విక్రయించవద్దని వీడీసీ సభ్యులు ఆంక్షలు విధించారు. దీంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. ఈ విషయమై ఎస్సై ఉమాసాగర్‌ను వివరణ కోరగా బాధితుల ఫిర్యాదు మేరకు వీడీసీ సభ్యులపై కేసు నమోదు చేశామని తెలిపారు.

ఆర్టిజన్ల విలీనంపై విచారణ

సాక్షి, హైదరాబాద్: విద్యుత్ సంస్థల్లో ఆర్టిజన్ల విలీనంపై రాష్ట్ర ప్రభుత్వం విచారణ ప్రారంభించింది. రాష్ట్రంలోని వివిధ విద్యుత్ సంస్థల్లో ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన పని చేస్తున్న 23,667 మంది ఉద్యోగులను గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆర్టిజన్లుగా విద్యుత్ సంస్థల్లో విలీనం చేసిన విషయం తెలిసిందే. అయితే గత ప్రభుత్వం విద్యుత్ రంగంలో తీసుకున్న నిర్ణయాలపై ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పునఃసమీక్షిస్తోంది. విద్యుత్ కొనుగోలు ఒప్పందాలతో పాటు ఇతర నిర్ణయాలపై నివేదిక సమర్పించాలని సీఎం ఆదేశించారు. దీంతో ఆర్టిజన్ల విలీనానికి సంబంధించిన సమగ్ర సమాచారం పంపించాలని ఇంధన శాఖ ముఖ్యకార్యదర్శి రిజ్వీ రాష్ట్ర విద్యుత్ సంస్థలను కోరారు. మార్గదర్శకాల ప్రకారం 2017 నవంబర్ నాటికి ఈపీఎఫ్ ఖాతా కలిగి ఉన్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఆర్టిజన్లుగా విలీనం కావడానికి అర్హులు. ఈ నిబంధనలోని లొసుగుల ఆధారంగానే విలీనంలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలపై తాజాగా ఇంధనశాఖ విచారణ నిర్వహిస్తున్నట్టు తెలిసింది.

కాళేశ్వరంపై విజిలెన్స్ డీజీ విచారణ

- మేడిగడ్డ, అన్నారం బ్యారేజీ, లక్ష్మీపంపుహౌస్‌లలో కలియదిరిగిన డీజీ రాజీవ్ రతన్.. వాటిల్లిన నష్టంపై ఆరా


మేడిగడ్డ బ్యారేజీలో వరద ప్రవాహానికి కొట్టుకు వచ్చిన దిమ్మెను పరిశీలిస్తున్న డీజీ బృందం

కాళేశ్వరం: కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతి ఆరోపణలు వెల్లువెత్తిన నేపథ్యంలో ప్రస్తుత ప్రభుత్వ ఆదేశాలతో రాష్ట్ర విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీ రాజీవ్ రతన్ మలి రోజు ప్రాజెక్టు ను సమగ్రంగా పరిశీలించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం ప్రాజెక్టు పరిధి కన్నెపల్లి లోని లక్ష్మీపంపుహౌస్‌ను గురువారం ఆయన సందర్శించారు. ముందుగా పంపుహౌస్‌లోకి లిఫ్ట్‌ద్వారా మోటార్ల కింది భాగంలోకి వెళ్లారు. అక్కడ 2022 జూలై 14న భారీ వర్షాలతో నీట మునిగి చెడిపోయిన మోటార్లు, కంట్రోల్ రూమ్, రక్షణగోడను క్షుణ్ణంగా పరిశీలించారు. తరువాత పంపుహౌస్‌లోని అప్రోచ్ కెనాల్, డెలివరీ చానెల్ గుండా వరద ఉధృతి ఎలా వచ్చిందో పరిశీలించారు. అక్కడినుంచి నేరుగా అన్నారం(సరస్వతీ)బ్యారేజీకి 14కి.మీ. దూరం గ్రావిటీకాల్వ దారిలో కారులో వెళ్లారు. అక్కడ బ్యారేజీ వాక్‌వే ద్వారా వెళ్లి సీపేజీ బుంగలు ఏర్పడ్డ చోట క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఆ తర్వాత మళ్లీ మేడిగడ్డ(లక్ష్మీ)బ్యారేజీకి వెళ్లి గత అక్టోబర్‌లో 7వ బ్లాక్‌లో కుంగిన పియర్‌లతోపాటు క్రస్టు గేట్లను క్షుణ్ణంగా చూశారు. ఆయన మాట్లాడుతూ మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలు, లక్ష్మీ పంపుహౌస్‌ల రికార్డులు, డాక్యుమెంట్లను విజిలెన్స్ సేకరించిందనీ, తాను స్వయంగా పరిశీలనకు వచ్చినట్లు వెల్లడించారు. నివేదికలను ప్రభుత్వానికి సమర్పిస్తామన్నారు.

అంధకారంలో సిరిసిల్ల, వేములవాడ


లైట్లు లేకుండానే విధులు నిర్వర్తిస్తున్న మున్సిపల్ సిబ్బంది

స్మార్ట్‌సిటీ సిరిసిల్లలో బల్దియా అధికారులు ఏడాదికిపైగా విద్యుత్ బిల్లులు రూ.1,56,85,517 చెల్లించకపోవడంతో గురువారం సిరిసిల్ల సహకార విద్యుత్ సరఫరా సంఘం(సెస్) అధికారులు విద్యుత్ కనెక్షన్ తొలగించడంతో సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కార్యాలయాలు అంధకారంలో మునిగిపోయాయి . ఈ నెలాఖరుకు బిల్లులు చెల్లిస్తామని మున్సిపల్ అధికారులు చెప్పినా ఇప్పటికే మూడుసార్లు నోటీసులు అందజేశామని సెస్ అధికారులు విద్యుత్ కనెక్షన్ తొలగించారు. ఇక ప్రధాన రహదారులతోపాటు వీధుల్లోని వీధి దీపాలకు, ప్రభుత్వ పాఠశాలలకు విద్యుత్ సరఫరా నిలిపివేయడంతో సిరిసిల్లలో చీకట్లు కమ్ముకున్నాయి. నాలుగు ప్రభుత్వ పాఠశాలలకు కూడా బకాయిలు పేరుకుపోయాయంటూ గురువారం కరెంట్ కట్ చేశారు. దీంతో విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేయడం, కాలకృత్యాలకు నీటి సరఫరా లేక ఇబ్బందులు పడ్డారు.

పలుమార్లు నోటీసులు ఇచ్చాం: మధుకర్, ఏఈ, సిరిసిల్ల

పాఠశాలలో పేరుకుపోయిన విద్యుత్ బకాయిలను చెల్లించాలని అనేకసార్లు ప్రధానోపాధ్యాయులకు నోటీలు ఇచ్చాం. దీనిపై స్పందించి ఉంటే నేడు ఈ పరిస్థితి వచ్చేది కాదు. బకాయిలు లక్షల్లో, వేలల్లో ఉండడంతో గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేశాం. బకాయిలు చెల్లిస్తే వెంటనే పునరుద్ధరిస్తాం.

– సిరిసిల్లటౌన్, వేములవాడ అర్బన్

భార్యను చంపిన భర్తకు ఉరి

- నాంపల్లి కోర్టు చరిత్రలో తొలిసారి సంచలన తీర్పు
- 2019లో భవానీనగర్ పీఎస్‌లో కేసు నమోదు


ఇమ్రాన్

సాక్షి, హైదరాబాద్: అదనపు కట్నం కోసం వేధిస్తూ భార్యను అత్యంత కిరాతకంగా హత్య చేసిన భర్తను దోషిగా తేల్చిన న్యాయస్థానం మరణదండన విధించింది. నాంపల్లిలోని నాలుగో ఎంఎస్‌జే కోర్టు ఉరి శిక్ష విధించడం ఇదే తొలిసారని పోలీసులు పేర్కొన్నారు. హైదరాబాద్ భవానీనగర్‌కు చెందిన కారుడ్రైవర్ ఇమ్రాన్ ఉల్ హక్ 2004లో నసీమ్ అక్తర్‌ను వివాహం చేసుకున్నాడు. వీరికి నలుగురు సంతానం. పెళ్లయిన ఐదేళ్ల వరకు బాగానే ఉన్న వారిమధ్య తర్వాత స్పర్థలు వచ్చాయి. ఏ పనీ చేయకుండా ఖాళీగా ఉండే ఇమ్రాన్ కారు ఖరీదు చేయడానికి డబ్బు కావాలని భార్యను వేధించడమే దీనికి కారణం. నసీమ్ ఇంట్లో కుట్టుపని చేస్తూ కుటుంబాన్ని పోషించేది. ఆమె కుటుంబీకులు పలుమార్లు నచ్చచెప్పినా భర్తలో మార్పు రాలేదు సరికదా.. 2019లో మరో వివాహం కూడా చేసుకున్నాడు. ఈ నేపథ్యంలో 2019, జనవరి 6 రాత్రి భార్యాభర్త మధ్య అదనపు కట్నం విషయంలో ఘర్షణ జరిగింది. విచక్షణ కోల్పోయిన ఇమ్రాన్ కత్తెరతో పొడిచి, గొంతు కోయడంతోపాటు తలపై సుత్తెతో బలంగా కొట్టి భార్యను చంపేశాడు. ఆమె సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న భవానీనగర్ పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. దర్యాప్తు పూర్తి చేసి నాంపల్లిలోని నాలుగో ఎంఎస్‌జే కోర్టులో అభియోగపత్రాలు దాఖలు చేశారు. ఈ కేసు విచారించిన న్యాయస్థానం నిందితుడిని దోషిగా నిర్ధారించి ఐపీసీ 302 కింద ఉరిశిక్ష విధిస్తూ గురువారం తీర్పు చెప్పింది. అతనిపై నమోదైన ఇతర సెక్షన్లలో కూడా శిక్షలు ఖరారు చేసి, జరిమానాలు విధించింది.

గర్భగుడిలోకి రామ్‌లల్లా

అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్టకు శరవేగంగా ఏర్పాట్లు

- ఐదేళ్ల బాలుడి రూపంలో దర్శనమివ్వనున్న శ్రీరాముడు
- ఆలయ ప్రాంగణంలో పటిష్టమైన భద్రతా చర్యలు

అయోధ్య/న్యూఢిల్లీ: అయోధ్య రామమందిరంలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠకు ఏర్పాట్లు శరవేగంగా కొనసాగుతున్నాయి. గురువారం ఉదయం కీలక ఘట్టం ముగిసింది. రామ్‌లల్లా విగ్రహాన్ని క్రేన్ సాయంతో భవ్యమందిరంలోని గర్భగుడిలోకి చేర్చారు. వేద పండితుల మంత్రోచ్ఛారణలు, భక్తుల జయజయ ధ్వానాల మధ్య ప్రధాన వేదికపై ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ఆచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇక అత్యంత కీలకమైన ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం జరగాల్సి ఉంది. గర్భగుడిలో రామ్‌లల్లా విగ్రహాన్ని వస్త్రంతో కప్పి ఉంచారు. మొబైల్ ఫోన్లు, కెమెరాలతో ఎవరినీ లోపలికి అనుమతించడం లేదు. ఆలయ ప్రాంగణంలో ఉత్తరప్రదేశ్ ప్రత్యేక భద్రతా బలగాలు మోహరించాయి. పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. అనధికార వ్యక్తులు ఆలయ ప్రాంగణంలోకి ప్రవేశించకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. ప్రాణప్రతిష్ఠ తర్వాత బాలరాముడికి నిత్యం ఐదుసార్లు ప్రత్యేక హారతి ఇస్తారు. విగ్రహంపై దుస్తులను ప్రతిరోజూ మారుస్తారు. మొదటి, చివరి హారతి సందర్భంగా రాముడు ప్రత్యేక దుస్తుల్లో దర్శనమిస్తాడు.

నిర్విఘ్నంగా కొనసాగుతున్న క్రతువులు

ప్రత్యేక క్రతువులు నిర్విఘ్నంగా కొనసాగుతున్నాయి. అయోధ్యలో మూడో రోజు గురువారం ఆచార్యులు ఆలయ ప్రాంగణంలో గణేశ్ పూజ, వరుణ పూజ, వాస్తు పూజ శాస్త్రోక్తంగా నిర్వహించారు. జలదివస్‌లో భాగంగా రామ్‌లల్లా విగ్రహాన్ని నీటితో శుభ్రం చేశారు.

రామ్‌లల్లా విశిష్టతలివే..

- అయోధ్య రామాలయంలో ప్రతిష్ఠించబోయే బాలరాముడి విగ్రహం ఎత్తు 51 అంగుళాలు.
- కృష్ణ శిల(నల్ల రాయి) నుంచి ఈ విగ్రహాన్ని కర్ణాటకలోని మైసూరుకు చెందిన శిల్పి అరుణ్ యోగిరాజ్ చెక్కారు.
- రామ్‌లల్లాను చెక్కిన శిల బరువు దాదాపు 200 కిలోలు.
- ఐదేళ్ల బాలుడి రూపంలో రామ్‌లల్లా విగ్రహాన్ని రూపొందించారు.
- గర్భాలయంలో నిల్చున్న రూపంలోనే రామ్‌లల్లా దర్శనమిస్తాడు.
- విగ్రహ ప్రాణప్రతిష్ఠ ఈ నెల 22వ తేదీన.. సోమవారం మధ్యాహ్నం 12.20 గంటల నుంచి ఒంటి గంట మధ్య అభిజిత్ ముహూర్తంలో జరుగుతుంది.
- ప్రాణప్రతిష్ఠ సందర్భంగా గర్భగుడిలోకి కొందరికే ప్రవేశం ఉంటుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ఉత్తరప్రదేశ్ గవర్నర్ ఆనందిబెన్ పటేల్, ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్, అయోధ్య రామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు మహంత్ నృత్యగోపాల్ మహారాజ్ మాత్రమే గర్భాలయంలోకి ప్రవేశిస్తారు. ఆలయ ట్రస్టీలు 'గర్భగృహం' అని పిలిచే పవిత్ర ప్రాంతంలో ఆసీనులవుతారు.
- ఆలయ ప్రాణప్రతిష్ఠకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రధాన యజమాని(కర్త)గా వ్యవహరిస్తారు.
- ఈ నెల 23వ తేదీ నుంచి గర్భాలయంలో బాలరాముడిని సామాన్య భక్తులు దర్శించుకోవచ్చు.



అయోధ్యలో శ్రీ హనుమాన్ మహాయాగం దృశ్యం



ఉత్సవాల్లో పాల్గొనేందుకు నేపాల్ నుంచి వచ్చిన మహిళలు




హనుమాన్ మహాయాగంలో పాల్గొనేందుకు అయోధ్యకు వచ్చిన బాలలు



భక్తి పారవశ్యంతో పాటలు పాడుతున్న భక్తులు



గర్భగుడిలోకి రామ్‌లల్లా విగ్రహాన్ని తీసుకువస్తున్న నిర్మాణ సిబ్బంది



తపాలా స్టాంపులు విడుదల చేస్తున్న ప్రధాని మోదీ

అయోధ్య ఆలయంపై పోస్టల్ స్టాంప్‌లు విడుదల

అయోధ్య భవ్య రామమందిరానికి సంబంధించిన పోస్టల్ స్టాంప్‌లను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గురువారం విడుదల చేశారు. అంతేకాకుండా ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాలు శ్రీరాముడిపై జారీ చేసిన స్టాంప్‌లతో కూడిన పుస్తకాన్ని కూడా ఆవిష్కరించారు. ఇవి కేవలం కాగితం ముక్కలు కాదని, చరిత్రాత్మక సంఘటనలను భవిష్యత్తు తరాలకు తెలియజేయడానికి ఉపయోగపడే మాధ్యమాలు అని చెప్పారు. చరిత్ర పుస్తకాలకు, పురాణ గాథలకు, గొప్ప ఆలోచనలకు సూక్ష్మరూపాలు అని తెలిపారు. మోదీ మొత్తం ఆరు రకాల స్టాంప్‌లను మోదీ విడుదల చేశారు. అయోధ్య రామాలయం, వినాయకుడు, హనుమంతుడు, జటాయు, శబరి మాత, కేవట్ రాజ్‌పై వీటిని ముద్రించారు. 48 పేజీల స్టాంప్ బుక్‌ను మోదీ విడుదల చేశారు. అమెరికా, న్యూజిలాండ్, సింగపూర్, కెనడా, కాంబోడియా తదితర దేశాలు, ఐక్యరాజ్యసమితి వంటి సంస్థలు ముద్రించిన శ్రీరాముడి స్టాంప్‌ల చిత్రాలు ఈ పుస్తకంలో ఉన్నాయి. రాముడు, సీత, రామాయణం అనేవి సరిహద్దులకు, కాలానికి, కులాలు, మతాలు, ప్రాంతాలకు అతీతం అని ప్రధాని మోదీ చెప్పారు. రామాయణం, రాముడి వ్యక్తిత్వం భూమిపై పర్వతాలు, నదులు ఉన్నంత కాలం ప్రజలను ప్రభావితం చేస్తూనే ఉంటాయని వ్యాఖ్యానించారు. విదేశాలు సైతం రాముడిపై పోస్టల్ స్టాంప్‌లు ముద్రించాయని, వేర్వేరు నాగరికతలను రాముడు ప్రభావితం చేశాడని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా భిన్న సంస్కృతుల ప్రజలకు రాముడు ఆరాధ్య దైవంగా మారాడని వివరించారు.

ఫిరోజాబాద్ నుంచి 10 వేల గాజులు, బ్రేస్‌లెట్లు

ఉత్తరప్రదేశ్‌లోని ఫిరోజాబాద్ నుంచి 10,000కుపైగా ప్రత్యేక గాజులు, బ్రేస్‌లెట్లను గురువారం అయోధ్యకు చేర్చారు. శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టుకు అందజేశారు. మహిళలు, పురుషులు చేతులకు ధరించే గాజులు, బ్రేస్‌లెట్ల తయారీకి ఫిరోజాబాద్ ఎంతో పేరుగాంచింది. అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ వేడుక కోసం ఫిరోజాబాద్ వ్యాపారులు రాముడు, సీత, హనుమంతుడి చిత్రాల తో కూడిన 10 వేల గాజులు, బ్రేస్‌లెట్లను ప్రత్యేకంగా తయారు చేయించారు. ప్రాణప్రతిష్ఠ వేడుక తర్వాత వీటిని ట్రస్టు ఆధ్వర్యంలో మూడు రోజులపాటు భక్తులకు ఉచితంగా పంపిణీ చేస్తారు. ఈ గాజులను పెళ్లిలో నూతన వధువులు ధరించాలని ఫిరోజాబాద్ వ్యాపారులు సూచించారు.

దూరదర్శన్‌లో ప్రత్యక్ష ప్రసారం

అయోధ్యలో ప్రాణప్రతిష్ఠ వేడుక దూరదర్శన్‌లో ప్రత్యక్ష ప్రసారం కానుంది. ఈ నెల 22న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఈ కార్యక్రమాన్ని టీవీల్లో ప్రత్యక్షంగా వీక్షించవచ్చు. డీడీ న్యూస్ తోపాటు డీడీ జాతీయ చానళ్లన్నింటిలో లైవ్ టెలికాస్ట్ జరుగుతుంది. దూరదర్శన్ సౌజన్యంతో ప్రైవేట్ చానళ్లలోనూ ప్రసారమవుతుంది. అయోధ్యలో 40 కెమెరాలను దూరదర్శన్ ఏర్పాటు చేస్తోంది. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లోని భారత రాయబార కార్యాలయాల్లోనూ ప్రత్యక్ష ప్రసారం కోసం ఏర్పాట్లు జరుగుతున్నాయి.

కఠిన నియమాలు పాటిస్తున్న ప్రధాని మోదీ

ప్రధాని నరేంద్రమోదీ నిత్యం కేవలం నేలపైనే నిద్రిస్తున్నారు. కేవలం కొబ్బరి నీళ్లు మాత్రమే తాగుతున్నారు. 11 రోజుల ప్రత్యేక అనుష్ఠానంలో భాగంగా ఆయన కఠిన నియమాలు పాటిస్తున్నారు. సాత్వికాహారం స్వీకరిస్తున్నారు. సమయం చిక్కినప్పుడల్లా రామనామం జపిస్తున్నారు. తన నివాసంలో రాముడికి పూజలు చేస్తున్నారు. అయోధ్యలో రామమందిర ప్రారంభోత్సవానికి ప్రధాన యజమానిగా వ్యవహరించనున్న మోదీ ఈ నెల 12న ప్రత్యేక అనుష్ఠానం ప్రారంభించిన సంగతి తెలిసిందే. 22న రామ్‌లల్లా ప్రాణ ప్రతిష్ఠతో మోదీ అనుష్ఠానం ముగుస్తుంది.

22న కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలకు 'సగం రోజు సెలవు'

దేశవ్యాప్తంగా అన్ని కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలు, కేంద్ర ప్రభుత్వ సంస్థలు, కేంద్ర పారిశ్రామిక సంస్థలకు ఈ నెల 22వ తేదీన సగం రోజు సెలవు ప్రకటించారు. అయోధ్యలో రామ్‌లల్లా విగ్రహ ప్రాణప్రతిష్ఠ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ప్రాణప్రతిష్ఠకు సంబంధించిన వేడుకల్లో ఉద్యోగులు పాల్గొనేందుకు వీలుగా వారి విజ్ఞప్తి మేరకు కార్యాలయాలకు సగం రోజు సెలవు ఇస్తున్నారు. ఈ మేరకు కేంద్ర సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పెన్షన్ల మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నెల 22న మధ్యాహ్నం 02.30 గంటల వరకు కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలను మూసివేస్తారు. ప్రభుత్వ రంగ బ్యాంక్‌లు, బీమా సంస్థలకూ 22న సగం రోజు సెలవే.

వాతావరణ శాఖ వెబ్‌పేజీ ప్రారంభం

అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ఠ వేడుకకు మరో నాలుగు రోజులే మిగిలి ఉంది. అయోధ్య నగరంతోపాటు పరిసర ప్రాంతాల వాతావరణ పరిస్థితులు, ఉష్ణోగ్రతలు, తేమ, చలి తీవ్రత వంటి సమాచారం ఎప్పటికప్పుడు తెలియజేయడానికి భారత వాతావరణ శాఖ(ఐఎండీ) గురువారం ప్రత్యేక వెబ్‌పేజీను ప్రారంభించింది. హిందీ, ఇంగ్లిష్, ఉర్దూ, చైనీస్, ఫ్రెంచ్, స్పానిష్ తదితర భాషల్లో ఇందులో సమాచారం అందుబాటులో ఉంటుంది.

ఉజ్జయిని నుంచి 5 లక్షల లడ్డూలు

అయోధ్యలో రామాలయ ప్రారంభోత్సవం కోసం మధ్యప్రదేశ్‌లోని ప్రఖ్యాత ఉజ్జయిని మహాకాళేశ్వర ఆలయంలో 5 లక్షల లడ్డూలు సిద్ధం చేశారు. శుక్రవారం వీటిని నాలుగు వాహనాల్లో అయోధ్యకు పంపించనున్నట్లు ఆలయ వర్గాలు తెలియజేశాయి. ఈ నెల 22న ప్రాణప్రతిష్ఠ సందర్భంగా వీటిని భక్తులకు పంపిణీ చేస్తారు.

ఇరాన్‌పై పాక్ ప్రతీకార దాడి

సియెస్తాన్–బలోచిస్తాన్ ప్రావిన్స్‌లో 9 మంది మృతి

ఇస్లామాబాద్: ఇరాన్ బుధవారం జరిపిన దాడులకు గురువారం పాక్ ప్రతీకారం తీర్చుకుంది. సరిహద్దులకు సమీపంలోని ఇరాన్ సియెస్తాన్–బలోచిస్తాన్ ప్రావిన్స్‌లో దాడులు జరిపింది. ఉగ్రవాదుల స్థావరాలే లక్ష్యంగా రాకెట్లు, డ్రోన్లతో చేపట్టిన 'ప్రెసిషన్ మిలటరీ స్ట్రయిక్స్'లో బలోచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ, బలోచిస్తాన్ లిబరేషన్ ఫ్రంట్‌లకు చెందిన 9 మంది ఉగ్రవాదులు చనిపోయినట్లు సమాచారం ఉందని పాక్ ఆర్మీ వెల్లడించింది. ఈ ఘటనను ఇరాన్ తీవ్రంగా ఖండించింది. పాకిస్తాన్‌కు తమ నిరసన తెలిపినట్లు ఇరాన్ విదేశాంగ శాఖ పేర్కొంది. పాక్ దాడుల్లో ఇరానేతర జాతీయులైన ఇద్దరు పురుషులు, ముగ్గురు మహిళలు, నలుగురు చిన్నారులు చనిపోయినట్లు అధికార వార్తా సంస్థ ఇర్నా పేర్కొంది. పాక్ కేంద్రంగా పనిచేస్తూ తమ దేశంలో ఉగ్రదాడులకు తెగబడుతున్న జైష్ అల్–అదిల్ ఉగ్రసంస్థ స్థావరాలపై ఇరాన్ డ్రోన్లు, క్షిపణి దాడులతో బుధవారం విరుచుకుపడింది. ఈ దాడులకు నిరసనగా పాక్ తమ దేశంలోని ఇరాన్ రాయబారిని బహిష్కరించడంతోపాటు ఇరాన్‌లోని తమ రాయబారిని వెనక్కి పిలిపించుకున్న విషయం తెలిసిందే. పాకిస్తాన్ భూభాగంపై ఇరాన్ దాడులను భారత్ సమర్థించింది. ఉగ్రవాదాన్ని అంతమొందించాలన్న తమ వైఖరిలో మార్పు లేదని స్పష్టం చేసింది. ఇది ఆ రెండు దేశాలకు సంబంధించిన విషయమే అయినప్పటికీ, దేశాలు తమ ఆత్మరక్షణ కోసం తీసుకునే చర్యలను భారత్ అర్థం చేసుకుందని పేర్కొంది.

కాన్పూర్ ఐఐటీలో మరో ఆత్మహత్య

కాన్పూర్: కాన్పూర్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ)లో మరో విద్యార్థి బలవన్మరణం చెందారు. పీహెచ్‌డీ చేస్తున్న ప్రియాంకా జైస్వాల్(29) గురువారం హాస్టల్‌లోని తన గదిలో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. జార్ఖండ్‌లోని దుమ్కాకు చెందిన జైస్వాల్ గత ఏడాది డిసెంబర్ 29వ తేదీన కెమికల్ ఇంజనీరింగ్ పీహెచ్‌డీలో చేరారు. 'గురువారం మధ్యాహ్నం ఒంటి గంటకు మాకు సమాచారం అందింది. వెంటనే అక్కడికి వెళ్లిన పోలీసులు రూం లోపలి నుంచి గడియపెట్టి ఉండటంతో తలుపులు పగులగొట్టారు. సీలింగ్ ఫ్యాన్‌కు ప్రియాంకా జైస్వాల్ విగతజీవిగా వేలాడుతూ కనిపించింది. ఫోరెన్సిక్ నిపుణులు ఆధారాలు సేకరించారు'అని డీసీపీ పటేల్ చెప్పారు. నెల రోజుల వ్యవధిలో క్యాంపస్‌లో జరిగిన మూడో ఆత్మహత్య ఇది. జనవరి 11వ తేదీన వికాస్ కుమార్ మీనా(31) అనే ఎంటెక్ సెకండియర్ విద్యార్థి హాస్టల్‌లోని తన గదిలో ఉరేసుకున్నాడు. పలు సబ్జెక్టుల్లో ఫెయిల్ కావడంతో మనస్తాపానికి గురైనట్లు సమాచారం. గత ఏడాది డిసెంబర్ 19 పల్లవి చిల్కా(34) అనే పరిశోధక విద్యార్థిని కూడా హాస్టల్‌లోని తన గదిలో ఉరేసుకున్నారు.

లొంగిపోయేందుకు గడువివ్వండి

సుప్రీంకోర్టులో బిల్కిస్ బానో కేసు దోషుల పిటిషన్

న్యూఢిల్లీ: బిల్కిస్ బానో కేసులో దోషులు లొంగిపోయేందుకు తమకు మరింత గడువు కావాలంటూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. గుజరాత్‌లో 2002లో మత కలహాల సమయంలో బిల్కిస్‌బానోపై గ్యాంగ్ రేప్‌నకు పాల్పడటంతోపాటు ఆమె కుటుంబంలోని ఏడుగురిని హత్య చేసిన కేసులో 11 మంది దోషులకు కోర్టు యావజ్జీవ జైలు శిక్ష విధించింది. అయితే వారికి గుజరాత్ ప్రభుత్వం క్షమాభిక్ష ప్రకటించి 2022లో విడుదల చేయడం, ఆ నిర్ణయాన్ని నిలుపుదల చేస్తూ ఈ నెల 8న సుప్రీంకోర్టు ఉత్తర్వులు జారీ చేయడం తెలిసిందే. సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు దోషులు రెండు వారాల్లోగా తిరిగి జైలుకు వెళ్లాల్సి ఉంది. అయితే, అనారోగ్యం, కుమారుడి వివాహం, అత్యవసర వ్యవసాయ పనులు వంటి కారణాలు చూపుతూ 11 మంది దోషుల్లో అయిదుగురు లొంగుబాటుకు మరింత గడువు కావాలని అత్యున్నత న్యాయస్థానాన్ని కోరారు. జనవరి 21వ తేదీతో లొంగుబాటు గడువు ముగియనున్నందున అత్యవసరంగా శుక్రవారం విచారణ చేపట్టాలని కోరారు. గురువారం వీరి పిటిషన్ జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ సంజయ్ కరోల్‌ల ధర్మాసనం ముందుకు రాగా, ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ ఎదుట ఉంచాలని వారు రిజిస్ట్రీని కోరారు. ఈ కేసు విచారణకు కొత్త ధర్మాసనం ఏర్పాటుపై ఆయన ఆదేశాలు జారీ చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

సిబ్బందిని పొట్టనబెట్టుకుంది అతడే

1990లో ఘటనలో యాసిన్ మాలిక్‌ను గుర్తు పట్టిన ప్రత్యక్ష సాక్షి

జమ్మూ: శ్రీనగర్‌లో 1990 జనవరి 25వ తేదీన భారత వైమానిక దళం(ఐఏఎఫ్) సిబ్బందిపై కాల్పులు జరిపింది జేకేఎల్ఎఫ్ చీఫ్ యాసిన్ మాలిక్ అని ప్రత్యక్ష సాక్షి ధ్రువీకరించారు. ఆ రోజు ఘటన జరిగిన తీరును గురువారం ఐఏఎఫ్ మాజీ కార్పొరల్ రాజ్వర్ ఉమేశ్వర్ సింగ్ ప్రత్యేక సీబీఐ కోర్టుకు చెప్పారు. శ్రీనగర్ వైమానిక కేంద్రానికి వెళ్లేందుకు ఐఏఎఫ్ సిబ్బంది 1990 జనవరి 25వ తేదీ ఉదయం రావల్‌పొరాలో వాహనం కోసం ఎదురు చూస్తున్నారు. అదే సమయంలో యాసిన్ మాలిక్‌తోపాటు కొందరు ఉగ్రవాదులు అక్కడికి చేరుకున్నారు. యాసిన్ మాలిక్ తన దుస్తుల్లో నుంచి తుపాకీని బయటకు తీసి, యథేచ్ఛగా కాల్పులకు తెగబడ్డాడు. ఈ ఘటనలో స్క్వాడ్రన్ లీడర్ రవి ఖన్నా సహా నలుగురు నేలకొరగ్గా మరో 40 మంది గాయపడ్డారు. క్షతగాత్రుల్లో ఉమేశ్వర్ సింగ్ ఒకరు. తీహార్ జైలులో ఉన్న యాసిన్ మాలిక్ గురువారం జరిగిన కోర్టు విచారణకు వర్చువల్‌గా పాల్గొన్నాడు. ప్రత్యక్ష సాక్షిని క్రాస్ ఎగ్జామిన్ చేయొచ్చని కోర్టు ఇచ్చిన అవకాశాన్ని యాసిన్ మాలిక్ తిరస్కరించాడు. తనను కోర్టులో ప్రత్యక్షంగా హాజరుపరచాలని కోరాడు. ఈ కేసులో మాలిక్, మరో అయిదుగురిపై 1990 ఆగస్ట్ 31వ తేదీన జమ్మూలోని టాడా కోర్టులో చార్జిషీటు దాఖలైంది. 1989లో అప్పటి కేంద్ర మంత్రి ముఫ్తీ మహ్మద్ సయీద్ కుమార్తె రుబియా కిడ్నాప్, నేవీ అధికారులపై కాల్పుల కేసులు యాసిన్ మాలిక్‌పై ఉన్నాయి.


ఏడెన్ పోర్టు సమీపంలో నౌకపై డ్రోన్ దాడి

తక్షణమే స్పందించిన భారత నావికాదళం

న్యూఢిల్లీ: ఏడెన్ సింధుశాఖ సమీపంలో మార్షల్ ఐల్యాండ్‌కు చెందిన వాణిజ్య నౌకపై బుధవారం అర్ధరాత్రి డ్రోన్ దాడి చోటుచేసుకుంది. బాధిత నౌక ఎంవీ గెంకో పికార్డీ నుంచి విపత్తులో ఉన్నామన్న సమాచారం అందుకున్న భారత నావికాదళం సత్వరమే స్పందించింది. హిందూ మహా సముద్రంలోని ఏడెన్ పోర్టుకు 60 నాటికల్ మైళ్ల దూరంలో ఈ ఘటన చోటుచేసుకుంది. నౌకలో 9 మంది భారతీయులు సహా మొత్తం 22 మంది సిబ్బంది ఉన్నారు. వారికి ఎటువంటి ప్రమాదం వాటిల్లలేదని నౌకలో మంటలను వెంటనే ఆర్పి వేసినట్లు అధికారులు తెలిపారు. ఎర్ర సముద్రం, అరేబియా సముద్ర జలాల్లో ఇటీవలి కాలంలో వాణిజ్య నౌకలపై దాడులు జరుగుతున్న విషయం తెలిసిందే. ఎంవీ గెంకో పికార్డీ నుంచి బుధవారం అర్ధరాత్రి 11.11 గంటలకు ప్రమాద సమాచారం అందిన వెంటనే నేవీకి చెందిన యుద్ధనౌక ఐఎన్ఎస్ విశాఖపట్నం వెంటనే పేలుడు పదార్థాలను నిర్వీర్యం చేసే నిపుణుల బృందంతో బయలుదేరింది. 12.30 గంటలకల్లా ఘటనా ప్రాంతానికి చేరుకుంది. నిపుణులు ఎంవీ గెంకో పికార్డీలో క్షుణ్నంగా తనిఖీలు జరిపారు. ఎలాంటి ప్రమాదం లేదని ధ్రువీకరించారు. దీంతో నౌక తన ప్రయాణాన్ని తిరిగి కొనసాగించిందని అధికారులు చెప్పారు. జనవరి 5న అరేబియా సముద్రంలో ఎంవీ లీలా నార్‌ఫోక్ అనే లైబీరియా నౌకను నేవీ సిబ్బంది హైజాకర్ల నుంచి కాపాడారు. డిసెంబర్ 23న ఎర్ర సముద్రంలో భారత్ వైపు చమురుతో వస్తున్న ఎంవీ చెక్ ప్లుటో అనే నౌకపై డ్రోన్ దాడి జరిగిన విషయం తెలిసిందే.

ఫ్లయిట్ అటెండెంట్‌కు ప్రెసిడెంట్ హోదా

జపాన్ ఎయిర్‌లైన్స్ అరుదైన నియామకం



టోక్యో: జపాన్‌కు చెందిన అంతర్జాతీయ విమానయాన సంస్థ 'జపాన్ ఎయిర్ లైన్స్'అరుదైన నిర్ణయం తీసుకుంది. సంస్థలో రెండో అత్యున్నత స్థాయి హోదా అయిన ప్రెసిడెంట్‌గా మాజీ మహిళా ఫ్లయిట్ అటెండెంట్‌ను నియమించింది. ఈమె ఏప్రిల్ ఒకటిన ప్రస్తుత ప్రెసిడెంట్ యూజి అకసావ స్థానంలో బాధ్యతలు చేపడతారు. ప్రస్తుత చైర్మన్ యోషిహరు స్థానంలో అకసావ చేరుతారు. 1985లో ఫ్లయిట్ అటెండెంట్‌గా సంస్థలో కెరీర్‌ను ప్రారంభించిన మిట్సుకో టొట్టోరి 2015లో క్యాబిన్ క్రూ డైరెక్టర్ స్థాయికి ఎదిగారు. తనకు లభించిన ఉద్యోగోన్నతి ఇతర మహిళలు తమ కెరీర్‌లో పైకెదిగేందుకు ప్రోత్సాహంగా నిలుస్తుందని మిట్సుకో చెప్పారు. టోక్యోలోని హనెడా ఎయిర్‌పోర్టులో ఇటీవల జపాన్ ఎయిర్ లైన్స్ విమానం చిన్నపాటి కోస్ట్‌గార్డ్ విమానాన్ని ఢీకొన్న ఘటన నేపథ్యంలో మిట్సుకోను నియమించడం ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రయాణికుల భద్రత, సేవల విభాగంలోనే తన కెరీర్‌లో అత్యధిక భాగం గడిపానని చెప్పారు. ఇకపై కూడా భద్రతకే అధిక ప్రాధాన్యం ఉంటుందని చెప్పారు. ప్రపంచంలోని టాప్–100 విమానయాన సంస్థల్లో ఉన్నత స్థాయి హోదాల్లో కేవలం 12 మంది మహిళా అధికారులు మాత్రమే ఉన్నట్లు ఫ్లయిట్ గ్లోబల్ వెబ్‌సైట్ 2022లో చేపట్టిన సర్వేలో తేలింది.

గుజరాత్‌లో ఘోర ప్రమాదం

- వడోదర శివారులో చెరువులో మునిగిన పడవ
- 14 మంది విద్యార్థులు, ఇద్దరు టీచర్లు మృతి
- మరో నలుగురు గల్లంతు

వడోదర: గుజరాత్‌లోని వడోదర నగర శివారులో గురువారం మధ్యాహ్నం ఘోర ప్రమాదం సంభవించింది. హరిణి చెరువులో పడవ మునిగిపోవడంతో 14 మంది విద్యార్థులు, ఇద్దరు టీచర్లు దుర్మరణం పాలయ్యారు. వారంతా పిక్నిక్‌లో ఉండగా ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ప్రమాద సమయంలో పడవలో మొత్తం 27 మంది ఉన్నారని, వీరిలో 23 మంది విద్యార్థులు, నలుగురు టీచర్లు అని అధికారులు తెలియజేశారు. 16 మంది నీట మునిగి మృత్యువాత పడ్డారని వెల్లడించారు. మిగిలిన వారిలో కొందరిని రక్షించగా, మరికొందరు గల్లంతయ్యారు. వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. చెరువు నుంచి ప్రాణాలతో బయటపడి అస్వస్థతకు గురైన వారిని ఆసుపత్రికి తరలించారు. నీటి అడుగున బురదలో చిక్కుకున్న పడవను బయటకు లాగారు. ఈ పడవలో కేవలం 14 మంది ప్రయాణించడానికి వీలుంది. అయినా 27 మందిని అందులోకి చేరుకున్నారు. బరువు ఎక్కువై చెరువులో మునిగిపోయినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. నలుగురు కనిపించకుండా పోయారని, వారికోసం గాలిస్తున్నామని ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది చెప్పారు. పడవ ప్రమాదంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు సానుభూతి ప్రకటించారు. మృతుల కుటుంబాలకు పీఎంఎన్‌ఆర్‌ఎఫ్ నుంచి రూ.2 లక్షల చొప్పున నష్ట పరిహారం ప్రకటించారు. క్షతగాత్రులకు రూ.50 వేల చొప్పున ఇస్తామని తెలియజేశారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ మోదీ 'ఎక్స్'లో పోస్టు చేశారు.

కేజ్రీవాల్ నాలుగోసారి డుమ్మా

ఈడీ విచారణకు హాజరుకాని ఢిల్లీ సీఎం

న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నాలుగోసారి పంపిన నోటీసులకు సైతం సీఎం కేజ్రీవాల్ స్పందించలేదు. విచారణ నిమిత్తం ఈ నెల 18వన తమ కార్యాలయానికి రావాలంటూ గత వారం ఈడీ ఆయనకు సమన్లు జారీ చేసింది. ఈడీ విచారణకు గైర్హాజరు కావడంపై మీడియా ఎదుట ఆయన స్పందిస్తూ..ఈడీ ఎదుటకు వెళ్లబోనని అన్నారు. 'ఈ కేసులో కేజ్రీవాల్ నిందితుడు కాదు అంటూనే ఈడీ సమన్లు ఎందుకు ఇస్తోంది? అవినీతికి పాల్పడిన నేతలు బీజేపీని ఆశ్రయిస్తే వారిపై కేసులుండవు. మేం ఎలాంటి అవినీతికి ఒడిగట్టలేదు. అందుకే మా నేతలెవరూ బీజేపీ వద్దకు వెళ్లరు'అని కేజ్రీవాల్ అన్నారు. మద్యం విధానం కేసులో పదే పదే సమన్లు ఇవ్వడం రానున్న లోక్‌సభ ఎన్నికల్లో తనను ప్రచారంలో పాల్గొనకుండా చేసే బీజేపీ రాజకీయ కుట్రలో భాగమని ఆరోపించారు.



అస్సాంలోని జోర్హాట్‌లో జరిగిన బహిరంగసభలో మాట్లాడుతున్న రాహుల్

అస్సాం ప్రభుత్వం, సీఎం.. దేశంలోనే అత్యంత అవినీతిమయం

- కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆరోపణ
- అస్సాం మొదలైన భారత్ జోడో న్యాయ్ యాత్ర

శివసాగర్/జోర్హాట్(అస్సాం): భారత్ జోడో న్యాయ్ యాత్రను అస్సాంలో మొదలుపెడుతూనే ఆ రాష్ట్ర బీజేపీ సర్కార్‌పై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ విమర్శలు ఎక్కుపెట్టారు. నాగాలాండ్ బుధవారం ముగిసిన యాత్ర అస్సాంలో గురువారం ఉదయం ప్రారంభమైంది. ఈ సందర్భంగా శివసాగర్ జిల్లాలోని హాలోటింగ్ పట్టణంలో వందలాది మంది పార్టీ కార్యకర్తల సమక్షంలో రాహుల్ మాట్లాడారు. '' దేశంలో అత్యంత అవినీతిమయ ప్రభుత్వం ఉందంటే అది ఈ రాష్ట్ర సర్కారే. అతిపెద్ద అవినీతి సీఎం కూడా ఇక్కడే ఉన్నారు'' అని ఆరోపించారు. జోర్హాట్ జిల్లాలోని దేబెరాపూర్‌లోని వీధి సమావేశంలోనూ రాహుల్ పాల్గొని ప్రసంగించారు. '' అస్సాంలోని బీజేపీ రాష్ట్ర సర్కార్ ఇక్కడి గిరిజనులు, తేయాకు కార్మికులు, స్థానిక తెగలకు అన్యాయం చేస్తోంది. సంపదను కొల్లగొడుతూ విద్వేషాన్ని చిమ్ముతోంది. యాత్ర మొదలైన మణిపూర్‌లో జాతుల మధ్య వైరం కార్చిచ్చులా విస్తరించి నివురుగప్పిన నిప్పులా ఉంది. దానిని చల్లార్చేందుకు కనీసం ఒక్కసారైనా మోదీ మణిపూర్‌కు రాలేదు. ఇక నాగాలాండ్‌లో నాగాల సమస్యను పరిష్కరిస్తామని మోదీ సర్కార్ తొమ్మిదేళ్ల క్రితం ఒప్పందంపై సంతకాలు చేసింది. కానీ అది ఎంత వరకు సఫలమైందనేది మోదీ ఇన్నేళ్లలో ఒక్కసారి కూడా మాట్లాడలేదు'' అని రాహుల్ ఆరోపించారు.

16 ఏళ్ల లోపు వారిని చేర్చుకోవద్దు

కోచింగ్ సెంటర్లకు కేంద్రం నిర్దేశం

న్యూఢిల్లీ: పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ప్రైవేట్ కోచింగ్ సెంటర్లను కట్టడి చేసేందుకు, వాటిని చట్టపరిధిలోకి తెచ్చేందుకు కేంద్ర విద్యాశాఖ మార్గదర్శకాలు ప్రకటించింది. 16 ఏళ్లలోపు విద్యార్థులను కోచింగ్ సెంటర్లలో చేర్చుకోవద్దని, ర్యాంకులు, మంచి మార్కులు గ్యారెంటీ అంటూ తప్పుదోవ పట్టించే ప్రకటనలివ్వరాదని గురువారం జారీ చేసిన మార్గదర్శకాల్లో స్పష్టం చేసింది. కోచింగ్ కేంద్రాల్లో పెరుగుతున్న విద్యార్థుల ఆత్మహత్యలు, అగ్ని ప్రమాదాలు, అసౌకర్యాలు, విద్యాబోధన విధానాలకు సంబంధించిన పలు ఫిర్యాదులు ప్రభుత్వానికి అందుతున్న నేపథ్యంలో వీటిని ప్రకటించింది. 'గ్రాడ్యుయేషన్ కంటే తక్కువ అర్హత కలిగిన వారిని ట్యూటర్లుగా పెట్టుకోరాదు. విద్యార్థులను ఆకర్షించేందుకు మంచి మార్కులు, ర్యాంకు గ్యారెంటీ అంటూ వారి తల్లిదండ్రులకు తప్పుడు హామీలు ఇవ్వకూడదు. 16 ఏళ్ల లోపు వారిని చేర్చుకోరాదు. సెకండరీ స్కూలు పరీక్ష రాసిన వారిని మాత్రమే తీసుకోవాలి'అని తెలిపింది. కోచింగ్ నాణ్యత, వారికి కల్పించే సౌకర్యాలు, సాధించిన ఫలితాల గురించి ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ తప్పుదోవ పట్టించే ఎలాంటి ప్రకటనలను కోచింగ్ సంస్థలు ఇవ్వరాదని స్పష్టం చేసింది. మానసిక ఒత్తిడికి గురయ్యే వారికి తక్షణమే అవసరమైన సాయం అందించే యంత్రాంగం ఉండాలి. సైకాలజిస్టులు, కౌన్సిలర్ల పేర్లను విద్యార్థులు, తల్లిదండ్రులకు అందజేయాలని కేంద్ర విద్యాశాఖ ఆ మార్గదర్శకాల్లో వివరించింది.



తెలంగాణ స్టేజీ-2పై ఆశలు

రామగుండం ఎన్టీపీసీ తెలంగాణ విద్యుత్తు ప్రాజెక్టు స్టేజీ-1 పూర్తి చేసుకొని, సూపర్ థర్మల్ ప్రాజెక్టు స్టేజీ-2లో 3X800-2400 మెగావాట్ల ప్రాజెక్టు నిర్మాణం చేపట్టనుంది. - 10లో▸



రాజన్నకు కోడెమొక్కులు

వేములవాడఅర్బన్: రాజన్న ఆలయంలో గురువారం భక్తుల రద్దీ నెలకొంది. సమ్మక్క -సారలమ్మ జాతర సమీపిస్తుండడంతో కోడె మొక్కులు చెల్లించుకున్నారు.

గరిష్ఠం/కనిష్ఠం
32.0/20.0

వాతావరణం

ఆకాశం అప్పుడప్పుడు మేఘావృతమవుతూ ఉంటుంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

జిల్లాలో శిశు మరణాలు అరికట్టాలి

- డీఎంహెచ్‌వో డాక్టర్ లలితాదేవి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో లలితాదేవి

కరీంనగర్‌టౌన్: జిల్లాలో శిశు మరణాలను అరికట్టడానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని డీఎంహెచ్‌వో డాక్టర్ లలితాదేవి అన్నారు. గురువారం తన కార్యాలయంలో సీడీఆర్ కమిటీ సభ్యులతో పిల్లల మరణాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. పిల్లల ఆరోగ్యం మెరుగుపరచడానికి పౌష్టికాహారం తీసుకునేలా చూడాలన్నారు. వ్యాధి నిరోధక టీకాలు, విటమిన్-ఏ ద్రావణం సకాలంలో ఇప్పించడం వల్ల చిన్నారుల్లో ఆరోగ్యాన్ని పెంపొందించవచ్చని పేర్కొన్నారు. తద్వారా శిశు మరణాలను తగ్గించవచ్చని తెలిపారు. సమావేశంలో డీఐవో డాక్టర్ సాజీదా అతహరి, అదనపు డీఎంహెచ్‌వోలు డాక్టర్ సుజాత, డాక్టర్ జువేరియా, వైద్యులు శంతన్, వేణు, దీప, సరస్వతి, సనా జవేరియా తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ డబ్బులు అడుగుతున్నడు

- లేకపోతే భూమి రిజిస్ట్రేషన్ చేయాలట
- సీపీని కలిసి గోడు వెల్లబోసుకున్న బాధితుడు
- విచారణకు ఆదేశించిన కమిషనర్!

కరీంనగర్ క్రైం: ఓ కార్పొరేటర్ తనను భూమి విషయంలో ఇబ్బందులకు గురిచేస్తున్నడని, డబ్బులు అడుగుతూ వేధిస్తున్నడని సీతారాంపూర్‌కు చెందిన ఓ వ్యక్తి ఆరోపించాడు. గురువారం కరీంనగర్ సీపీ అభిషేక్ మహంతిని కలిసి తన గోడు వెల్లబోసుకొని, ఫిర్యాదు చేశాడు. బాధితుడి వివరాల ప్రకారం.. సీతారాంపూర్ సూర్యనగర్‌కు చెందిన తాటిపల్లి లింగారెడ్డికి సీతారాంపూర్ శివారులో భూమి ఉంది. స్థానిక కార్పొరేటర్ రూ.40 లక్షలు ఇవ్వాలని, లేనిపక్షంలో ఆ భూమిలో రోడ్డు వేయిస్తానని బెదిరించాడు. డబ్బులు ఇవ్వకపోతే మూడు గుంటల భూమిని తన పేరిట రిజిస్ట్రేషన్ చేయాలని భయభ్రాంతులకు గురిచేశాడు. అంతటితో ఆగకుండా మూడు గుంటల భూమిలో రోడ్డు వేశాడు. పర్మిషన్ రాకుండా చేస్తానని బెదిరిస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నాడు. స్పందించిన సీపీ దీనిపై విచారణ జరపాలని అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. వారు సాయంత్రం భూమికి సంబంధించిన దస్తావేజులు, ఆధారాలు తీసుకురావాలని బాధితుడికి సూచించినట్లు సమాచారం.

సంతకాలు ఫోర్జరీ చేశాడని మరొకరిపై..

సంతకాలు ఫోర్జరీ చేసి, తప్పుడు పత్రాలతో భూమి రిజిస్ట్రేషన్ చేయించిన న్యాయవాదిపై చర్యలు తీసుకోవాలని ఓ వ్యక్తి గురువారం సీపీ అభిషేక్ మహంతికి ఫిర్యాదు చేశాడు. వివరాల్లోకి వెళ్తే.. కరీంనగర్ రూరల్ మండలంలోని గుంటూరుపల్లికి చెందిన మహమ్మద్ రఫీకి సంబంధించి మొగ్దుంపూర్ శివారులోని భూమి విషయంలో న్యాయవాది మీర్జా అజ్మత్ అలీ బేగ్ అధికారుల సంతకాలు ఫోర్జరీ చేశాడు. తప్పుడు సర్టిఫికెట్లతో భూమి రిజిస్ట్రేషన్ చేయించి ఇచ్చాడు. ఆయన మోసం చేశాడని, చర్యలు తీసుకోవాలని బాధితుడు సీపీకి విన్నవించాడు.

పత్తి ధర రూ.6,700



జమ్మికుంట: స్థానిక వ్యవసాయ పత్తి మార్కెట్‌లో క్వింటాల్ పత్తి ధర గరిష్ఠంగా రూ.6,700 పలికింది. గురువారం మార్కెట్‌కు 52 వాహనాల్లో 534 క్వింటాళ్ల పత్తిని రైతులు అమ్మకానికి తీసుకువచ్చారు. మోడల్ ధర రూ.6,500, కనిష్ఠ ధర రూ.6,150లకు వ్యాపారులు కొనుగోలు చేశారు.

పాత బస్సుల్లో ప్రయాణమెలా?

- 15 లక్షల కి.మీ. పైబడి తిరిగినవే అందుబాటులో..
- కరీంనగర్ రీజియన్‌లో 861 బస్సులు
- 186 మందే మెకానిక్‌లు
- గత నెలలో ఎల్కతుర్తిలో ఊడిన పల్లె వెలుగు బస్సు టైర్లు
- 'ఆర్టీసీ' ప్రయాణంపై ప్రజల్లో ఆందోళన



కరీంనగర్ బస్టాండ్‌లో బస్సులు

'గత డిసెంబర్ చివరి వారంలో కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారి మధ్యలో ఉన్న ఎల్కతుర్తి సమీపంలో ఆర్టీసీ పల్లె వెలుగు బస్సు టైర్లు ఊడిపోయాయి. ప్రయాణికులు చిన్నపాటి గాయాలతో బయటపడ్డారు. దీనిపై టీఎస్ ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఒక ప్రకటన విడుదల చేస్తూ.. ప్రయాణికులను గమ్యం చేర్చే విషయంలో నిర్లక్ష్యం వద్దని, ఆర్టీసీ, అద్దె బస్సులను పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. మెకానిక్‌లతో రోజువారీగా తనిఖీలు నిర్వహించి, బస్సుల కండీషన్‌పై నిఘా పెంచాలన్నారు. కానీ, క్షేత్రస్థాయిలో అవే పాత బస్సులు, అరకొర సిబ్బంది(మెకానిక్‌లు)తో నెట్టుకొస్తున్నారు. నిత్యం ఆర్టీసీ బస్సుల్లో తిరిగే సామాన్య ప్రజానీకం బస్సుల కండీషన్‌పై అనుమానం వ్యక్తం చేస్తున్నారు.'

కరీంనగర్: ఆర్టీసీలో కాలం చెల్లిన బస్సులను నడుపుతుండటంతో ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కరీంనగర్ రీజియన్ పరిధిలో 11 డిపోలు ఉన్నాయి. కరీంనగర్-1, 2, గోదావరిఖని, హుస్నాబాద్, హుజూరాబాద్, మంథని, జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, సిరిసిల్ల, వేములవాడ డిపోల్లో 524 ఆర్టీసీ, 337 అద్దె బస్సులు మొత్తంగా 861 నడుస్తున్నాయి. వీటిలో గ్రామీణ ప్రాంతాలకు నడిచే పల్లె వెలుగు బస్సులే 230. ఇన్ని వాహనాలకు కేవలం 186 మంది మెకానిక్‌లు పని చేస్తున్నారు. ఈ బస్సులు రీజియన్ పరిధిలో ప్రతీరోజు 3.50 లక్షల కిలోమీటర్లు తిరిగి, ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చుతూ రూ.కోటి నుంచి రూ.1.20 కోట్ల వరకు ఆదాయాన్ని ఆర్టీసీకి సమకూర్చుతున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గత నాలుగేళ్లుగా కొత్త బస్సులను డిపోలకు కేటాయించలేదు. ఉన్నవి 15 లక్షల కిలోమీటర్లు పైబడి తిరిగినవే కావడంతో వాటిని నడిపేందుకు డ్రైవర్లు నిత్యం సాహసమే చేస్తున్నారని చెప్పవచ్చు. బస్సులు కండీషన్‌లో లేకపోవడం వల్ల ప్రాణాలు అరచేతిలో పెట్టుకోని నడపాల్సి వస్తోందని వాపోతున్నారు. లోకల్ బస్సులతోపాటు దూరప్రాంతాలకు వెళ్లే అన్ని రకాల సర్వీసులు ప్రయాణానికి ఏ మాత్రం అనుకూలంగా లేవని, నష్టాల ఊబిలో చిక్కుకున్న ఆర్టీసీని కాపాడుకోవాలని టార్గెట్లు పెట్టడమే తప్ప తమ బాగోగులు చూడటం లేదని డ్రైవర్లు, కండక్టర్లు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వీటిలో అధికంగా సూపర్ లగ్జరీ, రాజధాని, ఎక్స్‌ప్రెస్, మినీ బస్సులు ఉన్నాయి. ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకొని, కాలం చెల్లిన బస్సులను సైతం నడుపుతున్నారన్న ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలోని బస్సుల మరమ్మతులు, నిర్వహణపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

నాలుగు బృందాలుగా మెకానిక్‌లు..

బస్సుల మరమ్మతుల కోసం మెకానిక్‌లను నాలుగు బృందాలుగా ఏర్పాటు చేశారు. మొదటి బృందంలో ఎక్కువ మంది ఉండి, ప్రతీ బస్సును నిత్యం పరిశీలిస్తారు. రెండో బృందం బస్సు ట్రిప్పునకు వెళ్లి వచ్చిన ప్రతీసారి బస్సు మొత్తం తనిఖీ చేస్తుంది. మూడో బృందం ప్రతీ బస్సును వారానికోసారి పరిశీలించి, గ్రీజింగ్ చేసి, ఫిల్టర్లు శుభ్రం చేస్తుంది. ఇక నాలుగో బృందం నెలకోసారి బస్సుల టైర్లు, గేర్‌బాక్స్‌లను పరిశీలిస్తుంది. ఇంజిన్ ఆయిల్, ఫిల్టర్లను మార్చుతుంది. డ్రైవర్లు సూచించిన సమస్యలనూ ప్రత్యేకంగా పరిష్కరిస్తుంది.

నూతన నియామకాల్లేవ్..

సాధారణంగా డిపోలో 100 బస్సులుంటే 32 మంది మెకానిక్‌లు, ఒక్కో మెకానిక్‌కు ఒక సహాయకుడు ఉండాలి. కొన్నేళ్లుగా ఆర్టీసీలో నూతన నియామకాలు చేపట్టకపోవడంతో మెకానిక్‌ల సంఖ్య తగ్గింది. అయితే, బస్సుల సంఖ్య సైతం తగ్గినందున సరిపడా మెకానిక్‌లు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. కొన్ని డిపోల్లో సిబ్బంది తక్కువగా ఉండటంతో ఔట్‌సోర్సింగ్ ద్వారా నియమించారు. మెకానిక్‌లకు సరిపడా సహాయకులు అందుబాటులో లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. అప్రెంటిస్‌లను నియమిస్తున్నా సరిపడా వేతనాలు ఇవ్వకపోవడంతో వారు పని చేసేందుకు విముఖత చూపుతున్నారన్న చర్చ జరుగుతోంది.

నిత్యం పరిశీలించాలి..

బస్సును డిపో నుంచి బయటకు తీసే సమయంలో మెకానికల్ ఇంజినీర్ పరిశీలించి, సమస్యలు ఉంటే మెకానిక్‌లచే మరమ్మతులు చేయించాలి. టైర్లు, ఇతరత్రా ముఖ్యమైన విభాగాలను పరిశీలించి, ఊడిపోయేలా ఉన్న నట్లు, బోల్టులను బిగించి, పంపించాలి. ఇదే సమయంలో ఆరోజు విధుల్లో ఉండే డ్రైవర్ తనకు కేటాయించిన బస్సును సరిచూసుకొని, ఏమైనా సమస్యలను సూచిస్తే పరిష్కరించాలి. అనంతరం బస్సు ప్రయాణం పూర్తయిన తర్వాత డిపోలోకి వచ్చే సమయంలో డ్రైవర్లు గుర్తించిన సమస్యలను ప్రత్యేకంగా సూచిస్తారు. వీటిని రాత్రి విధుల్లో ఉండే మెకానిక్‌లు పరిష్కరిస్తారు.

ఏ డిపోలో ఎంతమంది?

గోదావరిఖనిలో 28 మంది, హుస్నాబాద్‌లో 9, హుజూరాబాద్ 17, కరీంనగర్-1 డిపోలో 26, కరీంనగర్-2 డిపోలో 22, మంథనిలో 13, జగిత్యాలలో 22, కోరుట్లలో 15, మెట్‌పల్లిలో 10, సిరిసిల్లలో 12, వేములవాడలో 12 మంది మొత్తంగా 186 మంది మెకానిక్‌లు విధులు నిర్వహిస్తున్నారు. తక్షణమే కొత్త బస్సుల కేటాయింపులతోపాటు సిబ్బందిని నియమించాలని యాజమాన్యాన్ని కోరుతున్నారు.

రాముని అక్షింతలపై రాజకీయం వద్దు



ప్రధాని మోదీ ప్రసంగం వింటున్న ఎంపీ సంజయ్, కలెక్టర్ పమేలా సత్పతి

- ఎంపీ బండి సంజయ్
- పద్మనగర్ శివాలయంలో శుద్ధి

కరీంనగర్ కల్చరల్/చొప్పదండి: దేవుని అక్షింతల్లో రేషన్ బియ్యం, బాస్మతి, జై శ్రీరామ్ అక్షింతలు ఉంటాయా.. రాముని అక్షింతలను రాజకీయం చేయొద్దని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ అన్నారు. గురువారం ఆయన కరీంనగర్‌లోని పద్మనగర్ శివాలయంలో శుద్ధి చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ నెల 22న రామ మందిర పునర్ ప్రతిష్ట కార్యక్రమం కోసం ప్రపంచమంతా ఎదురుచూస్తోందని, ప్రధాని మోదీ, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా పిలుపు మేరకు దేవాలయాల శుద్ధి కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. హిందూ సమాజ సహకారంతో ఈరోజు రామమందిర నిర్మాణం జరిగిందన్నారు. అనేక ధార్మిక కార్యక్రమాలు దేశవ్యాప్తంగా పార్టీలకతీతంగా జరుగుతాయని పేర్కొన్నారు. 22న ప్రతీ ఒక్కరు తమ ఇంటి ఎదుట ఐదు దీపాలను వెలిగించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

మల్లికార్జున్‌రెడ్డిని ఆదర్శంగా తీసుకోవాలి

రైతు మల్లికార్జున్‌రెడ్డి చేస్తున్న ప్రకృతి వ్యవసాయం అందరికీ ఆదర్శమని ఎంపీ సంజయ్ అన్నారు. చొప్పదండి పట్టణంలోని మార్కెట్ యార్డు రోడ్డులో గురువారం నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రకు ఆయన కలెక్టర్ పమేలా సత్పతితో కలిసి హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రధాని నరేంద్ర మోదీ పర్చువల్ విధానంలో రైతు మల్లికార్జున్ రెడ్డితో మాట్లాడటాన్ని వీక్షించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ.. సాఫ్ట్‌వేర్ ఉద్యోగాన్ని వదిలేసి, ప్రకృతి వ్యవసాయం చేస్తూ రెట్టింపు దిగుబడితో లాభాలు పొందడం అభినందనీయమని పేర్కొన్నారు. రసాయన ఎరువులను వాడే రైతులు మల్లికార్జున్ రెడ్డిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఆవు పేడ, మూత్రంతో పంటలు పండిస్తూ పర్యావరణాన్ని కాపాడటం హర్షణీయమని అన్నారు.



ఆలయంలో శుద్ధి చేస్తున్న ఎంపీ సంజయ్

స్టాల్స్ ఏర్పాటు

వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర సందర్భంగా కేంద్ర ప్రభుత్వ పథకాలపై వివిధ శాఖల అధికారులు స్టాల్స్ ఏర్పాటు చేశారు. మినిస్ట్రీ ఆఫ్ హోం అఫైర్స్ డైరెక్టర్ మోహన్ దీక్షిత్ వాటిని పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, వైస్ చైర్‌పర్సన్ ఇప్పనపల్లి విజయలక్ష్మి, ఎంపీపీ చిలుక రవీందర్, ఎల్‌డీఎం ఆంజనేయులు, కౌన్సిలర్ మాదూరి శ్రీనివాస్, జిల్లా అధికారులు సరస్వతి, లలితాదేవి, రవీందర్, శ్రీరాములు, మున్సిపల్ కమిషనర్ శాంతికుమార్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

బల్దియాలో విజిలెన్స్ తనిఖీలు

- రికార్డులు పరిశీలించిన అధికారులు

కరీంనగర్ కార్పొరేషన్: నగరపాలక సంస్థ కార్యాలయంలో విజిలెన్స్ అధికారులు గురువారం తనిఖీలు నిర్వహించారు. ఆఫీస్‌లోని అన్ని విభాగాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టాక, మున్సిపాలిటీల కార్యకలాపాలపై దృష్టిసారించిన విషయం విదితమే. మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థలపై వరుసగా వస్తున్న ఆరోపణలు, ఫిర్యాదుల నేపథ్యంలో విజిలెన్స్ అధికారులకు బాధ్యతలు అప్పగించారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ నుంచి వచ్చిన విజిలెన్స్ ప్రత్యేక బృందం బల్దియా వ్యవహారాలను సమగ్రంగా తనిఖీ చేసింది. నగరపాలక సంస్థ కార్యాలయంలోని రెవెన్యూ, పట్టణ ప్రణాళిక, శానిటేషన్, ఇంజినీరింగ్ తదితర విభాగాలకు సంబంధించిన రికార్డులను తెప్పించుకొని, ఆయా విభాగాల ఇన్‌చార్జీల నుంచి వివరాలు సేకరించారు. నగరపాలక సంస్థకు ఆదాయ మార్గాలు ఏమిటి, వస్తున్న ఆదాయమెంత, చేస్తున్న ఖర్చు ఎంత, పనులు జరుగుతున్న తీరు తదితర అంశాలపై ఆరా తీసినట్లు సమాచారం. ఇదిలా ఉంటే నగరపాలక సంస్థలో విజిలెన్స్ అధికారులు సోదాలు నిర్వహించడం కలకలం సృష్టించింది. కొన్ని రోజులుగా బల్దియాలోని కొంతమంది అధికారుల తీరు, అక్రమాలపై పలువురు వరుసగా ఫిర్యాదులు చేయడం తెలిసిందే. ఇటీవల హౌసింగ్‌బోర్డు కాలనీలో జరిగిన స్మార్ట్‌సిటీ పనులపైనా విజిలెన్స్ అధికారులు విచారణ జరిపి, నాణ్యతను పరిశీలించారు. ఈ క్రమంలో ఈ తనిఖీల వ్యవహారం ప్రాధాన్యం సంతరించుకుంది.

పెండింగ్ కేసులు పరిష్కరించాలి

- సీపీ అభిషేక్ మహంతి



మాట్లాడుతున్న సీపీ అభిషేక్ మహంతి

కరీంనగర్‌క్రైం: పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలని సీపీ అభిషేక్ మహంతి ఆదేశించారు. గురువారం కరీంనగర్ రూరల్ ఏసీపీ కార్యాలయంలో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీస్‌స్టేషన్లలో ఎస్‌హెచ్‌వోలు పిటిషన్ మేనేజ్‌మెంట్ సక్రమంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎటువంటి కేసులైనా నెలల తరబడి పెండింగ్‌లో ఉంచకూడదని, వీలైనంత త్వరగా సాక్ష్యాధారాలను సేకరించి, పూర్తి చేయాలని సూచించారు. నిత్యం నమోదయ్యే క్రిమినల్ కేసులతోపాటు ఆర్థిక నేరాలు, భూతగాదాలు, భూ ఆక్రమణ, రౌడీషీటర్స్‌పై నిఘా, పెండింగ్ వారెంట్‌ల అమలు తదితరాలకు ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో రూరల్ ఏసీపీ కరుణాకర్‌రావు, సీపీఆర్‌బీ ఏసీపీ విజయ్‌కుమార్, ఇన్‌స్పెక్టర్లు గోపతి రవీందర్, రాజ్‌కుమార్, స్వామి, ఎస్సైలు చంద్రశేఖర్, అభిలాష్, ఉపేంద్రచారి, రాజేశ్, చేరాలు, నరసింగరావు పాల్గొన్నారు.

23న జైలులో సరుకుల సరఫరాకు టెండర్లు



జిల్లా కేంద్రంలోని జైలు

కరీంనగర్ క్రైం: జిల్లా జైలులో ఆహార వస్తువులు, వివిధ రకాల సరకులు సరఫరా చేయడానికి టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు జైలు సూపరింటెండెంట్ జి.సమ్మయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 1 నుంచి మార్చి 1, 2025 వరకు ఏడాదిపాటు పప్పుదినుసులు, గోధుమలు, వంటనూనె, టీ పొడి, ఇతర వస్తువులు, స్టీల్ ఫర్నిచర్ తయారు చేసేందుకు ముడి సరుకులు సరఫరా చేయడానికి ఈ నెల 23న టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. టెండర్ షెడ్యూల్‌తోపాటు ఫాంలు గురువారం నుంచి జైలులో అందుబాటులో ఉంచామని తెలిపారు.

కాంగ్రెస్‌లోకి బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు?

- తొమ్మిది మంది రెడీ!
- మంత్రి 'పొన్నం' గ్రీన్‌సిగ్నల్ ఇవ్వగానే చేరికకు ముహూర్తం

కరీంనగర్ కార్పొరేషన్: కరీంనగర్ నగరపాలక సంస్థలో బీఆర్‌ఎస్‌కు గట్టి దెబ్బ తగలనున్నట్లు సమాచారం. ఆ పార్టీకి చెందిన తొమ్మిది మంది కార్పొరేటర్లు కాంగ్రెస్‌లోకి వెళ్లేందుకు సిద్ధమైనట్లు తెలిసింది. వీరిలో ఆరుగురు గురువారం సదాశివపల్లిలోని ఓ ఫాంహౌస్‌లో భేటీ అయ్యారు. మిగతా ముగ్గురు హాజరు కాకపోయినా తాము పార్టీ మారతామని సంకేతాలు ఇచ్చారు. రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అపాయింట్‌మెంట్ కుదరగానే కాంగ్రెస్‌లో చేరాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం.

మరికొందరి దృష్టి కాంగ్రెస్ వైపు!

లోక్‌సభ ఎన్నికల అనంతరం కాంగ్రెస్‌లోకి భారీగా చేరికలు ఉంటాయని ప్రచారం జరుగుతున్నా, ఆలోగానే చేరేందుకు పలువురు కార్పొరేటర్లు సిద్ధమయ్యారు. నగరపాలక సంస్థలో 60 మంది కార్పొరేటర్లకు గాను ప్రస్తుతం బీఆర్‌ఎస్‌కు 44 మంది ఉన్నారు. వీరిలో నుంచి కాంగ్రెస్‌లో చేరే తొమ్మిది మంది జాబితా ఇప్పటికే ఆ పార్టీ పెద్దల వద్దకు చేరిందన్న చర్చ జరుగుతోంది. వీరితోపాటు మరికొందరు కార్పొరేటర్లు కాంగ్రెస్ వైపు దృష్టిసారించినప్పటికీ, స్థానిక పరిస్థితుల దృష్ట్యా వేచిచూసే ధోరణి అవలంబిస్తున్నట్లు బల్దియాలో ప్రచారం సాగుతోంది.

మంత్రి ప్రభాకర్‌గౌడ్‌తో టచ్‌లో..

మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ గ్రీన్‌సిగ్నల్ ఇవ్వగానే చేరికల కార్యక్రమానికి ముహూర్తం కుదరనుంది. ఇప్పటికే పలువురు కార్పొరేటర్లు ఆయనతో టచ్‌లో ఉండగా, ప్రస్తుతానికి తొమ్మిది మంది పార్టీ మారేందుకు సిద్ధమైనట్లు తెలిసింది. ఈ సంఖ్య భవిష్యత్‌లో మరింత పెరిగే అవకాశం ఉంది.

ఏం జరుగుతోంది?

– మేయర్ సునీల్‌రావు ఆరా

కొంతమంది బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు కాంగ్రెస్ వైపు చూస్తున్నారన్న చర్చ జరుగుతున్న నేపథ్యంలో మేయర్ యాదగిరి సునీల్‌రావు ఈ వ్యవహారంపై దృష్టి పెట్టారు. గురువారం తన చాంబర్‌లో పలువురు కార్పొరేటర్లతో చర్చించారు. ఏం జరుగుతోంది.. ఎందుకు పార్టీని వీడాలనుకుంటున్నారని ఆరా తీశారు. తొందర పడకండి.. భవిష్యత్ ఉంటుందని నచ్చజెప్పే ప్రయత్నం చేసినట్లు సమాచారం. శుక్రవారం కార్పొరేటర్లకు ఓ హోటల్‌లో గెట్ టు గెదర్ ఏర్పాటు చేయడం ఆసక్తి రేపుతోంది.

మైనార్టీ గురుకులాల్లో ప్రవేశాలు

- 5, 6, 7, 8వ తరగతుల్లో చేరేందుకు అవకాశం
- 9 కళాశాలల్లో అందుబాటులో 160 సీట్లు
- మొదలైన దరఖాస్తుల ప్రక్రియ
- ఫిబ్రవరి 6వ తేదీ వరకు గడువు



కరీంనగర్ రూరల్ మైనార్టీ కళాశాల

కరీంనగర్: రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యనందించాలన్న లక్ష్యంతో మైనార్టీ గురుకులాలను ప్రారంభించింది. ఉచిత విద్యతోపాటు వసతి కల్పించి విద్యార్థినీ విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దుతున్న ఈ విద్యాలయాల్లో ప్రవేశాలకు గురువారం నోటిఫికేషన్ విడుదలైంది. ఫిబ్రవరి 6వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉంది.

జిల్లాలో 9 పాఠశాలలు, 9 కళాశాలలు..

మైనార్టీ గురుకులాల్లో 5వ తరగతిలో మొత్తం సీట్లకు, 6, 7, 8వ తరగతుల్లో మిగిలిపోయిన సీట్లను భర్తీ చేయనున్నారు. కరీంనగర్ జిల్లాలో 9 పాఠశాలలు ఉండగా వీటిలో 5 బాలుర, 4 బాలికలవి. 5వ తరగతిలో ఒక్కో పాఠశాలలో 40 సీట్ల చొప్పున మొత్తం 360 సీట్లను భర్తీ చేస్తారు. మిగిలిన తరగతుల్లో ఖాళీలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటారు. అలాగే, జిల్లాలో 9 కళాశాలలు ఉండగా ఎంపీసీ, బైపీసీ, హెచ్‌ఈసీ, ఎంఈసీ, సీఈసీ, ఒకేషనల్(మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్, ఎలక్ట్రికల్ టెక్నీషియన్) కోర్సుల్లో 160 సీట్లు ఉన్నాయి.

ఆన్‌లైన్‌లో దరఖాస్తులు..

విద్యార్థులు tmreistelangana.cgg.gov.in లో ఉచితంగా దరఖాస్తు చేసుకోవచ్చు. మైనార్టీలకు(ముస్లింలు, క్రిస్టియన్లు, పార్శీలు, జైనులు, సిక్కులు, బుద్ధులు) 75 శాతం, ఇతరులకు 25 శాతం సీట్లు కేటాయించారు. వెబ్‌సైట్‌లో చూపినట్లు వివరాలు పొందుపరచాలి. గ్రామీణ ప్రాంత విద్యార్థుల తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.1.5 లక్షలు, పట్టణ ప్రాంతాల వారి వార్షికాదాయం రూ.2 లక్షల లోపు ఉన్నవారే అర్హులు.

చదువుతోపాటు క్రీడలు

మైనార్టీ గురుకులాల్లో ప్రవేశం పొందిన విద్యార్థులను చదువుతోపాటు క్రీడల్లో రాణించేలా తీర్చిదిద్దుతారు. ఇప్పటికే పలువురు రాష్ట్ర, జాతీయస్థాయిలో పతకాలు సాధిస్తున్నారు. ఏటా నిర్వహించే వైజ్ఞానిక ప్రదర్శనల్లోనూ ప్రత్యేకత చాటుకుంటున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



ప్రతీ విద్యార్థి చదవాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీ గురుకులాలను ప్రారంభించింది. ఇక్కడ ఒక్కో విద్యార్థిపై రూ.లక్షలు వెచ్చిస్తున్నాం. నాణ్యమైన భోజనం అందించడంతోపాటు అర్హత గల అధ్యాపకులతో విద్యాబోధన చేస్తున్నాం. కరీంనగర్ జిల్లాలోని పేద విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. మరిన్ని వివరాలకు మైనార్టీ గురుకులాల్లో ప్రిన్సిపాళ్లను సంప్రదించాలి. 82475 06232, 91600 48786 నంబర్లకు ఫోన్ కూడా చేయొచ్చు.

– టి.పవన్‌కుమార్, జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి

పార్కింగ్ వద్దంటే వినరే..





కరీంనగర్ ఆర్టీసీ బస్టాండ్ ఇన్‌గేట్ వద్ద టూవీలర్, ఆటోల పార్కింగ్‌తో బస్సులు లోనికి వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఆర్టీసీ అధికారులు పార్కింగ్ చేయొద్దని బోర్డు ఏర్పాటు చేసినప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదు. పార్శిల్ సర్వీస్ కోసం, ప్రయాణికులను దింపడం కోసం వచ్చే వారు తమ వాహనాలను అక్కడే పార్కింగ్ చేస్తుండటంతో బస్సులు లోనికి వెళ్లడం ఇబ్బందికరంగా మారుతోంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో ప్రతిభ


ఉమ్మడి జిల్లా బాలికల జట్టు

కరీంనగర్ స్పోర్ట్స్: నిజామాబాద్ జిల్లాలోని ఆర్మూర్‌లో ఈ నెల 16 నుంచి 18 వరకు జరిగిన 67వ రాష్ట్రస్థాయి పాఠశాలల అండర్-14 సాఫ్ట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి జిల్లా బాలికల జట్టు ప్రతిభ కనబరిచి, తృతీయ స్థానంలో నిలిచింది. కోచ్, మేనేజర్‌గా రాకేశ్, మహేశ్, పోటీల పరిశీలకుడిగా కరీంనగర్ జిల్లాలోని వేగురుపల్లి జెడ్పీ హైస్కూల్ పీఈటీ ఎండీ.యూనిస్ పాషా వ్యవహరించారు. ఈ సందర్భంగా వారు బాలికల జట్టును అభినందించారు.

మార్షల్ ఆర్ట్స్ సౌత్ జోన్ పోటీలకు ఎంపిక


ఎంపికైన విద్యార్థినులతో కోచ్ వినోద్

కోనరావుపేట(వేములవాడ): తమిళనాడులో ఈనెల 18 నుంచి 21 వరకు జరిగే సౌత్ జోన్ ఖేలో ఇండియా వుషూ ఉమెన్స్ లీగ్ పోటీలకు రాజన్నసిరిసిల్ల జిల్లా నుంచి ఇద్దరు క్రీడాకారులు ఎంపికైనట్లు కిక్‌బాక్సింగ్ జిల్లా అధ్యక్షుడు అక్కెనపల్లి వినోద్ తెలిపారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తమిళనాడు ఆధ్వర్యంలో జూనియర్, సీనియర్ విభాగాల్లో 46 మంది క్రీడాకారులు పాల్గొననున్నారు. కోనరావుపేట మండలం ఎగ్లాస్‌పూర్‌కు చెందిన పసుల జెస్సికా(39 కేజీల విభాగం), నూకల సుదీప్తి(33 కేజీల విభాగం) ఎంపికైనట్లు వివరించారు. వీరిని కరాటే ఇన్‌స్ట్రక్టర్ ఎం.ప్రియాంక, రోహిత్ అభినందించారు.

ఖాతా నుంచి డబ్బు మాయం

జ్యోతినగర్(రామగుండం): డబ్బులు రెట్టింపు వస్తాయని ఆశపడి టెలిగ్రాంలో వచ్చిన టాస్క్ మేరకు లింక్ ఓపెన్ చేసి కాంపిటీషన్‌లో పాల్గొని డబ్బు పంపితే తన ఖాతాలోని రూ.1,53,000 పోగొట్టుకున్న ఘటనపై ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఆర్ఎఫ్‌సీఎల్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ టౌన్‌షిప్‌లో నివసిస్తున్న ఆష్రఫ్ అలీకి ఈనెల 15న టెలీగ్రాంలో సందేశం వచ్చింది. లింక్ ఓపెన్ చేసి కాంపిటీషన్‌లో పాల్గొనగా డబ్బులు పోయాయని ఎన్టీపీసీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సైబర్ క్రైమ్ కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కోడిపందేల స్థావరంపై పోలీసుల దాడి


పట్టుబడిన నిందితులు

మల్లాపూర్: మండలంలోని ముత్యంపేట శివారు నిజాం షుగర్ ఫ్యాక్టరీ సమీపంలో కోడి పందేలు నిర్వహిస్తున్నారన్న సమాచారం మేరకు దాడులు చేసి ఐదుగురు నిందితులను పట్టుకున్నట్లు సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు. నిందితుల నుంచి మూడు పందెం కోళ్లు, రూ.4,500 స్వాధీనం చేసుకున్నామని ఎస్సై నవీన్‌కుమార్ పేర్కొన్నారు.

మిడ్ మా‘నీటి’పైనే ఆశలు

- గేట్లు ఎత్తితేనే పంటలసాగు
- ప్రాజెక్టు కింది గ్రామాల రైతుల ఆవేదన
- మానేరువాగులో చెక్‌డ్యాంలు నిర్మించాలి డిమాండ్
- ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు వినతి
- గతంలో అధికారుల సర్వే


మిడ్‌మానేరు ప్రాజెక్టు డౌన్‌స్ట్రీమ్‌లో మానేరు వాగు పరిసరాలు


గతంలో చెక్ డ్యాం కోసం మానేరు వాగు చూస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు (ఫైల్)

బోయినపల్లి(చొప్పదండి): మిడ్‌మానేరు ప్రాజెక్టు లోతట్టు ప్రాంతంలోని గ్రామాల రైతులు సాగు నీటికి కోసం తండ్లాడుతున్నారు. ప్రాజెక్టు గేట్లు ఎత్తితేనే తమ పంటలను కాపాడుకోగలమని.. లేదంటే బీళ్లుగా మారుతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా మానేరువాగులో చెక్‌డ్యామ్‌లు నిర్మిస్తే భవిష్యత్‌లో భూగర్భజలాలు పెరిగి నీటి కరువు ఉండదని.. ఈమేరకు ఇటీవల చొప్పదండి ఎమ్మెల్యే మేడిపెల్లి సత్యంకు వినతిపత్రం అందించారు. గతంలోనే అధికారులు సర్వే చేశారు.

27.5 టీఎంసీల సామర్థ్యంతో..

రాజన్నసిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం మాన్వాడ వద్ద 27.5 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో శ్రీరాజరాజేశ్వర(మిడ్‌మానేరు) ప్రాజెక్టును నిర్మించారు. ప్రాజెక్టు కింది గ్రామాలైన బోయినపల్లి మండలంలోని మాన్వాడ, మల్లాపూర్, కొత్తపేట, ఇల్లంతకుంట మండలం కందికట్కూర్, పాత్తూర్ గ్రామాల రైతులు వానాకాలం, యాసంగి సీజన్లలో సుమారు 1500 ఎకరాల్లో పంటలు సాగుచేస్తారు. బావులు, బోరుబావుల ఆధారంగా పంటలు సాగుచేస్తారు. కొందరు రైతులు మానేరువాగులోని నీటిని పైపులైన్ల ద్వారా తరలించి పంటలు సాగుచేస్తారు.

గేట్లు ఎత్తితేనే నీరు.. లేదంటే కన్నీరు

మిడ్‌మానేరు ప్రాజెక్టు నిర్మించకముందు ఈ ప్రాంతం అంతా మానేరువాగు పారేది. దీంతో రైతులు వాగులో మోటార్లు పెట్టుకుని పైపులైన్లు వేసుకుని పంటలు సాగుచేసేవారు. మిడ్‌మానేరు ప్రాజెక్టు నిర్మించి గేట్లు ఏర్పాటు చేశాక పై నుంచి వచ్చే వరదనీరు, మానేరు నీరు ప్రాజెక్టులోనే నిల్వ ఉంటోంది. మిడ్‌మానేరు ప్రాజెక్టు గేట్లు ఎత్తి దిగువ ఉన్న ఎల్‌ఎండీలోకి నీరు విడుదల చేసిన క్రమంలో మాత్రమే కింద మానేరువాగులో నీరు ఉంటోంది. అలా నీరు విడుదల చేసిన సమయంలోనే దిగువన ఉన్న రైతుల బోరుబావులు, బావులలో నీటి ఊటలు ఉంటున్నాయి. వానాకాలంలో పంటలకు ఇబ్బంది లేకున్నప్పటికీ, యాసంగి పంటలకు సాగునీరు భారంగా మారింది. చివరి తడులకు నీరందక పంటలు ఎండిపోయిన సందర్భాలు ఉన్నాయి.

తెరపైకి చెక్‌డ్యాంల డిమాండ్

మిడ్‌మానేరు ప్రాజెక్టు దిగువన మానేరువాగు పరిసరాల్లో చెక్‌డ్యామ్‌లు నిర్మిస్తే సాగునీటి ఇబ్బంది తీరుతుందని పలు గ్రామాల రైతులు పేర్కొంటున్నారు. ఈమేరకు చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి చొరవ చూపాలని ఇటీవల మల్లాపూర్, పాత్తూర్, కందికట్కూర్ గ్రామాల రైతులు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను కలిసి విన్నవించారు. గేట్లు ఎత్తి నీరు విడుదల చేసినప్పుడు చెక్‌డ్యామ్‌లలో నీరు నింపి నిల్వ చేస్తే పంటలకు నీరు అందుతుందని రైతులు చెబుతున్నారు. అయితే మానేరువాగులో చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి డిజైన్ల కోసం రెండేళ్ల క్రితం మిడ్‌మానేరు ఇంజినీరింగ్ అధికారులు జలవనరులశాఖ దృష్టికి తీసుకెళ్లారు. డ్రాయింగ్ కోసం వివరాలు కోరినట్లు తెలిసింది.

సాగు నీటికి ఇబ్బంది



పై ప్రాంతంలో మిడ్‌మానేరు ప్రాజెక్టు ఉన్నప్పటికీ యాసంగి పంటలకు నీరందక గోస పడుతున్నాం. నాకు నాలుగెకరాల మేర భూమి ఉంది. వాగులో బోరు ఆధారంగా పైపులైన్ వేసి పంటలకు నీరు అందిస్తున్నాను. అయితే వానాకాలం ఏదోలా నడుస్తోంది. యాసంగి పంటలకు ఇప్పుడే నీరు అందడం కష్టంగా ఉంది.

– ఐల పర్శరాములు, మల్లాపూర్

చెక్‌డ్యాంలు నిర్మించాలి



నాకు వాగు దగ్గర ఎకరం భూమి ఉంది. గేట్లు ఎత్తినప్పుడు వాగులో నీరు ఉంటుంది. వేసుకున్న పైపులైన్ ద్వారా పంటలకు నీరు అందిస్తాను. ప్రాజెక్టు నిర్మించకముందు గతంలో మానేరువాగు ఉన్నప్పుడు వాగులో నీరు సంవృద్ధిగా ఉండేది. ఇప్పుడు పంటలకు నీరందడం లేదు. మానేరు వాగులో చెక్‌డ్యాంలు నిర్మించాలి.

– దాసరి అంజయ్య, మల్లాపూర్

పంటలకు నీరందిస్తున్నాం



అధికారుల ఆదేశాలతో పంటలకు సాగునీరు అందిస్తున్నాం. కొన్ని చోట్ల డిస్ట్రిబ్యూటరీ కాల్వ నిర్మాణం పూర్తి కాలేదు. డీ–1 డిస్ట్రిబ్యూటరీ కాల్వ పూర్తయితే దిగువ గ్రామాల పొలాలకు సాగునీరు అందే అవకాశం ఉంది. బ్యాలెన్స్ ఏదైనా ఉంటే సరైన ఆలోచన చేయడం జరుగుతుంది. రైతులకు సాగునీటికి ఇబ్బందులు లేకుండా ప్రయత్నిస్తాం.

– జగన్, ఈఈ, మిడ్‌మానేరు

రోడ్డు ప్రమాదంలో రైతు దుర్మరణం

- మోపెడ్‌ను ఢీకొన్న కొరియర్ వాహనం
- చిగురుమామిడి మండలం బొమ్మనపల్లిలో ఘటన


కొంరుమల్లు (ఫైల్)


మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబసభ్యులు

చిగురుమామిడి(హుస్నాబాద్): రోడ్డు ప్రమాదంలో ఓ రైతు మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. చిగురుమామిడి మండలంలోని బొమ్మనపల్లికి చెందిన మేడుదుల కొంరుమల్లు(62) గురువారం ఉదయం 7.30 గంటలకు తన వ్యవసాయ బావి వద్దకు మోపెడ్‌పై వెళ్లి, తిరిగి వస్తున్నాడు. అదే సమయంలో వరంగల్ జిల్లాకు చెందిన ఫ్లిప్‌కార్ట్ కొరియర్ సర్వీసు హుస్నాబాద్ నుంచి హుజూరాబాద్ వైపు వెళ్తోంది. డ్రైవర్ అజాగ్రత్త, అతివేగం కారణంగా బొమ్మనపల్లి శివారులో కొంరుమల్లు వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు, బంధువులు సంఘటన స్థలానికి చేరుకొని, కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుడికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె కాగా, అందరికీ వివాహాలయ్యాయి. చిగురుమామిడి ఎస్సై రాజేశ్ మృతదేహాన్ని పరిశీలించారు. మృతుని భార్య కొంరవ్వ ఫిర్యాదు మేరకు కొరియర్ వాహన డ్రైవర్‌పై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆడుకుంటూ వెళ్లి శవమై..

- కేజీవీల్స్ కింద పడి బాలుడి దుర్మరణం
- పరారీలో ట్రాక్టర్ డ్రైవర్


జీవన్ (ఫైల్)

సారంగాపూర్: అప్పటిదాకా తల్లిదండ్రులతో కలిసి పొలం పనుల్లో సహాయపడ్డాడు. ఆనందంగా ఇంటికి చేరాడు. ఇప్పుడే వస్తానమ్మా.. అంటూ సైకిల్ తొక్కుకుంటూ వెళ్లిన క్షణాల్లోనే శవమై కనిపించాడు. ఈ సంఘటన బీర్‌పూర్ మండలం చిత్రవేణిగూడెంలో విషాదం నింపింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన చిత్రం రవి, పార్వతి దంపతులకు ముగ్గురు కుమారులు సంతానం. రెండో కుమారుడు జీవన్ స్థానిక గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. గురువారం పాఠశాలకు వెళ్లకుండా తల్లిదండ్రులతో కలిసి పొలం పనులకు వెళ్లాడు. సాయంత్రం వారితో కలిసే ఇంటికి చేరాడు. ఇప్పుడే వస్తాను అంటూ సైకిల్ తొక్కుకుంటూ రోడ్డుపై వెళ్తుండగా.. కొద్దిదూరంలోనే ఎదురుగా వస్తున్న కేజీవీల్స్ ట్రాక్టర్ డ్రైవర్ అతివేగంగా వచ్చి జీవన్‌ను ఢీకొట్టాడు. ఈ ఘటనలో బాలుడు అక్కడికక్కడే మృతిచెందాడు. అప్పటిదాకా తమతో కలిసిమెలిసి ఆనందంగా ఉన్న కొడుకు కళ్లముందే చనిపోవడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. ట్రాక్టర్‌ను గ్రామానికి చెందిన మెస్రం సురేందర్‌దిగా గుర్తించారు. బాలుడి తండ్రి రవి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై గజేంద్ర తెలిపారు.

యాక్సిడెంట్ కేసులో రెండేళ్ల జైలు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతికి కారణమైన లారీ డ్రైవర్‌కు గురువారం సిరిసిల్ల ప్రథమ శ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ రెండేళ్ల జైలుతోపాటు రూ.14,500 జరిమానా విధించారు. 2016లో తంగళ్లపల్లి మండల కేంద్రంలో ఆటోను లారీ ఢీకొట్టిన ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న శిరవేణి పరమేశ్, జంబయ్య, లింగాల ప్రభాకర్ తీవ్రంగా గాయపడి మరణించారు. ఆటో డ్రైవర్ మహ్మద్ కరీంఖాన్ ఫిర్యాదుతో కేసు నమోదు చేయగా లారీ డ్రైవర్ మిర్యాల్‌కార్ సంతోష్‌ను అరెస్టు చేశారు. న్యాయమూర్తి పైవిధంగా తీర్పు ఇచ్చినట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు.

దాడి కేసులో మూడేళ్లు..

సిరిసిల్లక్రైం: అప్పుగా ఇచ్చిన సొమ్మును తిరిగివ్వాలని అడిగిన వ్యక్తిపై దాడి చేసిన వ్యక్తికి మూడేళ్ల జైలుతోపాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ సిరిసిల్ల న్యాయమూర్తి ప్రవీణ్ గురువారం తీర్పు నిచ్చారు. పోలీసులు తెలిపిన వివరాలు. కోనరావుపేటకు చెందిన రాస నారాయణరెడ్డి 2016 జూన్‌లో అదే గ్రామానికి చెందిన చల్ల రాజిరెడ్డికి రూ.5వేలు అప్పుగా ఇచ్చాడు. వీటిని చెల్లించాలని అప్పు తీసుకున్న వ్యక్తి పలుమార్లు అడిగినా రేపు, మాపంటూ జాప్యం చేశాడు. దీంతో నారాయణరెడ్డి ఆగస్టు 2016లో చల్ల రాజిరెడ్డి వద్దకు వెళ్లి అడగ్గా నెట్టివేశాడు. నారాయణరెడ్డి మోచేతికి, కుడితుంటికి గాయమైంది. దీంతో నారాయణరెడ్డి కొడుకు రాజు ఫిర్యాదు చేయగా కోనరావుపేట పోలీసులు రాజిరెడ్డిపై కేసు నమోదు చేశారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి రాజిరెడ్డికి మూడేళ్ల జైలు, రూ.5 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

చైన్ స్నాచింగ్ కేసులో మరొకరికి..

సిరిసిల్లక్రైం: జాతరకు వెళ్లి వస్తున్న మహిళ మెడలోంచి రెండు తులాల బంగారు పుస్తెలతాడును లాక్కెళ్లిన వ్యక్తికి మూడేళ్ల జైలుతోపాటు రూ.5వేలు జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రథమశ్రేణి న్యాయమూర్తి ప్రవీణ్ గురువారం తీర్పు వెలువరించారు. పోలీసులు తెలిపిన వివరాలు. సిరిసిల్ల పట్టణంలోని గోపాల్‌నగర్‌కు చెందిన వీరవేణి లత 2015 జనవరిలో తన తోడికోడలుతో కలిసి ఓ జాతరకు తిరిగి ఇంటికొస్తుంది. ఈక్రమంలో సిరిసిల్ల డీఎస్పీ ఆఫీస్ ముందు ఒకరు లత మెడలోంచి పుస్తెల తాడును లాక్కెళ్లాడు. దీంతో బాధితురాలు సిరిసిల్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. మరుసటి రోజు పెట్రోలింగ్ చేస్తుండగా సిరిసిల్ల పెద్దబజారు వద్ద అల్లెపు కృష్ణను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా దొంగతనం చేసినట్లు నిందితుడు ఒప్పుకోగా రిమాండ్ తరలించారు. పోలీసులు కోర్టులో సాక్ష్యులను ప్రవేశపెట్టగా పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి మూడేళ్ల జైలు, జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

వృద్ధుడి ఆత్మహత్య

ధర్మారం(ధర్మపురి): పైడిచింతలపల్లికి చెందిన బీసగోని నర్సింగం (75) ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై సత్యనారాయణ వివరాల ప్రకారం.. నర్సింగం భార్య 15 ఏళ్ల క్రితం మరణించింది. అప్పటి నుంచి అతను మనోవేదన చెందుతూ మద్యానికి బానిసయ్యాడు. జీవితంపై విరక్తి చెంది గురువారం గ్రామ శివారులోని వ్యవసాయ చేను వద్ద చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుమారుడు తిరుపతిగౌడ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మార్కెట్లోకి హ్యుందాయ్ న్యూక్రెటా కారు


కారు ప్రారంభిస్తున్న ఎండీ హరీశ్‌రెడ్డి, ఏసీపీ నరేందర్

కరీంనగర్: ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న 2024 హ్యుందాయ్ న్యూ క్రెటా కారును గురువారం కరీంనగర్‌లోని సస్య హ్యుందాయ్ షోరూంలో ఎండీ ఆర్.హరీశ్‌రెడ్డి, ఏసీపీ జి.నరేందర్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎండీ మాట్లాడుతూ.. కొత్త క్రెటా కారును మార్కెట్లోకి తీసుకురావడం ఆనందంగా ఉందన్నారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పొందుపరిచి, అనేక మంది కస్టమర్ల ప్రశంసలు పొందిందని తెలిపారు. డైనమిక్ ఎస్‌యూవీ క్వాడ్ బీమ్ ఎల్ఈడీ హెడ్‌ల్యాంప్‌లు, హ్యుందాయ్ స్మార్ట్ సెన్స్ లెవల్-2 ఏడీఏఎస్ వంటి ఫీచర్లతో సెన్సుయస్ స్పోర్టినెస్ డిజైన్ లాంగ్వేజ్‌ను కలిగి ఉందన్నారు. కొత్త 1.5 ఎల్ టర్బో జీడీఐ పెట్రోల్ ఇంజిన్‌తో సహా శక్తివంతమైన పవర్ ట్రైన్ల ఎంపికను అందిస్తుందని, దీని ధర రూ.10.99–రూ.19.99 లక్షల మధ్య ఉంటుందని పేర్కొన్నారు. దేశంలో హ్యుందాయ్ ఎస్‌యూవీ లైనప్ కోసం కొత్త శకం ప్రారంభమైందన్నారు. కార్యక్రమంలో మేనేజర్లు సత్యనారాయణ, శ్రీనివాస్, షోరూం సిబ్బంది పాల్గొన్నారు.

నాయకులను విడుదల చేయాలి


జైలులో బాలకృష్ణను కలిసి వస్తున్న ఆయన భార్య భవాని, నరసింహ

కరీంనగర్: జగిత్యాల ఐలమ్మ కాలనీలో పేదలు వేసుకున్న గుడిసెలను కూల్చిన పోలీసులు, మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెల్లెల బాలకృష్ణతోపాటు స్థానిక నాయకులు 9 మందిని అరెస్టు చేసి, కరీంనగర్ జైలుకు తరలించారు. మత్స్యకార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోరెంకల నరసింహ, బాలకృష్ణ భార్య భవాని, కరీంనగర్ ప్రజాసంఘాల నాయకులు ముకుందరెడ్డి, వర్ల వెంకట్ రెడ్డి, పప్పు సదానందం గురువారం జైలుకు వెళ్లి, బాలకృష్ణను పరామర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఓవైపు ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని చెబుతూ మరోవైపు ఇళ్లు లేని పేదలు ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకుంటే కూల్చేస్తోందని అన్నారు. అరెస్టు చేసిన నాయకులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ నాయకుడు చంద్రశేఖర్, డీవైఎఫ్ఐ జిల్లా నాయకులు హరీశ్‌కుమార్, వెంకటాచారి తదితరులున్నారు.

జాతీయ వైజ్ఞానిక ప్రదర్శనలో ‘ఆగ్రో మెషిన్’


మహారాష్ట్ర గవర్నర్ రమేశ్ బైస్‌కు మెషిన్ పనితీరును వివరిస్తున్న శుభశ్రీ

కొత్తపల్లి(కరీంనగర్): పుణెలోని బాలేవాడి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎన్‌సీఈఆర్టీ), స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎస్‌సీఈఆర్టీ) మహారాష్ట్ర సహకారంతో ఇటీవల జాతీయ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ఇందులో కరీంనగర్ పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ పాఠశాల పదోతరగతి విద్యార్థిని శుభశ్రీ సాహు రూపొందించిన ఆగ్రో మెషిన్‌ను ప్రదర్శించారు. ముఖ్య అతిథిగా హాజరైన మహారాష్ట్ర గవర్నర్ రమేశ్ బైస్, ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్, విద్యాశాఖ మంత్రి దీపక్ కేసర్కర్ ఈ మెషిన్ పనితీరును తెలుసుకొని, విద్యార్థినిని అభినందించారు. దేశవ్యాప్తంగా 11 పాఠశాలల ఎగ్జిబిట్స్ సైన్స్ ఫెయిర్ ఫైనల్స్‌కు ఎంపికవగా వాటిలో పారమిత ఎగ్జిబిట్ ఉండటం గర్వకారణమని ఆ విద్యాసంస్థల చైర్మన్ ఇ.ప్రసాద్ రావు అన్నారు. కె.వి.ఆర్.ఎస్.ఎస్. సొసైటీ నుంచి స్పార్క్ ఇన్నోవేషన్ అవార్డు, డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ నుంచి ఇన్‌స్పైర్ అవార్డును శుభశ్రీ అందుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. పాఠశాల డైరెక్టర్లు ప్రసూన, అనూకర్ రావు, రశ్మిత, రాకేశ్, వి.యు.యం.ప్రసాద్, వినోద్ రావు, ప్రధానోపాధ్యాయుడు రితేశ్‌మెహతా, ప్రోగ్రాం హెడ్ గోపీకృష్ణ, గైడ్ టీచర్ లలిత్ మోహన్ సాహు ఆమెను గురువారం అభినందించారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత ఉద్రిక్తం

- వల్లంపహాడ్‌లో బాధితుల ఆందోళన


భవనం కూల్చివేయిస్తున్న అధికారులు

కరీంనగర్‌రూరల్: వల్లంపహాడ్‌లో అక్రమ నిర్మాణాల కూల్చివేత గురువారం ఉద్రిక్తతకు దారితీసింది. కొన్నేళ్లుగా ఇళ్లు నిర్మించుకొని ఉంటున్నామని, అధికారులు ఎలాంటి నోటీస్ ఇవ్వకుండా ఇప్పుడొచ్చి, అక్రమ కట్టడం అంటూ కూల్చివేయడం ఏంటని స్థానికులు ఆందోళనకు దిగారు. వివరాల్లోకి వెళ్తే.. కరీంనగర్ శివారులోని వల్లంపహాడ్‌లో కొన్నేళ్ల క్రితం కరీంనగర్–రాయపట్నం రహదారి నిర్మాణంతో భూములు కోల్పోయిన కొందరికి పాత రోడ్డులో పట్టాలిచ్చారు. అయితే, సర్వే నంబర్–8లోని రోడ్డును ఆక్రమించుకొని, గృహ నిర్మాణాలు చేసినట్లు ఇటీవల కొందరు వ్యక్తులు ఆర్డీవో మహేశ్వర్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాల మేరకు గురువారం ఆర్‌అండ్‌బీ అధికారులు రవీందర్, లక్ష్మణ్‌రావు, ఆర్ఐ రజనీకాంత్‌రెడ్డి, సర్వేయర్ రాకేశ్ మోఖాపైకి వెళ్లి, విచారణ చేపట్టారు. ఆర్‌అండ్‌బీ అధికారులు కొలతలు వేసి, నిర్ణయించిన హద్దుల్లోకి కొన్ని నిర్మాణాలు వచ్చాయి. అనంతరం వారు జేసీబీతో ఒక భవనం కూల్చివేత ప్రారంభించగానే స్థానిక తల్లీకుమారులు లక్ష్మి, తిరుపతి, కుమార్‌తోపాటు గాండ్ల శ్రీనివాస్, లక్కాకుల నర్సింగం, మల్లేశం తదితరులు అడ్డుకున్నారు. తాము పట్టాభూమిలో పంచాయతీ అధికారుల అనుమతితో ఇల్లు కట్టుకున్నామని, కూల్చివేస్తే పెట్రోల్ పోసుకుంటామంటూ ఆందోళనకు దిగారు. దీంతో అధికారులు వెనుదిరిగారు. అనంతరం బాధితులు ఆర్డీవో మహేశ్వర్, తహసీల్దార్ నవీన్‌కుమార్‌లను కలిసి వినతిపత్రం ఇచ్చారు. తహసీల్దార్ మోఖాపైకి వెళ్లి, సమగ్ర విచారణ చేస్తామని హామీ ఇవ్వడంతో వివాదం సద్దుమణిగింది.

బీజేపీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడిగా సునీల్‌రెడ్డి

- కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్లకు పాతోళ్లే


సునీల్‌రెడ్డి

మంథని/కరీంనగర్ టౌన్: బీజేపీ ఉమ్మడి జిల్లా అధ్యక్షులను నియమిస్తూ ఆ పార్టీ హైకమాండ్ గురువారం ఉత్తర్వులు జారీచేసింది. కరీంనగర్, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల జిల్లాలకు ప్రస్తుతం పనిచేస్తున్న గంగాడి కృష్ణారెడ్డి, పైడిపల్లి సత్యనారాయణ రావు, ప్రతాప రామకృష్ణలనే కొనసాగిస్తున్నట్లు ప్రకటించింది. పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడిగా మంథనికి చెందిన చందుపట్ల సునీల్‌రెడ్డిని నియమించింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. పెద్దపల్లి జిల్లాకు గతంలో రామగుండం మాజీ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ పనిచేయగా ఆయన రాజీనామాతో ఆ బాధ్యతలను రావుల రాజేందర్ చూశారు. పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తుండటంతో బీజేపీ జిల్లా అధ్యక్షుల నియామకం చేపట్టడం ప్రాధాన్యం సంతరించుకుంది.

విద్యుత్ మోటార్ల దొంగల అరెస్ట్

- 22 మోటార్లు, కారు స్వాధీనం


మోటార్లను పరిశీలిస్తున్న పోలీసులు

జగిత్యాలక్రైం: జగిత్యాలతోపాటు జిల్లాలోని బీర్‌పూర్, రాయికల్, మెట్‌పల్లి పరిధిలో విద్యుత్ మోటార్లను దొంగిలిస్తున్న ఇద్దరు దొంగలను అరెస్ట్ చేసినట్లు అడిషనల్ ఎస్పీ ప్రభాకర్‌రావు తెలిపారు. రూరల్ పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో వ్యవసాయ మోటార్లు చోరీకి గురవుతుండడంతో ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసులు నిఘా పెంచారు. ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. గురువారం జగిత్యాల అర్బన్ మండలం ధరూర్ కెనాల్ వద్ద తనిఖీలు చేస్తుండగా ఓ కారు అనుమానాస్పదంగా కనిపించింది. దానిని తనిఖీ చేయగా అందులో నాలుగు మోటార్లు పట్టుబడ్డారు. కారులో ఉన్న ఇద్దరిని నిర్మల్ జిల్లా కడెం మండలం పెద్దూరుకు చెందిన చెన్నమనేని మహేశ్, బసగుట్ట నవీన్‌గా గుర్తించారు. రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 4, రాయికల్ పరిధిలో 3, బీర్‌పూర్‌లో 4, మెట్‌పల్లిలో 4 మోటార్లు దొంగలించినట్లు నిందితులు అంగీకరించారు. వారిచ్చిన సమాచారం మేరకు మొత్తంగా 22 మోటార్లు స్వాధీనం చేసుకున్నామని, నిందితులను రిమాండ్‌కు తరలించామని అడిషనల్ ఎస్పీ పేర్కొన్నారు. డీఎస్పీ వెంకటస్వామి, రూరల్ సీఐ ఆరీఫ్ అలీఖాన్, ఎస్సై సదాకర్, హెడ్‌కానిస్టేబుల్ నసీర్‌ఖాన్, కానిస్టేబుల్ శ్రీనివాస్, గంగాధర్‌ను అభినందించారు.

సబ్‌స్టేషన్‌లో విద్యుత్ వైరు చోరీ


చోరీకి గురైన కండక్టర్ వైరు (ఫైల్)

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలంలోని మొగ్దుంపూర్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో చోరీ జరిగింది. కండక్టర్ వైరును దుండగులు ఎత్తుకెళ్లారు. వివరాల్లోకి వెళ్తే.. మొగ్దుంపూర్ సబ్‌స్టేషన్ ఏఈ నరేశ్ ఈ నెల 10న కరీంనగర్ స్టోర్ నుంచి వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం 600 మీటర్ల కండక్టర్ వైరును తీసుకువచ్చి, సబ్‌స్టేషన్ ఆవరణలో నిల్వ చేశారు. గురువారం ఉదయం 9 గంటలకు వెళ్లి చూడగా కనిపించలేదు. సిబ్బందిని అడిగితే తెలియదని చెప్పారు. దీంతో గుర్తు తెలియని వ్యక్తులు కండక్టర్ వైరు దొంగిలించారని, దాని విలువ రూ.22,800 అని ఏఈ తెలిపారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇటీవల ఇరుకుల్ల, చెర్లభూత్కూర్ గ్రామాల్లోని మూడు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తుతెలియని వ్యక్తులు పగులకొట్టి ఆయిల్, కాపర్‌వైరు తదితర సామగ్రిని ఎత్తుకెళ్లారు. ఇప్పుడు ఏకంగా సబ్‌స్టేషన్‌లో ఉన్న వైరును దొంగిలించడం చర్చనీయాంశంగా మారింది. పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టి, దొంగలను పట్టుకోవాలని విద్యుత్‌శాఖ అధికారులు కోరుతున్నారు.

ఆర్వోబీకి ఎంపీ నయాపైసా తేలే..

- కరీంనగర్‌పై గులాబీ జెండా ఎగురవేయాలి
- మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్


మాట్లాడుతున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్

మల్యాల(చొప్పదండి): కేసీఆర్ చావు నోట్లో తల పెట్టి, తెలంగాణ సాధించారని, తర్వాత ముఖ్యమంత్రిగా రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపారని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు నెరవేర్చకుంటే ప్రజల నుంచి తిరుగుబాటు తప్పదని పేర్కొన్నారు. మల్యాల మండలంలోని రాంపూర్ శివారులో గురువారం చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అధ్యక్షతన నిర్వహించిన బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై, మాట్లాడారు. 2014లో కరీంనగర్ ఎంపీగా గెలిచిన తర్వాత కరీంనగర్‌కు స్మార్ట్‌సిటీ హోదా, కరీంనగర్ నుంచి మనోహరాబాద్ వరకు రైల్వే ప్రాజెక్టు తీసుకువచ్చామని తెలిపారు. విభజన హామీలపై పార్లమెంట్‌లో ప్రశ్నించానని గుర్తు చేశారు. పొన్నం ప్రభాకర్ ఎంపీగా ఉన్న కాలంలో రైల్వే ప్రాజెక్టు కోసం నిధులు తీసుకురాలేదని ఆరోపించారు. కరీంనగర్ ఆర్వోబీకి ఎంపీ సంజయ్ నయాపైసా తేలేదని, తెచ్చినట్లు చెప్పుకోవడం హాస్యాస్పదమన్నారు. తెలంగాణ అభివృద్ధి కోసమే అప్పులు చేశామని తెలిపారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కరీంనగర్‌పై గులాబీ జెండా ఎగురవేసేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. జెడ్పీటీసీ సభ్యుడు కొండపల్కల రామ్మోహన్‌రావు, సర్పంచ్‌ల మండల ఫోరం అధ్యక్షుడు మిట్టపల్లి సుదర్శన్, ప్యాక్స్ చైర్మన్లు అయిల్నేని సాగర్‌రావు, బోయినలిపల్లి మధుసూదన్‌రావు, ముత్యాల రాంలింగారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జనగం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అక్రమ నిర్మాణం కూల్చివేత


కూల్చి వేస్తున్న నగరపాలక సంస్థ సిబ్బంది

కరీంనగర్ కార్పొరేషన్: నగరంలోని వావిలాలపల్లిలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన భవన సెల్లార్, పెంట్‌హౌస్‌ను గురువారం నగరపాలకసంస్థ పట్టణ ప్రణాళిక అధికారులు కూల్చివేశారు. వావిలాలపల్లిలోని శ్రీధర్ అనే వ్యక్తి ఎస్+3 నిర్మాణానికి అనుమతి తీసుకొని, ఆ తర్వాత అదనంగా సెల్లార్, పెంట్ హౌస్ నిర్మాణాలు చేపట్టాడు. దీంతో సమీపంలో ఉండే నివాసి శ్రీకాంత్ కోర్టును ఆశ్రయించాడు. కోర్టు ఆదేశాల మేరకు పట్టణ ప్రణాళిక సిబ్బంది గురువారం ఆ అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు.

24 వరకు బాలికా దినోత్సవం

కరీంనగర్: జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా జిల్లాలో ఈనెల 24వ తేదీ వరకు జాతీయ బాలికా దినోత్సవ వేడుకలు నిర్వహించనున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి ఎం.సరస్వతి ఒక ప్రకటనలో తెలిపారు. బాలల రక్షణ, బాలికలో నైపుణ్య అభివృద్ధిపై గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నామని అన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో బాలికలకు క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. బాల్య వివాహాల నిర్మూలనకు మత పెద్దలతో సమావేశాలు, పరిశుభ్రత కిట్ల పంపిణీపై వర్క్‌షాప్ వంటి కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు.

ఫర్టిలైజర్స్ దుకాణాలు తనిఖీ


ఎరువుల బస్తాలను తనిఖీ చేస్తున్న ఏవో

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం దుర్శేడ్, నగునూరు గ్రామాల్లోని ఫర్టిలైజర్ దుకాణాలను గురువారం మండల వ్యవసాయాధికారి బి.సత్యం తనిఖీ చేశారు. వ్యవసాయశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఆయా గ్రామాల్లోని శ్రీనివాస్ ఫర్టిలైజర్స్, శ్రీలక్ష్మీ నర్సింహ పెస్టిసైడ్స్, ఫర్టిలైజర్స్ అండ్ సీడ్స్, ఆగ్రో రైతు సేవా కేంద్రాల్లోని యూరియా, డీఏపీ తదితర ఎరువుల బస్తాల స్టాక్‌ను పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్ ప్రకారం గోదాంలో ఉన్న బస్తాలను లెక్కించారు. ఈపాస్ మిషన్ ద్వారానే ఎరువులు విక్రయించాలని దుకాణ యజమానులకు ఏవో సూచించారు.

హైమాస్ట్ లైట్ ప్రారంభం


సర్పంచ్ శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న ముస్లింలు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం బొమ్మకల్ గ్రామపంచాయతీ పరిధిలోని గుంటూరుపల్లి ముస్లిం శ్మశాన వాటికలో ఏర్పాటు చేసిన హైమాస్ట్‌లైట్‌ను గురువారం రాత్రి సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పురుమల్ల శ్రీనివాస్ ప్రారంభించారు. అనంతరం ముస్లిం ప్రతినిధులు సర్పంచ్ శ్రీనివాస్‌కు శాలువా కప్పి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో హఫీజ్ రఫీ, అబ్దుల్ రజాక్ తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఏడుగురికి జైలు

కరీంనగర్ క్రైం: నగరంలో మద్యం తాగి, వాహనాలు నడిపిన ఏడుగురికి కోర్టు జైలుశిక్ష విధించినట్లు కరీంనగర్ ట్రాఫిక్ ఏసీపీ సర్వర్ తెలిపారు. డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 24 మందిని గురువారం కోర్టులో హాజరుపరిచామన్నారు. వీరిలో ఇద్దరికి 10, మరో ఇద్దరికి 5, ముగ్గురికి 3 రోజుల జైలుశిక్ష, రూ.14 వేల జరిమానా, మిగతావారికి రూ.30 వేల జరిమానా విధిస్తూ జడ్జి తీర్పునిచ్చారన్నారు.

గ్రామాభివృద్ధికి ప్రణాళికలు

- గ్రామసభల్లో ఆమోదం
- ఈనెల 27లోపు సభల నిర్వహణకు ఆదేశం


గోపాల్‌పూర్ గ్రామసభలో పాల్గొన్న ప్రజలు

కరీంనగర్‌రూరల్: జాతీయస్థాయి ప్రజాప్రణాళిక కార్యక్రమం కింద 2024–25 ఆర్థిక సంవత్సరానికి గ్రామాభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో అధికారులు కరీంనగర్ జిల్లాలోని 313 గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనులపై గ్రామస్తులతో చర్చించి నిర్ణయించేందుకు వీలుగా ఈనెల 7 నుంచి గ్రామసభలు నిర్వహిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే 15వ ఆర్థిక సంఘంతో పాటు రాష్ట్ర ప్రభుత్వ నిధులతో గ్రామాల్లో పలు రకాల అభివృద్ధి పనులు చేపడుతారు. గ్రామాల్లో ఎలాంటి పనులు కావాలి, నిధుల అంచనా, మంజూరు కోసం అవసరమైన ప్రణాళిక రూపొందించాలి. పంచాయతీ కార్యదర్శి నోడల్ అధికారిగా వ్యవహరించి గ్రామసభలో అభివృద్ధి పనుల ప్రణాళికను రూపొందించడంలో కీలకపాత్ర పోషిస్తారు. ఈనెల 27వ తేదీ వరకు గ్రామసభలను పూర్తి చేయాల్సి ఉంటుంది. అనంతరం గ్రామసభల వివరాలను ఈనెల 31లోపు ఈ–గ్రామ్‌స్వరాజ్ పోర్టల్‌లో వివరాలను నమోదు చేయాలి.

తొమ్మిది అంశాలకు ప్రాధాన్యం

- ప్రస్తుత అభివృద్ధి ప్రణాళికలో ప్రభుత్వం తొమ్మిది అంశాలను ప్రవేశపెట్టింది. ప్రజల మెరుగైన జీవనోపాధి, అందరికి ఆరోగ్యం, బాలల స్నేహపూర్వకం, పంచాయతీలకు స్వచ్ఛమైన తాగునీరు, పచ్చదనం–పరిశుభ్రత, స్వయం సమృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, సామాజిక భద్రత, మహిళా సాధికారిత, పంచాయతీలో సుపరిపాలన అంశాలను రూపొందించారు. వీటిలో పంచాయతీలకు అవసరమైన ఏదైన రెండు అంశాలను తీసుకుని ప్రత్యేకంగా బడ్జెట్ రూపొందించుకోవాలి.
- బ్లాక్ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక(బీపీడీపీ)కు నోడల్ అధికారిగా ఎంపీడీవో ఉంటారు. మండల స్థాయిలో అభివృద్ధి ప్రణాళిక రూపొందించాలి. అన్ని శాఖల అధికారులను సమన్వయం చేసుకుని నిధులు కేటాయించాలి. జిల్లాలోని అన్ని మండలాల్లో ఫిబ్రవరి 7వ తేదీ వరకు ప్రత్యేకంగా సర్వసభ్య సమావేశం నిర్వహించి అభివృద్ధి ప్రణాళికను ఆమోదించుకోవాల్సి ఉంటుంది. ఫిబ్రవరి 10వ తేదీ నాటికి ఈ–గ్రామ్ స్వరాజ్ పోర్టల్‌లో వివరాలను నమోదు చేయాలి.
- జిల్లా పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక(డీపీడీపీ)కు జెడ్పీ సీఈవో నోడల్ అధికారిగా వ్యవహరిస్తారు. ఫిబ్రవరి 7లోపు జెడ్పీ సర్వసభ్య సమావేశం నిర్వహించి ప్రణాళికను ఆమోదించుకోవాలి. 10లోపు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి.

గడువులోగా గ్రామసభలు నిర్వహించాలి

గ్రామాల్లో ప్రజల అవసరాలను గుర్తించి ప్రణాళికను రూపొందించాలి. గ్రామసభలు నిర్వహించి ప్రజల ఆమోదం పొందాలి. ప్రణాళిక తయారీలో నిర్లక్ష్యం చేయొద్దు. ఈనెల 27వ తేదీ వరకు పంచాయతీ కార్యదర్శులు గ్రామసభల నిర్వహణ పూర్తి చేయాలి.

– పవన్‌కుమార్, ఇన్‌ఛార్జి డీపీవో, కరీంనగర్

శ్రీరాముని అక్షింతలు పంపిణీ


జడ్జికి అక్షింతలు అందజేస్తున్న వీహెచ్‌పీ బాధ్యులు

కరీంనగర్‌కల్చరల్: విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో గురువారం నగరంలోని కోర్టులో రాముని అక్షింతలు పంపిణీ చేశారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రతిమ, అదనపు జిల్లా జడ్జి శ్రీవాణి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి సరళరేఖలకు స్వామివారి అక్షింతలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బి.రఘునందన్‌రావు, వీహెచ్‌పీ గోరక్ష ప్రముఖ్ విభాగ్ ఊట్కూరి రాధాకృష్ణారెడ్డి, జిల్లా లీగల్ సెల్ కన్వీనర్ కటకం శ్రావణ్‌కుమార్, కోకన్వీనర్ కొలిపాక చంద్రమౌళి, ఎనంపల్లి గంగాధర్, వెన్న ఆనంద్, జిల్లా కార్యదర్శి ఆదిమూలం విద్యాసాగర్, నగర అధ్యక్షుడు ఇనుగుర్తి రమేశ్, కోశాధికారి గర్రెపల్లి ఆంజనేయులు, నగర కార్యదర్శి మనోజ్ లాహోటి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

కరీంనగర్: రవాణా రంగంలో లారీ డ్రైవర్స్, డీసీఎం, తూఫాన్, టాటాఏసీ, మినీవ్యాన్, జీపు, కారు, టిప్పర్, క్యాబ్, గూడ్స్ ట్రాన్స్‌పోర్టు, ఆటో డ్రైవర్లు, స్కూల్ బస్సు, ప్రైవేట్ బస్సు, ట్రాక్టర్ తదితర కేటగిరీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని పబ్లిక్ ప్రైవేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పున్నం రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏషియన్ పెయింట్ ట్రాన్స్‌పోర్టు డ్రైవర్స్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో ముద్రించిన కరపత్రాలను గురువారం సంఘ కార్యాలయంలో ఆవిష్కరించారు. రవాణా రంగ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, సంక్షేమ బోర్డు ద్వారా ప్రమాద బీమా ఆరోగ్య బీమా, పిల్లల చదువులు, పెళ్లికి ఆర్థిక సాయం అందించేలా చూడాలని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఉపాధి కోల్పోయిన ఆటో, క్యాబ్ డ్రైవర్లకు గీత, నేత, బీడీ కార్మికులకు ఇస్తున్నట్లుగా రూ.4,500 జీవనభృతి ఇవ్వాలని కోరారు. శుక్రవారం నుంచి గ్రామ, మండలాల్లో నిరసనలు, ఈనెల 25న జిల్లా కేంద్రాల్లో నిర్వహించే ప్రదర్శన ర్యాలీ, కలెక్టరేట్ ఎదుట ధర్నాను విజయవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు కరుణాకర్, కార్యదర్శి మహేశ్, కోశాధికారి కీసర మల్లేశం, ఉపాధ్యక్షులు నర్సింగ్, తిరుపతి, మహేశ్, మోహనకృష్ణ, కిశోర్, నరేశ్, దండురామన్, శంకర్, శేఖర్, విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్‌సిటీ నిధులతో మరమ్మతులు చేపట్టాలి


కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

కరీంనగర్: శాతవాహన యూనివర్సిటీలో ధ్వంసం చేసిన మహాత్మాజ్యోతిబాపూలే విగ్రహం, శిలాఫలకాన్ని, పగులగొట్టిన రేలింగ్‌ను స్మార్ట్‌సిటీ నిధులతో మరమ్మతులు చేపట్టాలని కోరుతూ బహుజన సంఘాల సమాఖ్య జయంతి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మారంపెల్లి లక్ష్మీనారాయణ గురువారం కలెక్టర్ పమేలా సత్పతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కరీంనగర్ స్మార్ట్‌సిటీ పరిధిలోని పూలే విగ్రహంనకు స్మార్ట్ సిటీ నిధులు కేటాయించలేనందున మున్సిపల్ కమిషనర్‌ను కలిశామని, కానీ ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. వెంటనే మహాత్మాజ్యోతిబాపూలే శిలాఫలకం, రెయిలింగ్ స్మార్ట్‌సిటీ నిధులతో మరమ్మతు చేయాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో జయంతి కమిటీ సభ్యులు నాగి అశోక్‌రావు, లచ్చన్న, దశరథం, లక్ష్మణబోధి, ప్రభాకర్, అంజయ్య, దేవదాసు, ధన్‌రాజ్ తదితరులు ఉన్నారు.

కురుమ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ మల్లేశం

సప్తగిరికాలనీ: కురుమ సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన 2024 సంవత్సర క్యాలెండర్‌ను గురువారం నగరంలోని కురుమ సంఘం భవనంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి అయిలన్న, సహాయ కార్యదర్శి కర్రె రాజు, కార్యవర్గ సభ్యులు మేకల నర్సయ్య, పెద్ద ధర్మయ్య, పెద్ది భీమరాజు, కురుమ ఉద్యోగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఈర్ల విజయ్‌కుమార్, యెముండ్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

‘వాణినికేతన్’లో స్పోర్ట్స్ మీట్


క్రీడా జ్యోతి వెలిగిస్తున్న పాఠశాల డైరెక్టర్ రేణుక


కరీంనగర్: నగరంలోని వాణినికేతన్ బాలవిహార్ పాఠశాలలో గురువారం వార్షిక ఆటల పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. పాఠశాల డైరెక్టర్ రేణుక ఒలింపిక్ జ్యోతి వెలిగించి శాంతి పావురాన్ని ఎగురవేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రేణుక మాట్లాడుతూ పాఠశాలలో చదువుతో పాటు విద్యార్థులకు అన్ని రంగాల్లో నైపుణ్యాన్ని పెంపొందించడానికి భాషా, సాంస్కృతిక, ఆటలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలంటే భౌతికంగా శారీరక శ్రమ ఎంతో ఉపయోగపడుతుందని, దాని కోసం ఆటల పోటీలు, విద్యార్థుల్లో పోటీతత్వం పెంచుతామని అన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన యోగాసనాలు, డంబుల్స్‌డాన్స్, కబడ్డీ డాన్స్ అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో రిటైర్డు ప్రధానోపాధ్యాయుడు హన్మంతరావు, పాఠశాల ప్రిన్సిపాల్ ప్రశాంత్, కిడ్స్‌కేర్ ఇన్‌చార్జి జేసస్, అంజయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వరి, మొక్కజొన్న పొలాల క్షేత్ర సందర్శన


రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

కొత్తపల్లి: కొత్తపల్లి మండలం మల్కాపూర్‌లోని పొలాల్లో గురువారం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవసాయ పరిశోధన స్థానం కరీంనగర్, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు క్షేత్ర సందర్శన చేశారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో వరిలో ప్రధాన సమస్య అయిన మొగి పురుగు, సల్ఫైడ్ దుష్ప్రభావం ఉన్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. దీనిపై రైతులకు నివారణ చర్యలు సూచించారు. నారుమడి, పిలక దశల్లో ఆశిస్తే మొక్కలు ఎండి చనిపోతాయని, ఆలస్యంగా ముదురు నారు నాటడం, కరువు పరిస్థితులు, తక్కువ రాత్రి ఉష్ణోగ్రతలు ఉండి, సూర్యరశ్మి రోజుకు 7 గంటల కంటే ఎక్కువ వుంటే ఈ పురుగు రావడానికి అనుకూలమని వివరించారు. అనంతరం మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు గమనించి దాని నివారణకు లింగాకర్షణ బుట్టలు ఎకరానికి 8 నుండి 10 మార్చుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ పరిశోధన స్థానం కరీంనగర్ సీనియర్ శాస్త్రవేత్త విజయ భాస్కర్, శాస్త్రవేత్తలు జి.ఉషారాణి, పి.మధూకర్‌రావు, జిల్లా ఏరువాక కేంద్రం సమన్వయకర్త కె.మదన్‌మోహన్‌రెడ్డి, మండల్ వ్యవసాయ అధికారి రంజిత్‌కుమార్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

పవర్ కట్ ప్రాంతాలు



కొత్తపల్లి: కరీంనగర్‌లో విద్యుత్ మరమ్మతు పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 11కేవీ అల్కాపురి ఫీడర్ పరిధిలోని అల్కాపురి, కోతిరాంపూర్, హనుమాన్‌నగర్, గణేశ్‌నగర్ ప్రాంతాలతో పాటు 33/11కేవీ ఆర్‌ఆర్ సబ్‌స్టేషన్ పరిధిలోని భాగ్యనగర్, సంతోష్‌నగర్, సెయింట్ జాన్స్ స్కూల్, కొత్తయాస్వాడ, ఎస్‌ఆర్‌ఆర్ కళాశాల వెనుక భాగం, కొత్త లేబర్ అడ్డ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ ఏడీఈ–2 ఎం.సుధీర్‌కుమార్ తెలిపారు. అదేవిధంగా విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపడుతున్నందున 33/11కేవీ అంబేద్కర్‌నగర్, టవర్‌సర్కిల్, బ్యాంక్‌కాలనీ సబ్‌స్టేషన్‌ల పరిధిలోని ప్రాంతాలతో పాటు 11కేవీ ఫీడర్లు, 11కేవీ కాపువాడ, వెంకటసాయి, విద్యానగర్, ఆర్టీసీ వర్క్‌షాపు, చైతన్యపురి ఫీడర్ల పరిధిలోని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్–1 ఏడీఈ ఎస్.నరేందర్ తెలిపారు.

చెర్లబూత్కూర్ సబ్‌స్టేషన్ పరిధిలో..

కరీంనగర్ రూరల్ డివిజన్ పరిధిలోని చెర్లభూత్కూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో ఉ.8 నుంచి మ.2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కరీంనగర్ రూరల్ ఏడీఈ కొలుపుల రాజు తెలిపారు.

తెలంగాణ జన సమితి రాష్ట్ర సదస్సు పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న తెలంగాణ జన సమితి నాయకులు

కరీంనగర్: తెలంగాణ జన సమితి పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర విభజన హామీల అమలు, కేంద్ర ప్రభుత్వ వివక్షతపై ఈనెల 21వ తేదీన తలపెట్టిన రాష్ట్ర సదస్సు పోస్టర్‌ను గురువారం సంఘ కార్యాలయంలో తెలంగాణ జన సమితి రాష్ట్ర నాయకుడు నరహరి జగ్గారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేలాదిమంది బలిదానాల సాక్షిగా సీమాంధ్ర పెట్టుబడిదారి దోపిడీ కబంధహస్తాల నుంచి తెలంగాణను భౌగోళికంగా విముక్తి చేసుకున్నామని అన్నారు..బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీ, ఖాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీలను తక్షణమే ఏర్పాటు చేయాలనే తదితర డిమాండ్లతో నిర్వహించే సభకు నియోజకవర్గంలోని కార్యకర్తలు, మేధావులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యువజన సమితి జిల్లా నాయకులు కుమారస్వామి, సతీశ్, తీర్థాల కుమార్, వెంకన్న, సంజీవ్, మొగిలి, మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

రంగోలి విజేతలకు బహుమతులు ప్రదానం


బహుమతులు అందుకున్న విద్యార్థులు

సప్తగిరికాలనీ: సంక్రాంతి పండుగ పురస్కరించుకొని కరీంనగర్‌లోని మానేరు విద్యాసంస్థల విద్యార్థులకు నిర్వహించిన రంగోలి పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు గురువారం మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. 160 మంది బాలబాలికలు పోటీల్లో పాల్గొనగా జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో విన్నర్స్‌గా నిలిచిన విద్యార్థులకు డైరీలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కేవలం విద్యలోనే కాకుండా అన్ని రంగాల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో మానేరు విద్యాసంస్థల డైరెక్టర్ కడారి సునీతారెడ్డి, ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బాలల పరిరక్షణ కమిటీ ఎన్నిక


ఎన్నికైన కమిటీ సభ్యులు

కరీంనగర్: నగరంలోని 9వ డివిజన్ కోతిరాంపూర్‌లో బాలల పరిరక్షణ కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ చైర్మన్‌గా కార్పొరేటర్ ఐలేందర్‌యాదవ్, కన్వీనర్‌గా అంగన్‌వాడీ టీచర్, యువజన సంఘ నేతలుగా బండ వేణు, ప్రదీప్, మణిదీప్, స్వచ్ఛంద సంస్థ సభ్యురాలిగా చకిలం స్వప్న, ఏరియా పోలీసుగా రవి, వార్డులోని పాఠశాల ఉపాధ్యాయుడిగా కె.సతీశ్, క్లబ్ సభ్యులుగా కె.రమేశ్‌గౌడ్, అది జలపతి, ఏఎన్‌ఎం స్రవంతి, మహిళ సంఘాల ఆర్‌పీలు రమ, రాధా సభ్యులుగా, బాలల తల్లిదండ్రులను సభ్యులుగా నియమించారు. బాలల హక్కులు, బాలలు ఎదుర్కొంటున్న సమస్యల మీద డివిజన్‌లో జరిగే ప్రతీ విషయాన్ని అందరూ చర్చించుకొని పరిష్కార మార్గాలు చేయాలనేది ఈ కమిటీ ఉద్దేశ్యమన్నారు. ఈ కార్యక్రమంలో కోతిరాంపూర్ సెక్టార్ సూపర్‌వైజర్ విజయ, క్లస్టర్ అంగన్‌వాడీ టీచర్లు కె.స్వరూప, కె.శ్యామల, పి.సరిత తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా పట్టివేత

ఇల్లందకుంట: మండలంలోని సిరిసేడు గ్రామంలో కరీంనగర్ జిల్లా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్, సీఐ కె.నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో గురువారం దాడులు నిర్వహించి 20 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకొని 375 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశామన్నారు. ఈ దాడుల్లో ఎస్సై శ్రీనివాస్, హెచ్‌సీ మోసిన్, ఈసీలు కుమార్, యాదవ్, శాసింబి, పాల్గొన్నారు.

ముగిసిన వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు


బ్రహ్మోత్సవాల్లో మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే

గంగాధర: మండలంలోని కోట్ల నర్సింహులపల్లి గ్రామంలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న నందగిరి వీరభద్రస్వామి బ్రహ్మోత్సవాలు గురువారంతో ముగిశాయి. చివరి రోజు ఉదయం అగ్నిగుండాలు, ఏకాదశ రుద్రాభిషేకం, శ్రీవీరభద్రస్వామికి అన్నపూజ, తీర్థప్రసాద వితరణ నిర్వహించారు. మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ బ్రహ్మోత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. వార్షికోత్సవాల్లో అన్నదానంతో పాటు నిత్యం సాంస్కృతిక కార్యాక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో సర్పంచు కవిత, పూజారి పొరండ్ల శ్రీనివాస్, శంకరయ్య పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగి ఆత్మహత్య

కరీంనగర్‌క్రైం: కుటుంబ సభ్యులు ఇద్దరు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో మానసిక వేదనకు గురై ఓ రిటైర్డ్ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నారు. కరీంనగర్ వన్‌టౌన్ ఎస్సై రవి తెలిపిన వివరాల ప్రకారం..నగరంలోని హనుమాన్‌నగర్‌కు చెందిన డి.కిష్టయ్య సింగరేణిలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందారు. రెండేళ్ల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో కోడలు, మనవరాలు మృతి చెందగా కుమారుడు తీవ్రంగా గాయపడ్డాడు. అప్పటి నుంచి కిష్టయ్య తీవ్ర మానసిక వేదనతో బాధపడుతున్నాడు. ఇటీవల కాలు విరిగి అనారోగ్య సమస్యలతో పాటు ఆర్థిక ఇబ్బందులు ఎక్కువ కావడంతో గురువారం భవనంపై ఉన్న డిష్ అంటినాకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



గంగాధర: మండలంలోని మధురానగర్ చౌరస్తాలో ఉన్న సురభి శాంతినికేతన్ హైస్కూల్ 2008–09 పదో తరగతి విద్యార్థులు గురువారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ చదువుకున్న రోజుల నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అనంతరం విద్యాబోధన చేసిన గురువులను ఘనంగా సన్మానించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సంతోషంగా గడిపారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ చిప్ప వీరేశం, వీరనర్సయ్య, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాబు తోడుదొంగ ఈశ్వరన్ ఔట్

పదవులు, పార్టీకి సింగపూర్ మంత్రి రాజీనామా.. తీవ్ర అభియోగాలతో చార్జ్‌షీట్లు దాఖలు

సాక్షి, అమరావతి: రాజధాని అమరావతి పేరిట ఏపీ మాజీ సీఎం చంద్రబాబు సాగించిన భూ దోపిడీలో కీలక పాత్రధారిగా వ్యవహరించిన సింగపూర్ మాజీ మంత్రి ఎస్.ఈశ్వరన్ కథ ముగిసింది. రవాణా శాఖ మంత్రి పదవితోపాటు ఎంపీ సభ్యత్వానికి, సింగపూర్ అధికార పీపుల్స్ యాక్షన్ పార్టీ(పీఏపీ) ప్రాథమిక సభ్యత్వానికి ఆయన రాజీనామా చేసి ఇంటిదారి పట్టారు. ఆయన ఈ నెల 12న రాజీనామా చేసిన విషయం గురువారం వెలుగులోకి వచ్చింది. ఇక దర్యాప్తు ప్రక్రియ ముగిసి నేరాలు రుజువు కావడమే తరువాయి ఆయన జైలు పక్షిగా మారనున్నట్లు స్పష్టమైంది. సింగపూర్ ఫార్ములా వన్ రేసింగ్ కాంట్రాక్టులో ఈశ్వరన్ అక్రమాలకు తెగబడి ఏకంగా 2.98 లక్షల అమెరికన్ డాలర్ల మేర భారీ అవినీతికి పాల్పడినట్టు సింగపూర్ అవినీతి నిరోధక విభాగం 'కరెప్ట్ ప్రాక్టీసెస్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో' (సీపీఐబీ) నిగ్గు తేల్చింది. 27 అభియోగాలతో తాజాగా చార్జ్‌షీట్లు దాఖలు చేసింది. వాటిలో ఆయన మంత్రి హోదాలో భారీ ముడుపులు తీసుకున్నట్టు 24 అభియోగాలు, అవినీతికి కేంద్ర బిందువుగా ఉన్నారని రెండు అభియోగాలు, న్యాయ విచారణకు అడ్డంకులు కల్పించారని ఒక అభియోగం ఉండటం ప్రాధాన్యం సంతరించుకుంది. నేరం రుజువైతే ఈశ్వరన్‌కు లక్ష డాలర్ల జరిమానాతోపాటు కనీసం ఏడేళ్ల జైలు శిక్ష పడుతుందని సింగపూర్ న్యాయ నిపుణులు పేర్కొంటున్నారు. ఈశ్వరన్ వ్యవహారం టీడీపీలో గుబులు పుట్టిస్తోంది. స్కిల్ స్కామ్ కేసులో అరెస్టై 52 రోజులు రిమాండ్ ఖైదీగా గడిపి బెయిల్‌పై విడుదలైన చంద్రబాబు తాజా పరిణామాలతో ఆందోళన చెందుతున్నట్లు స్పష్టమవుతోంది.

కాకినాడలో భారీ ఎల్‌ఎన్‌జీ ఫ్లోటింగ్ టెర్మినల్

సాక్షి, అమరావతి: నార్వేకు చెందిన క్రౌన్ ఎల్‌ఎన్‌జీ ఏపీలో భారీ పెట్టుబడులు పెట్టడానికి ముందుకొచ్చింది. కాకినాడ వద్ద సముద్రంలో రూ.8,300 కోట్లతో ఫ్లోటింగ్ లిక్విఫైడ్ న్యాచురల్ గ్యాస్ టెర్మినల్‌ను అభివృద్ధి చేయనున్నట్లు ప్రకటించింది. ఎల్‌ఎన్‌జీని దిగుమతి చేసుకుని దానిని రీగ్యాసిఫికేషన్ చేసి దేశంలోని అన్ని ప్రాంతాలకు సరఫరా చేసే విధంగా 7.2 మిలియన్ టన్నుల సామర్థ్యంతో ఈ టెర్మినల్‌ను అభివృద్ధి చేయనున్నట్లు క్రౌన్ ఎల్‌ఎన్‌జీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ స్వపన్ కతారియా ప్రకటించారు.



సామాజిక న్యాయ శిల్పం.. నేడు జాతికి అంకితం

- అంబేడ్కర్ స్మృతివనం పనులు పూర్తి
- ఏపీ సీఎం వైఎస్ జగన్ చేతుల మీదుగా నేడు ఆవిష్కరణ

సాక్షి ప్రతినిధి, విజయవాడ: స్వాతంత్ర్యోద్యమంలో ఎన్నో చారిత్రక సమావేశాలకు వేదికగా నిలిచిన బెజవాడ స్వరాజ్య మైదానంలో నిర్మిస్తున్న భారతరత్న బాబాసాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనం పనులు పూర్తిచేసుకుని ప్రారంభానికి సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. చరిత్రలో నిలిచిపోయేలా రూపుదిద్దుకున్న సామాజిక న్యాయ మహాశిల్పం జాతికి అంకితమిచ్చే తరుణం వచ్చేసింది. అద్భుతమైన ప్రాజెక్టుగా రూపుదిద్దుకున్న ఈ స్మృతివనం పనులను మహాయజ్ఞంలా పూర్తిచేశారు. అత్యంత అందంగా తీర్చిదిద్దుతున్న ఈ ప్రాంగణం ప్రపంచస్థాయి పర్యాటకులను సైతం ఆకర్షించే వేదికగా మారనుంది. దేశంలో మతాతీతమైన విగ్రహాల్లో ఇదే అతిపెద్దది కావడం విశేషం. 206 (81 అడుగుల బేస్, 125 అడుగుల విగ్రహం) అడుగుల భారీ అంబేడ్కర్ విగ్రహం నగరానికి ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. రాత్రివేళ ప్రత్యేక కాంతులతో సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా నిలుస్తోంది, ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్వయంగా ఈ ప్రాజెక్టును పర్యవేక్షించి, అత్యంత అద్భుతంగా రూపొందించడానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు.

నిత్యం అధికారులతో మాట్లాడుతూ పనులు పరుగులు పెట్టించారు. ఇలా స్టాట్యూ ఆఫ్ సోషల్ జస్టిస్ (సామాజిక న్యాయ మహా శిల్పం)ను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దారు. ఈ అరుదైన అంబేడ్కర్ సామాజిక న్యాయ విగ్రహాదే ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం ఆవిష్కరిస్తున్నారు. ఇక స్మృతివనాన్ని వీక్షించేందుకు ఈ నెల 20 నుంచి సామాన్య ప్రజలకు ప్రవేశం కల్పించనున్నారు.

పల్లెల్లో 'ప్రత్యేక'మే!

▶ మొదటి పేజీ తరువాయి

రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు గతంలో 'ట్రిపుల్ టెస్ట్' పేరిట మార్గదర్శకాలు ఇచ్చింది. స్థానిక సంస్థల పరిధిలో ఆయా గ్రూపుల వెనుకబాటు స్వభావంపై బీసీ కమిషన్ ద్వారా విచారణ జరపాలని.. ఆయా చోట్ల ఏ నిష్పత్తిలో రిజర్వేషన్లు ఇవ్వాలనేది తేల్చాలని సూచించింది. మొత్తంగా రిజర్వేషన్లు (ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ కలిపి) 50 శాతం మించకుండా ఉండాలని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల పెంపు, మార్పుల కోసం బీసీ కమిషన్ విచారణ జరిపి నివేదిక ఇవ్వాల్సి ఉంది. దాని ఆధారంగానే పంచాయతీ ఎన్నికల్లో రిజర్వేషన్లను పెంచేందుకు వీలు కానుంది.

ప్రభుత్వ ఆదేశాల కోసం ఎదురుచూపులు!

చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్ ఆధ్వర్యంలోని రాష్ట్ర బీసీ కమిషన్.. 'ట్రిపుల్ టెస్ట్' అంశంలో అనుసరించిన విధానాలపై ఇప్పటికే వివిధ రాష్ట్రాల్లో క్షేత్రస్థాయి పర్యటనలు పూర్తిచేసినట్టు సమాచారం. ప్రభుత్వానికి నివేదిక సమర్పించే విషయంలో కమిషన్‌కు పూర్తి స్పష్టత లేక ఆచితూచి వ్యవహరిస్తున్నట్టు తెలిసింది. కొత్త ఓటర్ల జాబితా వచ్చాక.. దాని ఆధారంగా మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖలను నోడల్ ఏజెన్సీలుగా పెట్టి ఆ వివరాలు సేకరించి ఇవ్వాలని భావిస్తున్నట్టు బీసీ కమిషన్ వర్గాలు చెప్తున్నాయి. అయితే ఓటర్ల జాబితా ద్వారానా? లేక సామాజిక, ఆర్థిక, కుల సర్వే ఆధారంగా వెళ్లాలా అన్న దానిపై ప్రభుత్వపరంగా ఎలాంటి సంకేతాలు రాకపోవడంతో సందిగ్ధత ఏర్పడినట్టు సమాచారం. లోక్‌సభ ఎన్నికలు ముగిశాక పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని, ఆలోగా బీసీ కమిషన్ నివేదిక ప్రక్రియ పూర్తవుతుందని రాష్ట్ర సర్కారు భావిస్తున్నట్టు తెలిసింది.

మొత్తం 12,751 పంచాయతీలు..

రాష్ట్రంలో ప్రస్తుతం 12,751 గ్రామ పంచాయతీలకు (కొత్తగా ఏర్పాటు చేసినవి కలిపితే మొత్తం 12,772 పంచాయతీలు) సర్పంచ్‌లు ఉన్నారు. వార్డు సభ్యులు సుమారు లక్షా 27 వేల మంది వరకు ఉంటారు. తెలంగాణ నూతన పంచాయతీరాజ్ చట్టం–2018 ప్రకారం.. సర్పంచ్‌ల పదవీకాలం ముగిసిపోయాక పర్సన్ ఇన్‌చార్జులుగా నియమించే అవకాశం లేదు. దీనితోపాటు సకాలంలో ఎన్నికలు జరగకపోతే గ్రామ పంచాయతీలకు 'స్పెషల్ ఆఫీసర్'లను నియమించాల్సి ఉంటుంది.

- ఉమ్మడి ఏపీలో కిరణ్‌కుమార్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు.. తెలంగాణ ఉద్యమ నేపథ్యంలో పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించలేదు. దీంతో 2011–2013 మధ్య పంచాయతీలు స్పెషల్ ఆఫీసర్ల పాలనలో కొనసాగాయి. అంతకుముందు చంద్రబాబు సర్కారు హయాంలోనూ గడువులోగా పంచాయతీ ఎన్నికలు నిర్వహించని కారణంగా, అంతకుముందున్న సర్పంచ్‌లనే పర్సన్ ఇన్‌చార్జులుగా కొనసాగించారు.

రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రతిపాదనలు పంపినా..!

రాజ్యాంగం ప్రకారం పంచాయతీరాజ్ సంస్థల ఐదేళ్ల పదవీకాలం ముగిసేలోపే.. తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం ప్రకారం పదవీకాలం ముగియడానికి మూడు నెలల ముందే ఎన్నికలు పూర్తిచేయాలి. ఈ క్రమంలో రాష్ట్రంలో జనవరి లేదా ఫిబ్రవరిలో మూడు దశల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తామని, అనుమతి ఇవ్వాలని రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) ప్రభుత్వానికి గతంలోనే ప్రతిపాదనలు పంపినట్టు తెలిసింది. కానీ దీనిపై గత ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. త్వరలో లోక్‌సభ ఎన్నికలు ఉన్న నేపథ్యంలో.. కనీసం ఆరు నెలల వరకు పంచాయతీ ఎన్నికలు నిర్వహించే పరిస్థితి లేదు. దీంతో అప్పటివరకు స్పెషలాఫీసర్ల పాలనలో కొనసాగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మొగ్గుచూపుతున్నట్టు తెలిసింది.

ప్రస్తుత సర్పంచ్‌లనే ఇన్‌చార్జులుగా కొనసాగించాలి

''ప్రస్తుతమున్న సర్పంచ్‌లనే పర్సన్ ఇన్‌చార్జులుగా కొనసాగించాలి. దీనిపై ఇప్పటికే ప్రభుత్వానికి వినతిపత్రాలు సమర్పించాం. గ్రామాల అభివృద్ధిపై మాకు పూర్తి అవగాహన ఉన్నందున ప్రభుత్వ కార్యక్రమాల అమల్లో, పాలనలో జాప్యం జరగదు. స్పెషలాఫీసర్లకు గ్రామాల్లోని పరిస్థితులపై అవగాహన ఏర్పడేందుకే కొంత సమయం పడుతుంది. అధికారులు స్థానికంగా ఉండరు, ఆఫీస్ టైమ్ బట్టి వచ్చి వెళ్తుంటారు. మేం గ్రామాల్లోనే అందుబాటులో ఉంటాం. ఆరునెలల పాటు ఇన్‌చార్జులుగా పొడిగించాలి. కోవిడ్ మహమ్మారి కారణంగా దాదాపు మూడేళ్ల పదవీకాలాన్ని కోల్పోయాం. మాకు చెక్ పవర్ కూడా ఆరు నెలలు ఆలస్యంగా ఇచ్చారు. గతంలో చేసిన పనులకు ఇంకా బిల్లులు రావాల్సి ఉంది.

– ఉప్పుల అంజనీప్రసాద్, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం గౌరవాధ్యక్షుడు

స్పెషలాఫీసర్లతో పాలనకు ఇబ్బంది

''ఇప్పుడున్న పరిస్థితుల్లో ప్రస్తుత సర్పంచ్‌లకే పర్సన్ ఇన్‌చార్జులుగా బాధ్యతలు అప్పగిస్తే బాగుంటుంది. గతంలో పనిచేసిన అనుభవం, విధుల నిర్వహణకు పనికొస్తుంది. క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారానికి దోహదపడతారు. వెంటనే పంచాయతీ ఎన్నికలు నిర్వహించే అవకాశం లేదు కాబట్టి సర్పంచ్‌లనే మరో ఆరునెలల పాటు కొనసాగిస్తే గ్రామాల్లో మంచి ఫలితాలు వచ్చే అవకాశముంది. పరిపాలన ఇబ్బందులు లేకుండా సజావుగా సాగే అవకాశాలు ఉంటాయి. అదే స్పెషల్ ఆఫీసర్‌గా నియమితులైన వారికి గ్రామంపై పట్టు రావడానికి.. ఆయా సమస్యలు, అంశాలపై అవగాహన ఏర్పడడానికి సమయం పడుతుంది.

– చింపుల సత్యనారాయణరెడ్డి, పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు

చరిత్ర ఎరుగని సాహసం

ఏకంగా 31.19 లక్షల మంది అక్కచెల్లెమ్మలకు ఇళ్ల పట్టాలు: ఏపీ సీఎం జగన్



నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు లబ్ధిదారులకు వడ్డీ రీయింబర్స్ చెక్కును అందజేస్తున్న సీఎం జగన్

సాక్షి, అమరావతి: నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు పథకం ద్వారా దేశ చరిత్రలో ఎప్పుడూ జరగని విధంగా, ఎవరూ సాహసించని రీతిలో అక్కచెల్లెమ్మలకు ఏకంగా 31.19 లక్షల ఇళ్ల స్థలాలు ఇవ్వగలిగామని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారు. ఇంటి స్థలం, ఇల్లు రూపంలో ప్రతి నిరుపేద అక్కచెల్లెమ్మకు రూ.20 లక్షల వరకు విలువైన ఆస్తిని ఇవ్వగలిగే గొప్ప అవకాశాన్ని దేవుడు తనకు ఇచ్చినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. నవరత్నాలు – పేదలందరికీ ఇళ్ల పథకం కింద 4,07,323 మంది లబ్ధిదారులకు బ్యాంకు రుణాలపై వడ్డీని రీయింబర్స్ చేస్తూ రూ.46.90 కోట్ల మొత్తాన్ని సీఎం జగన్ బటన్ నొక్కి నేరుగా వారి ఖాతాల్లో జమ చేశారు. గురువారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో లబ్ధిదారులను ఉద్దేశించి సీఎం జగన్ మాట్లాడారు. ''రాష్ట్రంలో ఇప్పటికే 22.25 లక్షల ఇళ్ల నిర్మాణం జరుగుతోంది. రాష్ట్ర చరిత్రలో ఇది ఎక్కడా, ఎప్పుడూ చూడని విధంగా చేపడుతున్నాం. ఒక్కో ఇంటి నిర్మాణానికి దాదాపు రూ.2.70 లక్షలు ఖర్చవుతుంది. మరో రూ.లక్ష మౌలిక సదుపాయాల కోసం అదనంగా ఖర్చవుతుంది. ఇంటి నిర్మాణం, మౌలిక వసతుల కోసం దాదాపు రూ.3.70 లక్షలు ఖర్చు అవుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో రూ.1.80 లక్షలు నేరుగా అక్కచెల్లెమ్మలకు ఇస్తున్నాం. మరో రూ.35 వేలు పావలా వడ్డీకి రుణాలను అందుబాటులోకి తెచ్చాం. దాదాపు రూ.15 వేలు ఖరీదు చేసే ఇసుకను ఉచితంగా సరఫరా చేస్తున్నాం. సిమెంట్, మెటల్ ఫ్రేమ్స్ లాంటి వివిధ రకాల నాణ్యమైన వస్తువులను మార్కెట్ ధర కన్నా తక్కువకు సబ్సిడీపై అందించడం ద్వారా రూ.40 వేల దాకా ప్రయోజనం చేకూరుస్తున్నాం. మనం ఇచ్చిన ఇంటి స్థలం మార్కెట్ విలువ ప్రాంతాన్ని బట్టి కొన్ని జిల్లాల్లో రూ.15 లక్షల పైచిలుకు ఉంది. ఈ విలువ మీద ఇళ్లు, మౌలిక సదుపాయాల విలువలను కలిపితే ప్రతి అక్కచెల్లెమ్మకు రూ.5 లక్షల నుంచి రూ.20 లక్షల వరకూ ఆస్తిని తోబుట్టువుగా సమకూరుస్తున్నాం'' అని చెప్పారు.

సిరిసిల్లలో సాంచాల బంద్ ఉపసంహరణ

- మొదలైన వస్త్రోత్పత్తి

సిరిసిల్ల: సిరిసిల్లలో రెండురోజులుగా బంద్ పడిన మరమగ్గాలు మళ్లీ వస్త్రోత్పత్తిని ప్రారంభించాయి. స్థానిక పాలిస్టర్ అసోసియేషన్ భవన్‌లో గురువారం సమావేశమైన వస్త్రోత్ప త్తిదారులు ఆసాములు, కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని వస్త్రపరిశ్రమ బంద్‌ను ఉపసంహరించుకుంటున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు మండల సత్యం, కార్యదర్శి వెల్దండి దేవదాస్, ఉపాధ్యక్షుడు బూట్ల నవీన్ తెలిపారు. సిరిసిల్లలో సాంచాల బంద్ కారణంగా వస్త్రోత్పత్తి నిలిచిపోవడంతో కార్ఖానాల్లోని కార్మికులకు ఉపాధి కరువైంది. ప్రభుత్వ పెద్దలు సైతం పరిశ్రమను బంద్ చేయొద్దని చెప్పడం, సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో వస్త్రోత్పత్తిని తిరిగి ప్రారంభిస్తున్నా మని వారు వెల్లడించారు. బంద్ ఉపసంహరణ తో గురువారం సాయంత్రమే ఆసాములు వస్త్రోత్పత్తిని ప్రారంభించారు.

తెలంగాణ స్టేజీ-2పై చిగురిస్తున్న ఆశలు

- ఎన్టీపీసీ సూపర్ థర్మల్ ప్రాజెక్ట్ రెండో దశ
- ప్రతిపాదనలు సిద్ధం చేసిన అధికారులు
- రూ.27వేల కోట్ల వ్యయంతో ప్రాజెక్టు
- భూసేకరణ కోసం త్వరలో నోటిఫికేషన్



రామగుండంలోని ఎన్టీపీసీ తెలంగాణ ప్రాజెక్టు

సాక్షిప్రతినిధి, కరీంనగర్: దక్షిణాదికి విద్యుత్ వెలుగులు పంచుతున్న రామగుండం ఎన్టీపీసీ మరో ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు అడుగులు వేస్తుంది. ఎన్టీపీసీ యాజమాన్యం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న తెలంగాణ విద్యుత్తు ప్రాజెక్టు స్టేజీ-1 పూర్తి చేసుకొని, సూపర్ థర్మల్ ప్రాజెక్టు రెండోదశ-2లో నిర్మించనున్న 2,400 మెగావాట్ల ప్లాంట్ నిర్మాణానికి ప్రతిపాదనలను అధికారులు సిద్ధం చేశారు. త్వరలో రూ.27 వేల కోట్ల (26,952) వ్యయంతో నిర్మించనున్న ప్రాజెక్టు కోసం కావాల్సిన పర్యావరణ అనుమతులు, భూసేకరణ తదితర అంశాలతో బ్లూప్రింట్ సిద్ధం చేశారు. రామగుండంలోని శారదానగర్, కాజీపల్లి, గౌతమినగర్ పరిధిలో కొంత మేర భూసేకరణ చేయాల్సి ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. విద్యుత్ కొనుగోలు అంశంపై ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలతో పవర్ పర్చేజ్ అగ్రిమెంట్(పీపీఏ) ఒప్పందం కుదిరిన తర్వాతే తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్టు స్టేజీ-2లో 3 గీ800–2400 మెగావాట్ల ప్రాజెక్టు నిర్మాణం చేపట్టనున్నారు. స్టేజ్-2కు పవర్ పర్చేజ్ అగ్రిమెంట్ పూర్తవ్వడమే తరువాయి శంకుస్థాపన అంశంపై రాష్ట్ర ప్రభుత్వం త్వరలో నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

మరో మూడు నెలల్లో..

రాష్ట్రంలో ఏర్పడిన కొత్త ప్రభుత్వం విద్యుత్ అవసరాల దృష్ట్యా రాష్ట్ర పునర్విభజన చట్టంలో ఎన్టీపీసీ సంస్థలో 4,000 మెగావాట్ల ప్రాజెక్టు నిర్మాణానికి ఒప్పందం ఉంది. దీనిలో భాగంగా మొదటి స్టేజీలో రెండు యూనిట్లు నిర్మించారు. మొదటి యూనిట్ ఉత్పత్తి ప్రారంభించింది. రెండో యూనిట్ త్వరలో విద్యుత్ ఉత్పత్తి దశలోకి రానుంది. ఇదిలా ఉండగానే స్టేజీ-2లో 800 మెగావాట్ల మూడు యూనిట్లు మొత్తం 2,400 మెగావాట్ల విద్యుత్ ప్రాజెక్టు నిర్మాణం కోసం రానున్న మూడు నెలల్లో అన్ని ప్రక్రియలు పూర్తి చేసుకుని శంకుస్థాపన చేసేందుకు అంతర్గతంగా సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తుంది. దీని నిర్మాణం కోసం రామగుండంలో స్థలం, నీరు, బొగ్గు అందుబాటులో ఉన్నాయని, ప్రభుత్వం అనుమతి వచ్చిన పిదప ప్రజాభిప్రాయ సేకరణ అనంతరం నిర్మించేందుకు ప్రతిపాదనలను అధికారులు సిద్ధం చేసినట్లు విశ్వసనీయ సమాచారం.

ఎన్టీపీసీ ప్రాజెక్టు వివరాలు..

- ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టులో థర్మల్ విద్యుత్ పాత ప్రాజెక్టులో 26,00 మెగావాట్లు, తెలంగాణ స్టేజీ-1లోని మొదటి యూనిట్‌లో 800, రెండో యూనిట్‌లో త్వరలో మరో 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి ప్రారంభానికి సిద్ధంగా ఉంది.
- రిజర్వాయర్‌లో ఫ్లోటింగ్ సోలార్ 100 మెగావాట్లు, రాజీవ్ రహదారి పక్కన 10 మెగావాట్ల సోలార్ ప్రాజెక్టు విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నాయి.

తెలంగాణ ప్రాజెక్ట్ స్టేజీ-1 ఇలా..

తెలంగాణ స్టేజీ-1 (2 గీ 800 మెగావాట్లు) అత్యాధునిక అల్ట్రా సూపర్ క్రిటికల్ టెక్నాలజీ ద్వారా బొగ్గు వినియోగంతో ప్రాజెక్టు నిర్మాణం కొనసాగుతుంది. సంప్రదాయక స్విచ్ యార్డుతో పోలిస్తే తక్కువ స్థలం అవసరమయ్యే కాంపాక్ట్ స్విచ్ యార్డ్ వ్యవస్థ అయిన జీఐఎస్‌ను కూడా ఈ ప్రాజెక్ట్‌లో ఏర్పాటు చేశారు. జీఈ-పవర్ ఇండియా ద్వారా ఇన్‌బిల్ట్ ఫ్లూ గ్యాస్ డీ-సల్ఫరైజేషన్ సిస్టమ్ కూడా ఏర్పాటు చేస్తున్నారు. 1,600 మెగావాట్ల తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్ట్ ఫేజ్ -1లో 800 మెగావాట్ల మొదటి యూనిట్ విద్యుత్ ఉత్పత్తి దశలోకి వచ్చింది. ప్రధాని నరేంద్ర మోదీ గత అక్టోబర్‌లో జాతికి అంకితం చేశారు. 800 మెగావాట్ల రెండో యూనిట్‌లో సైతం ఉత్పత్తిని ప్రారంభించేందుకు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు.

రామగుండంను రైల్వే జంక్షన్‌గా గుర్తించండి!

- రైల్వే కోచ్ పరిశ్రమ ఏర్పాటు దిశగా ఆలోచన చేయాలి
- సంఘ్ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే ఠాకూర్



ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

రామగుండం: రామగుండం రైల్వేస్టేషన్‌ను జంక్షన్‌గా గుర్తించాల్సిన అవసరం ఉందని, మాంచెస్టర్ ఆఫ్ ఇండియాగా గుర్తింపు ఉన్న ఈ స్టేషన్‌లో అన్ని సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లకు హాల్టింగ్ కల్పించాలని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌ఠాకూర్ అన్నారు. సికింద్రాబాద్ దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ ప్రధాన కార్యాలయంలో మూడు రోజుల పాటు జరిగే సర్వసభ్య సమావేశంలో భాగంగా గురువారం రామగుండం ఎమ్మెల్యేను ముఖ్య అతిథిగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రామగుండం రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న ఖాళీ స్థలంలో రైల్వే కోచ్ పరిశ్రమ ఏర్పాటు చేసి స్థానికులకు ఉద్యోగావకాశాలు కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రైల్వేస్టేషన్ల అభివృద్ధి, చిన్న తరహా పరిశ్రమల స్థాపనకు కోల్‌బెల్ట్ శాసనసభ్యుల నుంచి సంపూర్ణ సహకారం ఉంటుందని పేర్కొన్నారు. రామగుండం కేంద్రంగా బొగ్గు ఎగుమతులతో రైల్వేకు కోట్లాది రూపాయల ఆదాయం సమకూరుతున్నా అభివృద్ధి, హాల్టింగ్స్‌పై నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. తరచూ ప్యాసింజర్ రైళ్లను రద్దు చేస్తుండడంతో సాధారణ ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ గుర్తించాలన్నారు. కోల్‌బెల్ట్ జిల్లాల్లో రైల్వే పెండింగ్ ప్రాజెక్టులను సత్వరమే పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. ట్రేడ్ యూనియన్లకు ప్రతినిధిగా పని చేసిన అనుభవం ఎక్కువగా ఉండడంతో కార్మికలోకం తనను భారీ మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలిపించారని వివరించారు. అనంతరం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్‌ను నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రైల్వేస్ (ఎన్ఎఫ్ఐఆర్), దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ డివిజనల్ ప్రధాన కార్యదర్శి మర్రి రాఘవయ్య పుష్పగుచ్ఛం, శాలువతో సత్కరించారు. సమావేశంలో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్, రామగుండం బ్రాంచ్ చైర్మన్ అజ్మీరా వీరన్ననాయక్, కేంద్ర ప్రతినిధులు ఆడెం విజయ్, ఆడెం సంతోష్ పాల్గొన్నారు.



ఆలయంలో స్వామికి నమస్కరిస్తున్న భక్తులు

కొండగట్టులో భక్తుల రద్దీ

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు అంజన్న స్వామి ఆలయానికి గురువారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. సమ్మక్క, సారలక్క జాతర సమీపిస్తున్న నేపథ్యంలో భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. ఏర్పాట్లను ఆలయ అధికారులు పర్యవేక్షించారు.



క్యూలైనులో భక్తులు

'డయాలసిస్'కు కరెంటు కష్టాలు



చెన్నూర్ ఆరోగ్య కేంద్రంలో చికిత్సలు పొందుతున్న రోగులు

- ఇన్వర్టర్లతో నడవని యంత్రాలు
- జనరేటర్ లేక రోగుల తిప్పలు
- రూ.15లక్షలు అవసరమంటున్న అధికారులు

చెన్నూర్: మంచిర్యాల జిల్లా చెన్నూర్ సామాజిక ఆరోగ్య కేంద్రంలో జనరేటర్ లేక డయాలసిస్ రోగులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. రూ.10కోట్లు వెచ్చించి ఆధునిక హంగులతో నిర్మించిన ఆరోగ్య కేంద్రంలో పూర్తి స్థాయిలో సౌకర్యాలు లేక.. ఇటు డయాలసిస్ రోగులు, ఇతర వ్యాధిగ్రస్తులు ఇబ్బందులు పడాల్సిన దుస్థితి నెలకొంది. జనరేటర్ లేకపోవడంతో ప్రస్తుతం ఆస్పత్రిలోని ఇన్వర్టర్ల సహాయంతో వైద్యులు అత్యవసర సేవలు అందిస్తున్నారు. సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఐదు డయాలసిస్ యంత్రాలు ఉన్నాయి. కరెంటు సరఫరాలో అంతరాయం ఏర్పడినప్పుడు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. డయాలసిస్ యంత్రాలు ఇన్వర్టర్లతో పని చేయడం లేదు. చెన్నూర్, కోటపల్లి, వేమనపల్లి మండలాలతోపాటు పక్కనే ఉన్న మహారాష్ట్ర నుంచి రోగులు ఇక్కడికి వస్తుంటారు. వివిధ వ్యాధులతోపాటు కిడ్నీ సంబంధిత వ్యాధులకు చికిత్స పొందుతున్నారు. ఈ ఆరోగ్య కేంద్రం పరిధిలో 25 మంది డయాలసిస్ రోగులు ఉన్నారు. ఒక్కో రోగికి సుమారు నాలుగు గంటలపాటు డయాలసిస్ చేయాల్సి ఉంటుంది. విడతల వారీగా చికిత్స అందిస్తున్నారు. డయాలసిస్ చికిత్సలు అందిస్తున్న సమయంలో విద్యుత్ అంతరాయం ఏర్పడి రక్తం గడ్డ కట్టే ప్రమాదం ఉంటుంది. ఇలాంటి సమయంలో రోగికి మృతిచెందే అవకాశం లేకపోలేదు. రోజుకు రెండు విడతలుగా డయాలసిస్ చేస్తుండడంతో రెండో విడత వచ్చిన రోగులు కరెంటు సమస్య వస్తే వేచి చూడాల్సిన దుస్థితి నెలకొందని కోటపల్లి మండలం అన్నారం గ్రామానికి చెందిన తుంగ బాపు, సిర్సా గ్రామానికి చెందిన జానకి దుర్గక్క ఆవేదన వ్యక్తం చేశారు.

150 కేవీ జనరేటర్ అవసరం..

చెన్నూర్ ఆరోగ్య కేంద్రానికి 150 కేవీ జనరేటర్ అవసరమని వైద్యులు తెలిపారు. గతంలో రూ.5 లక్షల వ్యయంతో 65 కేవీ జనరేటర్ ఏర్పాటు చేసేందుకు సన్నద్ధమైనప్పటికీ పూర్తి స్థాయిలో పనికి రాదని విరమించుకున్నారు. సుమారు రూ.15 లక్షలు వెచ్చిస్తే 150 కేవీ జనరేటర్ ఏర్పాటు చేసే అవకాశం ఉంది. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఆరోగ్య కేంద్రానికి అవసరమైన 150 కేవీ జనరేటర్ మంజూరు చేయాలని డయాలసిస్ రోగులు కోరుతున్నారు.

గంటల తరబడి ఉండాల్సి వస్తుంది..



విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడితే గంటలు గంటలు వేచి ఉండాల్సి వస్తోంది. ముందే కిడ్నీ రోగులం. కరెంటు పోయినప్పుడు చాలా ఇబ్బందులు పడుతున్నాం. మంచిర్యాలకు వెళ్లకుండా స్థానికంగానే డయాలసిస్ యంత్రాలు ఉన్నాయి అని సంతోషపడ్డాం. జనరేటర్ లేక కొంత ఇబ్బంది పడుతున్నాం. అధికారులు స్పందించి జనరేటర్ సౌకర్యం కల్పించాలి.

– రత్న సంజీవరెడ్డి, చెన్నూర్

సౌకర్యం కల్పిస్తాం.

ప్రస్తుతం ఇన్వర్టర్లతో అత్యవసర సేవలందిస్తున్నాం. ఇన్వర్టర్లతో డయాలసిస్ యంత్రాలు పని చేయవు. జనరేటర్ అవసరం ఉందని అధికారులకు నివేదిక అందజేశాం. డయాలసిస్ రోగుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని వారం రోజుల్లో జనరేటర్ సౌకర్యం కల్పిస్తాం.

– సత్యనారాయణ, ఆసుపత్రి సూపరింటెండెంట్, చెన్నూర్

రేపు నవోదయ ప్రవేశ పరీక్ష

- ఏర్పాట్లు పూర్తి చేసిన విద్యాలయ సమితి
- పరీక్ష నిర్వహణపై అధికారులకు శిక్షణ
- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 4,458 మంది దరఖాస్తు



అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ చక్రపాణి

కాగజ్‌నగర్‌టౌన్: 2024– 25 విద్యా సంవత్సరానికి సంబంధించి జవహర్ నవోదయ విద్యాలయాల్లో ఆరో తరగతిలో ప్రవేశానికి శనివారం పరీక్ష నిర్వహించనున్నారు. ఉమ్మడి జిల్లాలో కుమురంభీం జిల్లా కాగజ్‌నగర్ పట్టణంలోని త్రిశూల్ పహాడ్‌పై మాత్రమే నవోదయ విద్యాలయం ఉంది. ఉమ్మడి జిల్లాలో ప్రవేశ పరీక్ష నిర్వహణ కోసం విద్యాలయ సమితి ఆధ్వర్యంలో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. కాగజ్‌నగర్‌లోని నవోదయ విద్యాలయంలో గురువారం పరీక్ష సూపరింటెండెంట్‌లు, కేంద్ర పరిశీలకులు, ఇతర బాధ్యులకు పరీక్ష విధి విధానాలు, నిర్వహణపై శిక్షణ కల్పించారు. ప్రిన్సిపాల్ చక్రపాణి, నిపుణులు పరీక్ష నిర్వహణపై సూచనలు చేశారు.

4,458 మంది దరఖాస్తు

ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, కుమురంభీం జిల్లాల నుంచి 4,458 మంది విద్యార్థులు ఆరో తరగతిలో ప్రవేశం కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. ఆదిలాబాద్ నుంచి 983 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, జిల్లాలో నాలుగు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. నిర్మల్ నుంచి 1208 మంది దరఖాస్తు చేసుకోగా ఆరు పరీక్ష కేంద్రాలు, మంచిర్యాల జిల్లాలో 1188 మందికి ఏడు పరీక్ష కేంద్రాలు, కుమురంభీం జిల్లాలో 1079 మందికి ఐదు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. రేపు ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ప్రవేశ పరీక్ష జరగనుంది.

చిరుత దాడిలో ఆవు మృతి



చిరుత దాడిలో మృతిచెందిన ఆవు

బజార్‌హత్నూర్: ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండలం చిన్నుమియతండా సమీపంలో గురువారం చిరుతపులి దాడిలో ఆవు మృతి చెందింది. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ లక్ష్మణ్ తెలిపిన వివరాల ప్రకారం.. గంగాపూర్ గ్రామానికి చెందిన గైక్వాడ్ సుధాం తన ఆవులను చిన్నుమియతండా సమీపంలోని వ్యవసాయ క్షేత్రానికి మేతకు తీసుకెళ్లాడు. అదే సమయంలో పొదల చాటున ఉన్న చిరుత ఆవుపై దాడి చేసి చంపింది. అంతకుముందు అదే చిరుత శ్యాంరావ్ గూడ గ్రామ సమీపంలో చిత్రుకు చెందిన ఆవుల మందపై దాడికి ప్రయత్నించగా అతడి కేకలకు చిన్నుమియతండా వైపు పరుగులు తీసింది. మృతి చెందిన ఆవు విలువ రూ.60 వేలు ఉంటుందని రైతు సుధాం తెలిపాడు. ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని కోరాడు.

ఫ్యాషన్



చలి ప్రభావం తగ్గుతూ ఎండ ప్రతాపం చూపడానికి రెడీ అవుతున్నట్టుగా ఉంది ప్రస్తుత వాతావరణం. మనం కూడా అందుకు రెడీగా ఉండకతప్పదు. ఈ రిపబ్లిక్ డే ని పురస్కరించుకొని ఫాస్ట్ ఫ్యాషన్‌ను వదిలేసి మనవైన దేశీయ కాటన్ దుస్తులతో వార్డ్‌రోబ్‌ను సిద్ధం చేసుకుంటే రాబోయే వేసవి రోజులను ఫ్యాషనబుల్‌గానూ హాయి హాయిగా కులాసాగానూ గడిపేయచ్చు.

ఇక కాటన్స్‌తో ఆరంభం



సీజన్‌కి తగ్గట్టుగా మన డ్రెస్సింగ్‌ను కూడా మార్చుకుంటాం. అందులోనూ వేసవి కంఫర్ట్‌తో గడిపేయాలనుకుంటాం. కాటన్స్ అయితే డల్‌గా ఉంటాయి అనే మాటలు పక్కన పెట్టేసి మోడర్న్ లుక్స్‌తో ఆకట్టుకుంటున్న వాటిని ఎంపిక చేసుకోవచ్చు. ఎక్కడ ఉన్నా వైభవంగా వెలిగిపోవచ్చు.

మనవైన చేనేతలు

కాటన్ అనగానే మనకు ముందుగా ఖాదీ గుర్తుకు వస్తుంది. ఖాదీ చీరలు, షర్ట్‌లే కాదు ఇండో వెస్ట్రన్ స్టైల్స్ కూడా ఇందులో వస్తున్నాయి. దీనితో పాటు నారాయణ్‌పేట్, ఇక్కత్, గద్వాల ... వంటి చేనేతలు సంప్రదాయ వేడుకల సందర్భాల్లోనూ ధరించడానికి బాగుంటాయి.

ఇండోవెస్ట్రన్

జంప్‌సూట్స్, ఫ్రాక్స్, గౌన్లు, లాంగ్ అండ్ షార్ట్ జాకెట్స్ డిజైన్స్ ఎన్నో ఇప్పుడు మనకు కాటన్ మెటీరియల్‌తో తయారైన డిజైన్స్ కనిపిస్తున్నాయి. క్యాజువల్ లేదా కాక్‌టెయిల్ పార్టీ ఏదైనా సందర్భానికి తగినట్టు వీటిని ఎంచుకోవచ్చు.

బ్లాక్ ప్రింట్ గౌన్స్

కాటన్‌పై వేసిన బ్లాక్ ప్రింట్ మెటీరియల్‌తో ఏ స్టైల్ డ్రెస్ అయినా డిజైన్ చేసుకోవచ్చు. ఇవి వేసుకోవడానికి సౌకర్యంగానే కాదు, ఎంతమందిలో ఉన్నా ప్రత్యేకంగానూ కనిపిస్తాయి.

ఆభరణాల ఊసు

కాటన్ మెటీరియరల్ పైగా వేసవి టైమ్ కాబట్టి ఉడెన్, టెర్రకోట జ్యువెలరీతో అలంకరణ ప్రత్యేక ఆకర్షణగా ఉంటుంది. ఎక్కువ అలంకరణ హంగామా లేకుండా సింపుల్ అండ్ ఎలిగెంట్ లుక్స్ అనిపించేలా రెడీ అవడానికి ఇప్పటి నుంచి ప్రిపేర్ అయిపోవచ్చు.



బ్యూటిప్స్



తులసి ఆకులను మెత్తగా గ్రైండ్ చేసి ఆ పేస్టును కాని రసాన్ని కాని ముఖానికి రాసి ఆరిన తర్వాత చన్నీటితో కడగాలి. క్రమం తప్పకుండా రోజూ చేస్తుంటే మొటిమలు, వాటి మచ్చలు పూర్తిగా పోవడంతో పాటుచర్మం నునుపుదేలుతుంది.

తేనెను గోరువెచ్చగా చేసి అందులో నిమ్మరసం కలిపి ముఖానికి పట్టించి ఆరిన తర్వాత కడగాలి. తేనెను ఎప్పుడూ నేరుగా మంట మీద వేడి చేయకూడదు. తేనె ఉన్న పాత్రను ఎండలో కాని, వేడి నీటి గిన్నెలో కాని పెట్టి వేడి చేయాలి.

సిట్రస్ ఫ్రెషనర్‌తో ముఖాన్ని శుభ్రం చేస్తుంటే రోజంతా తాజాగా ఉంటుంది. ఇందుకోసం రెండు కప్పుల నీళ్లు, నిమ్మరసం, నిమ్మ తొక్కలు కావాలి. ఒక పాత్రలో నీటిని మరిగించి అందులో నిమ్మ తొక్కలను వేసి మూత పెట్టి రాత్రంతా అలాగే ఉంచాలి. మరుసటిరోజు ఉదయం నిమ్మ తొక్కలను తీసివేసి ఆ నీటిలో తాజా నిమ్మ రసాన్ని కలిపి స్ప్రే బాటిల్‌లో పోసుకోవాలి. దీనిని ముఖం మీద స్ప్రే చేసుకుని పది నిమిషాల తర్వాత తుడిచేయాలి. ఇలా చేస్తే ముఖం తాజాగా ఉంటుంది. స్ప్రే బాటిల్ తప్పనిసరి కాదు. ఈ మిశ్రమంలో దూదిని ముంచి ముఖానికి పట్టించినా కూడా సాంత్వన లభిస్తుంది. నిమ్మ తొక్కలకు బదులుగా ఆయా కాలాల్లో దొరికే కమలా, బత్తాయి వంటి పండ్ల తొక్కలను కూడా వాడుకోవచ్చు.

రిపబ్లిక్ డే స్పెషల్

ఢిల్లీ పరేడ్‌కు అసామాన్యులు





ఈసారి గణతంత్ర దినోత్సవ ఉత్సవాలకు తెలంగాణ నుంచి 'అసామాన్యులు' హాజరై తెలంగాణకు ప్రాతినిధ్యం వహించనున్నారు. ఒకరు హైదరాబాద్ స్వీపర్ నారాయణమ్మ. మరొకరు కోదాడ మొబైల్ షీ టాయిలెట్ నిర్వహిస్తున్న నాగలక్ష్మి. ప్రజల కోసం భిన్నమైన ఉపాధుల్లో అంకితభావంతో పని చేస్తున్న వీరిద్దరూ 'శ్రమయేవ జయతే'కు నిజమైన ప్రతీకలు. నారాయణమ్మ, నాగలక్ష్మిల పరిచయం.

నారాయణమ్మ దినచర్యను చూస్తే కర్మయోగుల దినచర్యలా అనిపిస్తుంది. తెల్లవారుజాము నాలుగ్గంటలకు నిద్ర లేస్తుందామె. స్నానపానాదులు ముగించుకుని గంటసేపు గురుధ్యానం చేసి కొద్దిగా టీ తాగి ఆరు గంటలకంతా బంజారాహిల్స్‌లోని కాలనీలో రోడ్లు ఊడ్చే పనిలోకి వస్తుంది. పెదాల మీద ఏదో ఒక జానపద గీతమో, గురు తత్వమో, స్మరణో లేకుండా నారాయణమ్మ కనిపించదు. అందుకే ఆమెను అందరూ 'సింగింగ్ స్వీపర్' అంటారు. 22 సంవత్సరాలుగా నగరాన్ని తన చేతులతో శుభ్రం చేస్తూ స్వస్థతనిస్తూ మరోవైపు వీలున్నప్పుడల్లా భజనలకు, భక్తి కార్యక్రమాలకు హాజరయ్యి ముక్తిమార్గాన్ని చూపుతూ నారాయణమ్మ చేస్తున్న సేవ సామాన్యం కాదు. అందుకే ఆమెను రిపబ్లిక్ డేకి ఢిల్లీ పంపాలని జి.హెచ్.ఎం.సి. అధికారులు నిశ్చయించారు. 'ఇది విని మావాళ్లంతా చాలా సంతోషించారు. మంచి కర్మల ఫలితం ఇది' అంటుంది నారాయణమ్మ.

బావులు తవ్వుతూ

రంగారెడ్డి జిల్లా యాచారంకు చెందిన నారాయణమ్మ భర్తతో కలిసి బావులు తవ్వే పనికి వెళ్లేది. అది చాలా శ్రమతో కూడిన పని. అయినా పదిహేను ఇరవై రోజుల్లో బావిని తవ్వి జలను బయటకు తేవడంలో ఆమెకు తృప్తి కలిగేది. తర్వాత జెసీబీలు వచ్చాయి. బావుల స్థానంలో బోర్లు వచ్చాయి. దాంతో పొట్ట చేత్తో పట్టుకుని హైదరాబాద్ చేరుకుంది నారాయణమ్మ. అప్పటికే తల్లి స్వీపర్‌గా చేస్తుండంతో తన పని కూతురికి అప్పజెప్పింది. అప్పటి నుంచి ఇప్పటివరకూ అదే పనిలో కొనసాగుతూ ఉంది నారాయణమ్మ. నెలకు 14 వేలు వస్తాయి. కొడుకు లారీ డ్రైవర్‌గా చేస్తున్నాడు. కూతురిని స్వీపర్ ఉద్యోగంలోనే పెట్టించింది.

జీవుడే దేవుడు



నారాయణమ్మ

నారాయణమ్మకు భక్తి ఎక్కువ. పెళ్లయినప్పటి నుంచి భర్తతో కలిసి దేశంలోని గుళ్లన్నీ తిరిగేది. సంపాదించినది అంతా తీర్థయాత్రలకే ఖర్చు పెట్టింది. 'కాని గుళ్లన్నీ తిరిగాక జీవుడిలోనే దేవుడు ఉన్నాడని గ్రహించాను. కరీంనగర్ జిల్లాకు చెందిన నిత్యానంద రాజేశ్వరాచార్యుల దగ్గర గురుబోధ తీసుకున్నా. నన్ను నేను ఆత్మజ్ఞానిగా మార్చుకున్నా. మనిషి చిత్తం విచిత్రం. అతను లోకాన్ని తరచి చూసి ముక్తిపొందాలంటే గురువును తెలుసుకుని గురుబోధతో నడుచుకోవాలి. అజ్ఞానాన్ని తవ్వి బయట పారేయాలి' అంటుంది నారాయణమ్మ. ఆమెకు రోకటి పాటల దగ్గరి నుంచి మంగళ హారతి పాటల వరకూ కరతామలకం. రామయణ, భారతాలను కూడా పాటలుగా పాడుతుంది. వేమన పద్యాల నుంచి సంస్కృత పద్యాల వరకూ అన్నీ చెబుతుంది. ఆమె ధారణకు, ఆధ్యాత్మిక అవగాహనకు ఎవరైనా నమస్కరించాల్సిందే.

కోదాడలో అమూల్యసేవ

సూర్యాపేట జిల్లా కోదాడ పట్టణంలో రోజూ ఉదయం నుంచి సాయంత్రం వరకూ నాగలక్ష్మి నిర్వహించే మొబైల్ షీ టాయిలెట్ కనిపిస్తుంది. 30 ఏళ్ల ఈ డబుల్ డిగ్రీ హోల్డర్ కోదాడ మునిసిపల్ ఉద్యోగిగా మొబైల్ టాయిలెట్‌ను నిర్వహించడానికి, తిప్పడానికి ఏ మాత్రం సిగ్గుపడదు.



నాగలక్ష్మి

'ఐదేళ్లుగా ఈ టాయిలెట్‌ను నిర్వహిస్తున్నాను. ఆటోకు బిగించిన టాయిలెట్‌ను రోజూ నేను ఉదయం ఎనిమిదన్నర నుంచి పట్టణంలో తిప్పుతాను. గుళ్ల దగ్గర, బస్టాండ్ దగ్గర, మార్కెట్ దగ్గర అవసరాన్ని బట్టి ఉంచుతాను. పనుల కోసం పల్లెల నుంచి వచ్చిన స్త్రీలు తగిన టాయిలెట్‌లు లేక ఇబ్బంది పడతారు. వారు నా మొబైల్ టాయిలెట్‌ను చూడగానే ఎంతో రిలీఫ్ ఫీలవుతూ ఉపయోగిస్తారు. నేను గమనించేదేమిటంటే ఆ ఒత్తిడి తీరాక వారు చల్లగా బతకమ్మా అని ఆశీర్వదించడం. ముఖ్యంగా గర్భిణి స్త్రీలు ఎంతో సంతోషపడతారు' అంటుంది నాగలక్ష్మి. ఈ మొబైల్ టాయిలెట్ ఉపయోగించుకోవడానికి ఏమీ రుసుము చెల్లించ నక్కర లేదు. మధ్యాహ్నం వరకూ ఈ వాహనాన్ని నడిపే నాగలక్ష్మి మధ్యాహ్నం భోజన విరామం తీసుకుని మళ్లీ సాయంత్రం వరకూ తిప్పుతుంది. 'మా కుటుంబ సభ్యుల ప్రోత్సాహం కూడా ఎంతో ఉంది' అంటుందామె. ఆమె అంకిత భావాన్ని గమనించిన జి.హెచ్.ఎం.సి. అధికారులు ఈ సంవత్సరం గణతంత్ర దినోత్సవ వేడుకలకు తెలంగాణ ప్రతినిధిగా ఢిల్లీకి పంపుతున్నారు.

అకృత్యాలకు అడ్డుకట్ట కార్నర్ మీటింగ్స్

చైతన్యం

ముంబైలోని మురికివాడల్లో ఉదయం పూట మహిళాపోలీసులు 'కార్నర్ మీటింగ్స్' నిర్వహిస్తున్నారు. ప్రతి వీధిలోని ఒక మూల మీద అక్కడ పోగైన స్త్రీలకు, పిల్లలకు 'గుడ్ టచ్, బ్యాడ్ టచ్'తో మొదలు డ్రగ్స్, ట్రాఫికింగ్, సైబర్ క్రైమ్‌ల గురించి వివరిస్తున్నారు. పెద్దగా చదువులేని మహిళలకు ఈ వీధిమలుపు మీటింగ్‌లు మేలుచేస్తున్నాయి. నిజానికి ప్రతి రాష్ట్రంలో, ప్రతి బస్తీల్లో ఇలాంటి కార్నర్ మీటింగ్‌ల అవసరం ఉంది.



నగరాల్లోని గేటెడ్ కమ్యూనిటీల్లో ఉన్న స్త్రీల భద్రత గురించి కొంతైనా నిశ్చింత ఉంది. కాని ఇవే నగరాల్లో, పెద్ద పట్టణాల్లోని మురికివాడల్లోని, బస్తీల్లోని స్త్రీల, పసి పిల్లల భద్రత చాలా కష్టతరమైనది. చట్టపరంగా ఎంత కట్టుదిట్టాలు ఉన్నా స్వీయ అవగాహన లేకపోతే ప్రమాదం తప్పదు. మన దేశంలో నిత్యం పసి పిల్లల మీద అకృత్యాలు పెరుగుతూనే ఉన్నాయి. తప్పిపోతున్న పిల్లల సంఖ్య తీవ్రంగా ఉంది. మరోవైపు అసంఘటిత రంగాల్లో స్త్రీలపై లైంగిక దాష్టీకాలు కొనసాగుతూనే ఉన్నాయి. చదువు లేని స్త్రీలు ఈ విషయమై ఎవరితో చెప్పుకోవాలో తెలియక బాధ పడతారు, ఆందోళన చెందుతారు. అందుకే ముంబైలో మహిళా పోలీసులు 'కార్నర్ మీటింగ్'లు నిర్వహిస్తున్నారు.

సంవత్సరం క్రితం

సంవత్సరం క్రితం పోలీసు అధికారుల సూచన మేరకు మహిళా పోలీసులతో మొదలైన ఈ పని సత్ఫలితాలను ఇస్తోంది. ముంబైలోని అతి పెద్ద మురికివాడలకు రోజూ ఉదయం పూట మహిళా పోలీసు బృందాలు చేరుకుని వీధి మూలల్లో ఆడవాళ్లను కూడేసి జాగ్రత్తలు చెప్పడమే ఈ కార్నర్ మీటింగ్‌ల ఉద్దేశం. ఆడపిల్లలకు అర్థమయ్యేలా 'గుడ్ టచ్ బ్యాడ్ టచ్'ల గురించి చెప్పడం మరో ముఖ్య ఉద్దేశం. అపరిచితులకు పిల్లల్ని అప్పగించి పనుల్లోకి వెళ్లకుండా చూడటం, మొబైల్ ఫోన్లలో వచ్చే కేటుగాళ్ల కాల్స్ వల్ల ఆర్థికంగా నష్టపోకుండా చూడటం కూడా కార్నర్ మీటింగ్‌ల ముఖ్యవిధిగా ఉంది. 'రోజూ పది నుంచి పదకొండు గంటల మధ్య బస్తీ స్త్రీలు ఖాళీగా దొరుకుతారు. వారికి అన్ని విధాలా కౌన్సెలింగ్ ఇచ్చి అలెర్ట్ చేస్తాం. చిన్నచిన్న ఫ్యాక్టరీల్లో పని చేసే స్త్రీలు లైంగికపరంగా వేధింపులను ఎదుర్కొంటే ఫిర్యాదు చేయమని చెబుతాం. దీని వల్ల దౌర్జన్యకారుల్లో భయం ఏర్పడుతోంది' అంటున్నారు మహిళా పోలీసులు. అలాగే వ్యభిచార వృత్తిలోకి ఈడ్చబడే స్త్రీల, బాలికలను కాపాడే బాధ్యత వారి గురించి సమాచారం ఇచ్చే చైతన్యం కూడా బస్తీ మహిళలకు కలిగిస్తున్నారు. మత్తు పదార్థాల వల్ల జరిగే హాని చెబుతున్నారు. నిజానికి ఈ పని ముంబైలోనే కాదు దేశంలోని ప్రతి నగరంలో చదువులేని బీదసాదలు ఉండే అన్ని ఊళ్ల వాడల్లో జరగాలి. సత్ఫలితాలు ఇస్తున్న ఈ పనిని మిగిలిన రాష్ట్రాల్లోని పోలీసులు కూడా అనుసరిస్తే బాగుంటుంది.

యువర్స్

ఇన్నోవేషన్




దీపెన్

దారి దీపం

సమస్య గురించి నిట్టూర్చేవారు కొందరు. సమస్యకు పరిష్కారం వెదకాలని ప్రయత్నించేవారు కొందరు. దీపెన్ బబారియా రెండో కోవకు చెందిన వ్యక్తి. కాలేజీ రోజుల్లో ఎదురైన సమస్య స్టార్టప్ ఐడియాకు ఊపిరి పోసింది. ఇనోవేటర్‌గా, 'రోడ్‌మాట్రిక్స్' రూపంలో సక్సెస్‌ఫుల్ ఎంటర్‌ప్రెన్యూర్‌గా దీపెన్‌ను మార్చింది...

దీపెన్ బబారియా అతని ఫ్రెండ్ ఒకరోజు రాత్రి పనిపై బైక్‌పై ఎక్కడికో వెళుతున్నారు. లొకేషన్ తెలియక నావిగేషన్ కోసం గూగుల్ మ్యాప్స్‌ను ఓపెన్ చేశారు. 'ఫాస్టెస్ట్ రూట్' అని చూపించింది. తీరా చూస్తే అది గుంతలతో కూడిన రోడ్డు. మరోవైపు స్ట్రీటు లైట్లు లేకపోవడంతో బైక్ ముందుకు వెళ్లడానికి ఇబ్బంది ఎదురైంది.

'దూరం, వేగాన్ని లెక్కలోకి తీసుకొని ఈ మ్యాప్స్ షార్టెస్ట్ రూట్‌ను గుర్తిస్తాయి తప్ప అధ్వానంగా ఉన్న రోడ్లను మాత్రం గుర్తించవు' అంటున్న దీపెన్ ఈ సమస్యకు ఏఐ ద్వారా పరిష్కారం చూపాలని కాలేజీరోజులలో గట్టిగా అనుకున్నాడు. సూరత్(గుజరాత్)కు చెందిన దీపెన్ ఏఐ స్పెషలైజేషన్‌తో ఇంజనీరింగ్ చదువుకుంటున్న రోజుల్లో రోడ్ల స్థితిగతులను తెలిజేసే అప్లికేషన్‌ను మొబైల్ ఫోన్‌ల కోసం రూపొందించాలనుకున్నాడు. ఈ ఆలోచన క్రమంగా పెరిగి పెద్దదై స్టార్టప్ రూపం తీసుకుంది.

ఎంటర్‌ప్రెన్యూర్‌గా రాణించాలనే కలతో స్టార్టప్‌ల కేంద్రం అయిన బెంగళూరులో అడుగు పెట్టాడు దీపెన్. అక్కడ దీపెన్ ఐడియాపై నిఖిల్ ప్రసాద్ ఆసక్తి చూపించాడు. యూఎస్‌లో ఆటోమోటివ్ కారు కంపెనీలలో పని చేసిన నిఖిల్ ఇండియాకు తిరిగి వచ్చాడు. స్టార్టప్ కో–ఫౌండర్‌లలో నిఖిల్ ఒకరు.

తక్కువ సమయంలోనే ఈ స్టార్టప్‌పై ఇన్వెస్టర్‌లు ఆసక్తి ప్రదర్శించారు. 100ఎక్స్.వీసి ఫస్ట్ ఫండింగ్ చేసింది.

రోడ్ మేనేజ్‌మెంట్ ప్లానును అందించే ఏఐ–బేస్డ్ స్టార్టప్ 'రోడ్‌మెట్రిక్స్' బెంగళూరు కేంద్రంగా ప్రారంభమైంది.

'కాలేజీరోజుల్లో ఎన్నో ప్రాజెక్ట్‌లో పనిచేసిన నాకు ఎంటర్‌ప్రెన్యూర్‌గా ప్రయాణం ఇదే మొదటిసారి. చాలా సంతోషంగా అనిపించింది. రోడ్డు సేఫ్టీ అనేది ముఖ్యమైన అంశం. అయితే రోడ్డు హెల్త్‌ను తెలియజేసే సాఫ్ట్‌వేర్‌లు మన దగ్గర లేవు. ఈ లోటును పూరించేలా రోడ్‌మెట్రిక్స్‌ను తీసుకువచ్చాం' అంటాడు దీపెన్.

మొబైల్ ఆధారిత సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేయాలని మొదట్లో అనుకున్న ఐడియాపై వర్క్ చేశాడు దీపెన్. మొబైల్ అప్లికేషన్‌గా పనిచేసే సెన్సర్ ఆధారిత సాంకేతిక పరిజ్ఞానం బాగున్నప్పటికీ వైబ్రేషన్స్‌ను క్యాప్చర్ చేయడానికి రోడ్డు ప్రతి భాగంలో డ్రైవ్ చేయాల్సి ఉంటుంది. ఇదొక సమస్య.

దీన్ని దృష్టిలో పెట్టుకొని ఇతర కో–ఫౌండర్‌లతో కలిసి దీపెన్ మరింత రిసెర్చ్ చేసి ఇమేజ్ బేస్డ్, కంప్యూటర్ విజన్ బేస్డ్ సాఫ్ట్‌వేర్‌ను డెవలప్ చేశాడు. వీరు రూపొందించిన ఏఐ అల్గారిథమ్ పది రకాల రోడ్ డిఫెక్ట్స్‌ను గుర్తిస్తుంది. ఫాస్టెస్ట్, మోస్ట్ కంఫర్టబుల్, ట్రాఫిక్‌లెస్ రోడ్లను గుర్తించడానికి వినియోగదారులకు ఉపకరించే రోడ్‌మెట్రిక్స్ మ్యాప్స్‌ను కూడా అభివృద్ధి చేశారు. మొదట బెంగళూరు, ముంబై రోడ్లను మ్యాపింగ్ చేసిన తరువాత అస్సాం, బిహార్‌లలో కూడా పనిచేశారు.

'మా సాఫ్ట్‌వేర్ అంచనా వేసిన డ్యామేజ్ రిపోర్ట్‌ల ఆధారంగా మున్సిపాలిటీలు, ప్రైవేటు సంస్థలు నిధుల కేటాయింపు గురించి సరియైన నిర్ణయం తీసుకోవచ్చు' అంటున్న దీపెన్ రోడ్డు సమస్యలను గుర్తించడంలో జంషెడ్‌పూర్‌లోని టాటాగ్రూప్‌నకు సహాయం అందించాడు.

టాటా గ్రూప్, మహీంద్రా గ్రూప్‌తో కలిసి పనిచేస్తున్న 'రోడ్‌మెట్రిక్స్' ప్రభుత్వ మున్సిపాలిటీలతో పనిచేయడానికి చర్చలు జరుపుతోంది. మన దేశంలో వేలాది కిలోమీటర్‌లు కవర్ చేసిన కంపెనీ ఇక్కడితో ఆగిపోలేదు. 'సిటీ ఆఫ్ లండన్' మ్యాపింగ్ కూడా స్టార్ట్ చేసింది.అక్కడ కూడా స్టార్టప్‌కు క్లయింట్స్ ఉన్నారు.

'మన రహదారులను సాధ్యమైనంత సురక్షితంగా మార్చాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నాం. ప్రభుత్వానికి నివేదికలు సమర్పించాలనుకుంటున్నాం' అంటున్నాడు దీపెన్ బబారియ. 'రోడ్ మెట్రిక్స్' స్టార్టప్ మొబిలిటీ ఏఐ గ్రాండ్ ఛాలెంజ్, బెస్ట్ ఏఐ స్టార్టప్ అవార్డ్‌తో సహా ఎన్నో అవార్డ్‌లను సొంతం చేసుకుంది.



• మ్యూజిక్ వరల్డ్

సుమధుర ధ్వని

స్కూలు, కాలేజి రోజుల నుంచి రోజుల తరబడి పాటలు వినేది ధ్వని భానుశాలి. అందరూ తనను సరదాగా 'సాంగ్ ఈటర్' అని పిలిచేవారు. రికార్డ్ బ్రేకింగ్ సాంగ్ 'వాస్తే'తో లైమ్‌లైట్‌లోకి వచ్చిన ధ్వని సింగర్‌గా బాలీవుడ్‌లో మంచి పేరు తెచ్చుకుంది. మంత్రముగ్ధులను చేసే అందమైన గానంతో ఎంతోమంది అభిమానులను సంపాదించుకుంది. చిత్రపరిశ్రమలో గొప్ప సంగీతదర్శకులతో కలిసి పనిచేసే అదృష్టాన్ని సొంతం చేసుకుంది. ధ్వని పాడిన 'దిల్బార్' పాట బిల్‌బోర్డ్ యూట్యూబ్‌లో మ్యూజిక్ ర్యాంకింగ్‌లో మూడో స్థానంలో నిలిచిన తొలి భారతీయ సింగిల్‌గా చరిత్ర సృష్టించింది. 'ఒక ఆర్టిస్ట్ నుంచి స్ఫూర్తి తీసుకోవచ్చు. కానీ వారి శైలిని కాపీ కొట్టకూడదు' అంటున్న ధ్వని సంగీతప్రపంచంలో తనదైన అందమైన సంతకాన్ని సృష్టించుకుంది. ధ్వని ఇండస్ట్రీలోకి అడుగు పెట్టినప్పుడు ప్రోత్సాహకంగా మాట్లాడిన వారు తక్కువే. దీని గురించి ఇలా స్పందిస్తుంది ధ్వని...'ఒక్కొక్కరికీ ఒక్కో అభిప్రాయం ఉంటుంది. రకరకాల అభిప్రాయాలు వినడం వల్ల మనం ఎంచుకున్న దారి సరియైనదేనా అనే డౌటు వచ్చి అయోమయంలోకి వెళతాం. ఇలాంటి సమయంలో మనపై మనకు ఆత్మవిశ్వాసం ఉండాలి. నా ప్రయాణంలో నేను అది కోల్పోలేదు' అంటుంది ధ్వని భానుశాలి.

• టెక్.. టాక్

వన్‌ప్లస్ 12 ఆర్



డిస్‌ప్లే : 6.78 అంగుళాలు
ఫ్రంట్ కెమెరా : 16 ఎంపీ
బ్యాటరీ : 5500 ఎంఏహెచ్
వోఎస్ : ఆండ్రాయిడ్ 14
ర్యామ్ : 12జీబి ; స్టోరేజ్ : 256 జీబి
వోఎస్ : ఆండ్రాయిడ్ 14 ; రిఫ్రెష్ రేట్ : 120 హెచ్‌జడ్

మొబైల్ టేబుల్‌టాప్ స్టాండ్



- బ్రాండ్: స్వాప్‌కార్ట్
- కలర్: వైట్
- ఫామ్ ఫ్యాక్టర్: టేబుల్ స్టాండ్
- మల్టీ ఫంక్షన్ క్లిప్
- మల్టీపర్పస్ మొబైల్ యాక్సెసరీ

గూగుల్ అసిస్టెంట్‌లో...

Google Assistant

గూగుల్ తన ఏఐ–పవర్డ్ అసిస్టెంట్ అప్‌డేటింగ్‌లో భాగంగా కొన్ని అండర్ యుటిలైజ్‌డ్ ఫీచర్‌లను తొలిగించనుంది. వాటిలో కొన్ని: ప్లేయింగ్ అండ్ కంట్రోలింగ్ ఆడియో బుక్స్, సెట్టింగ్ మీడియా అలారమ్స్, మ్యానేజింగ్ కుక్‌బుక్స్, యూజింగ్ వాయిస్ కాల్స్ అండ్ ఇ–మెయిల్, రీషెడ్యూలింగ్ ఈవెంట్స్, వాయిస్ కంట్రోల్ ఫర్ యాక్టివిటీస్, వ్యూయింగ్ యువర్ స్లీప్ సమ్మరిస్, రిక్వెస్టింగ్ స్పెసిఫిక్ యాక్షన్స్ వయా వాయిస్–మేకింగ్ పేమెంట్స్, రిజర్వేషన్స్, సోషల్ మీడియా పోస్ట్స్, రిక్వెస్టింగ్ ఇన్‌ఫర్‌మేషన్ ఎబౌట్ యువర్ కాంటాక్ట్స్, కమ్యూట్ టు వర్క్ టైమ్ ఎస్టిమేట్స్.

మైక్రోసాఫ్ట్ కొత్త ఏఐ బటన్

మైక్రోసాఫ్ట్ తన విండోస్ కీబోర్డులకు కొత్త ఏఐ బటన్‌ను యాడ్ చేస్తుంది. రిబ్బన్–షేప్‌డ్ బటన్ ప్రెస్ చేయడం ద్వారా ఏఐ–పవర్డ్ చాట్‌బాట్ కోపైలట్ ఆన్‌లైన్‌లో ఫర్నీచర్ సెర్చింగ్, డ్రాఫ్ట్ టెక్ట్స్, ఇమేజ్‌లను క్రియేట్ చేయడం, ఐడియాలను సాంగ్స్‌గా మలచడానికి యూజర్‌లకు ఉపయోగపడుతుంది. కొత్త బటన్ స్పేస్‌బార్‌కు కుడి వైపున ఉంటుంది.





రీమార్క్‌బుల్ 2 ఇ–ఇంక్ ట్యాబ్


రీమార్క్‌బుల్ 2 ఇ–ఇంక్ ట్యాబ్ మన దేశంలో లాంచ్ అయింది. ఈ ఇ–ఇంక్ ట్యాబ్ రోజువారీ నోటుబుక్‌లాగే పనిచేస్తుంది. నోటుబుక్ రాసిన అనుభూతిని ఇస్తుంది. నోట్స్ తీసుకోవడానికి, డాక్యుమెంట్‌లను రివ్యూ చేయడానికి... రకరకాలుగా ఇది ఉపయోగపడుతుంది. కొన్ని వివరాలు... • 10.3 అంగుళాల మోనో క్రోమ్ డిజిటల్ పేపర్ డిస్‌ప్లే • రిజల్యూషన్: 1,872X1,404 పిక్సెల్స్ • 1.2 జీహెచ్ డ్యూయల్–కోర్ ఏఆర్‌ఎం చిప్‌సెట్ • వై–ఫై • బ్యాటరీ: 3,000 ఎంఏహెచ్

• గేమింగ్ | నేడు విడుదల



ఎవర్‌గ్రీన్ ఎనర్జీ

'వెల్‌కమ్ టు హమ్‌బోల్డ్ బొటానికల్ గార్డెన్' అంటూ ఆహ్వానిస్తోంది ది కబ్. అడ్వెంచర్ గేమ్ 'ది కబ్' నేడు విడుదల అవుతుంది. 'ది జంగిల్ బుక్' 'లయన్ కింగ్'లాంటి ఎన్నో క్లాసిక్స్‌ను స్ఫూర్తిగా తీసుకొని నేటి కాలానికి తగినట్లుగా రూపొందించిన గేమ్ ఇది. ఈమధ్య విడుదలైన గేమ్ ట్రైలర్ ప్లేయర్స్‌కు ఉత్సాహం కలిగించేలా ఉంది. పబ్లిషర్స్: అన్‌టోల్డ్ టేల్స్, గేమర్‌స్కైగేమ్స్ ప్లాట్‌ఫామ్స్: ప్లేస్టేషన్ 5, నిన్‌టెండో స్విచ్, ఎక్స్‌బాక్స్ వన్, ప్లేస్టేషన్4, మైక్రోసాఫ్ట్ విండోస్, ఎక్స్‌బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్ జానర్స్: ప్లాట్‌ఫామ్ గేమ్, అడ్వెంచర్ గేమ్.



ఎట్ సీ

అయోమయంలో ఉండి ఏమీ చేయాలో తెలియని పరిస్థితుల్లో వాడే మాట... ఎట్ సీ.
ఉదా: ఐయామ్ కంప్లీట్లీ ఎట్ సీ విత్ ది న్యూ కంప్యూటర్ సిస్టం.

నెససరీ ఇవిల్

ఒక విషయం నచ్చకపోయినా, తప్పనిసరి పరిస్థితుల్లో ఒప్పుకోవడం.
ఉదా: మోస్ట్ అమెరికన్స్ యాక్సెప్ట్ ట్యాక్సెస్ యాజ్ ఏ నెససరీ ఇవిల్.

సినిమా


• ధనుష్, శేఖర్ కమ్ముల

క్రేజీ కాంబినేషన్‌కి క్లాప్

హీరోలు ధనుష్, నాగార్జున అక్కినేని క్రేజీ మల్టీస్టారర్ ప్రాజెక్ట్ కోసం చేతులు కలిపారు. ఈ చిత్రానికి శేఖర్ కమ్ముల దర్శకత్వం వహిస్తున్నారు. 'డీఎన్‌ఎస్' (ధనుష్, నాగార్జున, శేఖర్ కమ్ముల) వర్కింగ్ టైటిల్‌తో ఈ సినిమా రూపొందుతోంది. ఇందులో రష్మికా మందన్న కథానాయిక. నారాయణ్ దాస్ కె. నారంగ్ ఆశీస్సులతో సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు నిర్మిస్తున్న ఈ సినిమా పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ధనుష్‌తో కొన్ని కీలక సన్నివేశాల చిత్రీకరణతో రెగ్యులర్ షూటింగ్ మొదలుపెట్టారు. ''నా సామిరంగ'తో నాగార్జున, 'కెప్టెన్ మిల్లర్'తో ధనుష్ సంక్రాంతికి బ్లాక్ బస్టర్‌లను అందించారు. వీరిద్దరూ కలిసి నటిస్తున్న ఈ మల్టీ స్టారర్ ప్రాజెక్ట్‌పై ఎగ్జయిట్‌మెంట్ రెట్టింపు అయ్యింది. 'ఫిదా, లవ్ స్టోరీ' వంటి వరుస బ్లాక్‌బస్టర్స్ తర్వాత శేఖర్ కమ్ముల బిగ్ కాన్వాస్‌పై యునిక్ కథతో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సమర్పణ: సోనాలి నారంగ్, కెమెరా: నికేత్ బొమ్మి.

మళ్లీ షురూ

మళ్లీ యాక్షన్ షురూ చేశాడు పుష్పరాజ్. తనకు ఎదురొచ్చిన శత్రువుల బెండు తీస్తున్నాడు. అది ఏ రేంజ్‌లో అనేది ఆగస్టు 15న థియేటర్స్‌లో చూడాలి. అల్లు అర్జున్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'పుష్ప'. సుకుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో పుష్పరాజ్ పాత్రలో నటిస్తున్నారు అల్లు అర్జున్. 'పుష్ప' సినిమాలోని తొలి భాగం 'పుష్ప: ది రైజ్'కి మలి భాగంగా 'పుష్ప: ది రూల్' రూపొందుతోంది. ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్‌తో బిజీగా ఉన్నారు అల్లు అర్జున్. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించిన కొన్ని యాక్షన్ సీక్వెన్స్‌లను చిత్రీకరించారు. కాగా కొత్త షెడ్యూల్ చిత్రీకరణ హైదరాబాద్ శివార్లలోని ఓ స్టూడియోలో ప్రారంభమైందని తెలిసింది. పదిహేను రోజులకు పైగా ఈ షెడ్యూల్ సాగుతుందట. అల్లు అర్జున్ పాల్గొనగా ఓ యాక్షన్ సీక్వెన్స్‌ను చిత్రీకరిస్తున్నారట. ఈ షెడ్యూల్‌లోనే కొన్ని కీలక సన్నివేశాలను ప్లాన్ చేశారట. రష్మికా మందన్నా హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో సునీల్, అనసూయ, ఫాహద్ ఫాజిల్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: దేవిశ్రీ ప్రసాద్.


• అల్లు అర్జున్


• ఎన్టీఆర్

సెట్స్‌లో దేవర

'దేవర' తాజా షెడ్యూల్‌లో జాయిన్ అయ్యారట ఎన్టీఆర్. 'జనతా గ్యారేజ్' వంటి హిట్ ఫిల్మ్ తర్వాత హీరో ఎన్టీఆర్, దర్శకుడు కొరటాల శివ కాంబినేషన్‌లో రూపొందుతున్న సినిమా 'దేవర'. ఈ చిత్రంతో జాన్వీ కపూర్ తెలుగు చిత్ర పరిశ్రమకు హీరోయిన్‌గా పరిచయం అవుతున్నారు. కాగా ఈ సినిమా తాజా షెడ్యూల్ చిత్రీకరణ హైదరాబాద్‌లో ప్రారంభమైందని తెలిసింది. ఓ భారీ సెట్‌లో కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారట. ఈ షెడ్యూల్‌లో ముఖ్యంగా టాకీ పార్ట్ తీస్తారని తెలిసింది. అలాగే ఈ షెడ్యూల్‌లోనే ఓ పాట కూడా చిత్రీకరించే ఆలోచనలో ఉందట యూనిట్. న్యూ ఇయర్, సంక్రాంతి సెలవుల తర్వాత ఎన్టీఆర్ 'దేవర' షూటింగ్‌లో జాయిన్ కావడం ఇదే. రెండు భాగాలుగా కల్యాణ్ రామ్, మిక్కిలినేని సుధాకర్, కె. హరికృష్ణ నిర్మిస్తున్న 'దేవర' తొలి భాగం ఏప్రిల్ 5న విడుదల కానుంది.


• సమంత

రెండున్నరేళ్లు బాధ్యతతో పని చేశాం

- హీరో సందీప్ కిషన్

''ప్రేక్షకులకు అద్భుతమైన సినిమాటిక్ అనుభూతి ఇవ్వాలని దాదాపు రెండున్నరేళ్లు 'ఊరు పేరు భైరవకోన' సినిమా కోసం ఒక బాధ్యతతో పని చేశాం. ఈ చిత్రం పెద్ద విజయం సాధించడం మా యూనిట్‌కి చాలా అవసరం. ఆ బాధ్యతని, అవసరాన్ని గుర్తు చేసుకుంటూ పని చేశాం'' అని సందీప్ కిషన్ అన్నారు. వీఐ ఆనంద్ దర్శకత్వంలో సందీప్ కిషన్ హీరోగా, వర్ష బొల్లమ్మ, కావ్య థాపర్ హీరోయిన్లుగా నటించిన చిత్రం 'ఊరు పేరు భైరవకోన'. అనిల్ సుంకర సమర్పణలో రాజేశ్ దండా నిర్మించిన ఈ సినిమా ఫిబ్రవరి 9న విడుదల కానుంది. హైదరాబాద్‌లో నిర్వహించిన వేడుకలో ఈ చిత్రం ట్రైలర్‌ని రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా సందీప్ కిషన్ మాట్లాడుతూ– ''ఊరు పేరు భైరవకోన' కమర్షియల్లీ ఫుల్ ప్యాకేజ్డ్ ఎంటర్‌టైనర్'' అన్నారు. ''ఈ సినిమా నా కెరీర్‌లో ఓ సవాల్. ప్రేక్షకులకు కొత్త అనుభూతినిస్తుంది'' అన్నారు వీఐ ఆనంద్. ''ఈ మూవీలో ప్రేమకథ, కామెడీ, ఫ్యాంటసీ, యాక్షన్.. ఇలా అన్ని అంశాలున్నాయి. సినిమాపై చాలా నమ్మకంగా ఉన్నాం'' అన్నారు రాజేశ్ దండా. ''గొప్ప థియేట్రికల్ అనుభూతినిచ్చే మూవీ ఇది. థియేటర్స్‌లోనే ఈ సినిమా చూడండి'' అన్నారు వర్ష, కావ్య. ఈ చిత్రానికి సహనిర్మాత: బాలాజీ గుత్తా, సంగీతం: శేఖర్ చంద్ర, కెమెరా: రాజ్ తోట.


• వర్ష, సందీప్ కిషన్, కావ్య థాపర్

ఆ విషయంలో నేను విఫలమయ్యాను

హీరోయిన్ సమంత ప్రస్తుతం సినిమాల నుంచి కాస్త విరామం తీసుకున్నారు. అయితే సోషల్ మీడియాలో మాత్రం యాక్టివ్‌గా ఉంటున్నారు. తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఏదో ఒక పోస్ట్ పెడుతుంటారు. అంతేకాదు.. వీలు కుదిరన ప్రతిసారీ అభిమానులతో చిట్‌చాట్ చేస్తుంటారు. అందులో భాగంగా తాజాగా ఫ్యాన్స్‌తో చిట్ చాట్ చేసిన సమంత ఆ సమయంలో చేసిన వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి. 'మీ జీవితంలో చేసిన అతి పెద్ద పొరపాటు ఏంటంటే మీ సమాధానం ఏంటి?' అని ఓ అభిమాని సమంతను ప్రశ్నించగా ఆసక్తికరంగా జవాబిచ్చారు సమంత. ''నేను నా ఇష్టాలు, అయిష్టాలను తెలుసుకోవడంలో విఫలమయ్యా. ఈ విషయాన్ని నేను చాలా ఆలస్యంగా గ్రహించాను. ఆ సమయంలో సరైన నిర్ణయం తీసుకోకపోవడం నేను చేసిన అతి పెద్ద పొరపాటుగా భావిస్తున్నాను. నాతో ఉన్నవారితో, నా జీవిత భాగస్వామి వల్ల ఎక్కువగా ప్రభావితం అయ్యి నా ఇష్టాలను, అయిష్టాలను గుర్తించలేకపోయాను. క్లిష్ట సమయం నుంచే మనం విలువైన పాఠం నేర్చుకోగలమనే విషయం అర్థమైన తర్వాతే నా వ్యక్తిగత జీవితం ఎదుగుదల మొదలైంది'' అన్నారు సమంత. ఇక ప్రస్తుతం సమంత సినిమాలకు విరామం ప్రకటించి ఆరోగ్యంపై పూర్తి శ్రద్ధ పెట్టారు. ఆమె నటించిన 'సిటాడెల్' (ఇండియన్ వెర్షన్) వెబ్ సిరీస్ త్వరలో రిలీజ్ కానుంది. కాగా ఇటీవల సమంత 'ట్రలాలా మూవీ పిక్చర్స్' పేరుతో ఓ నిర్మాణ సంస్థను ప్రారంభించిన విషయం తెలిసిందే.


• రణ్‌బీర్ కపూర్


• బాబీ డియోల్

రాముడు... కుంభకర్ణుడు?

'యానిమల్' సినిమాలో రణ్‌విజయ్ సింగ్‌గా రణ్‌బీర్ కపూర్, అబ్రార్‌గా బాబీ డియోల్ అదిరిపోయే పెర్ఫార్మెన్స్ చేశారు. బాక్సాఫీస్ వద్ద ఈ సినిమా బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. కాగా రణ్‌బీర్, బాబీ డియోల్‌లు మళ్లీ స్క్రీన్ షేర్ చేసుకోనున్నారన్నది బాలీవుడ్‌లో వినిపిస్తున్న తాజా కబురు. రామాయణం ఆధారంగా హిందీలో దర్శకుడు నితీష్ తివారి 'రామాయణ్' (ప్రచారంలో ఉన్న టైటిల్) అనే సినిమాను మూడు భాగాలుగా తెరకెక్కించనున్నారనే వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. రెండేళ్లుగా నితీష్ ఈ సినిమాకు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ చేస్తున్నారని, ఈ పనులు తుది దశకు చేరుకున్న తరుణంలో నటీనటుల ఎంపికపై దృష్టి పెట్టారని టాక్. ఈ నేపథ్యంలో రాముడి పాత్రలో రణ్‌బీర్ కపూర్, సీత పాత్రలో సాయిపల్లవి, హనుమంతుడి పాత్రలో దేవ్ దత్తా, రావణుడి పాత్రలో యశ్ నటించనున్నారనే వార్తలు తెరపైకి వచ్చాయి. తాజాగా ఈ సినిమాలోని కుంభకర్ణుడి పాత్రలో బాబీ డియోల్, కైకేయి పాత్రలో లారా దత్తా కనిపించనున్నారనే వార్త ప్రచారంలోకి వచ్చింది. అన్నీ కుదిరి 'రామాయణ్' సినిమాలో రణ్‌బీర్, బాబీ డియోల్ సెట్ అయితే.. 'యానిమల్' తర్వాత ఈ ఇద్దరూ కలిసి నటించే సినిమా ఇదే అవుతుంది. ఇక ఈ సినిమా షూటింగ్ వేసవిలో ప్రారంభమయ్యే అవకాశం ఉందట. మధు మంతెన, నమిత్ మల్హోత్రా, అల్లు అరవింద్‌లు కలిసి ఈ సినిమాను భారీ బడ్జెట్‌తో నిర్మించనున్నారనే వార్తలు గతంలో వచ్చిన సంగతి గుర్తుండే ఉంటుంది.

హాలీవుడ్‌కి హాయ్

దాదాపు నాలుగు దశాబ్దాల పాటు హిందీ తెరను ఏలిన అలనాటి తారల్లో నూతన్‌కి ప్రముఖ స్థానం ఉంది. 1950లలో చిత్రసీమలోకి అడుగుపెట్టి, 40 ఏళ్ల కెరీర్‌లో దాదాపు 80 చిత్రాల్లో నటించి, చెరగని ముద్ర వేసుకున్నారు నూతన్. ఆమె వారసురాలిగా ప్రనూతన్ బహల్ హిందీ చిత్రం 'నోట్‌బుక్' (2019)తో నటిగా పరిచయమయ్యారు. ఆ తర్వాత 'హెల్మెట్'(2021) చిత్రంలో నటించిన ప్రనూతన్ బహల్ ఇప్పుడు హాలీవుడ్ ఎంట్రీ ఇస్తున్నారు. అమెరికన్ యాక్టర్ రహ్సాన్ నూర్ నటిస్తూ, స్వీయ దర్శకత్వం వహించనున్న సినిమా 'కోకో అండ్ నట్'. ఇంగ్లిష్, హిందీ భాషల్లో తెరకెక్కనున్న ఈ లవ్‌స్టోరీ సినిమా చిత్రీకరణ జూన్‌లో చికాగోలో ప్రారంభం కానుంది. ఈ సినిమాలో ఇండియన్, ఇంగ్లిష్ నటీనటులు నటించనున్నారు. ''ఓ రొమాంటిక్ డ్రామాతో హాలీవుడ్‌కు పరిచయం అవుతున్నందుకు చాలా సంతోషంగా ఉంది. ఈ సినిమాలో నా క్యారెక్టర్ కొత్తగా ఉంటుంది'' అని పేర్కొన్నారు ప్రనూతన్. ''నోట్‌బుక్'లో ప్రనూతన్ యాక్టింగ్ ప్రతిభను చూసినప్పట్నుంచి ఆమెతో కలిసి నటించాలనుకుంటున్నాను. ఈ సినిమాలో తన పెళ్లి విషయంలో కొంతమందితో పోరాడే అమ్మాయి పాత్రలో ప్రనూతన్ కనిపిస్తారు'' అని పేర్కొన్నారు రహ్సాన్ నూర్.


• ప్రనూతన్ బహల్

స్టాక్ మార్కెట్లు	
దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▽ 314	71,187
నిఫ్టీ ▽ 110	21,462

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (గురువారం రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	15,029	△ 173
డోజోన్స్	37,263	△ 4
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,451	△ 7
డాక్స్	16,560	△ 128
షాంఘై	2,846	△ 12
నికాయ్	35,466	▽ 11

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో) ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	61,970 ▽ 307
బంగారం (99.5 స్వచ్ఛత)	61,722 ▽ 306
వెండి (కేజీ)	70,898 ▽ 293

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	82.73	83.75
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	103.77	106.34
€	యూరో	ఒకటి	89.28	91.64
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	55.85	57.12
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	53.75	55.67
S$	సింగపూర్ డాలర్	ఒకటి	61.21	62.67
SAR	సౌదీ రియాల్	పదింటికి	21.21	22.83
UAE D	యూఏఈ దిర్హామ్	పదింటికి	21.73	23.53
¥	చైనా యువాన్	పదింటికి	10.43	12.51

విమానయానం ఉజ్వలం

- ఐదో అతిపెద్ద మార్కెట్‌గా భారత్
- ఏడేళ్లలో మరో 50 విమానాశ్రయాలు
- కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా వెల్లడి
- ప్రారంభమైన వింగ్స్ ఇండియా–24

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: 'మనుషులను, మనసులను విమానయాన రంగం అనుసంధానిస్తోంది. జీవితాల్లో మార్పు తెచ్చింది. సామాజిక, ఆర్థిక పురోగతిలో పాలుపంచుకుంటోంది. నరేంద్ర మోదీ నేతృత్వంలో భారత విమానయాన పరిశ్రమ వెలుగులమయం' అని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా గురువారం అన్నారు. హైదరాబాద్‌లోని బేగంపేట విమానాశ్రయంలో రెండేళ్లకోసారి జరిగే వైమానిక ప్రదర్శన వింగ్స్ ఇండియా–2024 ప్రారంభోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. సామాన్యుడికీ విమానయాన అవకాశాన్ని అందించే ఉడాన్ 5.3 స్కీమ్‌ను ఈ సందర్భంగా ఆవిష్కరించారు.

దేశీయంగా 30 కోట్లకు..

పౌర విమానయాన రంగంలో ప్రపంచంలో అయిదవ స్థానంలో భారత్ నిలిచిందని జ్యోతిరాదిత్య తెలిపారు. '2014లో దేశీయంగా 6 కోట్ల మంది విమాన ప్రయాణం చేశారు. 2023లో ఈ సంఖ్య 15.3 కోట్లకు ఎగసింది. 2030 నాటికి ఇది 30 కోట్లను తాకుతుంది. విమాన ప్రయాణికుల విస్తృతి ప్రస్తుతం కేవలం 3–4 శాతమే. ఏడేళ్లలో ఇది 10–15 శాతానికి చేరుతుందన్న అంచనాలు ఉన్నాయి. మిగిలిన 85 శాతం మేర అవకాశాలను అందుకోవడానికి కసరత్తు చేస్తున్నాం. అడ్డంకులు తొలగించడంతోపాటు మౌలిక వసతుల కల్పన చేపడుతున్నాం' అని వివరించారు.

కొత్త విమానాశ్రయాలు..

దేశవ్యాప్తంగా 2014 నాటికి 74 విమానాశ్రయాలు, హెలిప్యాడ్స్, వాటర్ డ్రోమ్స్ ఉన్నాయి. ఇవి రావడానికి 65 ఏళ్ల సమయం పట్టిందని సింధియా తెలిపారు.



'గడిచిన 10 ఏళ్లలో 75 విమానాశ్రయాలు, హెలిప్యాడ్స్, వాటర్ డ్రోమ్స్ జోడించాం. దీంతో ఈ కేంద్రాల సంఖ్య 149కి చేరుకుంది. 2030 నాటికి ఇవి 200 దాటతాయి. ప్రతి జిల్లా కేంద్రంలో హెలిప్యాడ్ ఏర్పాటు చేయాలన్నది ప్రణాళిక. ప్రస్తుతం భారతీయ విమానయాన సంస్థల వద్ద 713 విమానాలు ఉన్నాయి. వచ్చే దశాబ్దిలో వీటి సంఖ్య 2,000 దాటుతుంది. విమానాల కొనుగోలులో యూఎస్, చైనా తర్వాతి స్థానాన్ని భారత్ కైవసం చేసుకుంది' అని అన్నారు.

రికార్డు స్థాయిలో మహిళా పైలట్లు..

ప్రయాణికుల వృద్ధి రేటు దేశీయంగా 15.3 శాతం, అంతర్జాతీయంగా 6.1 శాతం ఉంది. 15 ఏళ్లలో విమానాల్లో సరుకు రవాణా దేశీయంగా 60 శాతం, విదేశాలకు 53 శాతం అధికమైందని సింధియా గుర్తు చేశారు. 'గతేడాది 1,622 మంది కమర్షియల్ పైలట్ లైసెన్స్ అందుకున్నారు. వీరిలో 18 శాతం మహిళలు కావడం విశేషం. భారత్‌లో ఉన్న పైలట్లలో మహిళల వాటా 15 శాతం ఉంది. ఇది ప్రపంచ రికార్డు. డ్రోన్స్ రంగంలో ప్రపంచ కేంద్రంగా భారత్‌ను నిలబెట్టేందుకు నిబంధనలు సరళీకరించాం, ప్రోత్సాహకాలు ప్రకటించాం' అని చెప్పారు. కార్యక్రమంలో పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి జనరల్ (రిటైర్డ్) వి.కె.సింగ్, తెలంగాణ రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

20 ఏళ్లలో 2,840 విమానాలు కావాలి

- దేశీయంగా సోర్సింగ్ రెట్టింపు చేస్తాం
- భారత మార్కెట్‌పై ఎయిర్‌బస్ ఇండియా ప్రెసిడెంట్ రెమీ మిలార్డ్



రాబోయే రోజుల్లో అంతర్జాతీయ ఏవియేషన్ రంగానికి భారత్ దన్నుగా నిలుస్తుందని విమానాల తయారీ దిగ్గజం ఎయిర్‌బస్ ఇండియా ప్రెసిడెంట్ రెమి మిలార్డ్ తెలిపారు. గణనీయంగా వృద్ధి చెందుతున్న భారత మార్కెట్‌కు వచ్చే 20 ఏళ్లలో 2,840 కొత్త విమానాలు అవసరమన్నారు. అలాగే 41,000 మంది పైలట్లు, 47,000 మంది టెక్నికల్ సిబ్బంది కావాల్సి ఉంటుందని గురువారం వింగ్స్ ఇండియా 2024 కార్యక్రమంలో ఆయన చెప్పారు. వచ్చే 20 ఏళ్లపాటు ప్రపంచంలోనే అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న దేశంగా భారత్ నిలుస్తుందని అంచనాలు ఉన్నట్లు రెమీ తెలిపారు. భారత్ నుంచి రెట్టింపు స్థాయిలో కొనుగోలు చేయనున్నట్లు రెమీ వివరించారు. ప్రస్తుతం 750 మిలియన్ డాలర్లుగా ఉన్న సోర్సింగ్‌ను ఈ దశాబ్దం చివరికి 1.5 బిలియన్ డాలర్లకు పెంచుకోనున్నట్లు చెప్పారు. భారత్ నుంచి గతేడాది 750 విమానాలకు ఆర్డర్లు రాగా 75 ఎయిర్‌క్రాఫ్టులను దేశీ విమానయాన సంస్థలకు డెలివరీ చేసినట్లు వివరించారు. వీటిలో 41 విమానాలు ఇండిగో సంస్థకు, ఎయిరిండియాకు 19, విస్తారాకు 14, గో ఫస్ట్‌కు ఒకటి చొప్పున అందించినట్లు రెమీ చెప్పారు. తమ ఏ350 రకం విమానాలు భారత్‌లో అంతర్జాతీయ ప్రయాణాలకు ఊతమివ్వగలవని పేర్కొన్నారు. గతేడాది ఎయిరిండియాకు ఆరు ఏ350 విమానాలను అందించినట్లు చెప్పారు. భారత్‌లో విమానాల నిర్వహణ, రిపేర్లు, ఓవరాలింగ్ వ్యవస్థ అభివృద్ధికి తమ వంతు తోడ్పాటు అందిస్తున్నట్లు తెలిపారు.

కర్నూలులో పైలట్ల శిక్షణ కేంద్రం

కర్నూలు విమానాశ్రయంలో పైలట్ల శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో.. ఇప్పటికే అయిదారు సంస్థలు ఆసక్తి కనబరిచాయని ఏపీ ప్రభుత్వ ఏవియేషన్ సలహాదారు, ఏపీ ఎయిర్‌పోర్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ వి.ఎన్. భరత్ రెడ్డి సాక్షి బిజినెస్ బ్యూరోకు తెలిపారు. టెండర్లకు జనవరి 31 వరకు గడువు ఉందని ఆయన పేర్కొన్నారు. ఇది కార్యరూపం దాలిస్తే ఏటా 40–50 మంది శిక్షణ తీసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు.

గడువు కంటే ఆరు నెలల ముందే భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. 2025 మే నాటికి ఇది సిద్ధం అవుతుందని వెల్లడించారు. తొలి దశలో ఏటా 60 లక్షల మంది, తుది దశ పూర్తి అయ్యే నాటికి ఏటా 4 కోట్ల మంది ప్రయాణికులకు సేవలు అందించేలా విమానాశ్రయాన్ని నిర్మిస్తున్నట్టు వివరించారు. భోగాపురం విమానాశ్రయాన్ని పీపీపీ విధానంలో జీఎంఆర్ నిర్మిస్తోంది. 2,200ల ఎకరాలకుపైగా విస్తీర్ణంలో సుమారు రూ.5,000 కోట్లు వ్యయం అవుతోందని భరత్ రెడ్డి తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని ఎయిర్‌పోర్టులను అనుసంధానిస్తూ కొత్త రూట్లలో సర్వీసులను అందించాల్సిందిగా కోరుతూ పలు విమానయాన సంస్థలతో ఇటీవల చర్చలు జరిపామని చెప్పారు.

వింగ్స్ ఇండియా హైలైట్స్

హెరిటేజ్ ఏవియేషన్
ఎయిర్‌క్రాఫ్ట్ చార్టర్ కంపెనీ హెరిటేజ్ ఏవియేషన్ తాజాగా హెచ్125, హెచ్130 హెలికాప్టర్ల కోసం ఎయిర్‌బస్‌కు ఆర్డరు ఇచ్చింది. వీటిని ప్రాంతీయ కనెక్టివిటీ స్కీము ఉడాన్ కింద సర్వీసుల కోసం ఉపయోగించనున్నట్లు సంస్థ సీఈవో రోహిత్ మాథుర్ తెలిపారు. ఎత్తైన, వేడిమి ఎక్కువగా ఉండే వాతావరణాల్లో ప్రయాణాలకు హెచ్125 హెలికాప్టర్ ఉపయోగపడుతుంది. ఇక సైట్ సీయింగ్, అత్యవసర వైద్య సర్వీసులు మొదలైన వాటి కోసం హెచ్130 సహాయకరంగా ఉంటుంది.

ఎయిర్ ఇండియా
గురుగ్రాంలో 6 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఆసియాలో అతిపెద్ద ఏవియేషన్ శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయనుంది. ఎయిర్‌బస్, బోయింగ్ కోసం 20కిపైగా సిమ్యులేటర్స్‌తో పైలట్లకు శిక్షణ.

జీఎంఆర్ ఏరో
జ్యోతిరాదిత్య సింధియా చేతుల మీదుగా ఏవియేషన్ స్కూల్ వర్చువల్‌గా ప్రారంభం.

టీఏఎస్ఎల్
విడిభాగాల తయారీకై మహీంద్రా ఏరోస్పేస్‌తో కలిసి ఎయిర్‌బస్ నుంచి ఆర్డర్లను పొందింది.

ఆకాశ ఎయిర్
బోయింగ్ 737 మ్యాక్స్ రకం 150 విమానాలకు ఆర్డర్ ఇచ్చింది.



టారో.. సన్ ఫార్మా సొంతం

- మిగిలిన 21.52 శాతం వాటా కొనుగోలు
- ఇందుకు రూ.2,892 కోట్ల వ్యయం

న్యూఢిల్లీ: ఇజ్రాయెల్‌కు చెందిన టారో ఫార్మాస్యూటికల్ ఇండస్ట్రీస్ పూర్తిగా సన్‌ఫార్మా సొంతం కానుంది. ఇప్పటికే టారో ఫార్మాలో సన్ ఫార్మాకు 78.48% వాటా ఉంది. కంపెనీలో మిగిలిన 21.52% వాటాను కూడా కొనుగోలు చేయనున్నట్టు సన్ ఫార్మా ప్రకటించింది. ఇందుకు రూ.2,891.76 కోట్లు వ్యయం చేయనున్నట్టు తెలిపింది. టారో ఫార్మాలో మిగిలిన షేర్లను ఒక్కోటి 43 డాలర్ల చొప్పున సొంతం చేసుకునేందుకు అంగీకారం కుదిరినట్టు పేర్కొంది. జనరిక్ డెర్మటాలజీ మార్కెట్లో టారో కీలక సంస్థగా ఉన్నట్టు సన్‌ఫార్మా తెలిపింది.

బీఎస్‌ఈలో సన్‌ఫార్మా షేరు 3 శాతం లాభపడి రూ.1,336 వద్ద ముగిసింది.

మూడో రోజూ వెనకడుగు

- సెన్సెక్స్ 314 పాయింట్ల పతనం
- నిఫ్టీకి 110 పాయింట్ల నష్టం



ముంబై: స్టాక్ మార్కెట్ మూడోరోజూ నష్టాలు చవిచూసింది. అధిక వెయిటేజీ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేరు మూడోరోజూ అమ్మకాల ఒత్తిడికి లోనవడం, ఐటీ షేర్ల బలహీన ట్రేడింగ్, ఫెడరల్ రిజర్వ్ వడ్డీరేట్ల తగ్గింపు సందేహాలు సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ఫలితంగా సెన్సెక్స్ 314 పాయింట్లు నష్టపోయి 71,187 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 110 పాయింట్లు పతనమై 21,462 వద్ద స్థిరపడింది. ఉదయం ఆసియాలో జపాన్, సింగపూర్, థాయిలాండ్ సూచీలు నష్టపోయాయి. యూరప్ మార్కెట్లు 1% లాభపడ్డాయి. అమెరికా మార్కెట్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి.

- డిసెంబర్ క్వార్టర్ ఆర్థిక ఫలితాలు నిరాశపరచడంతో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేరు మూడోరోజూ అమ్మకాల ఒత్తిడికి లోనైంది. బీఎస్‌ఈలో 3% నష్టపోయి రూ.1,487 వద్ద స్థిరపడింది. బుధ, గురువారాల్లో 11% నష్టపోవడంతో బ్యాంకు మార్కెట్ విలువ రూ.1.45 లక్షల కోట్లు కోల్పోయి రూ.11.28 లక్షల కోట్లకు దిగివచ్చింది.
- ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ షేరు 6% నష్టపోయి రూ.486 వద్ద ముగిసింది. మూడో క్వార్టర్ ఆర్థిక ఫలితాలు మెప్పించకపోవడం ఇందుకు కారణం.
- క్యూ3 ఫలితాలు అంచనాలకు అందుకోలేకపోవడంతో ఎల్‌టీఐమైండ్‌ట్రీ షేరు 11% నష్టపోయి రూ.5,602 వద్ద స్థిరపడింది.

మారుత్ డ్రోన్స్, స్కైడ్రైవ్ ఎంవోయూ



హైదరాబాద్: మారుత్ డ్రోన్స్, స్కైడ్రైవ్ మధ్య అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదిరింది. వ్యాపారాభివృద్ధితోపాటు, ఎలక్ట్రిక్ వెర్టిక్ టేకాఫ్ అండ్ ల్యాండింగ్ (ఈవీటాల్) ఎయిర్‌క్రాఫ్ట్ (ఎయిర్ ట్యాక్సీ/ఫ్లయింగ్ ట్యాక్సీ) విభాగంలో అవకాశాల అన్వేషణకు ఇది వీలు కల్పించనుంది. తప్పనిసరి మినహాయింపులు, సర్టిఫికెట్‌లను సొంతం చేసుకోవడంతోపాటు, ప్రభుత్వ మద్దతు పొందడం, పైలట్, మెకానిక్‌లకు శిక్షణ, కీలక భాగస్వాముల గుర్తింపు విషయంలో మారుత్ డ్రోన్స్‌కు ఈ సహకారం తోడ్పడనుంది. మారుత్ డ్రోన్స్ ఇప్పటికే డ్రోన్ల కోసం అన్‌మ్యాన్డ్ ఎయిర్‌క్రాఫ్ట్ సిస్టమ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్‌ను అభివృద్ధి చేసింది. ఇప్పుడు ఈ ఎంఓయూతో ఎయిర్‌ట్యాక్సీ కార్యకలాపాల్లోకీ విస్తరించనుంది.

సాక్షి స్పోర్ట్స్



విజయం వాకిట్లో ఆసీస్

వెస్టిండీస్‌తో తొలి టెస్టులో ఆస్ట్రేలియా విజయం దిశగా పయనిస్తుంది. ఓవర్‌నైట్ స్కోరు 59/2తో రెండో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆస్ట్రేలియా 283 పరుగుల వద్ద ఆలౌటైంది. హెడ్ (119 : 12 ఫోర్లు, 3 సిక్సర్లు) సెంచరీ చేశాడు. 95 పరుగులతో వెనుకబడి రెండో ఇన్నింగ్స్ ఆడిన వెస్టిండీస్ హాజల్‌వుడ్ (4/18) దెబ్బకు ఆట ముగిసే సమయానికి 6 వికెట్లకు 73 పరుగులు చేసింది. ఇన్నింగ్స్ ఓటమి తప్పించుకోవాలంటే విండీస్ మరో 22 పరుగులు చేయాలి.

మళ్లీ ఓడిన భారత్

ఆసియా కప్ పురుషుల ఫుట్‌బాల్ టోర్నీలో భారత జట్టుకు వరుసగా రెండో పరాజయం ఎదురైంది. గ్రూప్ 'బి'లో భాగంగా దోహాలో గురువారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 0–3 గోల్స్ తేడాతో ఉజ్బెకిస్తాన్ జట్టు చేతిలో ఓడిపోయింది. ఈ ఓటమితో భారత జట్టుకు నాకౌట్ దశకు అర్హత సాధించే అవకాశాలు పూర్తిగా సన్నగిల్లాయి. ఈనెల 23న జరిగే చివరి లీగ్ మ్యాచ్‌లో సిరియాతో భారత్ ఆడుతుంది.



క్వార్టర్స్‌లో సాత్విక్ జోడీ

న్యూఢిల్లీ: ఇండియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–750 బ్యాడ్మింటన్ టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో రెండో సీడ్ సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి (భారత్) జోడీ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో సాత్విక్–చిరాగ్ ద్వయం 21–14, 21–15తో చింగ్ యావో లు–పో హాన్ యాంగ్ (చైనీస్ తైపీ) జంటపై గెలిచింది. పురుషుల సింగిల్స్‌లో భారత నంబర్‌వన్ ప్రణయ్ క్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టాడు. భారత్‌కే చెందిన ప్రియాన్షు రజావత్‌తో జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రణయ్ 20–22, 21–14, 21–14తో గెలుపొందాడు.

నేడు జపాన్‌పై గెలిస్తేనే భారత జట్టుకు 'పారిస్' బెర్త్



రాంచీ: మహిళల హాకీ ఒలింపిక్ క్వాలిఫయింగ్ టోర్నీ సెమీఫైనల్లో భారత జట్టుకు ఓటమి ఎదురైంది. జర్మనీతో గురువారం జరిగిన రెండో సెమీఫైనల్లో టీమిండియా 'షూటౌట్'లో 3–4 గోల్స్ తేడాతో ఓడిపోయింది. ఈ గెలుపుతో జర్మనీ పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించింది. తొలి సెమీఫైనల్లో అమెరికా 2–1తో జపాన్‌ను ఓడించి పారిస్ ఒలింపిక్స్ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. మూడో బెర్త్ కోసం నేడు భారత్, జపాన్ జట్లు తలపడతాయి. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధిస్తుంది. జర్మనీతో జరిగిన సెమీఫైనల్లో నిర్ణీత సమయం ముగిసేసరికి రెండు జట్లు 2–2తో సమంగా నిలిచాయి. భారత్ తరఫున దీపిక (15వ ని.లో), ఇషిక (59వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. జర్మనీ జట్టుకు చార్లోటి (27వ, 57వ ని.లో) రెండు గోల్స్ అందించింది. 'షూటౌట్'లో తొలి ఐదు షాట్లు ముగిశాక రెండు జట్లు 3–3తో సమంగా నిలిచాయి. ఫలితం తేలడానికి 'సడెన్‌డెత్'ను నిర్వహించగా... తొలి ప్రయత్నంలో రెండు జట్లు విఫలమయ్యాయి. రెండో ప్రయత్నంలో భారత ప్లేయర్ సంగీత గురి తప్పగా... జర్మనీ ప్లేయర్ లీసా నోల్టి గోల్ చేసి జర్మనీ విజయాన్ని ఖరారు చేసింది.

భళా బ్లింకోవా

- మూడో సీడ్ రిబాకినాపై సంచలన విజయం
- గ్రాండ్‌స్లామ్ టోర్నీల చరిత్రలోనే సుదీర్ఘంగా సాగిన టైబ్రేక్‌లో రష్యా ప్లేయర్‌దే పైచేయి
- 31 నిమిషాలపాటు కొనసాగిన టైబ్రేక్‌లో 22–20తో నెగ్గిన బ్లింకోవా



మెల్‌బోర్న్: టెన్నిస్ సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్ ఆస్ట్రేలియన్ ఓపెన్ మహిళల సింగిల్స్ విభాగంలో సంచలనాల పర్వం కొనసాగుతోంది. ఐదో రోజు గురువారం టాప్–10లోని ఇద్దరు క్రీడాకారిణులు రెండో రౌండ్‌లోనే ఇంటిముఖం పట్టారు. గత ఏడాది రన్నరప్, ప్రపంచ మూడో ర్యాంకర్, మూడో సీడ్ రిబాకినా (కజకిస్తాన్)... ప్రపంచ ఐదో ర్యాంకర్, ఐదో సీడ్ జెస్సికా పెగూలా (అమెరికా) రెండో రౌండ్‌లోనే నిష్క్రమించారు. ప్రస్తుతం టాప్–10లో నలుగురు క్రీడాకారిణులు టాప్ సీడ్ స్వియాటెక్ (పోలాండ్), రెండో సీడ్ సబలెంకా (బెలారస్), నాలుగో సీడ్ కోకో గాఫ్ (అమెరికా), పదో సీడ్ ఒస్టాపెంకో (లాత్వియా) మాత్రమే బరిలో నిలిచారు.

42 పాయింట్ల టైబ్రేక్...

రష్యాకు చెందిన 25 ఏళ్ల అనా బ్లింకోవా 2 గంటల 46 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో 6–4, 4–6, 7–6 (22/20)తో రిబాకినాపై గెలుపొందగా... క్లారా బురెల్ (ఫ్రాన్స్) 70 నిమిషాల్లో 6–4, 6–2తో పెగూలాను ఓడించి తమ కెరీర్‌లో తొలిసారి ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో మూడో రౌండ్‌లోకి దూసుకెళ్లారు. బ్లింకోవా–రిబాకినా మ్యాచ్ చరిత్ర పుటల్లోకి ఎక్కింది. నిర్ణాయక మూడో సెట్‌లో జరిగిన టైబ్రేక్ గ్రాండ్‌స్లామ్ టోర్నీల చరిత్రలోనే సుదీర్ఘంగా సాగిన టైబ్రేక్‌గా నిలిచింది. 31 నిమిషాలపాటు సాగిన 42 పాయింట్ల టైబ్రేక్‌లో చివరకు బ్లింకోవా 22–20తో విజయాన్ని ఖరారు చేసుకుంది. మూడో సెట్ ఏకంగా 93 నిమిషాలు సాగింది. గత ఏడాది వింబుల్డన్ టోర్నీ మహిళల సింగిల్స్‌లో లెసియా సురెంకో (ఉక్రెయిన్)–అనా బొగ్డాన్ (రొమేనియా) మధ్య మూడో రౌండ్ మ్యాచ్‌లోని మూడో సెట్‌లో టైబ్రేక్ 38 పాయింట్లపాటు జరిగింది. చివరకు సురెంకో ఈ టైబ్రేక్‌ను 20–18 పాయింట్లతో గెల్చుకుంది. రిబాకినాతో జరిగిన మ్యాచ్‌లో బ్లింకోవా ఏకంగా ఆరుసార్లు మ్యాచ్ పాయింట్లను కాపాడుకొని నెగ్గడం విశేషం. మరోవైపు రిబాకినా తొమ్మిదిసార్లు మ్యాచ్ పాయింట్లను కాపాడుకున్నా పదోసారి పరాజయం తప్పలేదు.

శ్రమించి నెగ్గిన స్వియాటెక్

ప్రపంచ నంబర్‌వన్ ఇగా స్వియాటెక్ (పోలాండ్) మూడో రౌండ్ చేరడానికి 3 గంటల 14 నిమిషాలు శ్రమించింది. ఐదో గ్రాండ్‌స్లామ్ టైటిల్‌పై గురి పెట్టిన స్వియాటెక్ రెండో రౌండ్‌లో 6–4, 3–6, 6–4తో 2022 రన్నరప్ డానియెలా కొలిన్స్ (అమెరికా)పై కష్టపడి గెలిచింది. మరో మ్యాచ్‌లో 14వ సీడ్ కసత్‌కినా 6–4, 3–6, 3–6తో స్లోన్ స్టీఫెన్స్ (అమెరికా) చేతిలో, 2021 యూఎస్ ఓపెన్ చాంపియన్ ఎమ్మా రాడుకానూ (బ్రిటన్) 4–6, 6–4, 4–6తో యాఫాన్ వాంగ్ (చైనా) చేతిలో ఓడిపోయారు. ఇతర రెండో రౌండ్ మ్యాచ్‌ల్లో 11వ సీడ్ ఒస్టాపెంకో (లాత్వియా) 6–0, 3–6, 6–4తో ఐలా తొమ్లాజనోవిచ్ (ఆస్ట్రేలియా)పై, 12వ సీడ్ కిన్‌వెన్ జెంగ్ (చైనా) 6–3, 6–3తో కేటీ బుల్టర్ (బ్రిటన్)పై, 19వ సీడ్ స్వితోలినా (ఉక్రెయిన్) 6–1, 6–3తో తొమోవా (బల్గేరియా)పై గెలిచారు.

హోల్గర్ రూనెకు చుక్కెదురు

పురుషుల సింగిల్స్‌లో ఎనిమిదో సీడ్ హోల్గర్ రూనె (డెన్మార్క్) రెండో రౌండ్‌లో నిష్క్రమించాడు. ఆర్థర్ కజాక్స్ (ఫ్రాన్స్) 7–6 (7/4), 6–4, 4–6, 6–3తో రూనెపై గెలిచాడు. ఇతర రెండో రౌండ్ మ్యాచ్‌ల్లో రెండో సీడ్ అల్‌కరాజ్ (స్పెయిన్) 6–4, 6–7 (3/7), 6–3, 7–6 (7/3)తో సొనెగో (ఇటలీ)పై, ఆరో సీడ్ జ్వెరెవ్ (జర్మనీ) 7–5, 3–6, 4–6, 7–6 (7/5), 7–6 (10/7)తో లుకాస్ క్లీన్ (స్లొవేకియా)పై, 11వ సీడ్ కాస్పర్ రూడ్ (నార్వే) 6–3, 6–7 (5/7), 6–3, 3–6, 7–6 (10/7)తో మాక్స్ పర్సెల్ (ఆస్ట్రేలియా)పై కష్టపడి గెలిచారు.

పోరాడి ఓడిన సుమిత్ నగాల్

భారత నంబర్‌వన్ సుమిత్ నగాల్ పోరాటం రెండో రౌండ్‌లోనే ముగిసింది. క్వాలిఫయర్ హోదాలో మెయిన్ 'డ్రా'లో అడుగు పెట్టిన ప్రపంచ 137వ ర్యాంకర్ సుమిత్ నగాల్ గురువారం జరిగిన రెండో రౌండ్‌లో 6–2, 3–6, 5–7, 4–6తో ప్రపంచ 140వ ర్యాంకర్ జున్‌చెంగ్ షాంగ్ (చైనా) చేతిలో ఓడిపోయాడు. 2 గంటల 50 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సుమిత్ 22 అనవసర తప్పిదాలు చేశాడు. రెండో రౌండ్‌లో ఓడిన సుమిత్ నగాల్‌కు ఓవరాల్‌గా 2,45,000 ఆస్ట్రేలియన్ డాలర్లు (రూ. 1 కోటీ 33 లక్షలు) ప్రైజ్‌మనీగా లభించాయి. పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో రోహన్ బోపన్న (భారత్)–ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ 7–6 (7/5), 4–6, 7–6 (10/2)తో డక్‌వర్త్–పాల్మన్స్ (ఆస్ట్రేలియా) జంటపై గెలిచింది. అనిరుధ్–విజయ్ ప్రశాంత్ (భారత్) ద్వయం 3–6, 4–6తో మరోజ్‌సన్–పుచోవిక్స్ (హంగేరి) జోడీ చేతిలో ఓడింది.



ఆరో టైటిల్ లక్ష్యంగా...



- బరిలో యువ భారత్
- నేటి నుంచి అండర్–19 ప్రపంచకప్
- రేపు బంగ్లాదేశ్‌తో టీమిండియా మ్యాచ్

రాబోయే క్రికెట్‌లో కాబోయే స్టార్లు అయ్యేందుకు అండర్–19 వన్డే ప్రపంచకప్‌కు మించిన టోర్నీ ఏదీ లేదు. అంతర్జాతీయ కెరీర్‌కు కచ్చితంగా సోపానమయ్యే ఈ టోర్నీలో సత్తా చాటేందుకు కుర్రాళ్లంతా సై అంటే సై అంటున్నారు. నేటి నుంచి దక్షిణాఫ్రికాలో జరిగే ఈ మెగా ఈవెంట్‌లో ఐదుసార్లు విజేత అయిన భారత జట్టు ఆరో టైటిల్ లక్ష్యంగా హాట్ ఫేవరెట్‌గా బరిలోకి దిగుతోంది.

బ్లూమ్‌ఫొంటెన్ (దక్షిణాఫ్రికా): గతంలో యువరాజ్ సింగ్ (2000–ప్రపంచకప్)... ప్రస్తుతం రోహిత్ శర్మ (2006), కోహ్లి (2008)... ఇకపై ఇషాన్ కిషన్ (2016), గిల్ (2018) భారత క్రికెట్ చరిత్రలో బంగారు బాట వేసుకున్నారు. వీళ్లంతా అండర్–19 ప్రపంచకప్ నుంచి వెలుగులోకి వచ్చినవారే! వీళ్లే కాదు... మనీశ్ పాండే, ఉన్ముక్త్ చంద్, యశ్ ధుల్, మన్‌జోత్ కల్రా, కమలేశ్ నాగర్‌కోటి ఇలా చెప్పుకుంటూ పోతే చాలా మందే ఉన్నారు. క్రికెట్ క్రేజీ భారత్‌ను మరో స్థాయిలో నిలబెట్టారు. అందువల్లే భారత్ కుర్రాళ్ల మెగా ఈవెంట్‌లో ఎప్పటికప్పుడు హాట్ ఫేవరెట్‌గా ఉంది. ఇప్పుడు కూడా డిఫెండింగ్ చాంపియన్ హోదాతో సఫారీలో ఆరో ప్రపంచకప్ టైటిల్ లక్ష్యంగా బరిలోకి దిగుతోంది. గ్రూప్ 'ఎ'లో ఉన్న భారత్ తమ తొలి మ్యాచ్‌ను శనివారం బంగ్లాదేశ్‌తో ఆడనుంది. భారత్ మిగతా రెండు లీగ్ మ్యాచ్‌లను ఈనెల 25న ఐర్లాండ్‌తో, 28న అమెరికాతో ఆడుతుంది.

ఇదీ ఫార్మాట్...

ఈ టోర్నీలో మొత్తం 16 జట్లు బరిలో ఉన్నాయి. వీటిని నాలుగు గ్రూప్‌లుగా విభజించారు. గ్రూప్ దశలో ఒక్కో జట్టు మూడు లీగ్ మ్యాచ్‌లను ఆడుతుంది. ఈ నెల 24వ తేదీ వరకు గ్రూప్ దశలో 24 మ్యాచ్‌లు నిర్వహిస్తారు. ఓ రోజు విశ్రాంతి అనంతరం 30 నుంచి 'సూపర్ సిక్స్' దశ పోరు ఉంటుంది. అనంతరం ఫిబ్రవరి 6, 8 తేదీల్లో రెండు సెమీఫైనల్ పోటీలు జరుగుతాయి. టైటిల్ పోరు 11న జరుగనుంది.

ఎఫ్ఐఎం ఇ–ఎక్స్‌ప్లోరర్‌లో భారత జట్టు

బరిలోకి దిగనున్న ఇండి రేసింగ్



సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ మోటార్ సైక్లింగ్ సమాఖ్య (ఎఫ్ఐఎం) నిర్వహించే ప్రతిష్టాత్మక ఇ–ఎక్స్‌ప్లోరర్ ఈవెంట్‌లో తొలిసారి భారత జట్టు ప్రాతినిధ్యం వహించనుంది. 2024 సీజన్‌లో భారత్‌కు చెందిన 'ఇండి రేసింగ్' టీమ్ బరిలోకి దిగుతుంది. అధికారికంగా ఎఫ్ఐఎం అనుమతించిన రేసింగ్ పోటీల్లో పాల్గొనే తొలి టీమ్ 'ఇండి రేసింగ్' అవుతుంది. ఈ జట్టు యజమాని కంకణాల అభిషేక్ రెడ్డి ఈ విషయాలు వెల్లడించారు. తాజా సీజన్ రేస్‌లు జపాన్‌లో వచ్చే ఫిబ్రవరిలో మొదలవుతాయి. నవంబర్‌లో హైదరాబాద్‌లోనే రేసింగ్ నిర్వహించే అవకాశం ఉంది. ఇండి రేసింగ్ టీమ్ తరఫున ఐశ్వర్య పిస్సే, స్పెన్సర్ విల్టన్, సాండ్రా గోమెజ్ పోటీ పడతారు. భారత్‌లో మోటార్ స్పోర్ట్స్‌పై ఆసక్తి ఇటీవల చాలా పెరిగిందని, అయితే పోటీల్లోకి వచ్చేసరికి మన టీమ్‌కు ప్రాతినిధ్యం లేదని కంకణాల స్పోర్ట్స్ గ్రూప్ వ్యవస్థాపకుడు అభిషేక్ రెడ్డి అన్నారు. ఇప్పుడు తమ జట్టు ఇండి రేసింగ్ ఆ అవకాశం కల్పిస్తుందని, ఎక్కువ మంది దీనివైపు మళ్లేలా తమ ప్రయత్నం ఉపకరిస్తుందని ఆయన చెప్పారు.

క్లుప్తంగా...

22న అన్ని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించాలి

ఎండోమెంట్ కమిషనర్‌ను కోరిన విశ్వహిందూ పరిషత్

సాక్షి, హైదరాబాద్: అయోధ్య శ్రీరామ జన్మభూమి మందిర ప్రారంభం సందర్భంగా.. ఈ నెల 22న రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లో ప్రత్యేక కార్యక్రమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించాలని విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) విజ్ఞప్తి చేసింది. గురువారం ఈ మేరకు దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్ కుమార్‌కు వీహెచ్‌పీ రాష్ట్ర కార్యదర్శి పండరీనాథ్, ఉపాధ్యక్షుడు జగదీశ్వర్, ప్రచార ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి, బజరంగ్‌దళ్ రాష్ట్ర కన్వీనర్ శివ రాములు, బజరంగ్‌దళ్ రాష్ట్ర కో కన్వీనర్ జీవన్ వినతిపత్రం సమర్పించారు. అయోధ్యలో రామ మందిరం ప్రారంభం.. బాల రాముడి ప్రాణప్రతిష్ట చేస్తున్న సందర్భంగా.. రాష్ట్రంలోని ప్రతి గుడిని శుద్ధి చేసి, అందంగా ముస్తాబు చేయాలని కోరారు.

అయోధ్య రాముడికి 108 కిలోల కర్పూరం

అంబర్‌పేట్(హైదరాబాద్): అయోధ్య శ్రీరామ ఆలయంలో ప్రథమ అర్చన కోసం ఓ సంస్థ నూట ఎనిమిది కిలోల కర్పూరం అందించింది. గురువారం స్వస్తిక్ సంస్థ ప్రతినిధి పి.నాయినకర్ 108 కిలోల కర్పూరాన్ని అంబర్‌పేట మహంకాళి ఆలయం ప్రాంగణంలో బీజేపీ, విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులకు అందించారు. 108 కిలోల కర్పూరానికి మహంకాళి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అయోధ్యకు పంపించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు చుక్క జగన్, అజయ్ కుమార్, వెంకటేశ్‌గౌడ్, వెంకటేశ్వర్లు, కిశోర్‌కుమార్, డి.వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎగిరే ట్యాక్సీ



"రెండేరెండు గంటల్లో హైదరాబాద్ నుంచి అటవీ ప్రాంతమైన ములుగుకు ఎయిర్ ట్యాక్సీలో గుండెను తీసుకెళ్లి రోగి ప్రాణాలు కాపాడొచ్చు".

"తొమ్మిది గంటల్లో ఆదిలాబాద్ నుంచి తిరుపతికి ఎంచక్కా ఎగురుతూ వెళ్లిపోవచ్చు".

జపాన్ కంపెనీతో జట్టు కట్టిన హైదరాబాద్ సంస్థ

- వచ్చే ఏడాదే దేశంలో కార్యకలాపాలు ప్రారంభం
- వైద్య, పర్యాటక సేవలకే తొలి ప్రాధాన్యం
- స్కై డ్రైవ్‌తో మారుత్ డ్రోన్స్ ఒప్పందం
- 'సాక్షి'తో కంపెనీ సీఈఓ ప్రేమ్ కుమార్



అనుకున్నవి అనుకున్నట్టు జరిగితే 2025లోనే ఇవన్నీ నిజమవుతాయి. జపాన్‌కు చెందిన ఫ్లయింగ్ కార్ల తయారీ సంస్థ స్కై డ్రైవ్ పరిశోధనలు తుది దశకు చేరుకున్నాయి. మనదేశంలో వాణిజ్య కార్యకలాపాలు విస్తరించేందుకు హైదరాబాద్‌కు చెందిన డ్రోన్ తయారీ సంస్థ మారుత్ డ్రోన్స్‌తో ఒప్పందం చేసుకుంది.

సాక్షి, హైదరాబాద్

భూమి ఉపరితలం నుంచి 5 వేల అడుగుల ఎత్తులో ఎగురుతూ ప్రయాణించడం ఎయిర్ ట్యాక్సీల ప్రత్యేకత. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో వైద్యసేవలు అందించడంతోపాటు కొండ ప్రాంతాలు, తీర్థయాత్రలు, పర్యాటక ప్రదేశాలకు ప్రయాణికులను తీసుకెళ్లడమే లక్ష్యమని మారుత్‌డ్రోన్ సీఈఓ ప్రేమ్‌కుమార్ విస్లావత్ 'సాక్షి'కి తెలిపారు. ఎయిర్ ట్యాక్సీ ప్రత్యేకతలు ఆయన మాటల్లోనే..

- వాయు రవాణారంగంలో సరికొత్త శకం మొదలు కానుంది. పెరుగుతున్న జనాభా, పట్టణీకరణ, ఈ-కామర్స్ వృద్ధి వంటి కారణంగా ప్రజలు, వస్తువులకు వేగవంతమైన, సురక్షితమైన, సరసమైన రవాణావిధానం అవసరం. దీనికి అర్బన్ ఎయిర్ మొబిలిటీ (యూఏఎం) పరిష్కారం చూపిస్తుంది. 2030 నాటికి యూఏఎం ఎయిర్‌క్రాఫ్ట్ మార్కెట్ దాదాపు 25–30 బిలియన్ డాలర్లకు పెరుగుతుందని పరిశ్రమవర్గాల అంచనా.

ఎయిర్ ట్యాక్సీ అంటే..

ఎలక్ట్రిక్ వర్టికల్ టేకాఫ్ మరియు ల్యాండింగ్ (ఈవీటీఓఎల్) ఎయిర్‌క్రాఫ్ట్‌లను ఎయిర్ ట్యాక్సీలని పిలుస్తారు. ఇవి ఎలక్ట్రిక్ బైక్‌లు, కార్ల లాగా బ్యాటరీలతో నడుస్తాయి. వీటికి హెలికాప్టర్ ఫిక్స్‌డ్ వింగ్ ఎయిర్‌క్రాఫ్ట్ సామర్థ్యంతో మిళితమై ఉంటాయి. కాలుష్య ఉద్గారాలను విడుదల చేయని ఈ ఎయిర్ ట్యాక్సీలతో ట్రాఫిక్ రద్దీ, రణగొణ ధ్వనుల వంటి సమస్యలు ఉండవు.

రాజేంద్రనగర్‌లో టెస్టింగ్ సెంటర్

ఎయిర్ ట్యాక్సీలను స్కైడ్రైవ్ జపాన్‌లో తయారు చేస్తుంది. పరిశోధనలు, అనుమతులు పూర్తయ్యాక.. విడిభాగాలను ఇండియాకు తీసుకొచ్చి హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో ఉన్న టెస్టింగ్ సెంటర్‌లో బిగిస్తామని మారుత్ డ్రోన్స్ సీఈఓ ప్రేమ్‌కుమార్ చెప్పారు. భవిష్యత్ అవసరాలకు సెంటర్‌ను విస్తరించేందుకు ప్రభుత్వాన్ని సంప్రదిస్తాం.

ఎయిర్ ట్యాక్సీ ప్రత్యేకతలివే..

- సీటింగ్ సామర్థ్యం : 3 సీట్లు (ఒక పైలెట్+ ఇద్దరు ప్రయాణికులు)
- కొలతలు: 13 మీటర్లు x 13 మీటర్లు x 3 మీటర్లు
- యంత్రాలు: 12 మోటార్లు/రోటర్లు
- గరిష్ట టేకాఫ్ బరువు: 1.4 టన్నులు (3,100 ఎల్‌బీఎస్)
- గరిష్ట వేగం: గంటకు వంద కిలోమీటర్లు
- గరిష్ట ఫ్లయిట్ రేంజ్: 15 కి.మీ.

ఇదీ స్కైడ్రైవ్ కథ..

జపాన్‌కు చెందిన స్కైడ్రైవ్ 2018లో ప్రారంభమైంది. ప్రపంచవ్యాప్తంగా ప్రతి ఒక్కరూ తమ రోజువారీ రవాణాగా ఈవీటీఓఎల్‌ను వినియోగించేలా చేయడం దీని లక్ష్యం. 2019లో జపాన్‌లో జరిగిన తొలి ఈవీటీఓఎల్ విమాన పరీక్షలో స్కైడ్రైవ్ విజయం సాధించింది. వచ్చే ఏడాది జపాన్‌లోని ఒసాకాలో జరగనున్న అడ్వాన్స్‌డ్ ఎయిర్ మొబిలిటీ (ఏఏఎం) ప్రాజెక్ట్ పాల్గొనేందుకు స్కైడ్రైవ్ అర్హత సాధించింది. ఈ ఏడాది సుజుకి మోటార్ కంపెనీకి చెందిన ప్లాంట్‌లో స్కైడ్రైవ్ ఎయిర్ ట్యాక్సీల ఉత్పత్తిని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తుంది.

మారుత్ డ్రోన్ కథ..

సామాజిక సమస్యలకు డ్రోన్ ఆధారిత పరిష్కారాలను అభివృద్ధి చేయడమే మారుత్ డ్రోన్స్ ప్రత్యేకత. ముగ్గురు ఐఐటీ గ్రాడ్యుయేట్లు 2019లో దీనిని ప్రారంభించారు. తాజా ఒప్పందంలో ప్రదర్శన, వాణిజ్య విమానాల కార్యకలాపాలకు స్థానిక ప్రభుత్వం నుంచి మినహాయింపులు, ధ్రువీకరణ పత్రాలు పొందడంతోపాటు పైలెట్, మెకానిక్ శిక్షణ వంటి వాటిల్లో మారుత్ డ్రోన్స్‌ది కీలకపాత్ర. ఎయిర్ ట్యాక్సీలకు నెట్‌వర్క్‌లను కనెక్ట్ చేయడం, కస్టమర్లను గుర్తించడం, ఎయిర్‌ఫీల్డ్‌ల భద్రత, అవసరమైన మౌలిక సదుపాయాలకు సహకరించడం వంటివి వాటిలోనూ భాగస్వామ్యమవుతుంది.

ఏవియేషన్ స్కూల్‌ను ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియా. చిత్రంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తదితరులు



జీఎమ్మార్ ఏవియేషన్ స్కూల్ ప్రారంభం

- ప్రారంభించిన కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా
- ఏవియేషన్ రంగంలో మొట్టమొదటి విద్యాసంస్థ

సాక్షి, హైదరాబాద్: శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఏర్పాటు చేసిన జీఎమ్మార్ ఏవియేషన్ స్కూల్‌ను కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా గురువారం ప్రారంభించారు. బేగంపేట్ విమానాశ్రయంలో నిర్వహిస్తోన్న వింగ్స్ ఇండియా–2024 ప్రదర్శన ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వర్చువల్‌గా ఈ విద్యాసంస్థను ప్రారంభించారు. జీఎమ్మార్ ఏరో టెక్నిక్ ఏరోస్పేస్ పరిశ్రమలో గ్లోబల్ లీడర్ ఎయిర్ బస్‌తో కలిసి జీఎంఆర్ స్కూల్ ఆఫ్ ఏవియేషన్‌ను ఏర్పాటు చేసింది. ఇది విమానయాన రంగంలోనే ఒక మైలురాయిగా నిలిచింది. ఎయిర్ క్రాఫ్ట్ మెయింటెనెన్స్ ఇంజినీరింగ్‌లో ఈ స్కూల్ ఒక దిక్సూచిగా మారనుంది. ఈ సందర్భంగా జీఎమ్మార్ ఏరో టెక్నిక్ ప్రెసిడెంట్, అకౌంటబుల్ మేనేజర్ అశోక్ గోపీనాథ్ మాట్లాడుతూ, ఏవియేషన్ ఎడ్యుకేషన్ రంగంలో ఈ స్కూల్ మొట్టమొదటి విద్యా సంస్థ అని, ఏవియేషన్ రంగంలో రాణించాలని కోరుకునే విద్యార్థులకు అద్భుతమైన భవిష్యత్తును అందజేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎయిర్‌బస్ ఇండియా ప్రెసిడెంట్, మేనేజింగ్ డైరెక్టర్ రెమి మైలార్డ్ మాట్లాడుతూ, దేశంలో సమగ్రమైన, సమర్థవంతమైన విమానయాన పర్యావరణ వ్యవస్థను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో జీఎమ్మార్‌తో కలిసి పనిచేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు.ఈ విద్యా సంస్థలో 4 సంవత్సరాల పూర్తి ఇంటిగ్రేటెడ్ ఏఎంఈ ప్రోగ్రామ్‌ను అందించనున్నారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్ సబ్జెక్టులతో ఇంటర్ ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ కోర్సుల్లో చేరడానికి అర్హులు. ఎంపిక ప్రక్రియను ప్రవేశ పరీక్ష ద్వారా నిర్ణయిస్తారు. విద్యార్థులు కనీసం 65 శాతం మార్కులు సాధించాలి. ఈ కోర్సులో చేరిన విద్యార్థులు క్యాంపస్‌లో రెండేళ్లు అకడమిక్ ట్రైనింగ్, జీఎంఆర్ ఏరో టెక్నిక్‌లో రెండేళ్ల జాబ్ ట్రైనింగ్ పూర్తి చేసుకునే అవకాశం ఉంటుంది.

సీతారాములకు సిరిసిల్ల బంగారు చీర

రామాయణ ఇతివృత్త చిత్రాలతో నేసిన వెల్ది హరిప్రసాద్



సిరిసిల్ల నేతకార్మికుడు వెల్ది హరిప్రసాద్ నేసిన బంగారు చీరను పరిశీలిస్తున్న బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన నేత కళాకారుడు వెల్ది హరిప్రసాద్ నేసిన బంగారు జరీ అంచు చీర అయోధ్య సీతారాముల పాదాల చెంతకు చేరనుంది. చేనేత జకార్డు మగ్గంపై హరిప్రసాద్ స్వయంగా నేసిన బంగారం, వెండి పోగుల చీరను ఈనెల 26న ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి అందించనున్నారు. ఆ చీరను ప్రధాని చేతుల మీదుగా రాముడి పాదాల చెంతకు చేర్చనున్నారు. ఈ బంగారు చీరను గురువారం బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ పరిశీలించారు. అద్భుతంగా నేసిన హరిప్రసాద్‌ను బండి సంజయ్ అభినందించి, శాలువాతో సత్కరించారు. శ్రీరాముడి చిత్రాలతోపాటు రామాయణ ఇతివృత్తాన్ని తెలిపే చిత్రాలను సైతం ఆ చీరలో పొందుపర్చడం విశేషం. 8 గ్రాముల బంగారం, 20 గ్రాముల వెండి పోగులతో చీరను నేశారు. ఇది జాకెట్‌తో కలిపి 6.30 మీటర్ల పొడవు, 900 గ్రాముల బరువు ఉంది. ప్రధానమంత్రి తనతోపాటు తన భార్యకు ఈ నెల 26న ఢిల్లీ వెళ్లేందుకు విమాన టికెట్లను పంపించారని, అదే రోజు ప్రధాని మోదీకి చీర అందిస్తానని హరిప్రసాద్ తెలిపారు. కాగా, చీరను పరిశీలించిన వారిలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణిరుద్రమరెడ్డి, ఇతర స్థానిక నాయకులు ఉన్నారు.

రాష్ట్రాన్ని ఏవియేషన్ హబ్‌గా మారుస్తాం

- మారుమూల ప్రాంతాలను అనుసంధానించడానికి హెలిపోర్ట్‌ల ఏర్పాటు: మంత్రి కోమటిరెడ్డి
- హైదరాబాద్ నుంచి నేరుగా అమెరికాకు విమానాలను నడపాలని కేంద్రమంత్రికి వినతి
- అట్టహాసంగా వింగ్స్ ఇండియా–2024 ప్రారంభం



సదస్సులో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

సనత్‌నగర్ (హైదరాబాద్): తెలంగాణను ఏవియేషన్ హబ్‌గా మారుస్తామని రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చెప్పారు. గురువారం బేగంపేట విమానాశ్రయంలో ప్రారంభమైన వింగ్స్ ఇండియా–2024ను ఆయన సందర్శించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియాను కలిసిన ఆయన హైదరాబాద్ నుంచి అమెరికాకు నేరుగా విమానాలు నడపాలని కోరారు. అతిపెద్ద సివిల్ ఏవియేషన్ ఎయిర్ షో, గ్లోబల్ ఏవియేషన్ సమిట్‌ను నిర్వహించే అవకాశాన్ని హైదరాబాద్‌కు ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. దేశంలో ఏవియేషన్, ఏరోస్పేస్ రంగం అభివృద్ధికి సానుకూల వాతావరణం హైదరాబాద్‌లో ఉందన్నారు. ప్రపంచంలో నాణ్యమైన జీవనానికి అనువైన నగరాలకు ర్యాంకింగ్స్ ఇచ్చే మెర్సర్ సంస్థ నివేదిక ప్రకారం హైదరాబాద్ భారతదేశంలోనే అత్యంత నివసించదగిన నగరంగా ఎంపికైందని చెప్పారు. అమృత్‌కాల్ లక్ష్యానికి అనుగుణంగా రాష్ట్రంలోని పాత విమానాశ్రయాలను పునరుద్ధరించడం, కొత్త ఎయిర్‌పోర్ట్‌ల ఏర్పాటుపై దృష్టిసారించినట్లు చెప్పారు. రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాలను అనుసంధానించడానికి హెలిపోర్ట్‌ల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు.

రాష్ట్రంలో గ్రీన్‌ఫీల్డ్, బ్రౌన్ ఫీల్డ్ విమానాశ్రయాలు

భద్రాద్రి కొత్తగూడెం, నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి, మహబూబ్‌నగర్ జిల్లా అడక్కల్ మండలం గుడిబండ గ్రామంలో గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయాలను ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. అలాగే వరంగల్ అర్బన్ జిల్లా మామునూరు గ్రామం, పెద్దపల్లి జిల్లా బసంత్‌నగర్, ఆదిలాబాద్ జిల్లాలో బ్రౌన్‌ఫీల్డ్ విమానాశ్రయాలకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు చెప్పారు. తొలి దశలో ఇప్పటికే వరంగల్ (మామునూరు), ఆదిలాబాద్ విమానాశ్రయాల పనులు ప్రారంభమయ్యాయన్నారు. ఈ ఆరు విమానాశ్రయాల సాంకేతిక సాధ్యాసాధ్యాలపై ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ (ఏఏఐ) ప్రభుత్వానికి నివేదిక ఇచ్చిందని, ఇది ప్రస్తుతం ప్రభుత్వం పరిశీలనలో ఉన్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నాగార్జునసాగర్ డ్యామ్‌లో వాటర్ ఏరోడ్రమ్ ఏర్పాటుకు ప్రతిపాదించిందని, దీనికి ఏఏఐ ప్రీ–ఫీజిబిలిటీ నివేదిక కూడా ఇచ్చిందన్నారు. ఇదే కాకుండా మరికొన్నిచోట్ల కూడా వాటర్ ఏరోడ్రోమ్‌లను ఏర్పాటుచేసే ఆలోచన ఉందని వెల్లడించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టరేట్ సముదాయాల వద్ద శాశ్వత హెలిప్యాడ్ సౌకర్యాలు ఉన్నాయని, ఇలాంటి సౌకర్యాలున్న మొదటి రాష్ట్రం తెలంగాణనే అని చెప్పారు. రాష్ట్రానికి ఏరోస్పేస్, డిఫెన్స్, స్పేస్ పరిశ్రమలు అత్యంత ప్రాధాన్య రంగాలుగా ఉన్నాయన్నారు. తయారీ సేవలు, ఇంజనీరింగ్, శిక్షణతోపాటు అనుబంధ సంస్థలకు ఆతిథ్యం ఇవ్వడానికి రాష్ట్ర పరిశ్రమల శాఖ, టీఎస్‌ఐఐసీ అనేక ఏరోస్పేస్ పార్కులను అభివృద్ధి చేసినట్లు కోమటిరెడ్డి వివరించారు.

లోహ విహంగాల సందడి

ఒళ్లు గగుర్పొడిచే వైమానిక విన్యాసాలకు బేగంపేట్ ఎయిర్‌పోర్ట్ వేదికైంది. కేంద్ర పౌరవిమానయాన శాఖ, ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ (ఫిక్కీ) సంయుక్తంగా నిర్వహిస్తున్న వింగ్స్ ఇండియా–2024 గురువారం అట్టహాసంగా ప్రారంభమైంది. పౌర విమానయాన శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా ముఖ్య అతిథిగా హాజరై ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. ఇందులో వివిధ కంపెనీలకు చెందిన దాదాపు 25 విమానాలు, హెలికాప్టర్లు రన్‌వేపై కొలువుదీరాయి. వీటిని తిలకించేందుకు బిజినెస్ విజిటర్స్‌తోపాటు దేశ, విదేశాల నుంచి వచ్చిన సందర్శకులు ఆసక్తి కనబర్చారు. బోయింగ్ 777, ఎయిర్ ఇండియాతోపాటు ఆకాశ ఎయిర్ 737–8లు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.